మిసిమి

చింతనాత్మక సారస్వతం

25

...పాతికేండ్ల సారస్వత సేవ...

మాసపత్రిక ఫిబ్రవరి, 2014 ₹ 25

కూరగాయాలు !

మిసిమి
మాసపత్రిక

"All that we are is the product of what we have thought"
- Dammapada.

సంపుటి 25 **ఫిబ్రవరి 2014** **సంచిక 2**

ప్రధాన సంపాదకుడు
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

సంపాదకుడు
వల్లభనేని అశ్వినీకుమార్

సహాయ సంపాదకుడు
కాండ్రేగుల నాగేశ్వరరావు

సమాలోచక మండలి
డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
నందిగం కృష్ణారావు

సంస్థాపక సంపాదకులు
రవీంద్రనాథ్ ఆలపాటి

Printed & Published by

Bapanna Alapati
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹25 సంవత్సరానికి : ₹300
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

(Library of Congress Control Number)
LCCN 91-903060

ఈ నెల...

కమ్మతెమ్మెరలు 3
ఆదిరాజ యశోబింబము మహాత్ములు – మానవత్వము 5
– ప్రాచార్య శలాక రఘునాథశర్మ
తిమిరంతో సమరం – దాశరథి 9
– ప్రొ. రావినూతల సత్యనారాయణ
మన ప్రాచీన నగరాలు – కోటిలింగాల 19
– కొసరాజు వెంకటేశ్వరరావు
శిలాలోలిత 23
– కాత్యాయనీ విద్మహే
తాళపత్రాలు – శాసనాలు 32
– డా॥ వన్నె గోపాల్
భగవద్గీతలో బౌద్ధం 36
– భదంత ఆనంద కౌసల్యాయన్
యంత్రానువాదం 41
– డా॥ అద్దంకి శ్రీనివాస్
వలసవాదుల కవిత్వం – ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ 44
– ముకుంద రామారావు
మఖ్దూమ్ కవిత్వ సౌరభం 56
– డా॥ దేవరాజు మహారాజు
జడ అల్లి జడకుచ్చులిడిన రాయప్రోలు 59
– గెల్లి రామమోహనరావు
ప్రజ్ఞా సంజీవనం 63
– సి. వేదవతి
ఎలన్ డేనియోలో సిద్ధాంతం 65
– నండూరి పార్థసారథి
నాటకము : రసానుభూతి 69
– భూపతి లక్ష్మీనారాయణరావు
స్మృతి శకలాలు 79
– డా॥ అంకే శ్రీనివాస్
తెలుగు యాత్రా చరిత్రలు 82
– ఎమ్. ఆదినారాయణ
జూరన్ 92
– ఓం ప్రకాష్ వాల్మీకి
పుస్తక పరిచయం 94
కలల బేహారి 96

ముఖచిత్రం : ఆశ
రెండవ అట్ట : కూరగాయాలు } *రఘునాథ సాహా*
మూడవ అట్ట : క్షామ ధేనువు } *రఘునాథ సాహా*
నాల్గవ అట్ట : కల చెదిరె... | *ప్రంజలి కోష్టి*

దాశరథి కృష్ణమాచార్యులు కవితా పయోనిధిగా ప్రఖ్యాతి గాంచిన బహుముఖ ప్రజ్ఞానిధి.

దాశరథి

'తెలుగు నింగి దారులలో వెలుగు పులుగు రెక్కలార్చి
చిమ్మి వైచె తరతరాల చిక్కని చీకట్లు నెల్ల....' అంటూ
'తెలుగు ఊరులు – తెలుగు వారలు
ప్రతిఫలించే మహాకావ్యం – కావాలె, నాకు కావాలె' అని కోరి
'కోటి తమ్ముల కడ, రెండు కోట్ల తెలుగుటన్నలను గూర్చి వృత్తాంతమందజేసి
మూడు కోటుల నొక్కటి ముడి బిగించి, పాడినాను మహాంధ్ర సౌభాగ్యగీతి'
అని ఎలుగెత్తి పాడిన గళం దాశరథిది.

'ముక్కలైన మాతృమూర్తి గేహమ్మును కూర్చి కట్టుడోయి కొమరులారా!
మనము మనము కలహమ్మున మునింగిన యెడ – మన మహాంధ్రలక్ష్మి మనకు రాదు' మూర్తీభవించిన తెలుగుతనమే దాశరథి. ఆయన తెలుగువారందరికీ మంగళాశంసనముగా సమర్పించుకొన్న కానుక 'మహాంధ్రోదయము'. నిజాము పాలన నుంచి తెలంగాణము విముక్తిజేసి తెలుగువారందరినీ ఒకటిగా, ఒకతాటిమీదకు తేవాలనేదే దాశరథి ఆకాంక్ష.

'గతాన్ని కాదనలేను – వర్తమానాన్ని ఒద్దనబోను
భవిష్యత్తు ఒదులుకోను – కాలం నా కంఠమాల
నా పేరు ప్రజాకోటి – నా ఊరు ప్రజా వాటి' అని తనెవరో, తనకు ఏం కావాలో తెలుగు ప్రజకు తెలియజేసి వెళ్ళిపోయాడు. ***'మధనపడే మేధావుల శిథిలాశలు చివురించే రస రాజ్యం మా ఇంటి ముందు లేబొరేటరి'.*** కవులు, మేధావులు, రాజకీయాలకు, ప్రాంతీయ సంకుచితత్వానికి అతీతులు. దాశరథి చేసిన 'తిమిరంతో సమరం' విశ్లేషణ చదవండి.

కాల ప్రవాహంలో ఎన్నో నగరాలు కొట్టుకుపోయాయి. ముందు ప్రాభవం కోల్పోయిన ప్రాచీన నగరాలు మెలమెల్లగా కనుమరుగవుతాయి. వాటిని కాపాడుకోలేకపోవటం చరిత్ర అంటే గౌరవం లేని జాతికి అంతగా బాధ ఉండకపోవచ్చు. భావి తరాలకు మొండిగోడలు, మొండిచేతులే మిగిల్చి వెళ్ళిపోదామా?

అంటరాని తనం మానవజాతిని, మనిషి మనుగడను సిగ్గుతో తల దించుకోజేసింది. అది ఒకో ప్రాంతానికి ఒక్కో రకంగా ఉంటుంది. భారతదేశంలోనే ఉత్తరాది రాష్ట్రాలకు, దక్షిణాది గ్రామాలకు ఎంతో వ్యత్యాసం ఉంది. ఈ అంటరాని తనం ఆచరణలో ఎంత అవమానకరంగా పరిణమించిందో అది అనుభవించిన వారే చెప్పగలరు. 'జూఠన్', ఓంప్రకాష్ వాల్మీకి స్వీయచరిత్ర. ఉత్తరాదిన ఉపాధ్యాయులు సైతం ఏ విధంగా, ఎంత క్రూరంగా ప్రవర్తించే వారో చదివితే, గాంధీ హరిజనోద్ధరణ ఉద్యమం అంతరార్థం కొంతవరకైనా అవగాహనకు రావచ్చు.

నాటక సిద్ధాంతాన్ని కూలంకషంగా వివరిస్తుంది 'రసానుభూతి'. 'భారతి' కంటె ముందు నుంచి వస్తున్న 'సుభాషి', 'కిన్నెర' పత్రికలలో ఇటువంటి సిద్ధాంత వ్యాసాలకు కొదవలేదు. విచారించదగిన విషయం – ఈ పత్రికల గురించి, వాటి సంపాదకులు పందిరి మల్లికార్జునరావు గురించి, తెలుగు సాహితీ ప్రపంచానికి అంతగా తెలియకపోవటం.

ఈ నెల **మిసిమి** సంస్థాపక సంపాదకులు అలపాటి రవీంద్రనాథ్ 18వ వర్ధంతి– వారి స్మృతికి మా శ్రద్ధాంజలి.

– సంపాదకులు

కమ్మతెమ్మెరలు

నా చుట్టూ ఉన్న వారితో మీ పత్రిక గురించి మాట్లాడుతూ ఉంటాను. మీ మిసిమి పత్రిక నాకు చాలా ఇష్టమైన పత్రిక. చదువుతూ ఉంటే (నా చుట్టూ ఉన్నవారితో మాట్లాడటానికి ఆధారం కనుక అనుకోవచ్చు) పత్రిక చేతిలోంచి పక్కన పెట్టడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఇంతకీ మీకు ఎలా అభినందనలు తెలియజేయాలో అర్థం కావడం లేదు.

2014 జనవరి సంచికలో 49 పేజీలలో నా కవిత్వాన్ని (నిజానికి 'తెలుగు సాహిత్యంలో ప్రేమ కవిత్వం' కోసం మీరు అడగక్కరలేకుండా) ప్రచురించడం నిజంగా నాకు ఆశ్చర్యం కలిగించింది. 53 సంవత్సరాల క్రితం అంటే 1855 ప్రాంతాలలో – నా పాతికేళ్ళ వయస్సులో నేను రాసుకున్న కవితలు 'పత్ర సూచన' అన్న పుస్తకంలో, 57 సంవత్సరాల నా స్నేహితులు ప్రచురించారు. నిజానికి "లీవ్స్ ఆఫ్ గ్రాస్", 'లీవ్స్ ఆఫ్ గ్రాస్' అనేది – ఈ మాట మీకు ఏమైనా ఆశ్చర్యం కలిగిస్తోందా? అందుకే ప్రేమ కవిత్వం రాస్తే ఇలాగే ఉంటుంది. ఇక ఐర్లాండ్‌లో రిపబ్లికన్ – ఆర్మీ ప్రచురించిన ఏ పుస్తకమైనా ఇంతకంటే ఎక్కువ ఆశ్చర్యం కలిగిస్తుందా? (IRA) నాకు ప్రచురణలు అనేవి ఎప్పుడూ ఆశ్చర్యాన్ని కలిగించేవే. ఇంతకీ (నిజానికి) నాకు ఈ వ్యవహారం 1991 ఫిబ్రవరి 'మిసిమి' ప్రారంభ సంచిక చదివిన తరువాతే మొదలైంది. ఆ సంచికలో ఉన్న ఒక్క వ్యాసం కూడా నా ఆసక్తిని ఆకర్షించలేకపోయింది. అందుకే ఇంతకాలం మీకు ఉత్తరం రాయలేదు. ఇప్పుడు రాస్తున్నాను.

– వాల్ట్ విట్మన్

మిసిమి సెప్టెంబర్ 2004 సంచిక (332 పేజీలు) చూసినప్పటి నుంచీ అనుకుంటున్నాను. ఇది ఒక్కటి చదివితే నా కోరికలు నెరవేర్చుకోవడానికి ఈ ఒక్కజన్మ చాలదు, మొక్కతే ఏమో మళ్ళీ పుట్టి మీ అందరి దయాదాక్షిణ్యాలతో మళ్ళీ మిసిమి చదవాలనుకుంటున్నాను. నేను ఈ ఆలోచనలో ఉండగానే ఇంకో సంచిక వచ్చేసింది. నేను కొత్తగా ఇంకేమీ అభినందనలు తెలియజేయలేను. దయచేసి నన్ను క్షమించండి.

ఈ సంచికలో మాత్రం నేనుండాలని మీరు మొక్కుకుంటారనుకోను. ఎందుకంటే ఎన్నో కథలు, వ్యాసాలు ప్రచురించబడ్డాయి. నాలాంటి కొత్తవారిని ఎవరినో కొన్నిటిని ఎంపిక చేసుకోవాలి. అందుకే ఈ సంచికలో నేనుండకపోవచ్చు.

– ఎస్. సంక్రాంతి 2014

✶ "... **మిసిమి** జనవరి సంచిక ప్రత్యేకతను చూపింది. సంపాదక వర్గానికి అభినందనలు. రావినూతల సత్యనారాయణ చతుర్ముఖ జ్యోతి వ్యాసం సమగ్రతను సాధించింది. రావిపూడి వెంకటాద్రిగారు సమకాలీన హేతువాద చరిత్రపై నొక్కుపెడితే బాగ వుండేది. హేతువాద ఉద్యమం 1940 నుండి బాగా వ్యాప్తి పొందినది..." **– డా॥ ఇన్నయ్య నరిసెట్టి,** మేరీలాండ్, U.S.A.

✶ "... వెండి వెలుగుల **మిసిమి**లో ఆలపాటి వారి వర్ణ చిత్రం సింప్లి సుపర్బ్..." **– చాట్ల శ్రీరాములు,** హైద్రాబాదు.

✶ "... **మిసిమి** సెప్టెంబరు 2013 సంచికలో పలగాని గోపాలరెడ్డి గారి వ్యాసం ఎంతో బావుంది నెల్లూరు గురించి. వారు చేసిన పరిశోధన అభినందనీయం. మేము నెల్లూరు వారము గనుక ఈ వ్యాసం చూచి ఎంతగానో ఆనందించాము. గోపాలరెడ్డి గారిని సంప్రదించి, వారి పరిశోధన గురించి మరింత తెలుసుకోవాలని ఉంది..." **– ఎ. శిరీష,** నెల్లూరు.

✶ "... **మిసిమి** జూన్ సంచికలో బాలంత్రపు రజనీకాంతరావు *ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము* గ్రంథముపై ప్రొ. రావినూతల సత్యనారాయణ గారి సమీక్షావ్యాసం సమగ్రంగా ఉంది. గ్రంథం సంపూర్ణంగా చదివిన అనుభూతి కలుగుతుంది... సెప్టెంబరు సంచికలో దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి *చరిత్రలో చంద్రగిరి మహలు,* పలగాని గోపాలరెడ్డి నెల్లూరు–మారుపేర్లు రెండు పరిశోధనాత్మక వ్యాసాలు, చరిత్ర కెక్కని ఎన్నో విషయాలు తెలియచేస్తాయి. వారి పరిశోధనా ప్రతిభ ఎంతో శ్లాఘనీయం... ప్రతి సంచికకు శోభను కూర్చే వర్ణ చిత్రాల ఎంపిక, కాండ్రేగుల నాగేశ్వరరావు గారి విశ్లేషణాత్మక పరిచయం, నేటి చిత్రకళా విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం..." **– పతివాడ సూర్యనారాయణ,** రాజమండ్రి.

✶ "... చింతనాత్మక సారస్వత పత్రికగా వెలుగొందుతున్న **మిసిమి** మెడొన్నా అత్యద్భుత వర్ణచిత్రంతో కళాత్మక పత్రికగా కూడా విలసిల్లుతోంది, అభినందనలు. *ధనవంతుడు, అంద్రేయ,* కారుణ్యమూర్తి చిత్రాలు కూడా చిత్రకళారసజ్ఞులకు కన్నుల పండుగ... కృష్ణశాస్త్రి తమ *గురుదేవులు* నాయుడుగారికి సమర్పించిన నివాళి భక్తి ప్రపత్తులతో భాసిల్లింది. రావినూతలగారు రాయప్రోలు *మిశ్రమంజరి* గురించి సాహితీమంజరినే తయారుచేసి పాఠకులకు అందించారు. ఆర్వీయార్ అనువాద ప్రక్రియ గురించి చక్కని పీఠిక నందజేశారు... భాగవతుల వెంకటరామశర్మ కూచిపూడి నృత్య విధానంలో ఇతిహాస కథల ప్రాముఖ్యాన్ని సోదాహరణంగా వివరించారు... అజేయ చక్రవర్తి గాలిని గాలిలో చిత్రీకరించడమే సంగీతం అని భావాత్మకంగా, రాగాత్మకంగా చెప్పారు... కుర్రా జితేంద్ర బాబు ప్రాచీన భాషల ప్రభావం కవిత్వంపై ఎలా ప్రసరించిందో చక్కగా విశదీకరించారు... ముకుంద రామారావు పోలండ్ గురించి విహంగ వీక్షణం చేస్తూ అందలి అందచందాలను పాఠకులకు గర్తుకు తెచ్చారు... క్రీస్తు గురించిన జాషువా పద్యాలు కరుణ రసప్లావితంగా ఉన్నాయి..."

– డాక్టర్ శివభూషణం, కర్నూలు.

✶ "... ముందుగా కొత్త సంవత్సర శుభాకాంక్షలు. ప్రతినెల ఒక అపురూపమైన కానుకను అందుకొంటున్నట్లుగా **మిసిమి**ని మనః పూర్వకంగా అందుకొంటున్నాము. డిసెంబర్ నెల సంచిక ముఖచిత్రాలన్నీ అద్భుతంగా ఉన్నాయి. మెడొన్నా నుంచి కారుణ్యమూర్తి వరకు. ఫీచర్స్ అన్నీ చక్కటి విశ్లేషణలతో చక్కగా ఉన్నాయి. సంతోషం. దయచేసి రెగ్యులర్‌గా పంపించండి. ఒక నెల అందకుంటే ఏదో వెలితిగా ఉంటుంది..." **– కొలిపాక శోభారాణి,** కరీంనగర్.

✶ "... **మిసిమి**లో నేను చదివిన ఏ వ్యాసానికి నా అభిప్రాయాన్ని ముందుగా రాయాలా అని ఆలోచనతో గానగంధర్వ ఘంటసాల గురించి వ్రాస్తున్నా. తాడేపల్లి గూడెంలో వారు కచేరీ చేసినప్పుడు నేను ఉద్యోగం చేస్తున్నాను. ఆ ప్రోగ్రామ్‌కి హాజర్ కావటం నా పూర్వజన్మ సుకృతం. మూర్తిగారికి ధన్యవాదాలు. యే డిగ్రీ లేనివాడు నా ప్రియనేస్తం– సంజీవదేవ్, తుమ్మపూడి. 4, 5 ఉత్తరాలు వారి నుండి పొందాను. 'మనిషి ఎందుకు జీవిస్తున్నాడు' వారి వ్యాసం అక్షరసత్యం. మానవత లోపించిన సమాజంలోని వారు కళలు ఆస్వాదించటం లేదు. ఏ అనుభూతి లేకుండా జీవిస్తున్నారు. ఓ సినిమాలో రావుగోపాలరావు "మనిషన్నాక కాస్త కళాపోసన వుండాలి" అన్నారు. చిత్రలేఖనం, రచన, రేడియో ప్రసంగాలు బహుముఖ ప్రజ్ఞావంతుడు నా ప్రియనేస్తం సంజీవదేవ్... సాహిత్యంలో అన్ని ప్రక్రియలు **మిసిమి**లో ప్రచురించాలని కోరుకుంటున్నాను..." **– యం.కె. మూర్తి,** సూర్యాపేట.

✶ "... **మిసిమి** సెప్టెంబరు సంచిక ఆసాంతం చదివాను. పత్రిక బహుధా ప్రశంసనీయం..." **– సాయి శిరీష,** హైద్రాబాదు.

✶ "... డిసెంబరు **మిసిమి** పత్రికలో ప్రచురించిన అట్టమీద బొమ్మలు చాలా బాగున్నాయి. చిత్రకారుని పరిచయం ఇంకా బావుంది..." **– బి.వి వైద్యనాథ్,** చెన్నై.

✶ మంచి ఉత్తరానికి ఒక మంచి పుస్తకం బహుమతి!

ఆదిరాజ యశోబింబము

మహాత్ములు – మానవత్వము

– ప్రావార్య శలాక రఘునాథశర్మ

భారతీయ సంప్రదాయంలో ప్రజాపాలన తత్పరుడైన రాజు సాక్షాత్తూ విష్ణువే అనే భావన ఉన్నది. పాలకుడైనవాడు తన ప్రత్యణువులోను తండ్రితనాన్ని నిలుపుకోవాలి, నింపుకోవాలి. ప్రాచీన మహాచక్రవర్తుల చరిత్రలు మనకు ఆదర్శప్రాయం కావాలి. కాలమహిమ వలన అత్యంత మహోదాత్తమైన ప్రజాస్వామ్య భావన భయంకరంగా భ్రష్ఠపట్టిపోయింది. ఆ భ్రష్ఠతా సోపానం ఇంచుమించు మానవజాతిని ఊహించనలవికాని ప్రమాదగర్తంలోనికి, మళ్ళీ లేవకుండా, త్రోసివేసే స్థితిలో ఉన్నది. కాబట్టి పాలన ధర్మం గురించి, పాలకుని మనఃప్రవృత్తిని గురించి తప్పనిసరిగా తెలుసుకోవలసిన అవసరం వచ్చి పడింది.

దండి మహాకవి ఒక చక్కని ప్రవచనం చేశాడు. "ఆదిరాజ యశోబింబ మాదర్శం ప్రాప్య వాఙ్మయమ్ తేషా మ సన్నిధానేఽపి న స్వయం పశ్య నశ్యతి"

ఆదిరాజుల యశస్సు అనే వస్తువు, వాఙ్మయం అనే అద్దంలో ప్రతిఫలించి, చూడు! ఆశ్చర్యం వారి సన్నిధానం లేకపోయినా నశించిపోవటం లేదు.

ఇది ఒక వింత. అద్దంలో ప్రతిఫలించిన ప్రతిబింబం బింబం ఎదురుగా ఉంటేనే ఉంటుంది. మన ముఖాన్ని అద్దానికి ఎదురుగా ఉంచితే ప్రతిబింబం అక్కడ కనిపిస్తుంది. మనం ప్రక్కకు తొలగిపోతే ప్రతిబింబం ఉండదు. కానీ వాఙ్మయమనే అద్దంలో బద్ధమైన ప్రతిబింబం బింబం లేకపోయినా శాశ్వతంగా నిలిచిపోయే ఉంటున్నది. పైగా ఆ బింబం నిజానికి వస్తురూపం కాదు, భావరూపం. అంటే నిరాకారం. నిరాకారానికి ప్రతిఫలం ఎలా ఉంటుంది? ఉంచే గొప్పలక్షణం వాఙ్మయానికి ఉన్నది. మహర్షులు, మహర్షికల్పులూ అయిన మహాకవులు అటువంటి మహాత్ములనదగిన మహాచక్రవర్తుల ప్రతిబింబాలను వాఙ్మయాదర్శంలో నిబంధించి మనకందించారు. అట్టి వానిని దర్శించుకొని, ఆ స్వభావాలను హృదయాలకు పట్టించుకొని, వానిని శక్తివంచన లేకుండా ఆచరణలో పెట్టగలిగితే మానవత్వం పరిమళిస్తుంది. మానవుడు మాధవుడవుతాడు. ముఖ్యంగా పాలకపంక్తిలో పరమాన్న భోజనంకోసం పరితపించే వ్యక్తులు తప్పనిసరిగా ఈ విషయాలు తెలుసుకోవాలి. లేకుండా ఆ పంక్తిలోనికి ప్రవేశించదలచుకొంటే అట్టివారిని వెలివేయటానికి తక్కిన ప్రజలు అధికారులు కావటానికి ఈ విషయాలను తెలుసుకోవాలి.

కాళిదాసమహాకవి అభిజ్ఞానశాకుంతలం ప్రధానంగా శృంగారరసాత్మకం. అయితే మహానుభావుడు అందులో పాలనకూ పాలకునకూ సంబంధించిన కొన్ని అంశాలను ప్రయత్నపూర్వకంగా ప్రవేశపెట్టాడు. పాలకునిలో వైయక్తిక భోగభాగ్యదృష్టికంటే ప్రజాపరమైన యోగక్షేమభావన ఎలా ఉండాలో ఏప్రమాణంలో ఉండాలో తెలియజెప్పాడు. ఉత్తమ పాలకత్వ ప్రమాణాలు సాధించటం ద్వారా ప్రజలకు సదుపదేశం హృదయంలో మెదలుతూ ఉండటానికి మార్గం నిర్దేశించాడు.

బాణమహాకవి కాదంబరిలో ఒక మానవమనస్తత్వ సంబంధమైన అంశాన్ని ప్రకటించాడు.

"గర్భేశ్వరత్వ మభినవయౌవనత్వ మప్రతిమ రూపత్వ మమానుష శక్తిత్వం చేతి మహతీయం ఖల్వనర్థ పరంపరా, సర్వావినయానా మేకైక మప్యేషామాయ తనం. కి ముత సమవాయః"?

నాయనా ! చంద్రాపీడా! మహాప్రభువుల సంతానంగా పుట్టటం, కొంగ్రొత్త యౌవనంలో అడుగుపెట్టటం, సాటిలేని సౌందర్యంతో అలరారుతూ ఉండటం మానవశక్తి పరిధులకు మించిన దివ్యశక్తులు కలిగి ఉండటం అనే వీని కలయిక చాలా పెద్ద అనర్థపరంపర. ఇందులో ఏ ఒక్కటి అయినా అన్ని విధాల అవినయాలకూ నెలవు అవుతుందంటే అన్నీ కట్టగట్టుకొని ఒకచోట నెలకొని ఉంటే కలిగే కీడు సంగతి చెప్పనేల?"

ఇది శుకనాసుడు చంద్రాపీడునకు రాజ్యాభిషేక సమయంలో చేసిన మహోపదేశపు పీఠిక. దీనిని మనం జాగ్రత్తగా అనుశీలించాలి. సారాంశం ఏమిటంటే

సాధారణంగా రాజ్యపాలనలో నియుక్తుడైన వ్యక్తిలో 'మానవతామహాగుణం' మృగ్యం అయిపోతుందని చెప్పటం. అష్టైశ్వర్యాలతో అవసరం ఉన్నా లేకపోయినా పంచభక్ష పరమాన్నాలు అందుబాటులో ఉండేవానికి పేదల ఆకలిబాధలు ఊహకు అందుతాయా? చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష అనే భావనతో బ్రదుకును సాగిస్తున్న వానికి లేమితో ఆలమటించేవాని ఆర్తనాదాలు చెవికెక్కుతాయా?

ఇటువంటి ఆలోచనలు హృదయాన్ని అల్లకల్లోలం చేస్తుండగా కాళిదాసమహాకవి మహాచక్రవర్తుల మానవత్వ మహోజ్జ్వల దివ్యకాంతులను మనకు అందించాడు. ఆ కాంతులతో మనం మనహృదయాలను సంస్కరించు కోవలసిన అవసరం ప్రస్తుత కాలంలో ఎంతైనా ఉన్నది.

1. మహారాజులు అనేక కారణాల సంభావనతో అరణ్యాలలో వేటాడటం ధర్మవిరుద్ధమైన అంశం కాదు. అలాగే కణ్వాశ్రమ ప్రాంతంలో దుష్యంతుడు వేటాడుతూ ఒక లేడిని తరుముకొంటూ ఎక్కుపెట్టిన బాణంతో దూసుకొని వస్తున్నాడు. ఒక వైఖానసుడు గమనించాడు. "రాజా! ఆగు! ఆగు!, నీ బాణాన్ని మృదువైన మృగశరీరం మీద పడనీయకు!" అన్నాడు. వెంటనే రాజు "వినయంతో ఇదిగో మహానుభావా! బాణాన్ని ఉపసంహరించాను" అన్నాడు. ఆ తపస్వికి ఆనందం కలిగింది. అవునయ్యా! నీవు పురువంశంలో పుట్టిన వాడు ప్రవర్తించేవిధంగా ప్రవర్తించావు. నీవంటి గుణాలతో అలరారే సత్పుత్రుణ్ణి పొందు అని ఆశీర్వదించి తన దారిని తానుపోయాడు. ఇక్కడ మనం గమనించవలసిన విషయం మహారాజులోని 'మానవత్వం'. అతని సంస్కారం ఎంత గొప్పదో అది అనువంశికంగా రక్తంలో ఎలా జీర్ణించుకుపోయిన గుణమో అనేది. నోటిముందు కూడులాగివేస్తే మనిషి ఎంతగా కోపోద్రేకం పొందుతాడో మనం చూస్తూనే ఉంటాం. ఇంచుమించు అటువంటి సన్నివేశంలో మహాత్ముడైన మహారాజు ఎంత ప్రసన్న బుద్ధితో ప్రవర్తించాడు. ఇది మానవతామహనీయత.

2. దుష్యంతుడు కణ్వాశ్రమంలో ప్రవేశింపబోతూ సూతునితో ఇలా అన్నాడు. "సూతా ! తపోవన వాసులకు మనవలన ఇబ్బందులు కలుగరాదు. ఇక్కడనే రథాన్ని నిలుపు. తపోవనాలలోనికి వినీత వేషంతో ప్రవేశించాలి. ఇవిగో వీనిని నీ దగ్గరనే ఉంచు" అని విల్లమ్ములను ఆభరణాలను తీసి సూతునికందించాడు. ఎంతటి హృదయౌన్నత్యమో గమనించాలి. ఈ రోజులలో పాలకవర్గంలోని చాలా క్రింది స్థాయివాడు కూడా దేవాలయాదులోనికి ప్రవేశిస్తూ నన్ను చూడు, నా అందం చూడు అన్నట్లుగా ప్రవర్తించటం మనం చూస్తూనే ఉన్నాం. దుష్యంత ప్రవృత్తిని ప్రకటించటం ద్వారా కాళిదాసు ప్రజల హృదయాలలో వినయాధానం చేస్తున్నాడు.

3. శాపం వలన విమోహిత చిత్తుడైన దుష్యంతుడు ధర్మ భంగభయంతో అతిలోక సౌందర్యవతి అయిన శకుంతలను ధర్మపత్నిగా స్వీకరించటానికి ఇష్టపడలేదు. ఆమెకు తోడుగా వచ్చిన కణ్వశిష్యుడు అతి తీవ్ర పదజాలంతో నిందుసభలో నిందించాడు. రాజు ఉద్రిక్తుడు కాలేదు. సహనాన్ని కోల్పోలేదు. పరమశాంత చిత్తంతో "విశేషేణాధి క్షిప్తోఽస్మి". పెద్ద తిట్టే తిట్టారు తమరు అన్నాడు ! ఒక మహాచక్రవర్తి తన నిందుసభలో ఒక ఆరణ్యకుని అధిక్షేపానికి ఇంత శాంతంగా ప్రతిస్పందించటమా! ఎంత గొప్ప మానవత్వం!

4. ఈ అధిక్షేపానికి ముందే మరొక ఆశ్చర్యకరమైన విషయాన్ని కాళిదాసు నిబంధించాడు. రాజు తన కార్యానుక్రమణిక ప్రకారం ధర్మనిర్వహణను ఆనాటికి పూర్తిచేసి అప్పుడే అంతఃపురంలోకి వెళ్ళాడు. ఆయన అటు లోపలకు వెళ్ళాడో లేదో కణ్వశిష్యులు వచ్చి తమరాకను మహారాజునకు తెలియజేయవలసినదిగా కంచుకిని 'ఆదేశించారు'. కంచుకి ఇబ్బందిలో చిక్కుకున్నాడు. అటు మహారాజు. ఇటు మహర్షి శిష్యులు. వీలు లేదు. రాజుగారు విశ్రాంతి తీసుకుంటున్నారు అని వచ్చిన వారికి చెప్పి త్రిప్పి పంపటమా? రాజుగారి విశ్రాంతిని భంగపరచటమా! భంగపరచితే రాజు శిక్షవేయడు. అది తనకు తెలిసిన విషయమే. అతనికే రాజు మీది గౌరవంతో భంగపరచే ఉద్దేశం కలగటం లేదు. చివరికి ఇలా నిర్ణయించుకున్నాడు."అథవా అవిశ్రమో హి లోకతన్త్రాధికారః" అయినా లోకతంత్రాధికారం విశ్రాంతికి అవకాశం లేనిది కదా! సూర్యుడు ఒక్కమారే రథాన్ని సిద్ధం చేసుకుంటాడు. అటు పై ఆ రథం అవిశ్రాంతంగా తిరుగుతూనే ఉండాలి. వాయువు రాత్రి అనక పగలనక వీస్తూనే ఉంటాడు. ఆది శేషుడు భూభారాన్ని ఒక్కక్షణమైనా దింపుకోకుండా మోస్తూనే ఉన్నాడు. అలాగే శుల్కంగా ప్రజలనుండి ఆరవ ఆయభాగాన్ని తీసుకుంటూ బ్రదుకుతున్న రాజునకు కూడా ఇదియే ధర్మం. అని దుష్యంతుని అవిశ్రాంత ధర్మ నిర్వహణ దీక్షను చక్కగా ప్రకటించాడు. ఇప్పటి పాలకులలో ఏకోశాన అయినా ఇటువంటి ఆలోచన ఉన్నదా? ప్రజలు, ప్రజలకోసం అని

చప్పట్ల కోసం పనికిమాలిన ప్రజా జపం చేయటమే కానీ ఆర్తుల ఆర్తనాదాలను వినటానికి, పరిష్కార చర్యలను తీసుకోవటానికీ వాళ్ళకు మనస్సు తొందరపడే సంఘటన ఒక్కటైనా ఉన్నదా? అలా లేక పోవటం అమానుషం. దుష్యంతుని తీరు సుమానుషం. అటువంటి ధార్మికబుద్ధి ఉన్నవాడు తప్ప రాష్ట్రపాలనకు పనికిరాడని కాళిదాసుని నిష్కర్ష.

ఈ సందర్భంలోనే కంచుకి తనరాజును గూర్చి మరొక గొప్పమాటను అన్నాడు.

ప్రజాः ప్రజాः స్వా ఇవ తన్త్రయిత్వా
నిషేవతే శాన్తమనా వివిక్తమ్.
యూథాని సంచార్య రవి ప్రతప్తः
శీతం దివాస్థాన మివ ద్విపేన్ద్రः *(అభి. 5.5)*

ప్రజలను కన్నబిడ్డలను వలె ఆయాస్థితులలో కుదురుకొల్పి శాంతమైన మనస్సుకలవాడై ఏకాంతాన్ని ఆశ్రయించి ఉన్నాడు. ఏనుగుమందలనన్నింటినీ సంచరింప జేసి సూర్యతాపం దేహాన్నంతటినీ ఉడుకెక్కిస్తూ ఉండగా చల్లని ప్రదేశంలో సేదదీరుతున్న కరిరాజులాగా ఉన్నాడు.

స్వాः ప్రజాः అంటే తన కన్నబిడ్డలు. అటువంటి ప్రజలను వారి వారి కృత్యాలలో నియోగించి వారాకార్యాలను చక్కగా నిర్వహిస్తూ ఉంటే ఏ అలజడీ లేని మనస్సుతో హాయిగా ఏకాంతంలో కూర్చున్నాడు.

దీనిని బట్టి తెలియవచ్చే విషయం ఏమిటంటే పాలకుడు ప్రజల సుఖశాంతులకు భంగం కలిగినప్పుడు మాత్రమే ఉద్విగ్నుడవుతాడు. వారు హాయిగా ఉంటే ఉయ్యాలలో పడుకోబెట్టి జోలపాడి నిదురపుచ్చిన బిడ్డ మొగం చూచి తల్లి మనసు ఎంత నిబ్బరంగా ఉంటుందో అంత శాంత చిత్తుడవుతాడు అనేది. మానవత్వం పరిమళాలు స్వర్గ సీమల దాకా వ్యాపించి అందరినీ అలరించే పరమ కమనీయ భావకుసుమం ఇది.

5. అభిజ్ఞాన శాకుంతలంలోనే రాజధర్మాన్ని గురించి కాళిదాసుడు ప్రస్తావించిన ఒక మహోన్నత ఘట్టం ఉన్నది. అది సార్థవాహ వృత్తాంతం.

దుష్యంతుడు శకుంతలా స్మృతిని పొంది తన తప్పిదానికి మరణవేదన వంటి వేదనను అనుభవిస్తున్నాడు. శాంతిలేదు, సౌఖ్యంలేదు. నిద్రాహారాలు కూడా లేవు. గుండె కుమిలిపోతున్నది. పాలనధర్మాన్ని తన మనఃప్రవృత్తి వంటి ప్రవృత్తియే కల మంత్రుల మీద నిక్షేపించి కాలం గడుపుతున్నాడు. పాపం ! మంత్రులు రాజు మనస్సును మరింత కల్లోల పరచకుండా నేర్పుగా, ధర్మబద్ధంగా పాలనను సాగిస్తున్నారు. సమస్యలనన్నింటినీ సమరస ధోరణిలో పరిష్కరించి ప్రజలను కాపాడుతున్నారు. ఇలా ఉండగా ఒక పెద్ద సమస్య వచ్చిపడింది. మరో గతిలేక ఆ సమస్యను పరిష్కరించ వలసినదిగా రాజుకు మంత్రి ఒక లేఖ వ్రాసి పంపాడు.

సముద్ర వ్యావారం చేసేవాడూ, పెద్ద వర్తకులగుంపు నకు నాయకుడూ అయిన ధనమిత్రుడు తాను ప్రయాణిస్తున్న నావ భగ్నం కాగా చనిపోయాడు. అతనికి సంతానం లేదు. అమలులో ఉన్న రాజశాసనం ప్రకారం సంతానం లేని వాని ధనం మొత్తం రాజుకు చెందుతుంది. ఏమి చేయమంటారు? ఈ విషయంలో నిర్ణయం తమరే చేయాలి – ఇదీ మంత్రి పంపిన పత్రం సారాంశం.

రాజుకు దీనితో మరింతగా గుండె జారిపోయింది. అయ్యో సంతానం లేకపోవటం ఎంత కష్టమైన విషయం. అనుకున్నాడు. ఇది గోరుచుట్టు మీద రోకటిపోటులా అయింది. అంతటి ఘోరాతిఘోరమైన కల్లోలమనస్థితిలో కూడా ఆయన ధర్మ నిర్ణయం ఎంత మహోన్నతంగా ఉన్నదో ఊహలకందని విషయం. ఆ సంభాషణ ఇలా సాగింది.

వేత్రవతీ! ఆ ఉత్తమ శీలుడు మహాధనవంతుడు కనుక అతనికి చాలమంది భార్యలు ఉండే అవకాశం ఉన్నది విచారించు. అందులో ఏ ఒకతె అయినా గర్భవతి అయిన భార్య ఉన్నదేమో!

ప్రభూ! ఇప్పుడు అతని జాయలలో సాకేతశ్రేష్ఠి కూతురు గర్భవతియై పుంసవన సంస్కారం చేసుకొన్నదిగా వినవస్తున్నది.

అలాగా! అయితే ఆ గర్భం తండ్రి ఆస్తికి వారసుడు అవుతుంది. వెళ్ళి మంత్రిగారికి చెప్పు.

తమరి ఆజ్ఞ అంటూ వేత్రవతి నిష్క్రమించింది. రాజు మళ్ళీ ఇలారా అని ప్రతీహారిని పిలిచాడు. ఇలా అన్నాడు. "సంతానం ఉన్నదోలేదో మన కెందుకు?

"యేన యేన వియుజ్యన్తే ప్రజాः స్నిగ్ధేన బన్ధునా
స స పాపాదృతే తాసా దుష్యన్త ఇతి ఘుష్యతామ్" *6-23*

నా ప్రజలు తమకు ఆప్తులైన ఏ చుట్టంతో వియోగం పొందుతారో ఆ చుట్టం స్థానంలో వారికి దుష్యంతుడు నిలుస్తాడు అని నా ప్రజలందరికీ చాటింపువేసి తెలియ జేయ్యండి. ఇదిగో! ఇదిగో! మరొక ముఖ్యవిషయం. ఆ

చుట్టరికం పాపాత్మకం కాకపోతేనే సుమా!

అని అదేశించి ప్రతీహారిని పంపించాడు.

మానవత్వం కడపటిమెట్టు ఇది. ఆ సార్థవాహుని సంసారంలోని వారికి నేను కొడుకు, తమ్ముడు, తండ్రి మొదలైన సత్సంబంధాలు కలవాడనుగా ప్రవర్తిస్తాను. అంతేకానీ అతని భార్యలకు మగనిస్థానంలో మాత్రం మనసుపెట్టను. ఇది ఒక్క సార్థవాహునకు మాత్రమే కాదు. నా ప్రజలందరి విషయంలో వర్తించే సార్వత్రిక శాసనం. ఇలా చాటింపు వేయించు.

ఇక్కడ మనం గుర్తించవలసినది రాజుశాంతచిత్తుడై హాయిగా ఉల్లాసంగా ఉన్నప్పటి మాటకాదిది. హృదయం ఛిన్నాభిన్నమై అలమటిస్తున్న సమయంలో పలికిన ధర్మవాక్కు ఇది. అనంత జన్మల సంస్కార విశేషం చేత అలవడిన మనస్థితి. ఆది రాజ యశోబింబమైన పరమోదాత్త వాక్కు.

ముక్తాయింపుగా మరొక్క విషయం కూడా చెప్పాలి. దుష్యంతునకు హఠాత్తుగా ఇంద్రుని నుండి ఒక మహాకార్య నిర్వహణకోసం ఆదేశం వచ్చింది. అది కూడా మనస్సు వికలమై ఉన్న స్థితిలో. అయినా హృదయాన్ని సుస్థితిలోనికి సంస్కారబలం చేత తెచ్చుకొని బయలుదేరాడు. విదూషకునితో ఇలా అన్నాడు. "చెలికాడా! నామాటగా అమాత్యపిశునులకు చెప్పు. "నీ బుద్ధి ప్రజాపాలనయే. ఏకలక్ష్యంగా ఉన్నట్టిది. కాబట్టి నేను తిరిగి వచ్చేవరకు ప్రజలను చక్కగా పరిపాలించు!

దేవేంద్రుడంతటివాడు సాదరంగా ఆహ్వానం పంపితే ఆనందపారవశ్యంతో మహారాజ ఆత్మధర్మాన్ని విస్మరించ లేదు. ఆత్మీయులను గూర్చి విచారించలేదు. ప్రజలను పాలించటంలో ఏమరుపాటు లేకుండా ప్రవర్తించమని ఒకేఒక్కమాట మంత్రికి చేరవేశాడు. ఇదండీ అతి మానుషమైన మానవత్వం.

ప్రాచార్య శలాక రఘునాథశర్మ
రాజమండ్రి, ఫోన్ : 0883-2432906

మిసిమి
మాసపత్రిక
చందాదారులుగా చేరండి, చేర్పించండి
అరుదైన బహుమతి



నెల నెలా **మిసిమి** పత్రికను మీ ఇంటిదగ్గర అందుకొనేందుకు చందాదారులుగా చేరండి.
నాలుగు సంవత్సరాలకు వెయ్యి రూపాయలు పంపండి.
మీకు ప్రతినెల **మిసిమి** పత్రిక మీ ఇంటికే వస్తుంది.
చందా అందిన వెంటనే మీకు **అరుదైన బహుమతి చార్లీ చాప్లిన్ (నా కథ) ఉచితంగా పంపిస్తాము.**

ఈ అరుదైన అవకాశాన్ని పాఠకులు

మిసిమి
మాసపత్రిక

Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536

తిమిరంతో సమరం – దాశరథి

– రావినూతల సత్యనారాయణ

ప్రవేశిక :

తెలంగాణా కవి శ్రేష్ఠులలో మహారథి దాశరథి కృష్ణమాచార్యులు. కవితా పయోనిధిగా ప్రఖ్యాతి గాంచిన దాశరథి బహుముఖ ప్రజ్ఞానిధి. దాశరథి కవి, ఉద్యమశీలి, మహావక్త, అనువాద ప్రక్రియా దురంధరులు, అన్నిటి కన్నా మించి మానవత రూపు కట్టిన స్నేహశీలి. దాశరథి 22-07-1925న శ్రీమాన్ వేంకటాచార్యులు, శ్రీమతి వేంకటమ్మ గారికి జన్మించారు. వారి స్వస్థలం అప్పటి వరంగల్ జిల్లా (ఇప్పటి ఖమ్మం జిల్లా) లోని చిన గూడూరు గ్రామం. కృష్ణమాచార్యుల వారి పూర్వీకులు భద్రాచలం నివాసులు. విశిష్టాద్వైత శాఖకు చెందిన వారు. శ్రీరామ భక్తులు కావడం మూలాన వారి ఇంటి పేరు 'దాశరథి' అయినదని ప్రసిద్ధి. కృష్ణమాచార్యుల తండ్రి వేంకటాచార్యుల వారు గొప్ప సంస్కృత విద్వాంసులు. వారి తల్లి గారు సహితం, తెలుగు సాహిత్యంలో మంచి ప్రావీణ్యం కలవారని చెప్పుకొంటారు, వారి కుటుంబ పరిచితులందరూ. అటువంటి తల్లి తండ్రుల పెంపకం, బాలుడైన కృష్ణమాచారిలో సాహిత్య బీజాలు నాటింది. తర్వాత కాలంలో 'కృష్ణమాచార్యులు' మరుగున పడి, దాశరథిగా ఆయన పేరు స్థిర పడింది.

దాశరథి విద్యాభ్యాసం ఖమ్మంలో మొదలైంది. నాటి నిజాం ప్రభుత్వం ఉర్దూ భాషను బోధనా భాషగా నిర్ణయించి నందున విద్యాభ్యాసం పూర్తిగా ఉర్దూలోనే జరిగింది. "ఇంట్లో మాత్రం మా నాయన సంస్కృత భాషాధిక్యత గురించి చెప్పే వారు..." అంటారు దాశరథి. దాశరథిని కవితా కన్య బాల్యంలోనే వరించింది! పూవు పుట్టగానే పరిమళిస్తుందని కదా నానుడి! ఆ విధంగా దాశరథి ఏడో తరగతిలో జరిగిన ఒక సంఘటన సమకాలిక మిత్రులు ఇలా చెప్తారు. "పాఠశాలలో కవి సమ్మేళనం జరిగినప్పుడు 12 సంవత్సరాల బాలుడైన దాశరథి గంభీరముగా పెద్దల ముందు 25 పద్యాలు చదివారుట! ఆ ధారకీ, కవితా శక్తికీ, పఠన మాధుర్యానికీ, అబ్బుర పడిన ఆనాటి సభాధ్యక్షులు (సుబేదార్ నారాయణ రావు), దాశరథిని కౌగలించుకొని, నాకు అంతగా తెలుగు రాక పోయినా, నీ కవిత్వం బాగుందని" అంటూ "ఏక్ దిన్ తెలుగుకా శాయిర్ ఆజమ్ బనేగా" (ఒక రోజు మహాకవి వి కాగలవు) అని ఆశీర్వదించి, వంద రూపాయలు బహుకరించారట! ఆ భవిష్యవాణి నిజమై, దాశరథి మహాకవిగా పరిణమించుటయే కాక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆస్థాన కవిగా నియమితులై అపార కీర్తి గడించిన విషయం విజ్ఞులైన పాఠకులకు విదితమే! ఆ విధంగా 12వ యేట మొదలైన దాశరథి కవితా ప్రస్థానం దాదాపు 50 సంవత్సరాలు నిరంతరంగా సాగింది. వారి జీవిత సమర విశేషాలు పాఠకులకు విదితమే!

దాశరథి సాహిత్య ప్రస్థానం :

దాశరథి కవితా ప్రస్థానం, కవితా సాధన ప్రధానంగా మూడు విషయాలపై ఆధార పడి ఉంది. మొదటిది దేశభక్తి భావన, రెండవది అభ్యుదయ దృక్పథం, మూడవది సాంప్రదాయ వివేకం. ఈ మూడే కాక, నాల్గవ అంశం కూడా దాశరథిలో అంతర్లీనంగా ఉంది. అదే, శృంగార భావన! ఈ భావన కొంత మేరకు అగ్నిధార, కవితా పుష్పకం మొదలైన కావ్యాలలోను, చలన చిత్ర లలిత సంగీత గేయాల్లోను, వ్యక్త మౌతుంది. అర్ధ శతాబ్ది కాలంలో దాశరథి దాదాపు 31 గ్రంథాలు రచించారు. వానిలో అన్ని రకాల సాహిత్య ప్రక్రియలు చోటు చేసుకున్నాయి. అన్ని గ్రంథాల వివరాల విశ్లేషణ, మరో గ్రంథంగా రూపొందుతుంది. అందుచేత ఆ ప్రయత్నం ఈ వ్యాస కర్త ఉద్దేశ్యము కాదు. అయినప్పటికీ, దాశరథి సమగ్ర సాహిత్య విహంగ వీక్షణానికి, ఈ వ్యాసం ద్వారా ప్రయత్నిస్తాను. ఇది సాహసంతో కూడిన ప్రక్రియ. సహృదయులైన పాఠక మహాశయులు దీనిని కేవలం పృష్ఠ

భూమిగా గ్రహించి, స్థూల దృష్టితో స్వీకరిస్తారని ఆశిస్తాను. కాని *తిమిరంతో సమరం* అను కావ్యాన్ని మాత్రం సూక్ష్మ దృష్టితో పరిశీలించు యత్నం జరిగింది. ఆ కావ్యం 1974వ సంవత్సరంలో ప్రచురితమైన తెలుగు గ్రంథాలలో ఉత్తమ మైనదిగా ఎంపికై, కేంద్ర సాహిత్య అకాడెమీ జాతీయ పురస్కారాన్ని అందుకొన్నది. అది ఈ వ్యాసంలోని ప్రధానాంశం.

దాశరథి రచనలు :

ఇదివరలో పేర్కొన్నట్లుగా దాశరథి బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన కలం రకరకాల పరవళ్ళు త్రొక్కింది! ఆయన కలం నిప్పులెంతగా కురిపించిందో, పూల సౌరభాన్ని అంతగానూ పంచింది. సాహిత్యంలోని దాదాపు అన్ని ప్రక్రియలలోను ఆయన రచన చేశారు. ప్రక్రియా వైవిధ్యమే కాక, రచనా వైశిష్ట్యము సహితం దాశరథి రచనలో మనకు స్ఫురిస్తుంది. సాహిత్యమే ఊపిరిగా గల దాశరథి, వివిధ రచనలు చేయడం సహజమే కదా?! 1949 –1987 మధ్య కాలంలో దాశరథి రచించిన కొన్ని ముఖ్య రచనలను పరిశీలిద్దాం!

అగ్నిధార :

దాశరథి అచ్చైన పుస్తకాలలో మొదటిది *అగ్నిధార*, ఇది 1949 లో ప్రచురిత మైనది. దేవులపల్లి రామానుజ రావు దీనికి తొలి పలుకు వ్రాశారు. *అగ్నిధార*లోని కవితా ఖండికలు చాలావరకు దాశరథి జైలులోను, జైలు నుండి విడుదలైన కొత్తలోను వ్రాసినవి. నిజాం రాష్ట్రంలో ప్రభుత్వ నిరంకుశత్వం, ప్రజల అగచాట్లు, భారత స్వాతంత్ర్యం, భారత సైన్యాల హైదరాబాదు ప్రవేశం, నైజాం ప్రభుత్వ పతనం – ఈ కావ్యంలోని రచనలకు పునాదులు. *అగ్నిధార* అనే పేరునే చాలా మంది ఆక్షేపించారు! అగ్ని ధారలా ప్రవహిస్తుందా?! అగ్ని అనేది చైతన్యానికి సంకేతం. ఆ చైతన్యం ఒక మానవుని హృదయములో నుండి మరొకని లోనికి ప్రవహించి ఇట్టే జాతి నంతటినీ ఏక సూత్రాన బంధిస్తుంది. దాశరథి అనగానే మన స్మృతి పథంలో పరుగులెత్తే పద్యం :

ప్రాణము లొడ్డి ఘోరగహనాటవులన్ పడగొట్టి మంచి మా
గాణములన్ సృజించి ఎముకల్ నుసి చేసి పొలాలు దున్ని భో
షాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే, తెలం
గాణము రైతుదే; ముసలి నక్కకు రాచరికము దక్కునే?
ఓ నిజాము పిశాచమా! కానగ రాడు – నిన్ను బోలిన రాజు మా కెన్నడేని;
తీగెలను తెంపి, అగ్నిలో దింపినావు – నా తెలంగాణ, కోటి రత్నాల వీణ.

రతనాల వీణ తెలంగాణా భూమి అయితే, రతనాలు తెలంగాణ ప్రజలైతే, తీగలు ఆ ప్రజల మనో భావాలు! ఆ మనో భావాలను అవమానించి, అవహేళన చేసి, బాధలకు గురిచేసిన కారణంగా –

వీణియ తీగపై పదును పెట్టిన నా కరవాల ధారతో
గానము నాలపించిన స్వకంఠము నుత్తరణం బొనర్చి స్వ
ర్గానకు భూమి నుండి రస గంగలు చిమ్మెద పీడిత ప్రజా
వాణికి మైకమర్చి అభవాదులకున్ వినిపింప చేసెదన్

జైల్లో రజాకార్లు ప్రవేశించి దాశరథిని చితకబాది, పడవేసి త్రొక్కారు, మూతి పగుల గొట్టారు. మూడు రోజులు అన్న పానీయాలు మ్రింగుడు పడలేదు. ఆ అనుభవాన్ని అంతా పద్యాలలో పలికించారు. అందుకే స్వకంఠమ్ము నుత్తరణం బొనర్చి స్వర్గానకు భూమి నుండి రస గంగలు చిమ్మెద నన్నాడు. పీడించేవారు స్వర్గంలో విహరిస్తున్నారు, వారికి కనువిప్పు కలిగేలా కరుణ రస గంగలను చిమ్ముతా నంటున్నాడు. పీడిత ప్రజలకు మైకుగా మారి వారి వ్యథలను, కథలను అభవాదులకు (పునర్జన్మపై నమ్మకం లేనివారికి) వినిపింపజేస్తానంటాడు. తురుష్కులు అంటే, నిజాం ప్రభువులని అర్థం.

"దాశరథి కవితా శరములు చాలా వాడియైనవి. కాని ఈ కవితా శరములన్నీ అగ్ని బాణములనుకోవడము న్యాయము కాదు. వీనిలో అనేకము మదిలో మధుర భావాలను పులకెత్తించే కుసుమ శిరాలు" అని దేవులపల్లి రామానుజరావు పేర్కొనుట సమంజసం. ఋతు వర్ణన కవిత్వంలో అనాదిగా ఉన్నదే. ఒక్కొక్క కవి ఒక్కొక్క విధంగా వర్ణించడం అయా కవుల ప్రతిభను వెల్లడిస్తుంది. కాని, దాశరథి ప్రకృతి వర్ణనలో ప్రణయాన్ని, హృదయతాపాన్ని వినూత్నంగా వెల్లడించారు గమనించండి :

వానల లోన క్రొంజలువ వాగులలో, వడగండ్లలో పసం
దైన పయింటయున్ పిరుద నంటిన చీరయు, నానిపోవ రా
వేనకన్నె! కొంగున చలించెను నీ తనువల్లి యెల్ల! శీ
తానిల ధారలో వలువ లారగ గట్టుము నా బుజాల పై.

పైన పేర్కొనిన వానా కాలం వర్ణనలో ప్రణయారాధన చివరి పంక్తిలో ప్రస్ఫుటంగా వ్యక్తమౌతుంది. కవికి ఉండవలసిన ఆత్మవిశ్వాసమునకు దాశరథిలో లోటు లేదు. తన కవితను గూర్చి, కావ్యాలను గూర్చి ఆయన వ్యక్త పరచిన అభిప్రాయాలు ఏమాత్రం అతిశయోక్తులు కావు. ఆత్మ విశ్వాసానికి అవి నిదర్శనాలు. ఈ క్రింది పద్యాన్ని

పరికించండి :

నా దొక వెర్రి; త్రాగుడున – నాడును వీడును అమ్ముకొన్న ఉ
న్మాది పలెన్ కవిత్వమున – నా సకలమ్మును కోలుపోయి రా
త్రీ దినముల్ రచించితిని – తీయని కావ్య రస ప్రపంచముల్;
వేదన యేదియో కలత – వెట్టును గుండియ నెందుచేతనో?

అగ్నిధార కావ్యంలోని అనేక ఖండికలను గూర్చి యెంతైనా విశ్లేషించ వచ్చును. కాని స్థలాభావం అందుకు అనుమతించదు. ఈ కావ్యాన్ని దాశరథి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ వట్టికోట ఆళ్వారు స్వామికి అంకిత మిచ్చారు. ఆ కవితలోని కొన్ని పంక్తులు :

స్వార్థం రాచరికం నెరపే లోకంలో – నిస్వార్థి
ఆశ్రయింపు లెరుగని వాడు – విశ్రాంతి తెలియని వాడు
స్వసుఖం కోరని వాడు – వారం వారం మారని వాడు . . .
మనిషి మనస్సులో మంచినే గాని –
చెడు అనే మాలిన్యాన్ని వెతక తల పెట్టని వాడు
మిత్రుని కోసం కంఠం ఇవ్వగల వాడు – అతని కీ *అగ్నిధార* అంకితం.

రుద్రవీణ :

ఈ ఖండ కావ్యం 1950 లో ప్రచురిత మైనది. ఇందులో దాదాపు 18 కవితా ఖండిక లున్నవి. పద్య రచనా విధానములో ఆరితేరిన వారు దాశరథి. గాఢమైన భావన, రస నిర్భరంగా పలికే శబ్ద విన్యాసం, అప్పుడప్పుడూ వ్యంగ్యార్థం, సాధారణ పద్య భావాన్ని మరిపించి పాఠకుల మనసులను ఆర్ద్రతతో నింపుతాయి, ఇందులోని కవితలు.

మూర్ఛన అనే కవితలోని ఒక పద్యాన్ని పరిశీలించండి.

చింతల తోపులో కురియు చిన్ములకున్ తడి ముద్దయైన బా
లింత యొడిన్ శయనించు పసి రెక్కల మొగ్గను వోని బిడ్డకున్
బొంతలు లేవు కప్పుటకు; బొంది హిమం బయిపోవు నేమొ? సా
గింతును రుద్ర వీణ పయి నించుక వెచ్చని అగ్ని గీతముల్.

పై పద్యంలో నాటి తెలంగాణా ప్రాంతంలో తలదాచు కోవటానికి ఇండ్లు లేని పేదల ఇక్కట్లు స్పష్టంగా వ్యక్త మౌతాయి. కనీసం బాలెంత అని కనికరించి ధనవంతు లెవ్వరూ తలదాచు కోవడానికి ఇంత చోటు ఇచ్చిన పాపాన పోలేదని ధ్వని. బొంతలు బీదరికానికి ప్రతీక. కప్పుకోడానికి కనీసం అవి కూడా లేవు. బీద వారికి పూరి పాకలే మహాసౌధాలు. వాటికి కూడా వారు నోచుకోలేదు. చివరకు చింత తోపే గూడు. ఆ దీన స్థితిని కండ్లార చూచిన దాశరథి పద్యంలో పలికించాడు. రుద్రవీణపై మ్రోగిస్తానన్నాడు. రుద్రవీణ అంటే తెలంగాణా అని భావం. అగ్ని గీతాలంటే చైతన్యం రగిలించే పద్యాలు. శరీరం వేడెక్కడానికి, పుట్టిన బిడ్డకు కూడా విప్లవ భావాలతో వేడి పుట్టించి బ్రతికిస్తాను అంటాడు కవి దాశరథి! ఎంతటి గొప్ప భావన!

స్వామిపూజ అనే మరో కవితలో భారతదేశం పర పాలనలో పడుతున్న ఇక్కట్లను సహించలేని దాశరథి, తెల్లవారి చర్యలకు కోపించి కన్నులు నెత్తురు చిమ్ముతున్నాయని ప్రతీకాత్మకంగా నిందిస్తాడు. ఆ పద్యాన్ని ఆస్వాదించండి :

పడమర గాలి తాకిడికి వాడియు రాలిన పూలజాలులో
యెడదయు వాడి పోయినది యెట్టుల నిన్ గయి సేతు నింక? నీ
అడుగుల సవ్వడిన్ వినిన యంతనె నా నవ నాడు లెందుకో
గడగడ లాడు, నెత్తురులు కన్పడు నా నయనాంచలమ్ములన్.

పడమర గాలి తెల్ల దొరల పాలనకు చిహ్నం. వారి నిరంకుశత్వంలో వాడిపోయిన పూలు భారత ప్రజానీకం. పై పద్యం లోని వ్యంగ్యార్థం గ్రహించ దగ్గది! భారత దేశం స్వతంత్ర మైంది. అదే తరుణంలో నిజాం రాజు తెలంగాణా ప్రజలపై విషాన్ని గుప్పించాడు. కాశిం రజ్వీ చేతికి పెత్తనమిచ్చి ప్రజలను నానా హింసలకులోను చేసి, అనేకుల మాన, ప్రాణాలను దోచుకున్నాడు. ఆనాటి అనుభవాలను వర్ణించిన తీరును గమనించండి.

మత పైశాచి వికార దంష్ట్రికలతో మాభూమి లంఘించి మా
కుతుకల్ గోసెడి వేళ గూడ యెటు దిక్కున్ తోచకున్నప్పుడున్
బ్రతుకే దుర్భరమైన యప్పుడును ఆంధ్రత్వమ్మును పోనాడ లే
దు, తుదిన్ గెల్చితి మమ్మ యుద్ధమున రుద్రుల్ మెచ్చ నాంధ్రాంబికా.

పై పద్యంలో తన అనుభవాలను స్పష్టంగా చిత్రించాడు కవి. ధైర్యంతో రజాకార్ల నెదిరించి పల్లెలను కాపాడుకొన్నారు ప్రజలు. అప్పుడు జరిగిన అమానుష చర్యలకు బాధపడి, మానవత్వము తనను తానే తిన్నదని విలపించాడు దాశరథి. జంతు జాతిలో సహితం, పాము, పెద్ద పులి మాత్రమే తమ సంతానాన్ని తింటాయట! అటువంటి చర్యగానే ఆనాటి పరిస్థితిని విశ్లేషించారు దాశరథి.

నాడు మానవతీ నయనమ్ములందు – నాగ సర్పాలు తలలెత్తి నాట్యమాడె
నాడు మానవతా నవ నాగరకత – తన్ను తిన్నది రాక్షసత్వముతోడ.

దాశరథి కవిత్వంలో ఏ పద్యం ముట్టుకున్నా ఒక చరిత్ర, ఒక ప్రతీక, ఓ అగ్ని శకలం జ్వలిస్తూనే ఉంటుంది.

మహోంధ్రోదయం :

తెలంగాణాలో దేశాభిమాన ప్రబోధక గీతము లాలపించిన కవులలో దాశరథిది అగ్రస్థానం. ఈయన కవిత్వం లలిత పద చమత్కార సంపన్నమై, చదివిన కొలదీ, చవులూరించు చుండును. భావావేశము దేశాభిమాన కవిత్వానికి ప్రధాన లక్షణము. ఈ లక్షణం దాశరథిలో

పుష్కలంగా ఉంది. మహాంధ్రోదయం కావ్యం దేశాభిమానోద్దీపక కవితా సంపుటి. ఈ కావ్యం 1955లో ప్రకటితమైనది. దీనిని దాశరథి సురవరం ప్రతాప రెడ్డికి అంకితము చేశారు. ఈ కావ్యానికి మల్లంపల్లి సోమశేఖర శర్మ పీఠిక వ్రాశారు. ఇందులో దాదాపు 15 కవితా ఖండికలున్నవి. ముఖ్యమైన కవితలు ఆస్వాదిద్దాం! దాశరథిలో పూర్వ కవుల పోకడలతోపాటు, అధునాతన కవుల రాకడలునున్నవి! ఈ క్రింది గేయాన్ని పరికించండి :

తెలుగు నింగి దారులలో – వెలుగు పులుగు రెక్కలార్చి
చిమ్మివైచె తర తరాల – చిక్కని చీకట్ల నెల్ల.

పైన ఉదహరించిన పంక్తులు మహాంధ్రోదయం అనే గేయం లోనివి. ఎంత చక్కని శబ్ద చిత్రణ మో, ఎంతటి భావ గర్భిత కృతియో గమనించండి! మనసును రంజింప జేయుటలో శబ్ద చిత్రణములు అమోఘంగా పని చేస్తాయి. ఆ కళలో ఆరితేరిన వాడు దాశరథి! గాఢ దేశాభిమానం వ్యక్త మవుతుంది ఈ కవితా ఖండికలో. అందుకే అంటారు కవి :

తెలుగు ఊరులు – తెలుగు వారలు
ప్రతి ఫలించే మహా కావ్యం – నాకు కావలె, నాకు కావలె.

అంతటితో ఆగక –

కోటి తమ్ముల కడ రెండు కోట్ల తెల్గు –
టన్నలను గూర్చి వృత్తాంత మంద జేసి
మూడు కోటుల నొక్కటే ముడి బిగించి –
పాడి నాను మహాంధ్ర సౌభాగ్య గీతి.

ఆ నాటి తెలంగాణా జనాభా కోటి మంది. ఇతర తెలుగు వారు రెండు కోట్ల మంది. అందుకే ముక్కోటి ఆంధ్రులన్న గణన! ఈ నాటి జనాభా అంతకు రెండున్నర రెట్లయినది. దాశరథి వ్యక్త పరచిన అభిమతం తారుమారుగా అయ్యే సంకేతాలు దగ్గిర పడినవేమో? అనిపిస్తుంది!

దాశరథి కవితలో పూర్వ కవుల పోకడలు కనిపిస్తవని ఇదివరలో చెప్పడం జరిగింది. అందుకు ఉదాహరణగా ఈ పద్యం తిలకించండి!

పోషము వనితా మధురా – శ్లేషము, శృంగార రస విశిష్ట జగత్సం
తోషము, నగ్నాయిత తరు – శేషము, శిశిరాని లోపచిత వేషంబున్.

పైన పేర్కొనిన పంక్తులు మహాకవి పోతన్న శైలిని పుణికి పుచ్చు కొనినట్లు తెలియపరుచుచున్నవి. ఇది *పోష లక్ష్మి* ఖండిక లోనిది. అలాగే, *మాధురి* అనే కవిత నుండి మరో పద్యాన్ని పరిశీలించండి. అందులో ప్రబంధ కవుల పోకడలను చూడ వచ్చును.

గుమగుమ లాడి నా మనసు గొన్న నవాబ్జ సఖీ ముఖాను రా
గమున సుమించె చంపకము; కౌగిలిలో ప్రసవించె గోరటల్;
సుమ రమణీయమై తగె నశోకము తచ్చరణాహతిన్; ప్రహా
సమున సుమించె పొన్నలు పసందగు నందన దివ్య వాటిలో.

నూతన సంవత్సరమును నాతితో పోల్చి ఆమె ముఖ రాగమున కౌగిలిని చరణాహతిని ప్రహసనమున నందన దివ్య వాటికలోని చంపక, కురంటక, అశోక, పున్నాగ చెట్లు పూచినవట! అలాగే, *కాపయ నాయకుడు* అనే ఖండికలోని ఈ పంక్తులు విశేషించి గమనింప దగినవి :

ముక్కలైన మాతృమూర్తి గేహమ్మును –
కూర్చి కట్టుదోయి కొమరు లార!
మనము మనము కలహమున మునింగిన యెడ –
మన మహాంధ్రలక్ష్మి మనకు రాదు.

మూర్తీభవించిన తెలుగు తనమే దాశరథి. ఆయన మహాంధ్రోర్వరనున్న తెలుగు వారి కందరికి మంగళాశంసనముగా సమర్పించుచున్న కానుక ఈ మహాంధ్రోదయము.

పునర్నవం :

"ఏదో చెప్పాలనే కోర్కె, చుట్టు పక్కల మనుష్యుల్లో, వాళ్ళ క్రియా కలాపాల్లో ఆసక్తి, కనబడే లోకంలో కనబడని లోకంలో కాంక్ష, ఆకారం మీద అనురాగం – ఈ నాలుగూ గుండెను కవ్వించి కలం చేపట్టిస్తాయి. అచ్చంగా సొంత అనుభవాలు, వ్యక్తికీ సంఘానికీ గల చుట్టరికం, ప్రకృతికి మనకు గల పారస్పరిక బాంధనం, నవ సృష్టి కోసం కృషి – ఈ అయిదు కవితా సౌధ రచనకు వాస్తు శాస్త్రంలా తోడ్పడతాయి" అంటారు దాశరథి *పునర్నవం* అనే కావ్యంలో!

ఈ కావ్యం 1956లో ముద్రితమైనది. ఇందులో దాదాపు 22 కవితా ఖండిక లున్నవి. దీనికి తొలిపలుకుగా పి.వి.రత్నం ప్రచురించిన *పునర్నవం* విమర్శను పొందు పరిచారు.

సుదీర్ఘమైన ఈ విమర్శలో కావ్యాన్ని గురించిన అనేక విషయాలు తెలియపరిచారు. దాశరథి గురించి చెబుతూ ఆయన నిద్రాణమైన తెలంగాణాను తన కవిత ద్వారా మేల్కొలిపిన వైతాళికులని అభివర్ణించారు. దాశరథి స్వాతంత్ర్య భావాలు, అభ్యుదయ పోకడలు అపారమని పేర్కొంటూ, ఆయనకు బానిసత్వం, అన్యాయం అంటే అసహ్యం అని ఉద్ఘాటించారు. *తెలంగాణం* అనే కవితను ఉల్లేఖించి, ఆ ఖండికలోని కొన్ని పంక్తులు పేర్కొన్నారు, పరికించండి :

తమ మంత్రం పారదింక – ఉచ్చు త్రెంచు కొనెను జింక
ఇక స్వేచ్ఛా ప్రయాణము – ఇదే తెలంగాణము.

తెలుసా?అన్నాడు.

మనిషి జీవితంలో బాల్యం అతి మధురమైన దశ. 'బాల్యం' గురించి దాశరథి చెప్పిన తీరును చదివి మనం ఆశ్చర్యపోతాం, ఆనందిస్తాం. ఆహా! అనుకుంటాం. *"బాల్యం* అనే గేయాన్ని సాహిత్యంలో ఒక కోహినూర్'' అని అభివర్ణిస్తారు రత్నం. ఆ కవితలోని కొంత భాగం ఆస్వాదించండి :

దుర్మార్గాలకీ, దుఃఖాలకి ఇవతలి గట్టున –
తొంగి తొంగి చూస్తున్న లోకం బాల్యం ...
"అసలు బ్రతుక్కి ఆనందపు పొలిమేర –
పసితనం గాక మరేముంది చెప్పండి" అంటాడు.

మీరు ఆలోచనలో పడి పోతున్నప్పుడే –

"డబ్బు సంపాదనకు కావలసిన రహస్యాలు –
దానికోసం చేయ వలసిన సదస్యాలు
బ్రతుకులో ఏ భాగంలో వుండ వంటే –
ఇదో ఈ భాగంలో, బాల్యంలో".

కవితలోని ప్రతి పదంతో మనలో ఆలోచన రేకెత్తించి, అనుభూతులు కలిగించి, మనల్ని వినూత్న లోకాల్లో విహరింపజేస్తాడు దాశరథి. భాషలో మాధుర్యం, చెప్పడంలో సొగసు గమనించండి. విచిత్రమేమిటంటే *బాల్యం* గురించి చిన్న పిల్లలకు సహితం అర్థమయ్యేలా వ్రాశాడు! చూడండి:

నాగ జెముడు గుచ్చు కుంటుందనీ – నాగసర్పం కరుస్తుందనీ –
నమ్మించి మోసం చెయొచ్చనీ, –
అన్నల్ని తమ్ముళ్ళా, తమ్ముళ్ళని అన్నలూ –
అనాయాసంగా పొడి చేసుకో గలరనీ ...
ఉన్న దాన్ని ఉన్నవాళ్ళందరిలో పంచి –
ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి
ఉజ్వలంగా ఆటల్లో పాటల్లో పడి –
ఊరంతా తిరగడం ఎంత బాగుంటుంది?

దాశరథి అందరూ హాయిగా జీవించాలని కోరు కుంటాడు! అంతకంటే సామ్యవాదం మరేముంది?

నా పేరు ప్రజా కోటి అనే మరో గేయంలో

గతాన్ని కాదనలేను – వర్తమానాన్ని వద్దన బోను
భవిష్యత్తు వదులు కోను; – కాలం నా కంఠమాల;
***నా పేరు ప్రజా కోటి* – నా ఊరు ప్రజా వాటి.**

అంటూ తానెవరో ప్రజలకు తెలియజేస్తాడు. వినండి దాశరథి గర్జనలు! *పునర్నవం* అను ఖండికలో నిజమైన కవిత్వానికి నిర్వచనం చెప్తాడు! పరిశీలించండి :

రోజూ పొందని ఆనందానుభూతి – పొందడం అంటేనే కవిత్వం ...
మనసు మళ్లె పొదల్లోంచి – పసందైన వాసనలు వీచి
అవి పద్యాల సీసాల్లో – అనంత కాలం నిలిస్తే కవిత్వం.

"ఔను! దాశరథి కవిత కలకాలం నిలుస్తుంది. ఆ కవితలో కొత్తదనంవుంది, కమ్మదనంవుంది, ఘాటువుంది, గర్జనవుంది, అనుభూతివుంది. ఒక్కమాటలో వర్ణించాలంటే నవరత్నాలు, నవరసాలూ వున్నాయ్''. *పునర్నవం*లో ఎక్కువమందిమెచ్చుకొని, ప్రయోగాత్మక కవితగా పేరు పొందిన కవిత మస్తిష్కంలో లేబొరేటరీ విజ్ఞానశాస్త్ర విషయాలను మేళవించి తన భావాలను చెప్పటం *పునర్నవం*లో వ్యక్తమౌతుంది. మానవ మస్తిష్కమే ఒక ప్రయోగశాల అంటారు దాశరథి. ఈ ప్రయోగశాలలో అణ్వస్త్రాలు, బాంబులు వంటి విధ్వంసపరమైనవి తయారు చేయబడవు.

మానవ ప్రగతికీ, శ్రేయస్సుకీ ఉపయోగపడేదే మస్తిష్కం. వినాశానికి దూరంగా వుండాలన్నదే దాశరథి ఆశ.

మస్తిష్కంలో వెలిగే – మా ఇంటికి ముందుండిన
లేబొరేటరీ తెరిచి వుంది – మధన పడే మేధావుల
శిథిలాశలు చివురించే – రస రాజ్యం లేబొరేటరీ.

అని దీర్ఘ కవితా ఖండికను ముగిస్తారు కవి.

దాశరథి ప్రతిభను చూపటానికీ, చాటడానికీ, మనం సగర్వంగా చెప్పుకోడానికి ఒక్క *పునర్నవం* కావ్యం చాలుననే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు పి.వి.రత్నం తమ విమర్శలో.

అమృతాభిషేకము :

అమృతాభిషేకం అనే కావ్యాన్ని దాశరథి 1959వ సంవత్సరంలో వ్రాశారు. దీనిని డా. బెజవాడ గోపాలరెడ్డి గారికి అంకితము ఇచ్చారు. *అమృతాభిషేకా*నికి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం దాశరథి కవితా లోకము అనుపేరిట విపుల ప్రవేశిక వ్రాశారు. ఈ కావ్యంలో 16 కవితా ఖండికలున్నవి. కవితలన్నీ దేనికది చదివి ఆనందింప తగినవి. కవిగా దాశరథి పాత కొత్తల మేలుకలయికకు మంచి ఉదాహరణ. అసలు కవిత్వ మంటేనే 'పాత విషయాన్ని కొత్త మాటల్లో చెప్పడం'. *అమృతాభిషేకము* మొదటి కవిత *సుప్రభాతము* వృత్తాల్లోను, సీస గీతాల్లోను రచించారు దాశరథి. ఆ మేరకే దాని సాంప్రదాయ బంధనం. దాశరథి భావాలు మయూర కవి *సూర్య శతకం* భావాల వలె ఉన్నతమైనవి కాని *సూర్య శతకం*లోని కారిన్యత *సుప్రభాతము*లో లేదు. మనం ప్రతి నిత్యం చూస్తున్న లోక బాంధవుని గూర్చిన కవిత

ఇది. కొన్ని పద్యాలలోని అనుభూతులను ఆస్వాదిద్దాం :

ఈత డీతడే కావచ్చు నింద్ర దిశకు –
పశ్చిమాశకు నడుమ రే బవలు నడచి
ఒకరి వృత్తాంతము మొక్కరి కొసగి యొసగి –
స్నిగ్ధ బంధము గూర్చెడి స్నేహితుండు.

కేవలం స్నిగ్ధ బంధాన్ని కూర్చే స్నేహితుడే కాదు –

దైహి కారోగ్యమునే గాక తన కరాల –
హృదయ మందలి రుజ నెల్ల వదల గొట్టి
ఆత్మకానందమును గూర్చు నట్టి వైద్యు –
డతని కభివాద మొనరింతు నంజలింతు. ...
చేతనమ్ముల కెల్ల సంప్రీతి గూర్చి –
బీజముల నుండి మొక్కలు వెలికి తీసి
తీవె లందున పుష్పాలు ప్రోపు బోసి –
జగతికి విలాసమును గూర్చె సౌరమూర్తి.

ఈ శీర్షికలోనే మరో చోట –

ఇంక నిద్దుర పోయెదవేమె, సుదతి! –
ఇరులె కురులయి పడి మొగ మెత్త నీక
బరువుగా నిన్ను నిద్రతో బాధ పెట్టు –
తొలగ ద్రోచితి లెమ్ము మత్తు, విడి రమ్ము.

అంటారు ఇందులోని అలంకార భావాన్ని గమనించండి. దీపము–చీకటి, ఇవి జ్ఞానా జ్ఞానములకు ప్రతీకలుగా విజ్ఞులు గుర్తిస్తారు. సామాన్య పాఠకుడు వీని యందు దీపాన్ని – చీకటిని మాత్రమే చూస్తాడు. దాశరథి భావనలో ఇరులు (చీకట్లు) అందమైనవే! తిలకించండి :

ఇరుల కన్న అంద మెచట గానరాదు –
ఇరులే సౌఖ్యములకు దరులు సుమ్ము
ఇరులు లేని నాడు నరులు కానగ రారు –
నరులు లేని నాడు ధరణి లేదు.

చీకటిని ప్రేమించటం యోగికి, కవికి, ఎంత సహజమో వెల్తురిని ప్రేమించడం అంత సహజమే! జ్యోతిస్తమములు సత్య పదార్థము యొక్క మహా దశలు.

దాశరథి గొప్ప వేదాంతిగా మనకు గోచరిస్తాడు. *జ్యోతిస్తత్వము, దీపాంగన, చేతనా జ్యోతి* అనే ఖండికలలో కూడా ప్రస్ఫుటించింది. ఈ విషయాన్ని ఆయా కవితలు వెల్లడిస్తాయి. వీనిలో ఉర్దూ, పర్షియన్ కవిత్వాల భావాలు మెఱుస్తూ ఉన్నాయి. ఈ క్రింది పద్యాన్ని పరిశీలించండి :

ఎరుకలు కాలిపోవునని ఎంత యెరింగియు – గూఢ, దీపికా
తరుణి నవోప గూహమున తప్పు కొనన్ – బ్రయతింప బోని, ఈ
పురువుల ప్రేమ బంధమును బోలునె, – గొప్పలు చెప్పు చున్న ఈ
నరుల యధాను కూల – కుహనా వచనాంచిత రాగ బంధముల్?

దాశరథి దేశభక్తి నీటియందు పడవైచిన ఘనపదార్థము వంటిది. అది క్రమాభివృద్ధినొందు వలయములచే నిత్య విస్తృతము. *మహాంధ్రి* మున్నగు రచనలు ఈ విషయాన్ని ధృవపరుస్తాయి. *వధూనిక* (వదినె) అను కవిత గుండె నిండిన కరుణ ఊట చెలమ! ఈ నాటి విభక్త – కలహాంతరిక జీవితమందు ఎన్నియెా దివ్య ప్రేమ దుర్గములు నేలమట్టమగుచున్నవి. "వదినె తల్లి పిట్ట" అని దాశరథి చెప్పినమాట అక్షర లక్షలు చేస్తుంది! గమనించండి :

వానా కాల మందు కానల కోనల – చెట్ల కొమ్మ లందు చిన్ని గూట
రెక్క గొడుగు క్రింద డొక్కల ప్రక్కల – పట్టి గాచు తల్లి పిట్ట వీవు.

దాశరథి శబ్దబ్రహ్మారాధకుడు అని అంటారు. అంటే అనవసరంగా వాగ్వ్యయము చెయ్యడం ఆయనకు ఇష్ట ముండదు. ఈ విషయాన్ని పాఠకులు వాగ్వజ్రం అనే కవితా ఖండికలో గమనింప వచ్చు.

మనిషి మనసును గెలుచు – మాట నారాధింతు –
మాట లోపలి వజ్ర మర్యాద నెంతు ...
మాట కడుపున నున్న జ్వాల పై కెగసెనా –
మరి పయోధులె యింకు మందరాద్రి వడంకు, ...
నరజాతి చించి చెండాడ లేచిన చేయి –
తెగి నేల బడును నా సొగసు పద్దెపు జడికి.

అమృతాభిషేకము అనే ఖండికలో కూడా కవి ఈ భావమునే మరింత స్పష్టము చేశారు.

ద్వేషాగ్ని యార పీయూష ధారలు వార –
పద్యాలు కొన్నింటి పాద వలయు,
కాఠిన్యములు దింద కరుణమ్ము పెంపొంద –
పదముల గొన్నింటి వాద వలయు
విసమెల్ల దుల్ల రస ముప్పు తిల్లగా –
వివిధ భావముల కల్పించ వలయు,
అసహనమ్ముల ద్రుంచ నైక మత్యము పెంచ –
నిర్మల స్నేహమ్ము నించ వలయు,
వేప పూవులో చేదు విరిగి పోవ –
రసన పై తీయ మాటలు విసర వలయు,
ఉదయమే లేని గాఢాంధహృదయమందు –
చిత్రభాను సూనము వికసించ వలయు.

కవితాపుష్పకం :

ఈ కావ్యాన్ని 1966 లో రచించారు దాశరథి. ఈ పుస్తకాన్ని వారి ఆప్తమిత్రులు దేవులపల్లి రామానుజ రావుకి అంకితమిచ్చారు. ఇందులో 40 కవితలున్నవి. అన్నీ గొప్ప రచనలే! చదివి మననం చేసుకుంటూ ఆనందింపదగినవి. వివరణ లేకుండానే అర్థమవుతాయి. మచ్చుకు ఈ క్రింది పద్యాన్ని పరిశీలించండి :

పాల సముద్రమే నడచి వచ్చిన రీతి హిమాచలాగ్ర శృంగా
లు కరాలు సాచి మనకై అరుదెంచిన భాతి, శాంతి స
త్యాలు మనుష్య రూపమును దాలిచి నేలకు దిగ్గి నట్లు గాం
ధీ లలితాత్ము దుజ్వల మతిన్ భరతావని పైన కాలిడెన్.

పై పంక్తులు *అమృత మూర్తి* అను ఖండిక నుండి గ్రహించినవి. మహాత్మాగాంధిని గురించినవి. అలాగే *ప్రపాలిక* అనే కవిత నుండి ఈ పద్యాన్ని ఆస్వాదించండి :

పెదవిని దొండపండనెడి వెఱ్ఱి గతించెను! గోస్తనీ రసా
స్వద మధురాధరోష్ఠ పరిపక్వత నేమని ప్రస్తుతింతు! నీ
హృదయము నుండి లేచె రస హిందన మండిత దాడిమీద్వయం;
బెద నెద చేర్చి నన్ను మురిపింపుము నింపుము పానపాత్రికన్.

ప్రేయసి ఎరుపు అధరాలను దొండపండుతో పోల్చడం ప్రాచీన పద్ధతి. ఆ వెఱ్ఱి గతించినదట! అధరములోని మధురాస్రవం ద్రాక్షాఫలాస్రవంతో సమానమని దాన్ని ప్రస్తుతించమని చెప్పడం చమత్కారం. పద్యంలో శృంగారం కొంత శృతిమించినట్టే కనిపిస్తుంది! అలాగే *క్రాంతి కాంత* అనే గేయం లోని ఈ పంక్తులు పరికించండి :

భయపెట్టే ఈ లోకానికి – ప్రియ భావన కలిగించేవో?
నరకంలా కనబడు జగతిని – సురా లయము గావించేవో?

అని చెప్పడంలో వాక్య చమత్కారం బహుళార్థ ద్యోతకంగా ఉంది. చింతలతో, చికాకులతో, కష్టాలతో నిండిన ఈ లోకం సామాన్యునికి నరకంలా తోచడం సహజమే. మనసులో చింతలను మర్చిపోయి, తిరిగి ఉత్తేజాన్ని, ఉల్లాసాన్నీ పొందడానికి శృంగార స్మృతులు మంచి ఔషధంగా పని చేస్తాయని సూచిస్తారు మహాకవి దాశరథి.

నేత్రపర్వం :

1988 లో ప్రచురింప బడిన *నేత్రపర్వం*లో అభ్యుదయ భావాలు, శాంతియుత ప్రశంసలు దర్శనమిస్తాయి. ఈ కావ్యంలోని కవితలలో మార్తాండుని *మరణదండన* అనే కవితా ఖండిక ప్రతీకాత్మకంగా సాగుతుంది. ఆ కవితలో వ్యంగ్యం తొంగి చూస్తుంది! మార్తాండుడు నిరంతర పోరాట వీరునికీ, తిరుగు బాటు దారునికీ చిహ్నంగా మనం గ్రహించాలి. అతన్ని జైలులో పెట్టాలని అన్యాయ పీఠం ఆదేశిస్తుంది. అయితే, తన కిరణ ఖడ్గాలతో విజృభించగానే అరెస్టు చేయడానికి వచ్చిన వారు పలాయనం చిత్తగిస్తారు! ఆ ఖండికలోని కొన్ని పంక్తులు పరికించండి.

మార్తాండునికి వేసిన మరణ దండన –
మరో కల్పాంతం దాకా అమలు కాదు
మార్తాండుని శిక్షించే వాళ్లని చూసి –
మహీమండలం నవ్వు తోంది.
మరణదండన పొందిన మార్తాండుడు
అంధకార రాక్షసుల్ని –
హత్య చేస్తూ వెళ్ళి పోతున్నాడు
రక్కసులకు వత్తాసీ ఇచ్చే వ్యవస్థ –
ముక్కలై పోవడం ఖాయం.

పేదల పక్షాన కల మెత్తుతారు దాశరథి. వారి స్థితిని వినూత్నంగా చిత్రిస్తారు.

అగ్గిపెట్టె అంత గుడిసెలో –
అన్నం వండు తోంది
అగ్గిపుల్లంత కర్ర పుల్ల –
సిగ్గు పడుతూ పొగచూరుతోంది. ...
పేదల బాధలు బేరీజు వేసుకొంటూ –
పెద్ద మేడల్లో నుంచి ప్రసంగిస్తున్నాడు
బానంత కడుపు నాయకమ్మన్యుడు –
ప్రజలు అమాయకులు కనుక ధన్యుడు.

పై మాటలు నేటికీ సత్య సన్నిహితాలే! *నేత్రపర్వం* అనే మరో కవితలో కన్ను గురించి వివరిస్తూ గన్ను చేయలేని పని కన్ను చేస్తుందన్నారు. కన్ను గురించి ఇలా అంటారు–

సమాజం శరీరమైతే – సత్కవి – కన్ను
తనువు ఎక్కడో వేదన పడినా – చినుకులు కురుస్తుంది కన్ను.

తిమిరంతో సమరం :

ఈ కావ్యాన్ని 1973లో రచించారు దాశరథి. దీనిని తన తల్లి శ్రీమతి వేంకటమ్మకు అంకితం చేశారు. *తిమిరంతో సమరం* కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడెమీ వారు తమ1974 సంవత్సరపు జాతీయ పురస్కారాన్ని అందజేసి మహాకవి దాశరథిని గౌరవించారు. ఈ కావ్యంలోని విశేష వివరాలు పరిశీలించే ప్రయత్నం చేద్దాం. *తిమిరంతో సమరం* మున్నుడి *కాంతి కవాటం*లో "పీఠికలు అవసరమైన కవి కాదు దాశరథి. పేరు ఊరు కాదు పెరిమా పేర్మి ఉన్నవాడు. నిజమైన కవికి ఉండ వలసిన హృదయ స్పందనం, నిశిత దృష్టీ, మానవతా, భావిజగత్కల్యాణం మీద అపార విశ్వాసమూ కల వాడు" అంటారు. ఇంకా *తిమిరంతో సమరం* అనారతం కొనసాగిస్తున్న కవికి కావలసింది ఏమిటి? కవిత్వమంటే అసలు అదే అని నమ్మకమున్న వాడను నేను. "తమసో మా జ్యోతిర్గమయ" – అన్న వేదర్షి వాక్కే నేటికీ కవుల ధ్యేయం. అనుకునే వాణ్ణి నేను... "ప్రాచీన మహర్షుల్లాగా కవులు లోకంలోని అన్యాయాన్నీ, అజ్ఞానాన్నీ, తిమిరాన్నీ, జనం కష్టాలను తొలగించ గలరేమో?!" అంటూ

ముందు మాట వ్రాసి, దాశరథి కవితా హృదయాన్ని పట్టుకొన్నారు, విద్వాన్ విశ్వం. దాశరథి స్వయంగా వ్రాసుకొన్న ముందు మాటలో "దురంతమైన తిమిరంతో అనంతమైన సమరం ఇది. మూఢత్వానికీ, మూర్ఖత్వానికీ తిరోగమనానికి తిమిరం ప్రతీక. ఈ తిమిరంతో సమరం చేసే సైనికుడు కవి. విజ్ఞానానికీ, అజ్ఞానానికీ జరిగే హోరాహోరీ పోరాటంలో మేధావి వర్గానికి చెందిన ప్రతి వ్యక్తీ సైనికుడై పాల్గొనక మానడు" అని వివరిస్తారు.

రావమ్మా శాంతమ్మా! అనే కవితతో మొదలవుతుంది *తిమిరంతో సమరం.* కవి అనే వాడు ప్రతి మనిషి హృదయంలోనూ చైతన్యం చిమ్ముకొని వచ్చేలా చేయాలి. పై నేపథ్యంతో కావ్యానుస్వాదం మొదలెడుదాం!

నీవు రావన్నాయి మ్రోళ్ళు – నీవు లేవన్నాయి ముళ్ళు
నిజం నిజమన్నాయి రాళ్ళు – నమ్మ లేకున్నాయి నా కళ్ళు.

పై నుదహరించిన పంక్తులలో "నీవు అంటే శాంతమ్మ; అంటే శాంతి. శాంతి దేవత రాదనీ, ఈ మానవ లోకంలో హింసే తాండవించి రాజ్య మేలుతుందని అందరూ భావిస్తున్న తరుణంలో శాంతమ్మను (శాంతి దేవతను) ఆహ్వానిస్తున్నాడు మహాకవి దాశరథి. శాంతి స్వభావం మానవ సహజమైనదనీ, దానిని అడ్డుకోగలవారు ఎవ్వరూ లేరని కవిత్వ పరంగా ప్రకటిస్తారు దాశరథి. అందుకే –

ఇరువదవ శతాబ్దంలో – ఇంచు మించు ముప్పాతిక గడచి పోతున్నా
పుచ్చి పోయిన కులాలతో – చచ్చి పోయిన మతాల పేరుతో
తన్నుక చచ్చే మమ్ములను చూచి – భిన్నవై, ఎన్నడూ రానన బోకు.

అంటూ శాంతి దేవిని దాశరథి అభ్యర్థిస్తున్న వైనం మన మనసులను ఎంతైనా కదిలిస్తుంది. ఈ క్రింది పంక్తులు గమనిస్తే, శాంతి కాముకులు కాని వారు చేసే యత్నాలను గర్హిస్తాడు, వ్యంగ్యంగా హేళన చేస్తాడు.

నీవు రాకుండా బాంబులతో –
పకడ్బందీగా గోడల కట్టించే వారికి
నీవు గగనాలు దాటి రాగలవని తెలియదు! –
నిజానికి బాంబుల నిర్మాణ శాలలో
పరిశోధనలు చేసే శాస్త్రజ్ఞుని హృదయంలో –
ఏదో ఒక అరలో – నీవుంటావని వారికి తెలియదు! ...
స్వాగతమే శాంతమ్మా – చైతన్య నిశాంతమ్మా!

నాగార్జున సాగరం ప్రాజెక్టు కవుల భావుకతను ఆకర్షించింది. ఆ కవులలో దాశరథిగారొకరు. *క్షీరసాగరం* అనే ఖండికలో నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణాన్ని మెచ్చుకొంటూ భవిష్యత్తులో తెలుగు దేశ ప్రాంతం సస్య శ్యామలంగా మారుతుందని ఆశిస్తూ, ఈ విధంగా అంటారు.

కృష్ణ నాపి నిరుపేదల – తృష్ణ బాపి నట్టి వారు
విష్ణువు కంటే ఘనులని – వేయినోళ్ళ చాటింతును. ...
కలత లెల్ల తొలగి పోయి – తెలుగు వార లందరు
ఇలను సస్య సంపదతో – కళ కళ లాడింతురు. ...
నవ చరితకు నాందియైన – నాగార్జున సాగరము
తెలుగింటను కలిమి నింప – గలుగు క్షీరసాగరము.

ఇటువంటి రచనా రీతిని వచన గేయం అనాలన్న విమర్శకులూ ఉన్నారు. వలయాలు అనే గేయంలో...

సరస్సులో – జల వలయాలు
ఉషస్సులో– హిమ వలయాలు
మనస్సులో – విష వలయాలు.

ఈ విషవలయాలను చూచి విసుగెత్తి పోయిన దాశరథి తన భావాలను ఇలా వెల్లడిస్తాడు.

అశాంతినీ అరాచకాన్నీ – అన్ని దిశల వ్యాపింప జేసే
ఆ విష హృదయాలపై – దాడి చేయండి గళాలతో
ఆ విష వలయాలను – దండించండి కలాలతో.

అంతేకాదు. మీ కర్తవ్యం మీరు నెరవేర్చండి – లోకానికి నిజం తెలియ చెప్పండి.

అని మనలను అభ్యర్థిస్తున్నాడు!

అక్షర నక్షత్రమాలలోని భావాలు పరిశీలించండి!

చంపి సంపెంగ పరిమళాలు –
నింపుతా మంటున్నాయి దుర్విషవ భుజంగాలు
చంపితే శవాల కంపు తప్ప – సంపెంగలు నింపలేరు అంటున్నాయి
ప్రశాంత కురంగాలు ...
పచ్చ నోట్లతో కొందరు – కత్తి పోట్లతో కొందరు
ప్రజల వోట్ల విలువను – పడ గొట్టాలని చూస్తున్నారు ...
హింసా వాదాలన్నీ – ఇరింకు లింకాలి
మానవతా వాద మొక్కటె – మహిలో విలసిల్లాలి.

దాశరథి ఆశావాది. ఆ నమ్మకంతోనే కదా మనం బతుకుతున్నాం, మన జనం బతుకు తున్నారు, మన కవిత బతుకు తున్నది. అందుకే పలాశ కుసుమాలు అనే ఖండికలో ఈ విధంగా ఆయన భావాలు వ్యక్త పరుస్తారు.

వాడిన వసంత వన వాటిక – మరల పల్లవిస్తుంది
"ఛిన్నోపి రేహరి తరుః – క్షీణోప్యుప చీయతే పునశ్చంద్ర".

తెలుగు మాతృభాషగా ఉన్న ప్రజానీకమంతా ఒకటిగా ఉండాలని దాశరథి ఆకాంక్ష. ఆ భావాన్ని పలు కవితలలో పలు విధాలుగా వ్యక్తపరిచారు.

ఒక్క తెలుగు – ఒక్క వెలుగు అనే కవితలో ఇలా అభిప్రాయపడతారు, పరికించండి :

"ఎన్ని వందలేండ్లకు మనమేకమైతిమి? –
ఎన్నెన్ని పిశాచముల నెదిరించితిమి!
కలిసియుండు మార్గమునే కనుగొన వలెను –
విడిపోయే ఆలోచన విడిచి వేయ వలెను
నిజం తెలిసి, భుజం కలిపి నిండు మదిని సాగాలి –
పరిష్కారమును త్వరలో తెర బయటికి లాగాలి
ఒక దేహం, ఒకగేహం, ఒక దేశం మనది –
తెలుగు వెలుగు దిశ దిశలా దీపింప గలది".

అని నొక్కి చెబుతారు దాశరథి.

జీవగీతం అను కవితలో కవి వ్యక్త పరచిన అభిప్రాయాలు గమనార్హం.

నింగి ఆవులించి – నేలను కౌగిలించిన వేళ –
మనకు కనిపించని చోట – మహి – మహాకాశాన్ని చుంబించిన వేళ –
మంచు కంచుకం పికిలిన వేళ – మంచి దానిమ్మలు పెకలిన వేళ
నదీ చేలం తొలగిన వేళ – చైతన్యం సకల దిశలా గీతం వినిపిస్తున్నది. ...
గడియారం నడవని – పాత కోట గోడ కన్న
సూర్యుణ్ణి ఉరికించే – ఫ్యాక్టరీ కూత మిన్న.

అన్న ఆధునికుడు దాశరథి. అలాగే *వ్రణాల తోరణాలు* అను ఖండికలో :

నా మానని గాయాల వజ్రాయుధాలతో – అధికార మదాంధుల
బధిర హృదయాలను – బ్రద్దలు కొడతాను;
దయా హీన మానవ – మనో మరుభూమిలో
కృపా వృష్టి కురిపిస్తాను – కవితాంభోధర గణాలతో
తుపాకుల నోళ్ళు మూయిస్తాను – బాంబుల చెంపలు వాయిస్తాను
నా అరుణారుణ హృదయ శకలాల తోరణాలతో
అవనిని ఆనంద భవనంగా కళకళ లాడిస్తాను.

అదే కావలసినదల్లా. ఆ పని చేయగలమన్న విశ్వాసం ఉంటే, మనో బలంతో మహా పర్వతాలను క్రక్కదలించే చేవగల ప్రాచీన మహర్షులలాగా కవులూ లోకంలోని అన్యాయాన్ని, అజ్ఞానాన్ని, తిమిరాన్ని, జనం తిప్పలనూ తొలగించ గలరేమో!? ఈ *తిమిరంతో సమరం* ఆ పని చేయటలో, ఆ మహాయజ్ఞంలో ఒక సమిధగా ఉపకరిస్తే, అంతకంటే వాంఛించదగినది మరేమున్నది?

తిమిరంతో ఘన సమరం – జరిపిన బ్రతుకే అమరం
కవితా తేజోమయం – అవని శాంతి కది నిలయం.
అలాగే "విన్నపం" కవితలోని హృదయ తాపం ఆలకించండి –
నాడు అనుజుడు విడిపోతా నంటే – నేడు అగ్రజుడు వెళిపోతానంటే
తగదంటున్నది తమను కన్నతల్లి – ఆంధ్రమాత అమృతవల్లి ...
ఈ కవి మాట కాస్త ఆలించండి – ఇక కలహాలు చాలించండి
ఆంధ్ర జాతిని ఒకటిగా వుంచండి – ఆ కీర్తిని మీరంతా పొందండి.

విధి బలీయం! ప్రస్తుత వీరులనబడే వారు వినిపించుకోరు కదా?! ఈ దాశరథి గారి హృదయ వేదనను!

గాలిబ్ గీతాలు :

దాశరథి రచించిన 31 గ్రంథాలలో అనేక రకములైన రచనలున్నవి. ఖండ కావ్యాలు, గేయాలు, కథా కావ్యాలు, వ్యాసాలు, వ్యాఖ్యానాలు, నవల, నాటికలు, స్వీయ చరిత్ర, పీఠికలు, సమీక్షలు మొదలైనవి. స్వీయ రచనలే గాక, అనువాద రచనలు సహితం ఉన్నవి.

దాశరథి బహుభాషా కోవిదులు. ముఖ్యంగా ఉర్దూలో పండితులు. గజల్, రుబాయీ ప్రక్రియలు ఉర్దూ, పారశీ భాషలలోనివి. ఈ ప్రక్రియలను తెలుగులోకి ప్రవేశపెట్టిన ఖ్యాతి దాశరథికే చెందుతుంది. ఉర్దూసాహితీ ప్రపంచమునకు గాలిబ్ కవి సూర్యుని వంటి వాడు.ఉర్దూ సారస్వతమున అత్యున్నత స్థానం ఆయనది అని చరిత్రకారుల అభిప్రాయం. దాశరథి గాలిబ్ కవిత్వమును తెనిగించుట మిక్కిలి సంతోషకరమైన సంగతి. గాలిబ్ గీతాల తెనుగుసేత మిక్కిలి ప్రతిభావంతంగా నిర్వహించారు. అనువాద ధోరణి అత్యంత సరళముగా ఉన్నది. మూల గ్రంథకర్తతో సమాన భావనా శక్తి దాశరథికి సంపూర్ణంగా కలదని అనువాదంలోని ప్రతి పంక్తి నిరూపించుచున్నది. హైందవేతర వాతావరణమును హైందవ వాతావరణముగా మార్చుటలో దాశరథి ప్రత్యేక ప్రతిభ చూపినారు. గమనించండి :

"ఏడి మాంధాత? పురుకుత్సు డేడి నేడు?"
"గుడిని శివుడు దొరక కున్న కాశికి గాని –
పరుగు లెత్తి నేను బడయ గలను". ...
"లోకమందు సుఖము, శోకమ్ము గలవండ్రు –
శోక మొకటే యిచ్చె నాకు బ్రహ్మ".

పైన ఉదహరించిన పద్య పదములు దాశరథికి ఉర్దూ, పారశీ భాషలలోగల ప్రావీణ్యమునకు, ఆ సాంప్రదాయములోగల పరిచయమునకు దానిని మన వాతావరణము లోనికి మార్చు శక్తి సామర్థ్యాలకు ఉదాహరణ. దాశరథి యేరి కూర్చిన ఈ ఖండ కృతులలో గాలిబ్ కవి ప్రేమార్ద్ర హృదయాన్ని పసిగట్ట వచ్చు. ఒకానొక సందర్భములో గాలిబ్ ప్రేయసికి, ఆయన ఏకైక ప్రియుడు కాదట. ఆ పద్మం మీద మరి కొన్ని భృంగములు ఝుంకరించుచున్నవి. ఇది నిరుపమాన ఘటన! అప్పుడు గాలిబ్ అంటారు :

"ఒరుల కొసగ లేదె ఉవిద నీ యధరంబు? –
నాకు కూడ నోరు లేక పోదు".

దాశరథి గాలిబ్ గీతాలలో మానవ జీవితమును ప్రతిబింబించు గీతములున్నప్పటికీ, ఎక్కువ భాగం ప్రేయసికి

ప్రేమకు సంబంధించినవే! గాలిబ్ గీతాలు అత్యంత ప్రజా రంజకము లైనవి. తెలుగు ప్రజానీకం యొక్క అభిమానాన్ని చూర గొన్నవి. గాలిబ్ గీతాల్లోని ఎన్నో వంక్తులు చాలామందికి కంఠస్థమై "Quotable quotes" గా ప్రసిద్ధికెక్కాయి. అందుకే అంటారు దాశరథి "కవితా గ్రంథాలు కొనే వాళ్లు తక్కువ. అందులో అన్య భాషా కవిత్వానికి అనువాదాలు కొనే వారు అంతకన్నా తక్కువ. కాని నా అదృష్ట మేమిటో గాలిబ్ గీతాలు మొదటి ముద్రణ ప్రతులు అంతలోనే అమ్ముడు పోయాయ్". ఇప్పటికి దాదాపు ఎనిమిది ముద్రణలు పొందినదంటే, గ్రంథం యొక్క గొప్పదనాన్ని పాఠకులు ఊహించుకోగలరు!

"ఏను స్వయంగా కవితను వరించ లేదు, –
తానే వరియించె కైతల రాణి నన్ను"

పై పంక్తులు మహాకవి గాలిబ్‌వి అయినా, దాశరథికి కూడా పూర్తిగా అన్వయిస్తాయనుటలో సందేహం లేదు.

సినీ పాటలు :

"నా కంటి పాపలో నిలిచి పోరా–నీ వెంట లోకాల గెలువ నీరా" అన్న పాటతో సినీలోక హృదయాన్ని గెలిచిన దాశరథి అనేక చిత్రాలకు పాటలు వ్రాశారు. వానిలో అత్యంత ప్రసిద్ధి కెక్కిన సినిమాలు : *వాగ్దానం, ఇద్దరు మిత్రులు, కుల గోత్రాలు, మంచి మనసులు, రక్త సంబంధం, పునర్జన్మ* మొదలగునవి. దాశరథి పాటలలో అన్ని విధాల కవిత్వం చోటు చేసుకుంది. ఉర్దూ పదాలతో సమాసాలు చేసి తెలుగు సినిమా పాటలు వ్రాసిన తొలికవి దాశరథి. 'ఖుషీ ఖుషీగా నవ్వుతూ–చెలాకి మాటలు రువ్వుతూ' రూపొందింది. అలాగే ఆయన రచించిన భక్తి గీతాలు విలక్షణమైనవి. 'నడిరేయి ఏ జాములో' శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 'చిన్నింటి' ప్రేమాయణాన్ని మనవి చేస్తూ 'విభునికి మా మాట వివరించవమ్మా' అని అలివేలు మంగమ్మని ఆర్తిగా బ్రతిమాలు కొనడాన్ని గడుసుగా చిత్రించారు!. దాశరథి పాటలకు నవ్యత, రమ్యతా ప్రధాన గుణాలు. దాశరథి వారి పాటలలో రక రకాల ప్రతీకల్ని వాడినప్పటికీ, ఎక్కువగా కనిపించేది దీపం. మచ్చుకు – 'దీపాలు వెలిగె పరదాలు తొలగె' (పునర్జన్మ), 'తొలి చూపులు నాలో నె వెలిగించె దీపాలు' (చదువుకున్న అమ్మాయిలు). దీపాన్ని చైతన్యానికి, ప్రణయానికి, విప్లవానికి, ఆశావాదానికి తరచు ప్రతీకగా వాడారు. 1961–1987 మధ్య కాలంలో దాశరథి దాదాపు 2000 పాటలు వ్రాశారు. దాశరథి పద్యం తెలుగు సరస్వతికి నైవేద్యమైతే, వారి సినీ సంగీతం చలనచిత్ర భారతి గళ సీమలో విరిసిన పద పారిజాతం.

ముగింపు :

దాశరథి కవితా వ్యక్తిత్వం సుస్పష్టం. ఆయనకు కవితా రూపం పై పట్టింపు లేదు. ఆయన మాటల్లో "నా అభిప్రాయంలో ఒకొక్క భావానికి తగ్గట్టు రూపకల్పన జరుగుతుంది. హృదయంలో నుండి పెల్లుబుకిన భావం పద్య రూపంలో రావచ్చు, గేయ రూపంలో రావచ్చు. అదెట్లా వస్తే అట్లా. అంతేగాని మనం కేవలం పద్యంలోనే వ్రాయాలనిగానీ, బొత్తిగా రాయొద్దనిగాని, అటు వంటి సంకుచిత భావాలున్న వాణ్ణి కాదు... నా కవితా సిద్ధాంతం ఒక్కటే. నేను కవితలో చెప్పదలుచుకొన్నది ప్రపంచంలో శాంతి స్థాపించడం. యుద్ధాలు, కక్షలూ, కాలుష్యాలు లేనటు వంటి మానవ సమాజం రావాలి. నా వాదం మానవతా వాదం. నా ధ్యేయం ప్రపంచ శాంతి".

"ఏ సిద్ధాంతాలకూ, ఇజాలకూ, అమ్ముడుపోని స్వేచ్ఛా పథ సంచారి దాశరథి. కాల్పనికతనూ, అభ్యుదయాన్నీ, నవ్య సాంప్రదాయాన్నీ, దేశాభిమానాన్ని, జాతీయతనూ, సామ్య వాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, విశ్వ మానవతనూ, శాంతి విప్లవ చైతన్యాన్నీ, ఆత్మీయమైన శృంగారాన్ని, అంగారాన్ని – అన్నింటినీ తన విశాల కవితా విశ్వంభరాలలో పొదుగుకున్న అమృత కవితామూర్తి దాశరథి" అన్న డా. తిరుమల శ్రీనివాసాచార్య మాటలతో ఈ వ్యాసాన్ని ముగిద్దాం.

కృతజ్ఞతలు :

ఈ వ్యాసం రూపొందించుటలో దాశరథి రచనలతో పాటు, ఇతర రచయితల వ్యాసాలు, పుస్తకాలు పరిశీలించ వలసి వచ్చింది. కొందరి రచయితల భావాలు ఉదారంగా వాడుకున్నాను. ఆయా రచయితలందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలను ఇందు మూలముగా తెలియ పరుస్తున్నాను. ఈ వ్యాసం సహృదయులందరూ ఆదరించుటయే కాక, మహాకవి దాశరథి రచనలను చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
హైద్రాబాదు, ఫోన్ : 9618524702

మనప్రాచీన నగరాలు-
కోటిలింగాల

- కొసరాజు వెంకటేశ్వరరావు

తెలంగాణ ప్రాంతంలోవున్న మన ప్రాచీన నగరాలలో కరీంనగర్ జిల్లాలోవున్న కోటి లింగాల కూడా ఒకటి. కోటి లింగాల లేక కోట లింగాల గ్రామం $18^0.52'$ ఉ. అక్షాంశ మరియు $79^0.12'$ తూ రేకాంశాల మధ్య జిల్లా కేంద్రానికి ఉత్తరంలో 60 కి.మీ. దూరంలో వెల్లటూరు మండలం గోదావరి నది కుడివైపునవున్న కుగ్రామం. ఇక్కడ గోదావరి నది పశ్చిమం నుండి తూర్పుకు ప్రవహిస్తున్నది. ఈ ప్రాంతం ఆంధ్రదేశ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యతను సంతరించు కున్నది. ఈ వూరి కోటలోవున్న బురుజుపైవున్న కోటేశ్వర స్వామి దేవాలయాన్ని బట్టి ఈ ఊరికి కోటిలింగాల అనే పేరు వచ్చిందనేది ఊహాజనితమే. స్థానికుల కథనం ప్రకారం గోదావరి నదిలోవున్న కోటిలింగాలను బట్టి ఈ ఊరికి కోటిలింగాల అనే పేరు వచ్చిందని తెలుస్తున్నది. కాని ఈ వూరిచుట్టూ వున్న కోట మరియు శివలింగంవున్న శివాలయంను బట్టి కోటిలింగాల అనే పేరు వచ్చిందని డా॥ శివనాగిరెడ్డి తమ *తెలంగాణలో బౌద్ధం* అనే పుస్తకంలో పేర్కొన్నారు. అదే కాలక్రమేణా కోటిలింగాల అయివుంటుంది అని ఊహించవచ్చును.

గ్రీకు రాయబారి మెగస్తనీసు తన గ్రంథం ఇండికాలో ఆనాటి ఆంధ్రదేశంలో 30 పైగా ప్రాచీన దుర్గాలువున్నవని తెలియజేశాడు. క్రీ.పూ. 4వ శతాబ్దంలో నిర్మించిన కోటిలింగాల కూడ ఆ 30 దుర్గాలలో ఒకటి అయివుంటుందనటంలో ఎట్టి సందేహము ఉండకూడదు. ఇది శాతవాహనుల మొదటి రాజధానిగా 100 ఎకరాల స్థలంలో గోదావరి – పెదవాగు తీరం వెంబడి ఉన్నది. ఆ నాటి శాతవాహన కోట నదీతీరం వెంట 10 మీ. ఎత్తు. 1000 మీ. పొడవు, 300 మీ. వెడల్పు గల కోట శిథిలాలుగా మిగలగా ప్రస్తుతం అక్కడక్కడ బురుజులు, కోట గోడలు, స్తంభాలు మాత్రమే శాతవాహనుల చరిత్రకు ఆనవాళ్ళుగా నిలిచాయి. బహుశా అందుకే కోటిలింగాలను 'స్తంభాల పల్లి' అనికూడ చరిత్రకారులు పేర్కొన్నారు. శాతవాహన చరిత్రతోపాటు బౌద్ధమత చరిత్రకు ఈ ప్రాంతం విశిష్ట ప్రాధాన్యతను సంతరించుకున్నది. బౌద్ధ తార్కిక శాస్త్రంలో ఆధ్యుడుగా ప్రసిద్ధి చెంది *కుందమాల* అనే కావ్యాన్ని రచించిన దిఙ్నాగుడు కోటిలింగాల పరిసర ప్రాంతాల వాడేనని చరిత్రకారులు నిర్ధారించారు. కోటిలింగాల ప్రక్కనేవున్న మునులగుట్ట ప్రాంతం ఈయన కార్యక్షేత్రంగా వుండి ఉండవచ్చును. చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ కూడ ఈ ప్రాంతాన్ని సందర్శించివుండి వుండవచ్చును. ఈ ప్రాంతం ఆంధ్రదేశపు చరిత్రలోనే అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకొన్నది.

కోటిలింగాల అస్మక (అశ్మక) జనపదంలో భాగంగా వుండేది. అస్మక దేశపు రాజధాని పోతలి లేక పోతన (నిజాం బాదు జిల్లాలోవున్న బోధన్ నగరం) కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని, ప్రతిష్టానపురం (మహారాష్ట్ర) లోని ఉస్మానాబాద్ జిల్లాలోవున్న పైఠాన్, రెండవ రాజధాని కాగా, గుంటూరు జిల్లాలోవున్న ధాన్యకటకం (అమరావతి-ధరణికోటల ప్రాంతం) చివరి రాజధానిగా ఉండేది. రాష్ట్ర పురావస్తుశాఖ డా॥ కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో 1979-1984 సంవత్సరాలలో ఇక్కడ జరిపిన త్రవ్వకాలలో శాతవాహనుల కాలం నాటి నగరం బయటపడింది. ఈ త్రవ్వకాలలో జనావాసాలు, పారిశుద్ధ్యపు కాలువలు, మట్టిపెంకులు, ఇటుకలు, రోమను నాణెములు, జనపద మరియు శాతవాహన నాణెములు, రోము దేశపు మట్టి పాత్రలు, ఆభరణాలు, పూసలు మొదలైన వస్తుసామగ్రి లభించాయి. ఇప్పటికీ స్థానికులకు ఈ ప్రాంతంలో వివిధ పురాతన వస్తువిశేషాలు లభిస్తూనే ఉన్నాయి. ఈ గ్రామంలో 2.5 మీ.

లోతులో 2500 సంవత్సరాల నాటి ప్రాచీన నగరం బయట పడటమే కాక ఎంతో అమూల్యమైన నాణేలు లభించాయి. వీనిలో రాణో గోభధ (గోభద్ర అనే రాజు) అనే పేరుతో కొన్ని శాతవాహన పూర్వపు రాజుల నాణెములు, 1.78 మీ. లోతులో రాణో సమగోప నాణెములు, 0.38 మీ లోతులో శ్రీముఖుని నాణెములు, లభించాయి. మొదటి పులుమావి, మహాసేనాపతి సగమన, కంవాయిసిరి, మహాతలవర, సిరినార యొక్క నాణెములు ఉపరితల పొరలలో లభించాయి. ఇవేకాక పంచ్ మార్క్‌డ్ నాణెములు అక్షరాలు లేని నాణెములు, మహారథి, మహాగ్రామిక, శివశేబక, సాధకన నాణెములు తయారైన స్థితిలో ఉన్నవి కూడా దొరికాయి. సగం తయారైన నాణెములు, తిరిగి ముద్రించిన నాణెములు, కరగవేసినవి, బంగారు, రాగి, సీసంతో తయారు చేసినవి కూడా విరివిగా లభించడాన్ని బట్టి ఇక్కడ శాతవాహనుల కోశాగారం, నాణెముల ముదణ్రాలయం ఉండేవని తెలుస్తున్నది.

ఇక్కడకు 15 కి.మీ. దూరంలో ఉన్న రాయపట్నం, ధర్మపురిలలో జనావాసాలే కాక అనేక నాణెములు కూడ బయటపడ్డాయి. ఇక్కడ భూమి ఉపరితలం పై లభించిన నాణేలు (ముఖ్యగా శాతవాహన రాజ్యస్థాపకుడైన సిముఖ శాతవాహనుని నాణెం ఆధారంగా ఈ ప్రాంతం ప్రాచీనమైనదిగా రాష్ట్ర పురావస్తు శాఖ నిర్ణయించింది. ఇచ్చటి పురాతన మట్టి దిబ్బ సుమారు 10 మీ. ఎత్తులో వున్నది. దానిపై మూడు వంతులు గృహాలు నిర్మింపబడి చారిత్రక ఆనవాళ్ళు నాశనం చేయబడినాయి.

జగిత్యాల వద్ద పుట్టిన పెదవాగు కోటిలింగాల వద్ద గోదావరిలో కలుస్తుంది. ఈ త్రవ్వకాలలో పైన పేర్కొన్న నాణాలే కాక శాతవాహన రాజులైన సిరిశాతవాహన, సిరి శాతకర్ణి, పులుమావి రాజుల సీసపు నాణాలు లభించాయి. బర్రెకుంటం అనే ప్రదేశంలో ఉన్న రాతి స్తంభం పై క్రీ.పూ. మొదటి శతాబ్దానికి చెందిన బ్రహ్మి భాషలో వున్న లఘుశాసనం లభించింది. ఆ శాసనంలో 'నాగ గోపనికాయ' అనేపదం వున్నది. ఈ మధ్య కోటిలింగాల ప్రక్కనే ఉన్న ముక్కరావుపేటలో మూడు వరుసలువున్న క్రీ.పూ. మొదటి శతాబ్దానికి చెందిన బ్రహ్మి భాషలోవున్న శాసనం దొరికింది. దీనిని బట్టి శాతవాహనుల మొదటి రాజధాని కోటిలింగాలే అని నిర్ధారణ అయింది.

నానే ఘాట్‌లోవున్న శిలాశాసనాన్ని మరియు నాణెములను బట్టి శాతవాహన వంశస్థాపకుడైన సిముకుడు (శ్రీముఖుడు) కోటిలింగాలను రాజధానిగా చేసుకుని క్రీ.పూ. 2వ శతాబ్దంలో పరిపాలించాడని చెప్ప వచ్చును. శ్రీముఖుని కంటె ముందు గోభద్ర, సంవాయి, సమగోప, నారన అనేవారి బ్రహ్మి భాషలోవున్న నాణెములు క్రింది (Lower layers) పొరలలో లభించుట చేత కోటిలింగాల పాలకుడైన గోభద్రుని నుండి శ్రీముఖుని వశమైనదని డా॥ దేమె రాజారెడ్డి తన గ్రంథం *శాతవాహన నాణెములు*లో పేర్కొన్నారు. వాయుపురాణం 17 మంది శాతవాహన చక్రవర్తులు 272 సం॥లు పరిపాలించారని, మత్స్య పురాణం 30 మంది రాజులు 470 సం॥రాలు పరిపాలించారని తెలియజేస్తున్నవి. ఈ రెండు పురాణాలు శ్రీముఖుని ఆద్యుడు గానే పేర్కొన్నాయి. శ్రీముఖుని నాణెం ఈ ప్రాంతంలో లభించటం ప్రత్యేక ఆకర్షణగా పేర్కొనవచ్చు.

శెరివణిజ అనే జాతక కథను బట్టి ఉత్తర దేశపు వ్యాపారి తెలివాహన నదీ తీరంలోవున్న ఆంధ్రనగరం ప్రవేశించాడని తెలియజేస్తున్నది. బౌద్ధ వాఙ్మయంలో కణ్ణ బెణ్ణ, తెలివాహన నదులు కృష్ణా, గోదావరి నదులకు ఉన్న ప్రాచీన నామములు అని తెలియజేస్తున్నవి. మహాభారత కాలం నాటికి ఆంధ్ర రాజ్యం కృష్ణా, గోదావరి నదుల మధ్య విస్తరించిందని తెలుస్తున్నది. క్రీ.శ 3వ శతాబ్దానికి చెందిన పల్లవ రాజు శివస్కందవర్మ తన శాసనంలో ధాన్యకటకం ఆంధ్రపదంలోనిదని తెలియజేశాడు. శెరివణిజ జాతక కథను బట్టి కోటిలింగాల తొలినాటి వ్యాపార కేంద్రం అని తెలుస్తున్నది.

త్రవ్వకాలలో దొరికిన రోమను నాణెములను (నీరో, ఆగష్టస్ రాజుల కాలం నాటివి) బట్టి ఆంధ్రదేశానికి, రోము దేశానికి గోదావరి నది, బంగాళాఖాతం ద్వారా వర్తక వాణిజ్యాలు జరిగినట్లు తెలుస్తున్నది. రాజపట్నం, ధర్మపురి, వెంకట్రావుపేట, కోటిలింగాల, పోతలి ప్రాంతాలు ప్రముఖ వ్యాపార తీరప్రాంతాలుగా భాసిల్లాయి. కోటిలింగాలకు సమీపంలోవున్న మస్తులాపూర్ మొదటి శతాబ్దానికి చెందిన 39 రోమను వెండినాణెములు లభించాయి. పైఠాన్ నుండి ధాన్యకటకం వెళ్ళే మార్గంలో కోటిలింగాల వుండటం చేత ఈ ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. ఇది బౌద్ధ

భిక్షువులకు ఆరాధనా స్థలము అని చరిత్రకారుల అభిప్రాయం. ఉత్తర దేశంనుండి ఆంధ్రపదం వచ్చే వ్యాపారులకు తైర్థికులకు, భిక్షువులకు కోటిలింగాల ద్వారమని పిల్లి రాంబాబు తన గ్రంథం *ఆంధ్రదేశంలో బౌద్ధ వైభవం* లో పేర్కొన్నారు. విదర్భను, ఆంధ్రదేశాన్ని కలిపే ఆంధ్రమహాపదము గోదావరిని కోటిలింగాల వద్ద దాటి ఆంధ్రరాజ్యలో ప్రవేశించే ద్వారంమిది అని చరిత్ర కారులు నిర్ధారించారు.

విమానవత్థు అనే గ్రంథం గౌతమబుద్ధుని ముఖ్యశిష్యుడైన మహాకాత్యాయనుడు అస్మిక మహా జనపదాన్ని పరిపాలిస్తున్న రాజు సుజాతునకు బౌద్ధ ధర్మాన్ని బోధించి బౌద్ధమతంలోకి మార్పించాడని తెలియజేస్తున్నది. అస్సక, మూలక జనపదాలు దక్షిణాపథంలో వున్నాయని *సుత్తని పాత* అనే బౌద్ధ గ్రంథం తెలియజేసింది. పోతలి రాజధానిగావున్న అస్సక మహాజనపదం నేటి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలు వున్న ప్రాంతంగా చరిత్రకారులు గుర్తించారు. బావరి నివసించిన 'కవితవనం' (బాదనకుర్తి ద్వీపం) అస్సక దేశంలో వున్నట్లు *జాతక కథల*లో చెప్పబడింది. కవిత అనగా వెలగ అని అర్థం. కోటిలింగాలకు సమీపంలో వెలగటూరు అనే ఊరు ఉన్నది. దీనిని బట్టి ఆంధ్రదేశంలో బుద్ధుని ధర్మాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టిన బావరి నివాస స్థలం కోటిలింగాల అని, అలాగే బుద్ధఘోషుని *పరమార్థ జ్యోతిక* అనే గ్రంథంలో బావరి నివాస స్థలం 'కవిటవన' ద్వీపం అని చెప్పబడింది. కోటిలింగాలను బాదనకుర్తిగా చరిత్రకారులు గుర్తించారు. కోటిలింగాలను రాజధానిగా చేసుకుని శాతవాహనులు క్రీ.పూ. 1వ శతాబ్దం నుండి క్రీ.శ. 2వ శతాబ్దం వరకు పరిపాలించారని ఇక్కడ లభించిన శాతవాహనుల నాణెములను బట్టి తెలుస్తున్నది.

కోటిలింగాల ప్రాంతంలో నాణాలు సేకరిస్తున్న యస్. నరహరి ద్వారా 1978లో ఈ ప్రాంతం బయటి ప్రపంచానికి తెలిసింది. ఆయన మునులగుట్ట అనే ప్రాంతం నుండి కొన్ని రాగి నాణాలు సేకరించి రాష్ట్ర పురావస్తు శాఖలో ఉపసంచాలకులుగా ఉన్న పరబ్రహ్మశాస్త్రి పరిశీలనకు అందజేశాడు. శాస్త్రి ఆ నాణాలు పరిశీలించి ఆ ప్రదేశం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి వెంటనే ఆ ప్రదేశానికి వెళ్ళి మునులగుట్ట పైభాగంలో వున్న గుహల్ని చూసి, ఆ గుహలలో ఉన్న రాతి పడకలను గమనించి ఆ చుట్టు ప్రక్కల కొన్ని నాణాలను సేకరించారు. ఆ తరువాత అదే శాఖలో ఉపసంచాలకులుగా పనిచేస్తున్న డా॥ కృష్ణశాస్త్రి, ఠాకూర్ రాజారాం సింగ్ అనే వకీలు సహాయంతో ఆ ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించి కోటి లింగాలను వెలుగులోకి తీసుకు వచ్చారు. డా॥ పరబ్రహ్మ శాస్త్రి, డా॥ జవహర్లాలు గార్లు జైనములను ఈ గుహలలో నివశించినందుననే ఈ ప్రాంతం జైన స్థావరమని తెలియ జేశారు. కాని కోటిలింగాల చుట్టుప్రక్కల జైన స్థావరాలు ఇప్పటివరకు బయటపడలేదు. బౌద్ధ భిక్షువులే తమ వస్సావాసం (వర్షాకాలం) సందర్భంగా ఈ గుట్టలలో వున్న గుహలలో రాతి పడకలను, ఏర్పాటు చేసుకుని వుంటారు అని ఊహించవచ్చును.

గోదావరి నది మెట్‌పల్లి తాలూకా లోని కందుకుర్తి అనే చోట కరీంనగర్ జిల్లాను తాకి 283 కి.మీ. ప్రవహిస్తుంది. కోటిలింగాల అస్మక మహాజనపథంలో భాగం కాగా పైఠాన్ మూలక మహాజనపథంలో భాగంగా వుండేది. ధాన్యకటకం, పైఠాన్‌ల మధ్య రాజమార్గం కోటిలింగాల ద్వారా వుండేదని ఆ మార్గంలోవున్న చారిత్రక ప్రదేశాల ద్వారా తెలుస్తున్నది. కోటిలింగాల చుట్టుప్రక్కల పెదబంకూరు, ముక్కారావుపేట, ధూళికట్ట, పాషిగామ్, తంబంపల్లి (కంబంపల్లి) ధర్మవరం (ధమ్మవరం), రాయపట్నం (రాజపట్నం), కరణమామిడి, లక్సెట్టిపేట, మోదెల, కాసిపేట, యలకుర్తి మొదలైన చారిత్రాత్మక ప్రదేశాలు వున్నాయి. పెదబంకూరులో బౌద్ధ స్థూపం కనుగొనబడగా ధూళికట్టలో శాతవాహనుల కోట, ధర్మవరంలో బౌద్ధ అవశేషాలు లభించాయి.

గోదావరి లోయలో వున్న కోటిలింగాల ఆదిమానవునికి ఆవాస స్థావరం అయింది. ఇక్కడ పూర్వశిలాయుగపు, నవీన శిలాయుగపు రాతి పనిముట్లు లభించాయి. ఇవేకాక బృహత్ శిలాయుగపు సమాధులు కూడ ఈ ప్రాంతంలో ఎన్నో ప్రదేశాలలో మనకు కనిపిస్తాయి. శాతవాహనుల తరువాత ఈ ప్రాంతాన్ని ఇక్ష్వాకులు వేముల వాడ చాళుక్యులు, రాష్ట్ర కూటులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు, రేచర్ల వంశీకులు, బహమనీలు, కుతుబ్‌షాహీలు, మొగలులు, అసఫ్ జాహి రాజులు పరిపాలించినట్లుగా చరిత్ర తెలియజేస్తున్నది. వేములవాడ చాళుక్యులు,

రాష్ట్రకూటులు సామంతులుగా ఈ ప్రాంతాన్ని (సపాద లక్ష ప్రాంతం) పాలించగా, కళ్యాణి చాళుక్యులు ఈ ప్రాంతాన్ని సబ్బినాడుగా వ్యవహరించేవారు. వీరి శాసనాలు ఈ ప్రాంతంలో విరివిగా లభించాయి. కాకతీయులు నగునూరు, కొత్తపల్లి, బెజ్జంకి, రాయకల్, శనిగరం, గొడిశల, కటాషాపూర్, ధర్మపురి, మంతెన విలాసాగర్ మొదలైన అనేక గ్రామాలలో దేవాలయాలు కట్టించారు.

బౌద్ధ స్థూపము : కోటిలింగాల గ్రామానికి ఆగ్నేయ దిశలో గోదావరి – పెదవాగు కలిసే చోట చేసిన త్రవ్వకాలలో మహా స్థూపం బయటపడింది. కాల్చిన ఇటుకలతో నిర్మించిన ఈ మహాస్థూపం చాల వరకు శిథిలమైపోయింది. స్థూపానికి చుట్టూ అంటించిన 20 సెం.మీ మందం కల 59 చలవ రాతి ఫలకాలు లభించాయి. ఈ ఫలకాలపై బుద్ధుని జీవితంలోని ఘట్టాలని, జాతక కథలను అతినైపుణ్యంగా చెక్కబడినాయి. ఈ చలువరాతి ఫలకాలపై అశోకుని కాలపు బ్రాహ్మి లిపి శాసనాలు ఉన్నాయి. ఈ శాసనాలను బట్టి ఇక్కడి స్థూపం అశోకుని కంటే ముందే నిర్మించబడినట్లుగాను క్రీ.శ. 4వ శతాబ్దిలో ఇక్ష్వాకుల (విజయపురి వీరి రాజధాని) కాలంలో థేరవాదులు దీనిని పునరుద్ధరించినట్లుగాను తెలుస్తున్నది. ఈ శాసనాల ప్రకారం నాగగోపుడు బౌద్ధుల సమావేశపు మందిరాన్ని (విహారం) నిర్మించి, దానాలు ఇచ్చాడని తెలియవస్తున్నది. బౌద్ధ స్థూపానికి పడమటి వైపున 20 అడుగుల ఎత్తులో కల దిబ్బ ఉన్నది. ఇది కూడ బౌద్ధ స్థూపమే అయివుంటుంది. ఈ దిబ్బపై తరువాతి కాలంలో త్రికుటాలయం పేరుతో శివాలయం నిర్మించబడగా, అది గోదావరి వరదలలో కొట్టుకొని పోయి శివలింగాలుగా పేర్కొనే ఆయక స్తంభాలు మాత్రమే మిగిలివున్నాయి. ఇక చైత్యాలు, విహారాలు నివాసగృహాలు గుర్తులు మాత్రమే మిగిలివున్నాయి. ఇక్కడ జరిపిన త్రవ్వకాలలో రెండు సాంస్కృతిక పొరలు (Cultural layers) వెలుగులోకి వచ్చాయి. అవి శాతవాహనుల ముందు కాలమునకు, శాతవాహన కాలమునాటికి సంబంధించినవి. ఈ త్రవ్వకాలలో లభించిన నాణెముల ఆధారంగా శాతవాహన మొదటి రాజైన శ్రీముఖుడు కోటిలింగాల పాలకుడైన గోభద్రుని (గోభద) నుండి రాజ్యం వశపరచుకుని శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించాడని చరిత్రకారుల అభిప్రాయం. ఈ త్రవ్వకాల ముందు వరకు శాతవాహనులు మగధను పాలించిన మౌర్యుల తరువాత రాజ్యాన్ని స్థాపించారని చరిత్రకారుల ఊహ. కాని ఈ అభిప్రాయం సరి అయినది కాదని ఈ త్రవ్వకాలు నిరూపించాయి. ఈ త్రవ్వకాలలో అనేక రకాలైన మట్టిపాత్రలు, కుండపెంకులే కాక రోమను రౌలెటెడ్ వేర్ మట్టి, రాతి, గాజు, సున్నపు, దంతపు పూసలు, ఇనుపమేకులు, కత్తులు, కొడవళ్ళు, బాణాలు, బల్లెములు కాల్చిన మట్టి (Terra Cotta) తో చేసిన జంతువుల బొమ్మలు, దంతపు దువ్వెన, అనేక బ్రహ్మి లఘు శాసనాలు మొదలైన వస్తువులు కూడ లభించాయి.

ఇంతటి మహావైభవం కలిగిన ఈ కోటిలింగాల ప్రభుత్వ నిరాదరణకు గురి అయి కాలగర్భంలో కలసిపోతుండటం మన దౌర్భాగ్యం. ఇటువంటి చారిత్రక ప్రాధాన్యం ఉన్న కోటిలింగాల శ్రీపాదరాయ ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపుకు గురౌతున్న చారిత్రక స్థలాన్ని రాష్ట్ర పురావస్తుశాఖ వారు 2008–2011 సంవత్సరాల మధ్య చేపట్టిన త్రవ్వకాలలో సున్నపురాతి శిలాఫలకాలతో అలంకరింపబడిన స్థూపం, బుద్ధుని పాదాలు, చైత్యం, ఇంటి పునాదులు, నలుపు – ఎరుపు మట్టి పాత్రలు, మట్టి, రాతి, గాజు, స్ఫటికం మరియు విలువైన రాళ్ళతో చేసిన పూసలు, ఇనుప పనిముట్లు గోభద, శాతకర్ణి నాణాలు లభించాయి. ఈ అమూల్య సంపదను కరీంనగర్‌లోవున్న మహాత్మాగాంధీ వస్తు ప్రదర్శనశాలలో భద్రపరిచారు. కోటిలింగాల చుట్టు ప్రక్కల ప్రదేశాలలో పురావస్తు అన్వేషణ సంపూర్ణంగా చేయవలసిన అవసరం ఎంతైనావుంది.

ఇంతటి చారిత్రక వైభవాన్ని కలిగిన ఈ ప్రాంతం శ్రీపాదరాయ ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముంపుకు గురై, భావితరాల వారికి కనుమరుగవుతున్నది. శాతవాహనుల మొదటి రాజధానిగా వెలుగొందిన ఈ ప్రాచీన నగరం గురించి స్థానిక ప్రముఖులు, ముఖ్యంగా ప్రముఖ పురాతత్త్వవేత్త అయిన డా॥ జైకిషన్‌లాంటి వారు మేల్కొని ఈ పురావస్తు సంపదను ముందు తరాల వారికి అందేలా చేస్తారని ఆశిద్దాం. డా॥ కృష్ణశాస్త్రి, రాజారామ్ సింగ్‌కి మనం ఎంతో ఋణపడి ఉన్నాము.

కొసరాజు వెంకటేశ్వరరావు
పురాతత్త్వవేత్త, హైద్రాబాదు,
ఫోన్ : 9490636659

శిలాలోలిత

– కాత్యాయనీ విద్మహే

"రేవతీదేవి ఆధునిక కవయిత్రి. రీతిలో ఏమి, నీతిలో ఏమి, భావాలలో ఏమి, ప్రభావాలలో ఏమి, ఆమె నేటి కవయిత్రి" – *శిలాలోలిత* కవితల పుస్తకానికి *విన్యాసం* అనే శీర్షికతో ముందుమాట వ్రాసిన సంజీవదేవ్ కవయిత్రిని గురించి అన్నమాటలివి. వ్యక్తి అనుభవాల జ్ఞాన చైతన్యాల నుండి, వ్యక్తి ప్రయోజనాలకోసం వ్యక్తి గౌరవం లక్ష్యంగా సాగే చింతన ఆధునికతకు ప్రాణభూతమైన అంశం. ఈ చింతనే రేవతీదేవిని ఆధునిక కవయిత్రిని చేసింది. ఈ చింతన ఆమెకు ఎక్కడ నుండి అంది వచ్చింది? తాను పుట్టి పెరిగిన దేశకాల పరిస్థితుల నుండి, తాను చదివిన చదువుల నుండి ఆ చింతనా చైతన్యం ఆమె స్వంతమైంది.

రేవతీదేవి జీవించిన జీవితం చిన్నది. తన ముప్ఫయ్యవ ఏటనే 1981 జనవరి 19 నాడు ఆమె మరణించింది. ఆ స్వల్పవ్యవధిలోనే ఆమె జీవితాన్ని గాఢంగా అనుభూతి చెందింది. ఆ అనుభూతికి అభివ్యక్త రూపంగా వచ్చినవి *శిలాలోలిత* కవితలు. యాభయ్యవ దశకంలో పుట్టి డెబ్భయిల నాటికి నవయవ్వనంలోకి అడుగుపెట్టి ఆలోచనాలోచనాలు విప్పుకొని చుట్టూ ప్రపంచాన్ని చూస్తూ, అర్థం చేసుకొంటూ, సంఘర్షిస్తూ, భేదిస్తూ ఐక్యత కోసం అన్వేషించే యువతరం ఏ జీవితానుభవాల నుండి తయారైందో రేవతీదేవి కూడా ఆ జీవితానుభవాల నుండే చింతనాజీవి అయింది.

స్వాతంత్ర్యానంతరం గాంధీ పేరు చెప్పుకొంటూ సామాజిక ఆర్థిక అసమానతలను పెంచి పోషిస్తున్న ప్రభుత్వాధికార విధానాలను, పరిణామాలను, డబ్బుసంపాదన, సంచయనం ప్రాధాన్యతను పొందుతూ మనిషిని మానవత్వం నుండి పరాయీకరించటాన్ని, వీటిని వునాది నుండి మార్చటం లక్ష్యంగా రూపొందిన విప్లవోద్యమాలను వాటికి వైతాళికగీతం పాడిన, మద్ధతు ప్రకటించిన దిగంబర, విప్లవ సాహిత్య ఉద్యమాలను ఆమె చూచింది. అవి ఆమెకు ప్రశ్నించటాన్ని, విమర్శించటాన్ని, నిరసించటాన్ని, నిర్మించటాన్ని జీవిత తత్వంగా చేసుకొనే చైతన్యాన్నిచ్చాయి. దానికి తోడు ఆమె చదివింది తత్వశాస్త్రంలో ఎమ్మే. తన గురించి, తన పుట్టు పూర్వోత్తరాల గురించి, తనలో కదిలే చైతన్యం గురించి, తమ భాగంగా వున్న ప్రకృతి గురించి, తాను నిర్మించుకొన్న సమాజ జీవితం గురించి కలిగిన సందేహాలు, ఉదయించిన ప్రశ్నలు, సమాధానాలకై సాగిన అన్వేషణ అన్నీ కలిపి తత్వశాస్త్రం. తన చుట్టూ సమాజంలో సంభవిస్తున్న పరిణామాలకు తనకు వున్న సంబంధాన్ని గురించి ఆలోచించగల శిక్షణ ఆ రకంగా రేవతీదేవి ఆమె చదువు వల్ల పొందింది. కనుకనే ఆమెలో అన్వేషణ మరింత పదునెక్కిన లక్షణమైంది.

ఇక ఆమె పరిశోధన చేసింది అస్తిత్వవాద దార్శనికుడు జీన్‌పాల్ సార్త్రే మీద. ఉండటం లేకపోవటం అన్న విరుద్ధాంశాల మధ్య సంఘర్షణగా సమన్వయంగా వ్యక్తి ఉనికి చెందే పరిణామాలను వివరించిన సిద్ధాంతమిది. వ్యక్తి తన ఉనికే తనకు తెలియకుండా వున్న స్థితి నుండి తనను తాను తెలుసుకొంటూ తన కోసం తాను జీవించటానికి స్వేచ్ఛను స్వతంత్రాన్ని కాంక్షిస్తూ వేదన పడటమో, లేక అందరికోసం తాను జీవించటానికి సిద్ధ పడి ఆ క్రమంలో స్వేచ్ఛను స్వతంత్రాన్ని కోల్పోవటమో జరుగుతుంటుంది. ఈ అస్తిత్వవాద సారాంశం రేవతీదేవి అన్వేషణాలక్షణాన్ని అస్తిత్వాన్వేషణగా రూపు కట్టిస్తుంది.

రేవతీదేవి ఆలోచనలు రెక్కవిప్పుకొంటున్న డెబ్భయ్యవ దశకానికి నూతన స్త్రీవాద ఉద్యమాలు రూపుదిద్దు కొంటున్నాయి. స్త్రీల స్వీయ అస్తికతను గురించిన విచికిత్స దగ్గరే స్త్రీవాద ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. స్త్రీ అంటే అంత వరకు సమాజంలో వున్న నిర్వచనాలతో, విభేదిస్తూ, తామెవరో తాము తెలుసుకొనటానికి, తమను ఆ విధంగా అవకాశాలకు దూరంచేసి అధీనులుగా మార్చి అసమానస్థితిలో వుంచిన కారణాలను కనిపెట్టటానికి స్త్రీలు ప్రారంభించిన అన్వేషణ ఆ ఉద్యమాలకు మూలం. స్త్రీవాదానికి సిద్ధాంత బలం చేకూర్చిన *ది సెకండ్ సెక్స్* (1949) వ్రాసిన

సైమన్ డి బావురే అస్తిత్వవాది అయిన సార్త్రేకి సన్నిహితురాలు. స్త్రీలు పుట్టరు, తయారు చేయబడతారు. (one is not born, but rather becomes, a woman) అని స్త్రీ ప్రపంచానికి విషయం కావటం వల్ల స్త్రీ పట్ల జరిగిన అన్యాయాన్ని వివరించిన ఆమె స్త్రీ సమస్యను ప్రపంచ సంబంధాల ద్వారా అర్థం చేసుకొనటానికి అస్తిత్వకోణాన్ని సూచించింది.

తనను తాను తెలుసుకొనాలన్న ఆకాంక్షతో తనను తాను పొందటానికి నిరంతరం తపనపడ్డ రేవతీదేవికి స్త్రీ కావటం వల్ల ఈ విధమైన స్త్రీ వాద ఉద్యమ సిద్ధాంతాలు కూడా తన సాధనకు ఉపకరించి వుంటాయి. ఫలితంగా రేవతీదేవి అస్తితాన్వేషణ స్త్రీ అస్తితాన్వేషణగా మరొక కొత్తకోణాన్ని కలుపుకొన్నది. కనుక 1979లో వ్రాయబడిన *శిలాలోలిత* కవితలను ఈ సమకాలీన ప్రాపంచిక పరిణామాల నేపథ్యంలో రేవతీదేవి జీవిత తాత్వికతను రూపొందించిన ప్రభావాల వెలుగులో మాత్రమే అధ్యయనం చేయగలం. అర్థం చేసుకోగలం.

రేవతీదేవి కవిత్వంలో ఏముంది? తనను తాను వెతుక్కొనటం వుంది. తనను తాను తెలుసుకొనటం వుంది. తన మనసు తెలుసుకొనటం వుంది. తన మనోభావాలను వ్యక్తీకరించాలనే కాంక్ష వుంది. సౌందర్యకాంక్ష వుంది. అనుభూతి సాంద్రత వుంది. వైరుధ్యాల గురించి గుర్తింపు వుంది. విరుద్ధశక్తుల సంఘర్షణలో విధ్వంసం గురించిన ఆందోళన ఎంత ఉందో పునర్నిర్మాణం గురించిన ఆశ అంత ఉంది. తనతోపాటు తనకంటే భిన్నంగా వున్న రెండవ వ్యక్తిని గురించిన ఆలోచన ఆ వ్యక్తితో అద్వైత ఐక్యతను పొందాలన్న గాఢానురక్తి వున్నాయి. తాను, అతను మాత్రమే కాదు ఈ ప్రపంచంలోని మనుషులు. మగవాళ్ళు, ఆడవాళ్ళు, పెళ్ళికాని తల్లులు, వేశ్యలు, శిశువులు చాల మందే వున్నారు. వ్యక్తి నుండి ఇంత ప్రపంచానికి విస్తరించిన మానవసమాజపు సజీవ వర్ణచిత్రాన్ని కళ్ళకు కట్టించటం రేవతీదేవి కవిత్వంలో ప్రత్యేకత.

I

తనలో తాను ముడుచుకొని జీవించే వ్యక్తికి చైతన్యం లేనట్లే. చైతన్యరహిత జీవితంలో బాధ లేదు బాధ్యత లేదు. లోకంలో పుట్టి బ్రతుకీడుస్తున్న జనమంతా చైతన్య రహితులు కావటం వల్ల, తమ జీవితాలకు తాము బాధ్యత వహించలేక పోవటం వల్ల నిజంగా బ్రతుకుతున్నట్లూ కాదు. తనను తాను వెతుక్కొంటున్న మనిషి, తనను తాను తెలుసుకొంటున్న మనిషి మాత్రమే, నిజంగా బ్రతుకుతున్నట్లు, ఈ దృక్పథం నుండే రేవతీదేవి "ఇంతకీ నేను పుట్టిందెప్పుడు / పుట్టినప్పుడు పుట్టినట్లా / చైతన్యించినప్పుడు పుట్టినట్లా" (ఓటమిలో గెలుపు) అని ప్రశ్నించింది. చైతన్యించటమంటే అస్తిత్వ స్పృహను పొందటం. పుట్టిన వాళ్ళంతా –

"ఇది తెలుపు, ఇది నలుపు, ఇది పసుపు, ఇది ఎరుపు,
ఇది తప్పు, ఇది ఒప్పు, ఇది నిప్పు, ఇది నీరు
ఇది ఊరు, ఇది పేరు, ఇది నీది, ఇది నాది" అంటూ

పూర్వీకులు వివరించిన నియమనిబంధనలకు, పరిధులకు లోబడి జీవిస్తారు. అట్లాగని పుట్టిన వాళ్ళంతా పుట్టినట్లుగానే వుండరు. తనను తాను స్వీయ ఆలోచన, స్పందన వున్న ప్రత్యేక మానవ వ్యక్తిగా తెలుసుకొనేవాళ్ళు వాళ్ళలోంచి వేరవుతారు. తనకంటే ముందుకాలం నుండి వస్తున్న వ్యవస్థలు, నీతులు, నియమాలు తన అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా తన జీవితాన్ని శాసించటాన్ని వాళ్ళు అంగీకరించలేరు. అట్లా అస్తిత్వచైతన్యాన్ని పొందిన వాళ్ళకు ప్రతినిధిగా రేవతీదేవి...

"నేను చూసిన రంగులు విన్నధ్వనులూ
గమనించిన వివరణలు పరికించిన అవధులూ

మరింకెలాగో ఉన్నాయి" – అని తన అనుభవ కోణం నుండి చెప్తుంది ఈ కవితలో. మనిషిని, మనిషి అనుభవాన్ని అప్రధానం చేసిన పాత సామాజిక నైతిక ధార్మిక వ్యవస్థలతో సూత్రాలతో అస్తిత్వ స్పృహపొందిన వాళ్ళు సంఘర్షించటం అనివార్యం అవుతుంది. ఈ సంఘర్షణలో వాళ్ళది ఒంటరి పోరాటం. తమ అనుభవాలకు ఋజువు చూపటం, సూత్రీకరించటం, నలుగురికి ఆమోదయోగ్యమయిందిగా చూపటం అస్తిత్వ వాద సిద్ధాంతానికే వ్యతిరేకం. కనుక వాళ్ళదెప్పుడూ ఓటమి లాగానే కనబడుతుంది.

"చైతన్యించిన నాడు తొలిసారిగా ఓడిపోయాను
అప్పటినుంచి నిత్యం ఓడిపోతూనే వున్నాను."

అని రేవతీదేవి చెప్పటంలో అంతరార్థమిదే. అయితే తన ఓటమి కూడా గెలుపేనంటుంది ఆమె. ఎందుకంటే ఓడిపోవటమంటే రాజీ పడటమూ కాదు. లొంగి పోవటమూ కాదు. అందువల్ల తన మీద ఎవరి ఆధిపత్యమూ లేదు. ఆధిపత్యాన్ని ధిక్కరించటం తన ఓటమిలోని గెలుపు. అస్తిత్వవాద భావనలకు ఈ విధంగా వ్యాఖ్యానమైన కవిత ఇది. ఆశాగ్నిరేణువు కూడా ఇటువంటిదే.

ఆశాగ్ని రేణువు కవిత :

"పుట్టిన ఇంత కాలానికి
నేను బ్రతికున్నట్లు తెలిసి
తొలిసారిగా ఏడుపొచ్చింది
నేను నిజంగా బ్రతికుండే అవకాశం లేదని ॥

అని ప్రారంభమవుతుంది. బ్రతికున్నట్లు తెలియటమంటే తన ఉనికి, తన ఊహ, తన ఆసక్తి, తన ఆకాంక్ష అన్నీ కలిసిన 'తను' తనకు తెలియటం తనకు తాను తెలియటం దుఃఖకరమైన విషయమైంది. ఎందుకు? తాను తానుగా నిలబడటానికి అవకాశాలు ఈ సమాజంలో లేవని తెలియటం వల్ల –

బాధ్యత లేకపోవటం, బాధ్యత వుండటం అన్న రెండు విరుద్ధాంశాల మధ్య సంఘర్షణ మనిషి అస్తిత్వ కేంద్ర బిందువు. వ్యక్తి తన పుట్టుకకు తాను బాధ్యుడు కాడు. అట్లాగే తన జీవితానికీ తాను బాధ్యుడు కాక గతానుగతికమైన వ్యవస్థలకు, నీతులకు, విలువలకు లోబడి జీవిస్తున్నాడు. అస్తిత్వవాద సిద్ధాంతం ప్రకారం అది జీవించటం కాదు. ఆశాగ్ని రేణువు కవిత ప్రథమ భాగంలో ఈ విషయాన్ని ప్రతిపాదించిన రేవతీదేవి "వక్క వుదుటున చిచ్చుబుడ్డిలా ఎగసిన ఈ చైతన్యం –

నన్ను నేను తొలిసారిగా చూసుకున్న ఈ క్షణం
నేను బ్రతికున్నట్లు తెలిసిన ఈ క్షణం నుంచి
నేనేం చేసినా చెయ్యకపోయినా

అందుకు బాధ్యత నాదే" – అని చెప్పిన మాటలు పూర్తిగా అస్తిత్వ వాద సారానికి సాకారతనిచ్చాయి. చైతన్య వంతమవుతూ ఏమీలేని స్థితికిలోనై అస్తిత్వాన్వేషణలో పడిన వ్యక్తి తనను తాను తెలుసుకొన్నప్పుడు తన జీవితానికి తనదే పూర్తి బాధ్యత అని గ్రహించటం జరుగుతుంది. తన ఇష్టప్రకారం ఆలోచించటానికి, ఎంచుకొనటానికి, ఎంచుకోకుండా వుండటానికి అన్నిటికి స్వతంత్రం వున్న కొత్త వ్యక్తి ఆవిర్భావం వల్ల ఇది సాధ్యమవుతుంది. స్వాతంత్ర్యం వ్యక్తి బాధ్యతను వాంఛిస్తుంది. ఇదంతా తెలిసిన లక్షణం నుండే రేవతీదేవి –

"నేను బ్రతికున్నట్లు తెలిసిన ఈ క్షణం నుంచి
నేనేం చేసినా చెయ్యక పోయినా

అందుకు బాధ్యత నాదే" – అని నిర్ద్వంద్వంగా చెప్పగలిగింది. ఒకసారి తన జీవితానికి తానే కర్త అని తెలిసిన తరువాత, తన జీవితాన్ని తానే నిర్మించుకొనే బాధ్యతను సగర్వంగా స్వీకరించిన తరువాత గతం తనను బంధిస్తుంటే, నీ బ్రతుకు నీ స్వంతం కాదని పెత్తనం చేసే శక్తులు మీద పడుతుంటే సహించటం కష్టం. బంధనాలు తెంచుకొని ఎదురు తిరగాలనిపించినా మనుషుల పట్ల వున్న సానుభూతి, మనిషిలోని సానుభూతి లక్షణం పట్ల వున్న విశ్వాసం ఆశను రగిలిస్తాయి. సహనాన్ని నేర్పుతాయి. *ఆశాగ్ని రేణువు* కవిత ముగింపు అక్కడే. "ఎదుటి వ్యక్తి / మీజోలికి రాకుండా / ఎలా ఉంటే మీకెందుకు / ఏం చేస్తే మీ కెందుకు?" (నాగరిక జాడ్యం) అని లోకాన్ని సంబోధించటం అందులో భాగమే.

అస్తిత్వవాదం మానవాత్మ స్వేచ్ఛకు బంధనమని అనిపించిన వ్యవస్థలను, సంస్థలను, విధానాలను, యాంత్రికమైన నిత్యనైమిత్తికాలను, చారిత్రక ఐహిక మానవ జీవిత దృక్పథాలను అన్నిటిని వ్యతిరేకిస్తుంది. అస్తిత్వవాదం లోని ఈ లక్షణం బాగా వంటబట్టిన రేవతీదేవి *దేవుడూ* అన్న కవిత వ్రాసింది. దేవుడూ / నన్ను రక్షించు / నీ భక్తుల్నుంచి / నన్ను రక్షించు అని ప్రారంభమైన ఈ కవిత గాంధీ, మార్క్స్, మావో, ఫ్రాయిడ్, సార్త్ర్, విశ్వనాథ, శ్రీశ్రీ, చలం మొదలైన వాళ్ళందరి భక్తుల నుండి రక్షించమని కోరుతూ 'ఇందర్నుంచి రక్షించినందుకు / నేన్నీ భక్తిలో పడితే' అన్న సందేహం కలిగిన మరుక్షణం "ఒద్దు దేవుడూ / నువ్వు నన్ను రక్షించొద్దు / నన్ను నేనే రక్షించుకుంటాను" అని దేవుడ్ని కూడా తిరస్కరించి తన రక్షణ బాధ్యత తానే స్వీకరించటానికి సిద్ధపడిన వ్యక్తి చైతన్యాన్ని ప్రదర్శించింది.

అస్తిత్వవాదంలో మృత్యుచింతన ఒక లక్షణం. మార్టిన్ హిడిగర్ మరణమొక్కటే మానవుని శక్తి అని, మనిషి మరణముఖంలోనే స్వేచ్ఛను పొందుతాడని అభిప్రాయపడ్డాడు. ఈ మృత్యుచింతన అంత ఎక్కువగా కాదుకాని అక్కడక్కడా చిట్లని *నీదీబుదగ, ఈ రాత్రి* వంటి కవితలలో కనబడుతుంది.

II

జడత్వం నుండి చేతనత్వానికి, చైతన్యానికి మార్పు చెందటం మానవ అస్తికతకు గుర్తు. తాను స్త్రీని అన్న ప్రత్యేక స్పృహను పొందటం దగ్గర ప్రారంభించి రేవతీదేవి స్త్రీల శారీరక మానసిక చలన చైతన్యాలను తన కవిత్వంలో భావచిత్రరూపాలతో ప్రదర్శించింది.

తనను తాను తెలుసుకొనే క్రమంలో స్త్రీ తనకూ ఒక మనసు వుందని గుర్తిస్తుంది. మనసుందనే విషయం తెలియనప్పుడు ఏ పేచీలు ఏ బాధ్యతలూ లేకుండా జీవితం గతానుగతికమైన పద్ధతిలో కొనసాగిపోతూనే వుంటుంది. మనసుందని తెలిసినప్పటి నుండి ఆవేదన, అశాంతి, అన్వేషణ

అన్నీ ప్రారంభమవుతాయి. 'మనసు గతి'ని వివిధ కోణాల నుండి ప్రదర్శించటం రేవతీదేవి కవితలలో ముఖ్యాంశం. *దారి, హృచ్ఛితి, నిష్క్రమణ, ఊరెడుతున్నాను* మొదలైన కవితలు ఈ ధోరణికి చెందినవే. "గింజలోంచి పసిమొలక తొంగి చూసినట్లు / మనసలికిడి" (దారి) అయితే జీవితమిక చలనచైతన్య సంభరితమే. ప్రపంచం కొత్తగా కనబడుతుంది. తనను తాను నూతనంగా ఆవిష్కరించుకొనాలన్న తహతహ, తపన, వేదన బయలుదేరుతాయి. మనసుకు తోచినట్లు ప్రవర్తించాలనిపిస్తుంది. అందుకు అవరోధంగా వుండే సామాజిక శక్తులు అశాంతిని కలిగిస్తాయి. మనసు పొమ్మన్న దారిలో మనిషి పోకూడదంటే అప్పుడేమిటి కర్తవ్యం...? "మనసుదారి మనిషిదారి కాదంటే / మరి నా దారి గోదారేనేమో" అన్న సందేహంతో ముగిసే *దారి* కవిత మనసు చూపిన దారి వెంట మనిషికి నడిచే అవకాశాలు మూసివేయబడ్డప్పుడు మనసున్న మనిషికి ఆత్మహత్యే శరణ్య మేమోనన్న సూచన చేసినట్లయింది. మరణంలోనే మనిషి నిజమైన స్వేచ్ఛను అనుభవించ గలడన్న అస్తిత్వవాద భావం ఇక్కడ అట్లామెరిసి మాయమవుతుంది. మనిషి ఇచ్ఛకు సమాజ సంప్రదాయాలకు వైరుధ్యం వున్నప్పుడు అనివార్యంగా వచ్చే నిస్పృహ ఇది.

మనసుదారి మనిషిదారి కానప్పుడు, మనసుతో సంబంధం లేని సంబంధాలలో జీవించాల్సి వచ్చినప్పుడు హృదయపు అస్తిత్వాన్ని గుర్తించ గలుగుతున్న స్త్రీ గతేమిటో *హృచ్ఛితి* కవిత స్పష్టం చేస్తుంది. స్త్రీ పురుష సంబంధాలలో – అవి దాంపత్య సంబంధాలైన, వైవాహికేతర సంబంధాలైనా – హృదయానికి తావులేకపోవటం విషాదకర వాస్తవం. హృదయంతో సంబంధంలేని ఒట్టి శరీర సంబంధాలవి. "కొన్నేళ్ళుగా కాపరం చేస్తున్న భర్తకీ భార్యకీ మధ్య మనసెరగని గానుగెడ్ల దూరం, దూరం లేనిది.

శరీరానికీ శరీరానికీ మధ్య మాత్రమే
పావలా యిచ్చినా చాలు

సూత్రంతాడు కట్టినా చాలు" – అని *దూరం* కవితలో ఈ నగ్నసత్యాన్నే చెప్పింది రేవతీదేవి. "నిరంతర చిత్తకార్తి కుక్కలు" అనటం ద్వారా *హృచ్ఛితి* కవితలో ఆడపొందు కోసం తహతహలాడే పురుష ప్రవృత్తి నిరంతరత్వాన్ని సూచించి ఆ అవసరం తీరే వరకు మాట్లాడే మాటలు చూపే ప్రేమ ఎండిన గడ్డిలాగా ఎగిరి కమ్ముకొంటూనే వుంటాయి. కానీ అది స్త్రీ హృదయాన్ని కదిలించలేదని చెప్తుంది రేవతీదేవి. ప్రేమలేని సంబంధాల క్రమంలో హృదయం ఏమైంది? ఫ్రీజర్‌లోంచి తీసిన శవం కన్నా చల్లని / మాంసపు మంచు ముద్ద అయింది. మంచు ముద్ద అయిన హృదయానికి స్పందన వుండదు. అనుభవం వుండదు. తనను వాంఛించే అవతలి వ్యక్తిలో ప్రేమలేదు, నిజాయితీలేదు. అందువల్ల తాను అనుభవ విషయమే అవుతుంది కానీ అనుభవించలేదు. హృదయం కరగాలంటే స్పందించాలంటే నిప్పులాంటి నిజాయితీ ప్రేమ కావాలి. ప్రేమ, దాంపత్య సంబంధాలలో దొరకనప్పుడు బయట నుండి కూడా అది నిషేధమే అవుతున్నది. ప్రేమ తోటి సంబంధాలు ఏర్పరచుకొనటం లోకానికి ఇష్టం వుండదు. ధర్మం తగలబడిందని గగ్గోలు పుడుతుంది. లోకానికి హృదయానికి వైరుధ్యం. లోకానికి నిజాయితీకి వైరుధ్యం. హృదయాన్ని స్పందింపచేయగలిగినది నిజాయితీ మంచుమంట. లోకం హృదయాన్ని నిజాయితినీ కూడా లెక్కచేయదు. ఫలితంగా శవం కన్నా చల్లని మంచు ముద్దల వంటి హృదయాలు ఎప్పటికీ కరగని, మండని హృదయాలు అట్లా లోలోపల తోసేసుకొని శరీర సంబంధాలతో కాలం ఈడ్చేయ వలసినదే. 'ఈ హృది ఎన్నటికీ రగలని చితి' అని రేవతీదేవి చెప్పిన మాట దాన్నే సూచిస్తుంది.

మనసు అంటూ వున్న తరువాత దానికి కోరికలు ఇష్టాలు వుంటాయి. మహల్లాలస, అట్టాంటి అత్యుత్తున్నత గాఢేచ్ఛలకు అభివ్యక్త రూపమైన కవిత. అనాది నుంచి ఇంతవరకు ఎవరికీ తెలియని సౌందర్య రూపాలను చూడాలని, నాద స్వరాలను వినాలని, స్నిగ్ధత్వాలను స్పర్శించాలని, పరిమళాలు గాఢత్వాలను పీల్చాలని, రుచుల కమ్మదనాలను చవి చూడాలని, నాదస్వరాలను వినాలని, అనురాగమానసాన్ని అద్వైతించుకోవాలని తనకు గాఢమైన కోరిక వుందని కవయిత్రి ఈ కవితలో చెప్పింది. చూడటం, వినటం, స్పర్శించటం, వాసన చూడటం, రుచి చూడటం – ఇవి వరుసగా కన్ను, చెవి, చర్మం, ముక్కు, నాలుక అన్న అయిదు జ్ఞానేంద్రియాలకు సంబంధించిన కర్మలు. ఈ అయిదు జ్ఞానేంద్రియాలు సంపూర్ణ సర్వోత్కృష్ట వినియోగ జ్ఞానాన్ని మనస్సు అనే మరొక ఇంద్రియంతో అనుసంధానించు కొనాలన్న కోరిక ఇది. ఈ మనస్సు – అనురాగ మానసం – తనకంటే భిన్నమైనది. దానితో ఐక్యతను భజించాలన్నది ఆమె ఆకాంక్ష.

తాను ఐక్యతను సాధించవలసిన మనస్సు తన సాధనకు లక్ష్యం. కనుక అది సర్వోత్కృష్టమైనది. అటువంటి లక్ష్యాన్ని సాధించాలంటే తాను కూడా సర్వోత్కృష్టతను సంత రించుకొనాలి. *జననం* కవిత ఆ క్రమాన్ని చెప్పింది.

"పాతిక లాలసా తప్త దేహాల పరిమళాలతో
ఐదు మంచు పర్వతాల సౌందర్యాలతో
అసంఖ్యాక జంటగోళాల చలన సంగీతంతో
.....
నూరు చిరు పచ్చికల మెత్తని ఆనందాలతో
.....
నలభయ్ యవ్వనం సూర్యుళ్ళ దాహంతో" ..... "ఇట్లా గుణకారం చేయబడిన దేహ సౌందర్య యవ్వన శోభలతో శక్తితో" ఒకే ఒక్క మనసుతో / ఒకే ఒక్క మనసుకోసం / ఇంత కాలానికి జన్మించాను" అని చెప్పిన ఈ కవితలో జన్మానికి సార్థకత ఆ మరొక మనసుకు చేరుకొనటమే నన్న ధ్వని వినబడుతుంది.

మరొక మనసుకు చేరుకొనటానికి తన మనసు పడే తహతహ లోలోపలి ఆలోచనకు, ఆసక్తికి సంబంధించినదిగా వున్నంతసేపు ఎవరికీ తెలియదు. తనలో తాను తన గురించి ఏమి నిర్వచించుకొన్నా, ఆశయం పట్ల ఆశ పెంచుకొన్న ప్రమాదం ఏమీలేదు. తనేమిటో చెప్పి, తను ఎవరికోసమో ప్రకటించి కార్యాచరణకు దిగి నప్పుడే లోకంతో వ్యక్తికి ఘర్షణ ప్రారంభమవుతుంది. మనసలికిడి పసికట్టి అస్తిత్వ చైతన్యంతో ఆచరణకు దిగే స్త్రీ విషయంలో ఇది మరింత నిష్కర్షగా, నిశితంగా వుంటుంది. ప్రారంభంలో ఇది ఆమె మాటను అభిప్రాయాన్ని వినిపించుకోక పోవటంగా వుంటుంది. *మూగపోయిన గొంతు* కవిత ఆ స్థితిని చెప్తుంది.

"ఇన్నాళ్ళు గలగలా మాట్లాడితే
నే చెప్పాల్సిందేమీ లేనందున
నేనేం చెప్పినా విన్నారు.
ఇప్పుడేమో నాకూ
చెప్పాల్సిందేదో ఉండి
చాలా గాఢమైంది
చాలా ఇష్టమైంది
చాలా స్వచ్ఛమైంది
చెప్పాల్సిందేదో ఉండి
మాట్లాడ బోతే
ఎవరూ వినిపించుకోరు
.....

స్త్రీ జీవితంలోని దైన్యం ఇది. గలగలా మాట్లాడినా అందులో ఆమె చెప్పిన ఆమె అభిప్రాయాలు ఏమీ లేవు. అవన్నీ ఇంతకు పూర్వపు సమాజం, సంప్రదాయం అలవాటు చేసిన ప్రసంగాంశాలే. అందు వల్ల వాటన్నిటినీ ఎంత బాగా వల్లె వేయగలుగుతున్నది అని ముచ్చట పడుతూ వినగలిగారు ఇన్నాళ్లు. ఇప్పుడు ఆమె చైతన్యం మేల్కొన్న వ్యక్తి తన మనసు గురించి తాను ఐక్యం కావలసిన మనసు గురించి ఆమెకు స్పష్టత, గాఢత ఏర్పడింది తత్సంబంధమైన తన ఇష్టాలు చెప్పాలని ఇపుడామె మాట్లాడబోతే ఎవరూ వినరు. ఎందుకంటే వినకుండా నిర్లక్ష్యం చేయటం ద్వారా ఆ ఇష్టాలను మొగ్గలోనే చిదిమి వెయ్యవచ్చు. నెమ్మదిగా లోకమార్గాన పడవేయవచ్చు. మనసును విప్పిచెప్పాలనుకొనే గొంతులను మూగవిగా చేయటం లోకంలో నడుస్తున్న న్యాయం. మూగబోయిన గొంతులోనూ అనురాగమానసం చేసే ధ్వనులున్నాయని చెప్పటంతో ముగిసే ఈ కవిత చెప్పింది వినిపించుకోక పోవటం అన్న కఠోర అనుభవాన్ని ఎదుర్కొన్న తరువాత కూడా చావని ఆశను వ్యంగ్యమానం చేస్తున్నది.

మనసు పడ్డ మనిషితో సంబంధాన్ని కులం పేరుతోనో ఆస్తులు అంతస్తుల పేరుతోనో, కుటుంబ గౌరవాలు, ఆధిక్యతలు, అహంకారాల పేరుమీదనో నిషేధించటం లోకరీతి. ఈ లోకరీతిని అపహాస్యం చేసే కవిత *ఊరెడుతున్నాను*. నిష్క్రమణ మనసు పడ్డ వాడి నుంచి మనిషిని దూరం చేయటానికి ఒక మార్గం. వేరే ఊరికి పంపించటం శరీరాన్ని పంపించగలరు కానీ హృదయాన్ని పంపలేరు. అవతలి వ్యక్తి అనురాగపు చిరునవ్వు తన నుదుటి మీద ప్రసరించిన అనుభవం, అవతలి వ్యక్తి మనస్సు తన హృదయంలో అనుక్షణం కదలాడుతుంటే రైలెక్కినా, మైళ్ళు గడిచినా తానెక్కడికి కదలనట్లే అనిపిస్తుంది. ఈ అనుభవ ప్రత్యేకత నుండే ఆమె ఏం చేసినా తానతని నుండి నిష్క్రమించ లేకపోవటాన్ని చెప్తుంది లోకం అతని పట్ల ఆమె ఇష్టాన్ని కాదన్నది. అతనికి దూరంగా వుండమని హెచ్చరించింది. దూరంగా వుండాలని ఇల్లుదాటింది, ఊరుదాటింది. కానీ అతను తనహృదయంలోనే వున్నాడే. తన హృదయంలోంచి తాను నిష్క్ర మించటమెట్లా అన్నది సమస్య. లోకానికి హృదయాలతో పనిలేదు కనుక ఇది సమస్యకాదు. కానీ ఈ నిర్లక్ష్యాలకు, ఈ విధి నిషేధాలకు రాపిడి పడీపడీ మనసు లోలోపలే కాలిపోయిననప్పుడు వస్తుంది లోకానికి ప్రమాదం. మనసుకాలిన మనుషులు కారణాలేవైనా కావచ్చు ప్రేమకావచ్చు, ఆకలి కావచ్చు, మరేదైనా కావచ్చు. మనసుకాలిన మనుషులు తిరగబడతారు. తుపాకులు

కాలుస్తారు. తపాకీ కాల్పులు కవిత ఈ ప్రమాదాన్ని సూచనప్రాయంగా తెలియచేస్తుంది.

తనను తాను తెలుసుకొనే క్రమంలో స్త్రీ తనకొక శరీరం వుందని గుర్తిస్తుంది. మనిషి వునికికి బాహిర రూపం శరీరం తాను వుండటం అంటే శరీరంతో వుండటమనే అర్థం. అయితే అస్తితకు ఆధారభూతమైన శరీరపు ఉనికి విషయంలో స్త్రీలను చాలాకాలంగా గుడ్డివాళ్ళుగా, అజ్ఞానులుగా చేయటం జరిగింది. శరీరాలు లేనివాళ్ళుగానో, శరీరం అనుభవ కేంద్రమన్న జ్ఞానమే లేనివాళ్ళుగానో స్త్రీలు జీవితాలు గడిపేస్తున్నారు. అందువల్ల స్త్రీలంతా బండరాళ్ళుగా పడివున్న అహల్యలే. ఆ బండరాళ్ళల్లో చలనం, చైతన్యం ప్రారంభం అవుతున్న ఆధునిక స్త్రీవాద యుగంలో ఈ కొత్త ఆలోచనా విధానానికి ప్రాతినిథ్యం వహించగలిగిన కవితగా రేవతీదేవి *శిలాలోలిత* వ్రాసింది. "వాన చినకు రాలినా, ఎండ పొడ తగిలినా / చిరుగాలి వీచినా / పరిమళం సోకినా / మమతలా, కరుణలా, మనిషిలా ద్రవిస్తుంది" అని ఏ శిల గురించి రేవతీదేవి చెప్పిందో అది నాతి శిల. "ఈ నిరీంద్రియ శిల చైతన్య శిలై / ఈ రాతి శిల నాతి శిలై" అన్న మాటలు ఈ కవితలో కీలకమైనవి – ముందువెనుకలుగా చెప్పిన విషయాల గురించి భావనకు ఉపకరిస్తాయి. ఇంద్రియాలు లేని వాళ్ళుగా, చైతన్యం రాళ్ళుగా వున్న స్త్రీలు అనురాగంతో స్పందించగల స్త్రీలుగా రూపాంతరం చెందుతున్న దృశ్యాన్ని కళ్ళకు కట్టిస్తుంది. *శిలాలోలిత* అన్న ఈ చిన్న కవిత.

కల్పిత జడత్వాన్ని వదిలించుకొని స్త్రీలు శరీరస్పృహ పొందితే కలిగే అత్యున్నతమైన ఆనందానుభవాన్ని చెప్పిన కవిత అనురాగ దగ్ధసమాధి. *శిలాలోలిత* ఈ కవితల పుస్తకంలో మొదటి కవిత అయితే *అనురాగ దగ్ధసమాధి* చివరి కవిత. జడత్వం నుండి చైతన్యానికి స్త్రీ పరివర్తనను ఆ కవిత చూపితే ఆ చైతన్యం యొక్క విశ్వరూప ప్రదర్శన ఈ కవిత. ఈ కవితలు ఆద్యంతాలలో వుండి స్త్రీ అస్తిత్వ విశిష్టతను ఈ సంపుటికి ప్రధాన సూత్రంగా చేశాయి. *అనురాగ దగ్ధసమాధి* పురుషుడి ఆకర్షణలో పడి అతని సాన్నిహిత్యాన్ని సంపర్కాన్ని కోరుకొనే స్త్రీ శారీరక సంస్పందనకు, మనోచాంచల్యాలకు, అనుభూతి సాంద్రతకు అభివ్యక్త రూపం. స్త్రీపురుష ఆకర్షణ, పరస్పర మోహం జగల్లీలా కేళిలో భాగమని, అనాదికాలాలనుండి వస్తున్న సహజాతమని స్థాపించటంతో ప్రారంభమవుతుంది ఈ కవిత. స్త్రీలపట్ల పురుషుడి అనురాగం, పురుషుడి పట్ల స్త్రీ అనురాగం సమస్థాయిలో వుంటూనే మోహవాంఛ, కాంక్షా తీవ్రత అంతా స్త్రీ వైపు నుండి అభివ్యక్తం కావటం ఈ కవితలో ప్రత్యేకత. అతను తనకిష్టం తను అతనికి ఇష్టం. అతని ఇష్టమంతా అతని కళ్లలో కనబడుతుంది. తాను ఆ కళ్ళ అనురాగ నీలిమలో కరిగి లీనమైపోవాలన్నది ఆకాంక్ష. ఆమె కాంక్షా పరితృప్తికి పతాకస్థాయి.

ఈ కవితలో స్త్రీకి శరీర స్పృహ వుంది. శరీరం అనుభవం ద్వారమని కూడా తెలుసు. అందువల్లనే తన వాంఛా పరితృప్త మార్గాల గురించి ఉద్వేగంతో చెప్తుంది. స్పర్శను, ముద్దును, కౌగలింతను దాటి సంభోగం వరకు స్త్రీపురుష సంబంధం ఎంత భావుక సంబంధమో అంచలంచలుగా ఈ కవిత నిరూపించింది. అదే సమయంలో ఇద్దరిని ఒక్కటిగా చేయగల ఆ సంబంధాన్ని అద్వైతానుభవంగా మోక్ష స్థాయికి తెచ్చి నిలపటం కూడా జరిగింది. శృంగారాన్ని స్త్రీ పురుష సంబంధాన్ని రహస్యం చేసి దాని చుట్టూ మాయను సృష్టించిన పితృస్వామిక సంస్కృతి పరమోద్దేశం స్త్రీలను అదుపులో పెట్టటం. పునరుత్పత్తి మాతృకలయిన స్త్రీలకు తమ పునరుత్పత్తి శక్తి గురించిన స్పృహలేకుండానో, వున్నా అది దోషమనుకొని లోలోపల అణచుకొని అదుపు చేసుకొనేట్టుగానో శిక్షణ ఇచ్చే క్రమంలో కామం తుచ్ఛమైనదిగా ప్రచారం చేయబడింది. ఈ సంప్రదాయ భావనను తిప్పికొట్టి దాని నొక సహజ స్నేహ సాహచర్య సౌందర్య చర్యా ప్రతిచర్యగా రూపుకట్టించి నిలపటం ఈ కవితలోని విశిష్టత.

"స్త్రీకి కూడా శరీరం ఉంది; దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడుంది; దానికి విజ్ఞానం ఇవ్వాలి, ఆమెకు హృదయం ఉంది; దానికి అనుభవం ఇవ్వాలి" అని 1930లో చలం చెప్పిన మాటల సారాన్ని దాదాపు యాభయిఏళ్ళకు స్త్రీల జీవిత వాస్తవ ఆకాంక్షగా, ఆచరణగా నిరూపించటమే కాదు, ఆ క్రమంలో స్త్రీలు ఎదుర్కొనే ఒత్తిడులను, స్త్రీల చైతన్యంలో జరిగే మార్పులను తన సమస్త స్త్రీత్వ శక్తి తెలిసి ప్రవర్తించగల కొత్త స్త్రీల జాడలను చూపుతాయి రేవతీదేవి ఈ కవితలు.

III

వ్యక్తిగానైనా స్త్రీగానయినా రేవతీదేవి తన కవితలలో కనబరిచిన అస్తిత్వవేదన పాతను గతానుగతికత్వాన్ని తిరస్కరించటంగా, తనను తాను తెలుసుకొనటంగా, తనను

తాను వ్యక్తీకరించుకొనటంగా తనను తాను ఒక స్వతంత్ర బాధ్యత కలిగిన మనిషిగా నిర్మించుకొనటంగా, ఆ స్వేచ్ఛనుండి స్వతంత్రత నుండి సత్య శివ సుందరాత్మకమైన సంబంధాన్ని సాటి మనిషితో ఏర్పరచుకొనటంగా రకరకాల ఛాయలతో ప్రకాశించింది. తాను స్త్రీ, తనకు హృదయం వుంది. దానిని గుర్తించి విలువ ఇయ్యని సమాజం మీద కోపం వుంది. ఆ కోపానికి గుర్తుగా హృదయాన్ని ఎన్నటికి రగలని చితిగా అలా వుంచింది. నిమిష మాత్రపు నీటిబుడగ జీవితాన్ని చిదిమితే ఏం అన్న నిస్పృహకు లోనయింది. తనను తనగా మిగలనీయని వ్యక్తుల శక్తుల సిద్ధాంతాలను నుండి తనను తానే రక్షించుకోవాలన్న స్థిర సంకల్పానికీ వచ్చింది. తన మనసుకు నచ్చిన మనసున్న మరొక మనిషితో సంబంధాన్ని కోరుకొన్నది. లోకం ఏర్పరచిన హద్దులు చూచి ఆక్రోశించింది. అధిగమించి అనుకొన్నది సాధించింది. తాను అతను ఒకరిలో ఒకరైన తాము ఈ లోకమంతా విస్తరించారు. *శిలాలోలిత* కవితలు ఇక్కడికే పరిమితం కావు. తనకోసం తాను నిలబడుతూనే తనకు ఆనందాన్ని, సంతృప్తిని కలిగించే ప్రపంచం కోసం ఆలోచించటం కూడా రేవతీదేవి కవితలలో ప్రముఖంగా కనబడుతుంది.

తానూ అందులో ఒక భాగమై నివసిస్తున్న సమాజాన్ని లోపలినుండి బయటనుండి పరిశీలిస్తూనే వుంది రేవతీదేవి. జనన మరణాలు, హత్యలు ఆత్మహత్యలు, ప్రేమలు, నిఘూలు, ఆకలి, ఆందోళనలు, శరీరబేరాలు నిర్వీరామంగా నడిచిపోవటాన్ని చూచింది (నిర్వీరామం) నిజాయితీతో సంబంధం లేకుండా సాగిపోయే వ్యాపారాలను, వ్యూహాలను, చదువులను, ఉద్యోగాలను, అనుబంధాలను, సంసారాలను అసహ్యించుకొన్నది. నిజాయితీ వాస్తవంలో లేకుండా నటనలో వుంటాన్ని గురించి బాధపడింది (నటించగల ప్రాణి) వ్యక్తి ఆకలి సమస్యను తీర్చని ప్రభుత్వ ప్రణాళికలను, సంస్కరణ సర్వోదయాలను, విప్లవ సిద్ధాంతాలను, ఓట్ల రాజకీయాలను నిరసించింది. ఇవేవీ ఆకలిగొన్న వ్యక్తిని వల్లకాడుకు పోకుండా ఆపలేకపోతున్నాయని ఆకలిచావుల గురించి ఆందోళన పడింది. (వల్లకాడనలేదు) వర్తమానంలో యంత్రంలాగానో గానుగెద్దులాగానో బ్రతకటమే తప్ప భవిష్యత్తుకోసం కలలు కనలేని, భవిష్యత్తును ఆవాహన చేయలేని, భవిష్యత్తును నిర్మించే మార్గంలో నడవలేని జడజాతిని ఏవగించుకొన్నది (నిద్రపోతుజాతి). డబ్బు ప్రధాన విలువగా మానవజీవితాన్ని, సంబంధాలను నిర్దేశించటాన్ని చివరకు మనిషినే అభావం చేయటాన్ని భరించ లేక పోయింది. ధనస్వామ్యం చాస్తున్న వికృత కోరలను గురించిన సమకాలీన చైతన్యం నుండి రేవతీదేవి డబ్బుదాహం, పంజరమై మనుషులను బంధించటాన్ని గమనించింది కనుకనే పంజరం విరగ్గొట్టండి అని పిలుపునిచ్చింది (డబ్బు పంజరం).

తాను నివసిస్తున్న సమాజానికి వున్న వర్గలక్షణాన్ని, లింగలక్షణాన్ని రేవతీదేవి సరిగానే గుర్తించింది. "యింత / తిండీ బట్టా కొంపా / అందరికీ ప్రతి ఒక్కరికీ / చాలు" నన్న చైతన్యం ఆమెది. అందుకే ఆమె డబ్బు సంచయనేచ్ఛను తిరస్కరించాలన్నది. (డబ్బుపంజరం) ఆ సంచయనేచ్ఛ తీవ్రతరం అవుతున్నది కనుకనే, డబ్బంతా ఒకవైపున పోగుపడుతూ పేదరికం మరొకవైపున కేంద్రీకృతమవుతున్నది. కొత్తగా పుట్టిన శిశువును, ఏ అవయవాలూ పుష్టిగా లేని శిశువును ఈ పేదరికానికి ప్రతినిధిగా చేసి రేవతీదేవి ఉక్కు శిశువు కవిత వ్రాసింది. పేదరికంలో పుట్టిన శిశువు ఆకలి శిశువు. బొమికల శిశువు. దళితజాతి శిశువు. అగ్రవర్ణ ఆభిజాత్యాన్ని, అగ్రవర్ణ అహంకారాన్ని ఏకకాలంలో ఎదుర్కొన వలసిన శిశువు ఇది బిచ్చమెత్తుకొని తిండీ బట్టా సంపాదించుకొనవలసిన శిశువు. అగ్రవర్ణాల వారి చేతిపరికరంగానో, ఆటబొమ్మగానో జీవించాల్సిన విధివ్రాత వాళ్ళది. దీనిని ప్రశ్నించకుండా ఆమోదించి భరించటానికి కర్మసిద్ధాంత బోధ తరతరాలుగా జరుగుతున్నది. ఆ బోధల సారం! నరనరాన జీర్ణించుకునే పుట్టింది ఈ శిశువు. ఈ శిశువు కోసం, ఇలాంటి అనేకానేక శిశువుల కోసం రేవతీదేవి అనుభవించిన దుఃఖ తీవ్రత ఈ కవితలో వుంది.

ఈ శిశువు అజ్ఞానాన్ని, భయాన్ని వదిలి అందరితో పాటు అన్నిటిమీదా తనకూ హక్కువుందని విప్లవించాలన్నది కవయిత్రి ఆకాంక్ష. "తన్నులకీ గుద్దులకీ పోట్లకీ / రాటుతేలి ఈ మట్టి శిశువు / రేపటి ఉక్కుశిశువు / ఊపిరిపీల్చే ఉక్కు శిశువు అవుతుందన్నది ఆశ. "మనిషి మనిషిగా బ్రతకటానికి / కావాల్సినవన్నీ అందరికీ సమకూర్చే / సామాజిక వ్యవస్థ కోసం" పని చేసే ఉక్కు శిశువుల సేనకు ఆహ్వానం పలికింది విప్లవాకాంక్షతోనే.

నక్సల్‌బరిఘటన తరువాత శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటంగా ప్రారంభమై తన ఈ కవితల రచనాకాలానికి ఉత్తర తెలంగాణా జిల్లాలకు విస్తరించి వేరూనుకొంటున్న

ఆంధ్రదేశ విప్లవోద్యమాన్ని అర్థం చేసుకోకుండా, దాని ప్రభావానికి లోనుకాకుండా *ఉక్కుశిశువు* వంటి కవిత వ్రాయటం సాధ్యం కాదు.

ఏడవకు ఏడవకు పేద పురుగూ
ఏడవకు ఏడవకు బొమికల గూడూ
నీకు ఆకలేస్తే కన్నీళ్ళిచ్చారు
నీకు ఆవేదనొస్తే నిట్టూర్పిచ్చారు
నీకు కోపమొస్తే చెరసాలిచ్చారు
తిండిలేని మందుల్లేని
పోషణలేని రక్షణలేని
నీ బానిస జన్మ తరించగా
అదొక చక్రం కింద పడి నలిగి
విముక్తమవటానికి

శ్వాసపీల్చు" – వంటి చరణాలు కూడా ఆ ప్రభావాలు లేకుండా రాలేవు. పేదరికం వర్గసమాజ లక్షణమే కాదు వర్ణసమాజ ఫలితం అని స్పష్టం చేయటం, హిందూ వర్ణవ్యవస్థ పెంచి పోషించిన కర్మసిద్ధాంతాన్ని బద్దలు కొట్టకుండా వర్ణాన్నే కాదు, వర్గాన్నికూడా లేకుండా చేయటం సాధ్యంకాదని గ్రహించటం, పేదలకు వ్యతిరేకంగా పనిచేసే రాజ్యస్వభావాన్ని బయట పెట్టటం *ఉక్కుశిశువు* కవితకు శాస్త్రీయ సైద్ధాంతిక భూమికను సమకూర్చిన అంశాలు.

నీతిని, న్యాయాన్ని, అవకాశాలను స్త్రీకి ఒక రకంగా పురుషుడికి ఒకరకంగా వర్తింపచేసే ద్వంద్వప్రమాణాల సమాజవైఖరిని కూడా రేవతీదేవి గుర్తించింది. అది పితృస్వామిక సమాజవైఖరి అన్న అవగాహన ఆమెకు వున్నది. మగకీ, ఆడకీ శీలాన్నీ ఆస్తినీ సమంగా వర్తింప చేయక లైంగికత మీద ఆస్తుల మీద వ్యక్తి ఆధిపత్యాన్ని స్థిరపరిచిన దాని పరిణామ ఫలితమే స్త్రీల మీద పురుషులకు ఆధిపత్యా నిచ్చిన పితృస్వామ్యం. పెళ్ళికాని తల్లులను, (దూరం) మరో బేరం కోసం దీపస్తంభం నీడలో వెదుకులాడే (నిర్వీరామం) స్త్రీలను ఈ పితృస్వామ్య సమాజం సృష్టిస్తుందని రేవతీదేవికి తెలుసు. సంపదల సృష్టికర్త, సౌందర్యాల ఆవిష్కర్త, సామర్థ్యాల ఆటపట్టు అంతిమంగా నాగరికతా సంస్కృతుల నిర్మాత అయిన స్త్రీ తన శక్తులన్నిటిని పురుషుడికిచ్చి చివరకు తానేమీ లేనిదానిగా మిగిలిపోయి పురుషుడికి లోకువగా బ్రతకాల్సివస్తున్నదని మాతృస్వామ్య సమాజం పితృస్వామ్య సమాజంగా మారిన చరిత్రక్రమం నిరూపించింది. ఈ చరిత్రసారాన్ని *స్త్రీ* అన్న చిన్న కవితలో ఇమిడించి చూపింది రేవతీదేవి.

పేదలకోసం, దళితులకోసం, స్త్రీలకోసం, శిశువులకోసం, ఆరాటం రేవతీదేవి కవితలకు ఉద్వేగాన్ని, ఆవేశాన్ని ఇచ్చింది. అయితే స్త్రీగా స్త్రీల మనస్సుకు సంబంధించిన భావాలను, శరీరానికి సంబంధించిన అనుభవాలను అనుభూతి సాంద్రతతో చిత్రించగలిగిన రేవతీదేవి స్త్రీని పురుషుడి చేతి ఆటబొమ్మగా మారుస్తున్న పితృస్వామ్యాన్ని ఎదుర్కొనటానికి తయారవుతున్న ఉద్యమ నమూనాలను తన కవిత్వంలో గుర్తించి చెప్పలేదు. కానీ పేదల దళితుల విముక్తికి విప్లవోద్యమం సరియైన నమూనా అని దానిని స్వీకరించి *ఉక్కుశిశువు* కవితలో దానికి మద్దతు ప్రకటించింది. వ్యక్తిని ఎదగనీయని, స్వేచ్ఛగా బ్రతకనీయని అభివృద్ధి నిరోధక వ్యవస్థలను, శక్తులను, భావాలను ధిక్కరించటం అస్తిత్వకోణం నుండి ప్రారంభమైనా ప్రత్యేక సమూహాలుగా, జాతులుగా, వర్గాలుగా మనుషులు కోల్పోతున్న అవకాశాలు హక్కులకోసం నిలబడే సామాజికార్థిక రాజకీయ ఉద్యమాల వైపు ప్రస్థానంగా అది కొనసాగటం సహజ పరిణామం. రేవతీదేవి కవితా ప్రస్థానాలలో ఈ అన్ని దశలు వున్నాయి.

IV

ప్రపంచం ద్వంద్వాత్మకం. జడత్వం, చేతనత్వం; మౌనం, శబ్దం; వెచ్చదనం, చల్లదనం; జీవితం, మృత్యువు; ఓటమి, గెలుపు; తీపి, చేదు; బాధ, హాయి; లేకపోవటం, ఉండటం; దేహం, ఆత్మ; నేను, నువ్వు; స్త్రీలు, పురుషులు; పేదలు, ధనికులు; – ఇట్లా ఎన్నెన్నో ద్వంద్వాలు లోకంలో ఉన్నాయి. ద్వంద్వాలలో ఒకదాని వునికి మరొకదాని సంబంధంలోనే వుంటుంది. ఏ ఒకదానినో ఆమోదించటం మరొక దానిని తిరస్కరించటం అందుకే సాధ్యం కాదు. విరుద్ధాంశాలుగా కనబడే ఈ ద్వంద్వాల మధ్య అన్యోన్యాశ్రయలక్షణంతో పాటు సంఘర్షణ కూడా వుంటుంది. ఆ సంఘర్షణ ఐక్యతకు దారి తీస్తుంది. అయితే ద్వంద్వాల మధ్య ఐక్యత కొన్ని పరిస్థితులలోనే సాధ్యం. అందుకే అది సాపేక్షం, నియతం, తాత్కాలికం. సంఘర్షణ నిత్యం. నిరతరం. ఐక్యత సంఘర్షణా కలిసే ద్వంద్వాల గతికి కారణభూతమవుతుంటాయి. ఈ తాత్త్విక అవగాహన రేవతీ దేవి కవితలను ప్రాణభూతమైన అంశం. ఉన్మాద ప్రకృతి దూరం, దేహాత్మ వంటి కవితలను గమనిస్తే ఈ విషయం అర్థమవుతుంది.

నీళ్ళు అసలే లేకపోవటం కరువు నీళ్ళు అధికాధికం

కావటం ఉప్పెన. ఈ రెండు విరుద్ధ స్థితులు ప్రకృతి పరిణామంలో భాగాలే. ఒకటి ఎండల ఫలితం, రెండవది ఎడతెగని వర్షాలు, వరదల ఫలితం. ఈ ప్రకృతి వైరుధ్యాలను పక్కపక్కనే చిత్రించిన కవిత *ఉన్మాద ప్రకృతి*. దగ్గర, దూరం ఇవి ద్వంద్వాలు. వేరు వేరు సామాజిక మానసిక స్థితిగతులు ప్రభావంతో వేరు వేరు సందర్భాలలో మనుషుల మధ్య సంబంధాలు, స్నేహాలు ఈ ద్వంద్వాల మధ్య ఎలా చలిస్తుంటాయో *దూరం* కవితలో చిత్రించబడింది. ద్వంద్వాలలో ఏ ఒకటి మరొకదాని సంబంధంలో కాకుండా విడిగా మనలేవని శరీరానికి ఆత్మకు వున్న సహ సంబంధాన్ని నిరూపిస్తూ చెప్పిన కవిత దేహాత్మ. ద్వంద్వాల స్వభావాన్ని సంబంధాన్ని మానవ సంబంధాల ప్రాతిపదిక మీద అర్థం చేసుకోవటానికి రేవతీదేవి చూపిన శ్రద్ధాశక్తులకు నిదర్శనాలీ కవితలు. అయితే ద్వంద్వాల మధ్య వైరుధ్యం, ఐక్యత, ఘర్షణ పరిణామాలు తెలిసినా వాటికి అతీతమైన స్థితిని వాంఛించటం రేవతీదేవి దృక్పథంలోని వైచిత్రి. రెండు మనసులు, ఇద్దరు మనుషులు ఒక్క మనసుగా ఒక్క మనిషిగా మారటం ఆమె ఆదర్శం. ఆరకంగా ఆమె అద్వైతవాది.

భిన్న మానసికావస్థలు, భిన్న భావోద్వేగాలు ప్రతిఫలించే రేవతీదేవి కవితలు పాఠకులను విస్తృత భావనా ప్రపంచంలోకి ప్రవేశపెడతాయి. ఉత్సాహం, దిగ్భ్రాంతి, దిగులు, తపన (*ఓటమిలోని గెలుపు, ఆశాగ్నిరేణువు,* మొ॥). చిరాకు, అసహనం (*దేవుడూ, వల్లకాడవలేదు* మొ॥). క్రోధం, ద్వేషం, ఉద్వేగం (*సినీవైతన్యం, నటించగల ప్రాణి, ఉక్కుశిశువు* మొ॥) ప్రకృతి సౌందర్యానికి ప్రేమ సంబంధాలకు సంచలించే ఉద్విగ్నత, ఆకాంక్ష, లాలస, తన్మయత్వం (*జననం, మహోల్లాసం, అనురాగ దగ్ధసమాధి* మొ॥) మొదలైన అనేక భావోద్వేగాల వర్ణచిత్రంగా భాసిస్తుంది. *శిలాలోలిత* కవితా సంపుటి.

చిన్న మాటలు, సాధారణ వాక్యాలు, వాక్యాంశాల సహాయంతో శక్తిమంతమైన భావోద్వేగాలను వ్యక్తం చేయటం ఈ కవితలలో ప్రముఖంగా కనిపిస్తుంది. మనసుందని తెలియనప్పుడు, తెలుస్తున్నప్పుడు, తెలిశాక ఈ మూడు దశలలోను మనసు స్థితి ఎలా వుందో సూక్ష్మస్థాయి నుండి ప్రదర్శించటానికి *దారి* కవితలో ఆమె వాడినవన్నీ చిన్న చిన్న మాటలే. ఒకటి రెండు పదాలనే ముందువెనుకలుగా ప్రయోగిస్తూ ఊనికను మారుస్తూ అనుభూతి గాఢతను పాఠకులకు అందచేయటం అనేక చోట్ల ఈ కవితలలో కనబడుతుంది.

"ఈ బాధ తియ్యగా, ఈ తీపి బాధగా, ఈ తీపి చేదుగా, ఈ చేదు తీపిగా, ఈ బాధ హాయిగా, ఈ హాయి బాధగా" వంటి ప్రయోగాలను ఎన్నిటినైనా చూడవచ్చు. శారీరక మానసిక గాఢానుభవాన్ని, అనుభూతిని వ్యక్తీకరించటానికి దీర్ఘ సమాసాలను వాడిన సందర్భం *అనురాగ దగ్ధసమాధి* కవితలో మాత్రమే కనబడుతుంది. ఉన్మాద ప్రకృతిలో ఆకాశాన్ని, సూర్యుణ్ణి రెండు భిన్న సందర్భాలలో వర్ణించిన విధానం రేవతీదేవి ప్రకృతి పరిశీలనాశక్తికి భావుకతకు, భావుకతలోని దేశీయతకు నిదర్శనం. నీటి కరువు కాలాన ఆకాశం 'వేడికి ఒంగిన ఇనపపెనం' అయితే సూర్యుడు మైనం ముద్దలా కరిగి వుడికినవాడు. ఎడతెగని వరద వానల కాలాన ఆకాశం 'నూనెలో ఊరిన నీలం కంబళి' అయితే సూర్యుడు పిండిముద్దలా తడిసి చీకి పోయినవాడు. ఈ వర్ణనలు, ప్రకృతిలోని భీభత్స తీవ్రతను చెప్పటానికి తగిన తూకంలో వున్నాయి. అంతే కాదు స్త్రీలు తాము కవిత్వం చెప్పటానికి పూనుకొన్న కొత్త సందర్భాల నుండి కొత్త ఉపమానాలను తమ అనుభవం నుండి ఎట్లా సృష్టించుకొంటున్నారో కూడా ఈ వర్ణనలు చెప్తాయి. కవిత్వం స్త్రీల కవిత్వంగా ఒక ప్రత్యేక అభివ్యక్తిని సంతరించు కొనటానికి రేవతీదేవి ఒక ప్రారంభం.

ఇంత జ్ఞానం, ఇంత భావం, ఇంత అభివ్యక్తి వున్న రేవతీదేవి బ్రతికే వుంటే ఇంకెంత కవిత్వం వ్రాసేదో...! కానీ ఆమె లేదు. *శిలాలోలితే* మనకిప్పుడు మిగిలింది.

కాత్యాయనీ విద్మహే
(కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత)
కాకతీయ విశ్వవిద్యాలయం, ఓరుగల్లు.
ఫోన్ : 9440550379

తాళపత్రాలు – శాసనాలు

– వి. గోపాల్

పరిష్కరణ :

పరిష్కరణ అనేది కావ్యాంశానికి, కావ్య పరిశోధనకు సంబంధించినది. ఇందులో ప్రధానంగా మూడు విషయాల గురించి ఆలోచించవలసి ఉంటుంది. మొదటగా ఛందస్సు యతిప్రాసలు, రెండవది అక్షర పరిజ్ఞానం. మూడవది వ్యాకరణ ప్రవేశం. కాబట్టి పరిష్కర్తకు ఛందశ్శాస్త్రంలో మంచి ప్రవేశం ఉండి, నేటి లిపికి నాటి తాళపత్రంలోని అక్షరాలకు భేదం తెలిసి, తాళపత్ర లేఖన పద్ధతిలో పరిచయం ఉండి, మంచి సమగ్రావగాహన కలిగి ఉండాలి.

తాళపత్రాలను చదవడమనేది అభ్యాసమున్న వారికే సాధ్యం. పత్రాలలో పద్యాలు ఛందస్సును బట్టి విడదీసి లేకుండా పద్యాలు ఒకే వరుసలో ఉంటాయి. కాబట్టి పత్రాల నుండి ఒక చిత్తు ప్రతిని తయారు చేయాలంటే మొట్టమొదట ఛందస్సు తెలుసుకొని వృత్తాలను వేరుచేసి ప్రాస సహాయంతో పద్యాలుగా వ్రాసుకొని, ఎక్కడికక్కడ పద్యాల పేర్లను ప్రసిద్ధమైన సంకేతాక్షరాలతో వ్రాసుకొని, పద్య సంఖ్యను నిర్దేశించుకొని, కాగితపు ప్రతిలో ఒకవైపు మాత్రమే వ్రాసుకొని, పద్యాలుగా వ్రాసుకొనేటప్పుడు అప్పటి అక్షర సంకేతాలను గుర్తుపెట్టుకొని నేటి లిపి సంకేతంలో వ్రాసుకోవాలి.

అక్షర పరిజ్ఞానంలో సంప్రదాయాలు ప్రధానంగా క్రింద పేర్కొనే పద్ధతిలో వుంటుంది.

ప్రాచీన పద్ధతి	నేటిపద్ధతి
పూర్ణబిందువు మీద	నేటి వ్రాతలో ద్విత్వం
హల్లులకు ద్విత్వము	వుండదు
అంక్కితము	అంకితము
అంబ్బోధి	అంబోధి
విందు	విందు

ద్రుతమునకు స్థిరములు పరమగునపుడు పూర్ణబిందువు

ఈక్షించం లోపల	ఈక్షించె ఁ లోపల
ముఖికిం సుఖికిం	ముఖిని ఁ సుఖికి ఁ
కౌస్తుంభ మణి	కౌస్తుభమణి
ముంన్న	మున్న

అర్ధబిందువు స్థానమున పూర్ణబిందువు

పోంక	పో(క
గాంగ	గా(గ

పూర్ణబిందువు మీద హల్లులలో ఉచ్చారణానుసారము మార్పు

నృశింహ్వా	నృసింహ
సంహ్వారణ	సంహరణ

ఐచ్ఛిక ద్రుత ప్రాప్తి

యివ్విధంబ్బునయిష్ట దేవతా	యివ్విధంబుననిష్టదేవతా
అనుచు కృత నిశ్చయిడై	అనుచుఁగృత నిశ్చయుడై

కృత హ్రస్వము మీది హల్లునకు ద్విత్వము

వర్ణనియ్య	వర్ణనీయ
జేగియ్య	జేగీయ

శ ష స వర్ణముల మార్పు

విందుచేశి	విందు చేసి
రంగశీమ	రంగసీమ
పషిడి	పసిడి

ఖఘుల విపర్యయము

నఘురుచి	నఖరుచి
పార్వతీశాఘర్వ	పర్వతాశాఖర్వ

ఫ భ ల మార్పు

భణీంద్రుడు	ఫణీంద్రుడు
భణి	ఫణి

ఉచ్చారణ ప్రధానం లేఖన విశేషములు అంటే ఉచ్చరించే విధానాన్ని బట్టి ఆనాటి లేఖన విధానం వుండేదనడానికి కొన్ని ఉదాహరణలు.

చెతుర	చతుర

పరిమెళ	పరిమళ
సోష్టవము	సౌష్ఠవము
చిన్న శౌరి	చెన్నశౌరి
వైస్యులు	వైశ్యులు

ఇవన్నికాక పలప గిలక అనే లిపి సంకేతమానాడు విరివిగ వాడుకలో వుండేది.

సంయుక్త వర్ణాలు వచ్చే సందర్భంలో రెండవ వర్ణాన్ని వాడి దాని ప్రక్క రెండు గీట్లున్న నకారపొల్లు వంటిది వాడేవారు.

వన ᵕ	వర్ణ
కన ᵕ ము	కర్ణము
కేత్తి ᵕ	కీర్తి

లేఖనదోషాలు మరికొన్ని దొర్లుతుంటాయి. లేఖకుని అజాగ్రత్త వల్ల కలిగే దోషాలు, లేఖకుడు తాను రాసిన ప్రతిని మళ్లీ చూడడం ఉండదు. కాబట్టి మొదటి సారి రాసిన ప్రతినే జాగ్రత్త చేస్తుంటాడు.

ఉన్నరూపం	**ఉండవలని రూపం**
ఇసృష్టి	ఈసృష్టి
ఎశ్వర్య	ఐశ్వర్య
శయనికులు	సైనికులు

తాళపత్రాలను కూర్చేటప్పుడు తప్పుగ పెట్టి కూర్చడంవల్ల క్రమభంగాలు కలుగుతాయి. కనుక వాటిని గుర్తించి సర చేసుకోవాలి.

ఆనాటి లిపి సాంప్రదాయాన్ని అనుసరించి రాసినవాటిని దోషాలుగ ఎంచలేము. అది నాటి లిపి వైఖరి. కొన్ని పదాలు సమాసాలు నిఘంటువుల కెక్కినంత మాత్రాన మనకు పరిచయం లేనంత మాత్రాన వాటిని దోషాలుగా అసాధువులుగా లెక్కించలేము. ఇటువంటి వాటిని సరిచేసుకున్న తర్వాత మొదట శుద్ధప్రతిని తయారుచేయాలి. ఆ తర్వాత కావ్యంలో కనిపించే వ్యాకరణ దోషాలను గణ భంగాలను యతిప్రాసల దోషాలను సరిచేసి సవరించు కోవాలి. సవరణకు కుదరని సందర్భాలను వేరుగ గుర్తించాలి. సామాసాలలో వ్యాకరణ సమ్మతంకాని రచనలను గుర్తించాలి. కొన్ని సమయాలలో ఒక ప్రతిని రెండు మూడు తాళపత్ర ప్రతులు లేదా వ్రాత ప్రతులు ఉండవచ్చు. అన్ని ప్రతులలోనూ ఒకే విధమైన పాఠముండదు. ఇటువంటి సందర్భాలలో పాఠం బోధించే రచలను వేరుగ రాసుకొని సరియైన పాఠాన్ని నిర్ణయించవలసి ఉంటుంది.

సామాన్యంగా అన్ని తాళపత్ర ప్రతులలోను కనుపించే అలాక్షణికాంశాలు కొన్ని పదాది యకారపుకారాల ప్రయోగం : యివ్విధంబునం జూపట్టదు, వుద్యత్ప్రతాప నిర్జిత యీదృశ్య మొదలగునవి వాక్యవసానంలో ద్రుతం మీద వున్న స్వరానికి లోపం లేకుండా వాడడం నన్ను బిలిచి యిట్లని పలికెను. పురాణము తొలకింపమను, ఉచ్చారణను బట్టి దంత్య చకార ప్రయోగం నిర్దేశించబడుతుంది. నిచ్చలు అనే దంత్య చకారాన్ని నిత్సలు అని వ్రాసేవారు. నేడు ప్రయోగంలో లేనికొన్ని పదాలు కనిపించవచ్చు. అని నిఘంటువులలో కనిపించవు. అన్నమాచార్యుల వారి పదాలలో ఇటువంటివి కోకొల్లలు. వోకలవులును, బిమిలి పెండ్లి వంటివి. ఈ విధంగ పరిశీలించినప్పుడు తాళపత్ర ప్రతులలోని దోషాలను నిర్ణయించడం సులభ సాధ్యంకాదు.

తాళపత్ర ప్రతులను సావధానంగ పరిశీలించి నశించిన భాగాలున్నట్లయితే వాటిని సందర్భోచితంగ పూరించి సాధు పాఠ నిర్ణయం చేయాలి. భావాస్వయం ఉన్నప్పటికి కావ్యాలలో ప్రసిద్ధిగ ప్రయోగించే పాఠాన్నే గ్రహించవలసి ఉంటుంది. పెక్కు కాలంబున అనడం కంటే పెద్ద కాలంబున అనేదే ప్రసిద్ధిలో ఉన్న ప్రయోగం. ఈ పాఠాన్నే ప్రయోగించాలి. కావ్యంలో కనిపించే విశేషాంశాలను ప్రత్యేకించి వేరుగ వివరించాలి. తెలుగు భాషలో బు, క్ష, జ్ఞ వర్ణం అనేవి విలక్షణ వర్ణాలు. కాబట్టి వీటి ఉచ్చారణ వైవిధ్యాన్ని గుర్తించాలంటే పద్యాలలో వీటికున్న యతి ప్రాసల ప్రయోగాన్ని గమనించాలి.

మనకు కావ్యాలలో పరిచయం కాని కొత్త పదాలను వేరుగ సేకరించి సందర్భాన్ని బట్టి వాటికున్న అర్థాలను నిర్దేశించాలి. పద్య రచనయందు వాక్య నిర్మాణం ఛందో లక్షణాన్ని బట్టి కర్త, కర్మ క్రియల వినిమయం జరుగుతుంది. కాని కొన్ని సందర్భాలలో ఒక లింగానికి బదులు వేరొక లింగ ప్రయోగం ఉంటుంది. ఎలకౌను మందకేసరి సన్నిభమే అనే పాఠంలో భిన్న లింగ ప్రయోగమున్నది. ఎలకౌను మదకేసరి సన్నిభయే అన సరిచేసి ప్రయోగించాలి. ఒక విభక్తికి మరొక విభక్తిని వాడటం అనేది కావ్యాలలో తరచు కనిపిస్తుంది.

భాషకు మరొక ప్రత్యేకమైన పరిణామక్రమం వున్నది. దీనిని అర్థ విపరిణామంగా పేర్కొన్నారు. అప్పటి భాషా ప్రయోగంలో వున్న అర్థం మార్పుచెంది నేడు మరొక

అర్థంలో వాడబడుతుంది. ఎదురించు అంటే ధిక్కరించు అనే భావం కాబట్టి తాళపత్ర ప్రతులను సరిచూచి పాత నిర్ణయాలు చేయటం ఒక ఎత్తు. అందులోని విశేష ప్రయోగాలను గుర్తించి వ్రాసుకోవడం మరొకయెత్తు. తాళపత్ర ప్రతులలోని అక్షరాలు పొందికగ ఉండవు. కిక్కిరి బిక్కిరిగ, గొలుసుకట్టు వ్రాతలుగ వుంటాయి. వాటిని సరిచేసుకొని చదువుకోవాలి.

శాసనాలు :

తెలుగు సాహిత్యంలో ఇప్పటి వరకు లభించిన వాటిలో మొదటి కావ్యం, క్రీ.శ. 11వ శతాబ్దం నాటి, నన్నయ రాసిన భారతం. అయితే అంతకుమునుపే తెలుగు భాష ఉంది అని చెప్పడానికి ఆధారాలైతే ఉన్నాయిగాని గ్రంథాలు లేవు. ప్రధానంగా అప్పటికే ఉన్న సంస్కృత, ప్రాకృత శాసనాలలో, గ్రంథాలలో, తమిళ, బౌద్ధ వాఙ్మయాలలో తెలుగు వారి గురంచి, భాష గురించి చర్చ కనిపిస్తుంది. ప్రధానంగా సంస్కృత, ప్రాకృత శాసనాలు ఆధారం. ఇందులో వ్యక్తుల పేర్లు, ఊళ్ళ పేర్లు, తెలుగు పదాలుగాక, తెలుగులోనే ఉన్న శిలాశాసనాలు, తామ్రశాసనాలు ముఖ్య ఆధారాలు.

శాతవాహనులు నిర్మించిన అమరావతీ స్తూపంలో ఒక రాతి పలక మీద లభ్యమైన 'నాగబు' అనే మాట మనకు లభించిన మొదటి తెలుగు మాట. 'నాగబు' అనే పదంలో 'నాగ' సంస్కృతం కాగా 'బు' తెలుగు ప్రత్యయం.

తెలుగు శాసనాలు :

ఇవి రెండు విధాలు. 1. వచన శాసనాలు 2. పద్య శాసనాలు. 'వచన శాసనాలు' ఆనాడు రేనాటి చోళుల పాలనలో ఉన్న కడప మండలంలో కన్నడ లిపిలో మొదటి శాసనాలు లభ్యమయ్యాయి. 12వ శతాబ్ది తరువాత కన్నడ లిపి నుంచి తెలుగు లిపి వేరు పడింది. *'పద్య శాసనాలు'* క్రీ.శ. 9వ శతాబ్దంలో లభ్యమయ్యాయి. క్రీ.శ.848లో పండరంగడు వేయించిన *అద్దంకి శాసనంలోని తరువోజ పద్యం* మొదటి *పద్య శాసనం.* ఆ తరువాత గుణగ విజయాదిత్యుని *కందుకూరి శాసనం,* (క్రీ.శ.850), చాళుక్య భీముని *ధర్మవరం శాసనం,* (క్రీ.శ. 848) *సీసపద్యం* లభ్యమైంది.

యుద్ధమల్లుని *బెజవాడ శాసనం* (క్రీ.శ. 885) లో మధ్యాక్కర *ఛందస్సులో శాసనాలు, గంగాధర శాసనం* (క్రీ.శ. 10వ శతాబ్ది) లో *కందపద్యాలు,* గుణగ విజయాధిత్యుని *సాతలూరి శాసనం* (క్రీ.శ. 848) సంస్కృతంలో చంపకమాల ఛందస్సులో, పొన్నకవి (క్రీ.శ. 953) రాసిన *ఆదిపురాణంలో* మత్తేభంతో మూడు పద్యాలు, విరియాల కామాసాని *గూడురు శాసనం* (క్రీ.శ. 1005)లో మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలు లభించాయి.

ఎరికల్ముత్తురాజు ఎర్రగుడిపాడు శాసనం :

ఇది క్రీ.శ. 574లో కడపజిల్లా, కమలాపురం తాలూకా ఎర్రగుడిపాడులో లభించింది.

స్వస్తిశ్రీ ఎరికల్ముత్తు రాజుల్ల కుణ్ణికాళ్ళు నివబుకాను ఇచ్చిన సన్నస

దుజయ రాజుల ముత్తురాజులు నవప్రియ ముత్తురాజులు వల్లవదు కరజులు శిక్షకాను ఇచ్చి (న) పన్నస్స కొట్టంబునపాఱకు కుణ్ణికాళ్ళళా ఇచ్చిన పన్నస ఇరువదియాది నాల్కుమఱుస్తున్నేల.

ధనంజయుని కాలమళ్ళ శాసనం :

ఇది క్రీ.శ. 575, కడపజిల్లా కమలాపురం తాలూకా కలమళ్ళలో లభించింది.

"కాజు...వాక్యం అసంపూర్ణం... మళ్ళీ తరువాత పంచమహాపాతకుడవుతాడని, ఈ ధర్మాన్ని చెడగొట్టే వారికి పాపం కలుగుతుందని" ఉంది.

పుణ్యకుమారుని తిప్పలూరి శాసనం :

ఈ శాసనం క్రీ.శ. 630, కడప జిల్లా కమలాపురం తాలూకా తిప్పలూరిలో లభించింది. ఇది చోళమహారాజు ఎరికల్ ముతురాజు వేయించిన శాసనం.

"స్వస్తిశ్రీ ఎరికల్ల ముతురాజు పుణ్యకుమారున్కు, గణ్యమాను స్టుమరున్ పిడుకుమద ముది తన్కుత్త మోత్తమున్టబున వాన్కు చిప్ప ౯ లియ పటుకాను రేనాణ్డేళు చు తక్క ౯ పుతోల పారదాయకి ఱెవురు కత్తి శమ్మ ౯ కు తిప్ప ౯ లూర పనాశ కొణ్ణకాత్తి ౯ య చేకు బిదియ సోమవారంబు పుణరు పుష్యంబు బృహస్పతహోర (కా)ను ఏమ్బురి యె చామణకాలధ.

వేల్పుచెర్ల శాసనం :

జమ్మలమడుగు తాలూకా వేల్పుచర్లలో 7-8వ శతాబ్దిలో లభించింది. ఇందులో అయితణ్ణ అనే అంపాల వ్రేంగు తాను చేసిన ధర్మాన్ని కాపాడడంకోసం తనకు

విధేయులైన కాలూరు కొందర్ని సాక్షులుగా నియోగించినట్లుంది.

కొండపర్తి శాసనం :

వరంగల్లు సమీపంలో కొండపర్తి అనే గ్రామం చెరువు వద్ద ఒక కొండరాతిపైన సుమారు 9వ శతాబ్దం నాటి శాసనం ఉంది.

"స్వస్తి/పొలమెయరట్టోడి మంచికాళు కొడ్డెపకు సమభగంబు తలంబుల స్రవంబు చేసిన భూమి/ దీని గూస్తుకుస్తుల వరుదివడ్డి యారంభ చేయువారు.

ఇంకా ఇలాంటివి అనేక శాసనాలున్నాయి. బూదరాజు రాధాకృష్ణ 1971లో ప్రాచీనాంధ్ర శాసనాలు అనే పరిశోధనా గ్రంథంలో క్రీ.శ. 2వ శతాబ్దం నుండి క్రీ.శ. 1100 వరకు లభ్యమైన అనేక శాసనప్రతులని తయారు చేశారు.

శాసనాలు పరిశీలిస్తే ఆనాడు గ్రామాల పేర్ల చివర ఊరు, కుదురు, కొన్న, కోడు, చెఱువు, తొఱె, పర, పల్లు, పాక, మంచి, ముడి, రేవు, వట్టిలాంటి తెలుగు మాటలు వుండేవని అలాగే శాసనాలలో వేప, రావి, రేగు, తాడి మొదలైన చెట్ల పేర్లు కనిపిస్తాయి.

తొమ్మిదో శతాబ్ది (క్రీ. శ. 848) మొదలు పదకొండో శతాబ్ది పూర్వార్ధం వరకు శాసనాలలో తరువోజ, సీసం, ఆటవెలది, తేటగీతి, మధ్యక్కర, కందం, చంపకమాల, ఉత్పలమాల, మత్తేభం, రగడ, ప్రాజ్ఞన్నయ యుగంలో ఉన్న ఛందస్సులు, తరువోజ, సీసం, ఆటవెలది, మధ్యక్కర, కందం, రగడ దేశీయ ఛందస్సులు కాగా చంపకమాల, ఉత్పలమాల, మత్తేభం సంస్కృత ఛందస్సులు. ఇవన్నీ శాసనాలలో లభ్యమైనవి. ఇవి ప్రభువుల దానాలు, వీరుల పరాక్రమాలు తెలిపేవి మాత్రమే కాబట్టి వీటిలో చెప్పుకో దగినంత భావానంద ప్రదాయకమైన కవిత్వం లేకపోవడం సహజం.

లేఖన పద్ధతులు – లేఖన దోషాలు :

రేఫమీది హల్లును ద్విరుక్తం చేయటం (తూవ్వుర్న, కాత్తిర్‌య్యు), అనుస్వారం మీది పరుషాలను ద్విత్వం చేసే ఆచారం (అంక్క, గుంట్ట) 9, 10 శతాబ్దాల నుంచి కనిపిస్తోంది.

శాసనభాషలో శిల్పి కృతదోషాలు (అగ్ని (=అగ్ఙ), తణ్ఙి (=తాఙ్ఙి), భాషామూలక దోషాలు (ఎడ్లకు (=ఎడ్లకు), వేవుగ్గ ఁ విలాళు (=వేయిగ విళాలు), ఉచ్చారణా సూచికాలు గోత్త (=గోత్ర), తళ్చి (=తల్చి), పాఠక కృతదోషాలు బంగోడు (=బంగొడు), ఉతరయాన (=ఉత్తరాయన) మొదలైనవి అనేకం వున్నాయి.

ముగింపు :

తాళపత్రాలు మరియు శాసనాలను పరిశీలించినప్పుడు మనకు ఆనాటి సాంఘిక చరిత్ర, సంస్కృతి, భాషా చరిత్ర, లిపి మొదలయిన విషయాలను గూర్చి తెలుస్తుంది. వీటి ద్వారా రాజులు, వాగ్గేయకారులు, కవులు మొదలయిన వారు తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషిని గూర్చి తెలుసుకొనవచ్చును. మన దేశచరిత్ర, భాషా చరిత్ర, సంస్కృతులను గూర్చి తెలిపే తాళపత్రాలను, శాసనాలను మనందరం కలిసి కాపాడే అవసరం ఎంతో ఉంది.

డా॥ వి. గోపాల్
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

"ప్రేమ తొంగి చూడటమేమిటయ్యా? పెళ్ళికానిదే ఎలా చూస్తుంది? అవన్నీ దొంగచూపులే కదా! అసలు ఒకడు వెళ్ళి ఇంకొక అమ్మాయిని ప్రేమించటమేమిటీ? వాళ్ళ మనసులు కలవవచ్చు. అంతమాత్రాన అది ప్రేమ అవుతుందా? చస్తే కాదు! ప్రేమ సంసారంతోటే ప్రారంభమవుతుంది. ముందు భర్త మీద ప్రేమ. తరువాత పిల్లల మీద ప్రేమ. పిల్లలకు తల్లిదండ్రుల మీద ప్రేమ - ఇలా పందిళ్ళలా అల్లుకుపోతాయి ప్రేమలు." ఇది తెలుసుకాని వేరొక ప్రేమ నాకు తెలియదు. నేను వ్రాయను.

– మునిమాణిక్యం నరసింహారావు.

భగవద్గీతలో బౌద్ధం

– భదంత ఆనంద కౌసల్యాయన్

నిస్సందేహంగా హిందూ వాఙ్మయంలో భగవద్గీత, చిన్నదే అయినా ఒక అద్భుత రచన. ఏనాడైనా హిందూ మతానికి సంబంధించిన వేదాలు మొదలైన సమస్త వాఙ్మయం అంతరించిపోయి ఒక్క భగవద్గీత మాత్రమే మిగిలిపోయినా, ఈ ఒక్క భగవద్గీతే బుద్ధుని తర్వాతి కాలంనాటి హిందూమత స్వరూపాన్ని స్పష్ట పరచేందుకు ఒక దర్పణంలాగా ఉపకరించగలుగుతుంది.

ఇంత పెద్ద యోగ్యతాపత్రం ఇవ్వడానికి భగవద్గీతలో ఉన్న విశేషతలు ఏమిటి? అని ఎవరైనా అడగవచ్చు. అందుకు "గీతలో లేనిది ఏమిటి?" అని నా సమాధానం. అందులో ఈశ్వరవాదం ఉంది, నిరీశ్వరవాదం ఉంది, శాశ్వత జీవవాదం ఉంది, అశాశ్వత జీవవాదం ఉంది, దేహాత్మవాదం ఉంది, ఇంద్రియాత్మవాదం ఉంది, మనో ఆత్మవాదం ఉంది, శ్రాద్ధం ఉంది, తర్పణం ఉంది, వర్ణాశ్రమ ధర్మం ఉంది, యతి ధర్మం ఉంది, గృహస్థాశ్రమం ఉంది, రాజధర్మం ఉంది, జ్ఞానం ఉంది, భక్తి ఉంది, యోగం ఉంది, వైరాగ్యం ఉంది, భోజన-నివాసాల రీతులున్నాయి, గురు-శిష్యుల వ్యవహార పద్ధతి ఉంది, హింస ఉంది, అహింస ఉంది, స్వర్గం ఉంది, నరకం ఉంది, మోక్షం ఉంది, పాపం ఉంది, పుణ్యం ఉంది, కర్తవ్యం ఉంది, అకర్తవ్యం ఉంది. ఎవరికీ అభ్యంతరకరంగా తోచకపోతే అది పూర్తిగా ఒక పెద్ద కలగూర గంపే అని చెప్పవచ్చు.

బుద్ధభగవానుని ధర్మంలోని గుణగణాల గురించి చెప్పినప్పుడు ఇలా చెబుతారు- (1) స్వాక్ఖాతో భాగవతా ధమ్మో (ఈ ధర్మం భగవానుని ద్వారా చక్కగా వివరించబడింది), (2) సందిట్ఠికో (ఇది ఇహలోకానికి సంబంధించింది), (3) అకాలికో (ఇది కాల బంధం నుంచి విముక్తి పొందింది), (4) ఎహి పస్సికో (దీని విషయంలో 'రండి, స్వయంగా పరీక్షించి చూసుకొండి అని చెప్పవచ్చు'), (5) ఓపనహికో (ఇది నిర్వాణం వైపుకు తీసుకుపోతుంది), (6) పచ్చత్తం వేదత్తబ్బో విఞ్ఞూహితి (విజ్ఞుడైన ప్రతి మనిషి దీన్ని స్వయంగా సాక్షాత్కరింప చేసుకోగలుగుతాడు.)

ఇక్కడ కేవలం బౌద్ధధర్మ లక్షణాలను చెప్పడమేకాక, ఏ ధర్మాన్నైనా పరీక్షించి చూడడానికి ఒక నిఖార్సయిన గీటురాయిని తెలపడం జరిగిందని నా అభిప్రాయం. ఏ ధర్మమైనా నిష్పత్తిలో ఈ గీటురాయి పైన ఎంత స్వచ్ఛమైందిగా తేలుతుందో దాన్ని అంతే నిష్పత్తిలో స్వచ్ఛత కలదిగానో లేక స్వచ్ఛత లేనిదిగానో భావించాలి.

భగవద్గీత సిద్ధాంత పక్షాన్ని గురించి చర్చించే ముందు దాని చారిత్రక పక్షమే మన ముందుకు వస్తుంది. గీత మహాభారతంలో ఒక భాగం కావడం వల్ల కూడా సాధారణ హిందువు మహాభారతం ఎంత చారిత్రకమో గీత కూడా అంతే చారిత్రకమని భావిస్తాడు. గాంధీజీ దృష్టిలో గీతలోని శ్రీకృష్ణుడుకూడా ఒక ప్రతీక, ఒక రూపకం మాత్రమే. ఇక అందులోని అర్జునుడు కూడా అంతకు మించి మరేమీ కాదు.

భగవద్గీత చారిత్రకతకు సంబంధించిన ఈ ప్రశ్న ప్రధానమైంది కాదని నా అభిప్రాయం. ఏ కథైనా, ఏ నాటకమైనా, ఏ నవలైనా అందులోని పాత్రలు చారిత్రకమైనవి కావడం, కాకపోవడం కారణంగా దాని ప్రభావశక్తి ఎక్కువా కాదు, తక్కువా కాదు. భగవద్గీతలో ఏ పాత్రలూ లేవు, ఏ కథా లేదు. ఉన్నదంతా శ్రీకృష్ణునికి అర్జునునికి మధ్య జరిగిన సంవాదం మాత్రమే.

ఈ సంవాదమంతా యుద్ధభూమిలో జరిగినట్లు చెప్పబడుతూంది. ధర్మక్షేత్రమనే ఏదో కురుక్షేత్రంలో శ్రీకృష్ణునికి, అర్జునునికి మధ్య కొంత సంవాదం జరిగి ఉండడం, తర్వాత ఈ వృత్తాంతాన్నే తీసుకొని ఎవరో గీతాకారుడు ఈ భగవద్గీతను రచించి ఉండడం అసంభవం మాత్రం కాదు. అలాకాక పద్దెనిమిది అధ్యాయాల్లో, ఏడువందలకు మించి శ్లోకాలున్న మొత్తం భగవద్గీత వాచనం యుద్ధభూమిలో జరిగి ఉంటుందనే నమ్మకం మాత్రం ఏనాడూ భగవద్గీత పారాయణం చేసి ఎరుగని వారి మనసులో మాత్రమే నిలిచి ఉండ గలుగుతుంది.

అందువల్ల గీతలోని శ్రీకృష్ణుడు, అర్జునుడు అజ్ఞాతుడైన ఎవరో గీతాచార్యుని మానసపుత్రులే అయినా కూడా మనం

వారిని చారిత్రక పురుషులుగానే భావించి వారి సంవాదాన్ని సమీక్షించాల్సి ఉంటుంది. ఒక చలన చిత్రాన్ని చూసేప్పుడు అందులోని పాత్రలన్నీ ఎవరో కథారచయిత మెదడులో నుంచి పుట్టినవే అని ఎల్లప్పుడూ ఆలోచిస్తూ ఉంటే చలన చిత్రం చూసే ఆనందమంతా మటుమాయమై పోతుంది కదా!

భగవద్గీత ఏ ఉపోద్ఘాతమూ లేకుండా అసలుసిసలైన నాటక ఫక్కీలో ఆరంభమవుతుంది. ఏ దర్శకున్నైనా, పాఠకున్నైనా ఒక్కసారి తుళ్ళిపడేట్లుచేసే ప్రకటన వినడానికిగానీ, చదవడానికిగానీ ఆరంభంలోనే ఉంది.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।
మామకాః పాణ్డవాశ్చైవ కిమకుర్వత సంజయః ॥ (1-1)

(ధృతరాష్ట్రుడిలా అన్నాడు: ఓ సంజయా! యుద్ధసన్నద్ధులై ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలోకి వచ్చి చేరిన నా కుమారులు, పాండురాజు కుమారులు ఏమి చేశారు?)

సంజయుడు యుద్ధభూమిని వర్ణిస్తాడు. ఇరుపక్షాల యుద్ధవీరుల పేర్లు వినిపిస్తాడు. ఆ తర్వాత రెండు సైన్యాల మధ్యకు రథం తీసుకెళ్ళమని అర్జునుడు శ్రీకృష్ణునితో చేసిన విన్నపాన్ని తెలుపుతాడు. శ్రీకృష్ణుడు అర్జునుని రథాన్ని రెండు సైన్యాల మధ్యకు తీసుకెళ్ళి నిలుపుతాడు. అక్కడ అర్జునుడు చూసిందేమిటి? అర్జునుడు అక్కడ తన పితామహులను, తన తండ్రి సోదరులను, ఆచార్యులను, మేనమామలను, సోదరులను, పుత్రులను, మనవళ్ళను, మామలను, మిత్రులను, ఆప్తులను చూస్తాడు. వీరినందరిని చూసి అర్జునుని మనసులో మానవ సహజమైన, అర్జునునిలాంటి వ్యక్తికి తగిన ప్రతిక్రియ కలుగుతుంది. అతడు ఇలా అంటాడు.

దృష్ట్వేమం స్వజనం కృష్ణ! యుయుత్సుం సముపస్థితమ్ ॥ (1-28)
సీదన్తి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥ (1-29)

(ఓ కృష్ణా! యుద్ధం చేసేందుకు నా ముందు నిలిచియున్న నా మిత్రులను, బంధువులను చూచి నా శరీరావయవాలు పట్టుతప్పు తున్నాయి. నోరు ఎండి పోతూంది. నా శరీరం కంపిస్తూంది. ఒడలు పులక బారుతూంది.)

ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే వీరుడైన అర్జునుడు యుద్ధానికి భయపడడం లేదు. అతనికి ఎలాంటి 'వ్యామోహం' కలగలేదు. అతడు స్పష్టంగానే అంటున్నాడు– 'యుద్ధం చేయడానికి ఎదుట నిలిచిన నా బంధు మిత్రాదులను చూసి' నా శరీరాంగాలు పట్టుతప్పున్నాయి...' అని.

అతడు తన బంధుమిత్రులను ఇలా వర్ణించాడు.

ఆచార్యాః పితరః పుత్రాస్తథైవ చ పితామహాః ।
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధినస్తథా ॥ (1-34)

(ఆచార్యులున్నారు, మిత్రులున్నారు, పుత్రులున్నారు, పితామహులున్నారు, మామలున్నారు, మేనమామలున్నారు, మనవలున్నారు, బావమరుదులున్నారు. ఇతర బంధువులు వున్నారు.) తర్వాత వారిని గురించి ఇలా అన్నాడు.

ఏతాన్న హన్తు మిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన ।
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥ (1-35)

(అందువల్ల ఓ మధుసూదనా! వీళ్ళు నన్ను చంపినా సరే, త్రైలోక రాజ్యాధిపత్యం కోసం కూడా వీరిని నేను చంపలేను. ఇక భూలోక రాజ్యంకోసం ఎలా చంపగలను?)

ధృతరాష్ట్రుని కుమారులు అర్జునునిపట్ల, ఇతర పాండవులపట్ల చూపని దుష్ప్రవర్తన ఏముంది? చేయకుండా వదలిపెట్టిన అన్యాయం ఏముంది? వాళ్ళద్వారా పాండవులు పడని అవమానాలేమున్నాయి? అయినా అర్జునుడు ధన్యుడు! ఇలా అన్నాడు.

తస్మాన్నార్హా వయం హన్తుం ధార్తరాష్ట్రాన్ స్వబాన్ధవాన్ ।
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥ (1-37)

(అందుచేత ఓ మాధవా! బంధుమిత్రాదులను చంపడం మాకు తగని పని. వీరందరిని చంపి మేము సుఖంగా ఎలా ఉండగలుగుతాము?)

అర్జునునికి ఇక్కడ కనిపిస్తున్నవివి.

1. మిత్రద్రోహ రూపంలో ఉన్న పాపం.
2. కులక్షయంవల్ల కలిగే దోషం.
3. యుద్ధంలో పురుషులు మృతి చెందిన తర్వాత స్త్రీలు దూషితలైపోతారు. దాని పరిణామంగా వర్ణసాంకర్యం కలుగుతుంది, అనే భయం.
4. పితరులకు పిండదానం లభించదు.
5. నరకవాసం అనుభవించవలసి ఉంటుంది.

ఇన్నిరకాల హానినుంచి తప్పించుకొనేందుకు వీరుడైన అర్జునుడు నిజమైన ఒక సత్యాగ్రహిలాగా ఇలా అంటాడు.

యది మామప్రతీకారమశస్త్రం శస్త్రపాణయః ।
ధార్తరాష్ట్రా రణే హన్యు స్తన్మే క్షేమతరం భవేత్ ॥ (1-46)

(ఒకవేళ శస్త్రధారులైన ధృతరాష్ట్రుని పుత్రులు ప్రతీకారం చేయనివాడుగాను, నిరాయుధుడుగాను ఉన్న నన్ను రథంలో చంపేస్తే అది కూడా నాకు క్షేమకరమే అవుతుంది.)

ఆ తర్వాత సంజయుడిలా అన్నాడు.

ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥ (1-47)

(ఇలా అని శోక విహ్వలుడైన అర్జునుడు ధనుర్బాణాలు వదిలిపెట్టి యుద్ధభూమిలో రథం వెనుక భాగంలో కూర్చుండిపోయాడు.)

గీత మొదటి అధ్యాయం ఇక్కడే పూర్తి అవుతుంది. ఇది ఏ నాటకంలోనైనా పరదా దించేయడానికి తగిన సమయమని ఎవరైనా అంగీకరించక తప్పదు.

నిజానికి గీతలోని 'జ్ఞానం' మొదలయ్యేది రెండవ అధ్యాయం నుంచే. ఈ 'జ్ఞానా'న్ని రెండు భాగాలుగా విభజించవచ్చు.

1. అర్జునున్ని 'యుద్ధోన్ముఖునిగా' చేయడంతో నేరుగా సంబంధం ఉన్న 'జ్ఞానం.'
2. అర్జునుడు యుద్ధం చేయడానికి, చేయకుండా ఉండడానికి ఎలాంటి సంబంధం లేని జ్ఞానం. నేటి గీతలోని అతి పెద్ద భాగం ఇదే.

ఈ జ్ఞానం యొక్క మొదటి భాగాన్ని అర్జునుడు యుద్ధం చేయడానికి విరుద్ధంగా లేవనెత్తిన అభ్యంతరాలకు శ్రీకృష్ణుడు నిజంగా సంతృప్తికరమైన సమాధానం చెప్పాడా, లేదా అనే దృష్టితో మాత్రమే మనం సమీక్షించవలసి ఉంటుంది.

ఇక 'జ్ఞానం'యొక్క రెండవ భాగాన్ని అందుకు భిన్నమైన దృష్టితో సమీక్షించవలసి ఉంటుంది. అంటే, ఈ 'జ్ఞానం' బుద్ధిసంగతంగా ఉందా? ఈ 'జ్ఞానం' మానవ సమాజానికి, సర్వ ప్రాణులకు కళ్యాణకరమైందేనా? అనే దృష్టితో సమీక్షించవలసి ఉంటుంది.

మొదటి భాగాన్నే మొదట తీసుకుందాం. అర్జునుడు యుద్ధం చేయడానికి విరుద్ధంగా లేవనెత్తిన అభ్యంతరాలను శ్రీకృష్ణుడు ఎంతవరకు సంతృప్తికరంగా నివారించాడు? అనేది ప్రశ్న. ఇక్కడ 'ప్రశ్న బియ్యమైతే, జవాబు శనగలు' అనే సామెతలోలాగా జరగలేదుకదా, అనేది మనం చూడాలి.

అన్నిటికంటే ముందు శ్రీకృష్ణుడు అర్జునునికి మానసికమైన ఒక కుదుపు ఇచ్చాడు.

కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్టమస్వర్గ్యమకీర్తికరమర్జున ॥ (2-2)

(ఓ అర్జునా! ఈ విషమ పరిస్థితిలో నీలో ఈ అజ్ఞానం ఎక్కడినుంచి పుట్టుకొచ్చింది? ఇది అనార్యులకు మాత్రమే తగింది, స్వర్గమార్గానికి అంతరాయం కలిగించేది. అపకీర్తిని తెచ్చేది.)

అర్జునుని సందేహాలకు ఇక్కడ ఏ సమాధానమూ లేదని స్పష్టంగా తెలుస్తూంది. అందువల్లనే అర్జునుడు తన మాటను మరోసారి వినిపిస్తాడు.

కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన॥ (2-4)

(ఓ మధుసూదనా! నేను భీష్మ పితామహునిపైకి, ద్రోణాచార్యునిపైకి బాణాలు ఎలా ప్రయోగించగలను? ఓ అరిసూదనా! వారిద్దరు నాకు పూజ్యులు.) అర్జునుడు ఇంకా ఇలా అన్నాడు.

(1) ఈ గురుజనులను చంపి కూడా నేను రక్తసిక్తమైన భోగాలనే అనుభవించవలసి ఉంటుంది. అందువల్ల లోకంలో బిచ్చమెత్తుకొని బ్రతకవలసివచ్చినా సరే, మహానుభావులైన నా గురుజనులను చంపకుండా ఉండడమే నాకు శ్రేయస్కరం.

తర్వాత ఈ మాటకూడా అంటాడు.

(2) మనకు ఏది శ్రేష్ఠమైందో, అదికూడా మనకు తెలియదు. కౌరవులను జయించడం శ్రేష్ఠమా లేక కౌరవుల ద్వారా జయించబడడం శ్రేష్ఠమా? ఇక యుద్ధంలో మనం వాళ్ళను జయిస్తామా లేక వాళ్ళే మనలను జయిస్తారా? అనేదికూడా మనకు తెలియదు. ఎవరిని చంపి మేము జీవించి ఉండలేమో, అట్టి దుర్యోధనాదులు మా ఎదుట యుద్ధానికి నిలిచి ఉన్నారు.

అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునున్ని సమాధాన పరచడానికి మొట్టమొదట అతన్ని ఎగతాళి చేస్తాడు.

అశోచ్యానన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతాసూనగతాసూంశ్చ నానుశోచన్తి పణ్డితాః ॥ (2-11)

(ఓ అర్జునా! పండితునిలాంటి మాట మాట్లాడుతూ కూడా నీవు ఏ విషయం గురించైతే దుఃఖించకూడదో, ఆ విషయాన్ని గురించి దుఃఖిస్తున్నావు. పండితులు జీవించి ఉన్నవారిని గురించిగానీ, గతించిన వారిని గురించిగానీ చింతించరు.)

అర్జునుడన్నమాట 'పండితుని లాంటి' మాట కాదు. అది 'పండితుని' మాటే. దాన్ని ఎగతాళి చేసినంతమాత్రాన్నే అది మరోవిధంగా మారిపోదు. జీవించి ఉన్నవారిని గురించిగానీ, గతించినవారిని గురించిగానీ చింతించకుండా ఉండడమే, అంటే ఇద్దరినీ సమానంగా భావించడమే పండితుని లక్షణమైతే శ్రీకృష్ణుడు అర్జునున్ని మాటిమాటికి

'యుద్ధస్వ' (యుద్ధం చెయ్యి) అనడం పూర్తిగా నిరర్థకమే అవుతుంది.

శ్రీ కృష్ణుని మరో సమాధానం.

నత్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనాధిపాః ।
న చైవ న భవిష్యామః సర్వే వయమతః పరమ్ ॥ (2-12)

(మునుపు నేను లేననిగాని, నీవు లేవనిగాని, ఈ రాజులు కూడా లేరనిగాని, నిశ్చయంగా చెప్పలేము. అలాగే ఈ తర్వాత మనమందరము ఉండమనికూడా చెప్పలేము.)

అంటే మనమంతా ఇంతకు మునుపు ఉండి ఉండనూ వచ్చు, లేకుండానూ ఉండవచ్చు. ఇకముందు కూడా మనం ఉండనూవచ్చు, ఉండకుండా పోనూ వచ్చు నన్నమాట! అలాంటప్పుడు అదీ జరిగే అవకాశం ఉండి, ఇదీ జరిగే అవకాశం ఉండి, ఏదీ నిశ్చయమే కానప్పుడు ఈ అనిశ్చయ వాద పునాది ఆధారంగా అర్జునుని ఏ సందేహానికైనా సమాధానం చెప్పడం ఎలా సాధ్యం? అని ఎవరైనా అడగవచ్చుకదా!

'ఇదీ సంభవమే, అదీ సంభవమే' అయినప్పుడు మరి అర్జునుడు చంపినా ఎవరూ చావకుండా ఉండడం కూడా సంభవం కాదా?

నిజానికి శ్రీకృష్ణుడు అర్జునునికి ఈ మాటే తెలియజెప్పడానికి ప్రయత్నించాడు–

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।
తథా దేహాన్తర ప్రాప్తిః ధీరస్తత్ర న ముహ్యతి ॥ (2-13)

(ఏ విధంగా ఈ దేహంలో కౌమార్యం తర్వాత యౌవనం, యౌవనం తర్వాత వృద్ధాప్యం వస్తాయో, అదేవిధంగా ఈ దేహంలో నివసించే 'దేహి'కి (జీవాత్మకు) దేహాంతరం (మరోదేహం) ప్రాప్తిస్తుంది. ధీరులైనవారు అట్టి మార్పుచేత మోహమునందురు.)

పాపం అర్జునునికి ఈ దేహంలో ఉండే 'దేహి' గురించిన చింత ఎక్కడుందని శ్రీకృష్ణుడు దాన్ని గురించి అర్జునునికి ఇంతగా వివరించి చెబుతున్నాడు?

శ్రీకృష్ణుని తర్వాతి తర్కం ఇలా ఉంది.

మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ! శీతోష్ణ సుఖ దుఃఖదాః ।
ఆగమాపాయినోఽనిత్యాం స్తాంస్తితిక్షస్వ భారత ! ॥ (2-14)

(ఇంద్రియాలకు వాటి విషయాలతో సంయోగం కలిగినప్పుడు శీతోష్ణాల అనుభవం, ఇతర అనేక విధాల సుఖదుఃఖాల అనుభవం కలుగుతుంది. ఈ సుఖదుఃఖాలు వస్తూ పోతూ ఉండేవే. అంటే అవి అనిత్యమైనవి. ఓ కౌంతేయా! ఓ అర్జునా! నీవు వీటిని సహించు.)

దీనికైనా అర్జునుడు యుద్ధం చేయడంతోగానీ మానడంతోగానీ ఏ సంబంధమూ లేదు. ఎందుచేతనంటే ఇక్కడ ప్రశ్న దుఃఖం సహించడానికిగానీ, సహించకుండా ఉండడానికిగానీ సంబంధించింది కానే కాదు. ఇక్కడ ఉన్నది ఇతరులను చంపడానికి లేదా చంపకుండా ఉండడానికి సంబంధించిన సంశయం.

ఆ తర్వాత శ్రీకృష్ణుడు ఇలా శెలవిచ్చాడు.

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టోన్తస్త్వనయోస్తత్త్వదర్శిభిః ॥ (2-16)

('అసత్తు'కు (భౌతిక శరీరానికి) ఉనికి లేదు. శాశ్వతమైన దానికి (ఆత్మకు) అస్తిత్వం లేకపోవడం అంటూ ఉండదు. తత్వదర్శులైనవారు ఈ రెండింటి తత్వాన్ని పూర్తిగా తెలుసుకున్నారు.)

ఇక్కడ శ్రీకృష్ణుడు ఈ ఆత్మవాద చింతనను మరోసారి చెప్పడంలో ఉన్న ప్రయోజనం అర్జునుడు శాశ్వతమైనదానికి (ఆత్మకు) అస్తిత్వం లేకుండా పోవడం అంటూ ఉండదు కాబట్టి చంపినా ఎవరూ చావరు, వారి అస్తిత్వం లేకుండా పోదు, అనేది అర్జునుడు తెలుసుకోవాలని.

చంపినా ఎవరూ చావకపోయినప్పుడు అర్జునుని సందేహం తీరడానికి బదులు అది మరింత బలపడుతుంది. చంపినా ఎవరూ చావకపోతే ఇక ఎవరినైనా చంపవలసిన పనేముంది? ఆ తర్వాత కూడా అదే తర్కం.

అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।
వినాశ మవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి ॥ (2-17)

(ఈ జగత్తంతా దేనితో పరివ్యాప్తమై ఉందో, అది అవినాశి అని నీవు తెలుసుకో. అవ్యయమైన (నాశము లేని) దీన్ని ఎవరు నశింప చేయలేరు.)

ఈ జగత్తంతా ఏదో ఒక అవినాశి అయిన, అవ్యయమైన తత్వంతో పరివ్యాప్తమై ఉన్నప్పుడు, అంటే ఒకే తత్వం అర్జునుని పక్షంలోనూ, అర్జునుని శత్రు పక్షంలోనూ ఉన్నప్పుడు ఒక 'అవినాశి'తో మరో 'అవినాశి'ని సంహరించమని చెప్పడం ఇక్కడ జరుగుతూందా? లేక ఆ అవినాశితోనే ఈ విధంగా 'ఆత్మహత్య' చేసుకోమని చెప్పడం జరుగుతూందా? ఈ రెండింటిలో ఏ అర్థమూ సమంజసంగా ఉందని చెప్పలేము.

ఇక శ్రీకృష్ణుడు చెప్పనే చెప్పాడు.

అన్తవన్త ఇమే దేహా నిత్యస్యోక్తాః శరీరిణః ।
అనాశినోఽ ప్రమేయస్య తస్మాత్ యుధ్యస్వ భారత ॥ (2-18)

(శాశ్వతమైనది, నాశము లేనిది, అప్రమేయమైనది (తెలుసుకోడానికి వీలుపడనిది) అయిన ఆ దేహి (జీవాత్మ)కున్న ఈ శరీరాలు మాత్రమే నశించిపోతాయి. కాబట్టి ఓ అర్జునా! యుద్ధం చెయ్యి.)

ఈ మాటవల్ల అర్జునున్ని అన్నిటికంటే ఎక్కువగా పీడిస్తున్న చింత అవినాశి అయిన 'జీవాత్మ' గురించేనని మనం భావించాలా? శ్రీకృష్ణుడు 'జీవాత్మ'కు నాశం లేదు కాబట్టి యుద్ధం చెయ్యి! అని చెప్పి అతన్ని సమాధాన పరుస్తున్నాడు.

నిజం చెప్పాలంటే శ్రీకృష్ణుని వద్ద ఈ ఒక్క మాటనే వేర్వేరు పదాల్లో, మాటిమాటికి చెప్పడానికి మించి వేరే తర్కం ఏదీ లేదు. ఈ క్రింది మరికొన్ని శ్లోకాలను చూడండి.

య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్ ।
ఉభౌ తౌ న విజానీతౌ నాయం హన్తి న హన్యతే ॥ (2-19)

(ఈ ఆత్మను చంపేదానిగా భావించేవాడు, చంపబడేదానిగా భావించేవాడు, ఇద్దరు అజ్ఞానులే. ఎందుచేతనంటే 'జీవాత్మ' ఎవరినీ చంపదు, ఎవరితోను చంపబడదు.)

న జాయతే మ్రియతే వా కదాచిన్నాయం
భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్యః శాశ్వతోఽ యం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥ (2-20)

(ఈ జీవాత్మకు ఎన్నడు జననంగానీ మరణంగానీ లేదు. గతంలో లేకుండానే కొత్తగా గోచరించునది కాదు. అది జన్మలేనిది, నిత్యమైనది, శాశ్వతమైనది, పురాతనమైనది, చంపబడే దేహంలో అది చంపబడదు.)

సామాన్య నియమమేమిటంటే, ఏ మాటైతే స్వయంగా అసిద్ధమో, దాన్ని మరో మాటను సత్యమైందిగా రుజువు చేయడానికి ఆధారంగా చేసుకోకూడదు. కానీ ఇక్కడ మాత్రం స్వయంగా అసిద్ధమైన మాటనే కాదు, దాన్ని సిద్ధమైందిగా భావిస్తే దానివల్ల స్వయంగా శ్రీకృష్ణుని పూర్వపక్షమే ఖండితమైపోయే మాటనే పూర్తి నిరాధారమైన ఒక మాటను సమర్థించడానికి ఉపయోగించడం జరుగుతూంది!

ఇక్కడ గుర్తుంచుకోదగిన విషయం ఒకటుంది. ఇంతవరకు శ్రీకృష్ణుని ఏ శ్లోకం ద్వారా అయినా అన్ని దేహాల్లో ఉండే ఈ అవినాశి 'ఆత్మ' ఒకటేనా లేక ఒక్కో దేహంలో ఒకటి వేర్వేరుగా ఉంటుందా? అనేది మనకు తెలియడం లేదు. ఈ ఒక్క శ్లోకం ఆత్మయొక్క 'నానాత్వా'న్ని ప్రతిపాదిస్తున్నట్లుగా తోస్తూంది.

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ ॥ (2-22)

(ఏ విధంగా మనిషి చినిగిన వస్త్రాలు వదలిపెట్టి కొత్త వస్త్రాలు ధరిస్తాడో, అదేవిధంగా దేహి (జీవాత్మ) పాత శరీరాలను వదలిపెట్టి కొత్త శరీరాలను స్వీకరిస్తుంది.)

వస్త్రాల ఉపమానంలో ఒకే వ్యక్తి అనేక వస్త్రాలు ధరిస్తాడు. కానీ ఎవరు కూడా ఒక్కరే ప్రపంచంలోని వస్త్రాలన్నీ ధరించలేడు. ఇప్పుడొక ప్రశ్న ఉదయిస్తుంది. ఒకే 'ఆత్మ' మొదటినుంచి నానా యోనుల నుంచి ఉత్పన్నమయ్యే అసంఖ్యామైన శరీరాలను వదలిపెడుతూ, స్వీకరిస్తూ వచ్చిందా, లేక నానా 'ఆత్మలు', నానా దేహాలు ఉన్నాయా? మరో ప్రశ్న కూడా ఇక్కడ తలెత్తుతూంది– ఈ ఆత్మల సంఖ్య, దేహాల సంఖ్య రెండు సమానంగా ఉంటాయా? అని. అంటే ఎన్ని ఆత్మలుంటే అన్నే దేహాలు ఉంటాయా? లేక అవి తక్కువ – ఎక్కువగా ఉంటాయా? అని. అవి రెండూ సమానంగా ఉంటాయని భావిస్తే ప్రతి సంవత్సరం పెరుగుతున్న జనసంఖ్యకు ఎలాంటి అర్థం చెప్పుకోవాలి? అలాకాక వాటి సంఖ్య తక్కువ–ఎక్కువ ఉంటుందని భావిస్తే అప్పుడు ఒకచోట తప్పనిసరిగా కొన్ని ఆత్మలకు ధరించడానికి దేహాలు దొరకకపోవడము, మరోచోట కొన్ని దేహాలు ఆత్మ లేకుండానే పడి ఉండడము జరుగుతుంది. ఇందులో ఏ మాట సత్యమైనా దీనిద్వారా శ్రీకృష్ణుడు మాటిమాటికి ఇచ్చే 'యుద్ధస్య' (యుద్ధం చెయ్యి) అనే ఆదేశానికి ఎలాంటి సమర్థన లభించదు. ఆ తర్వాతకూడా అదేమాట చెప్పడం జరిగింది..

నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ॥ (2-23)

(ఈ ఆత్మను ఆయుధం ఖండించలేదు, అగ్ని దహించలేదు, నీరు తడపలేదు, గాలి ఎండిపోయేట్లు చేయలేదు.)

ఇంకా వుంది...

హిందీనుంచి అనువాదం: జె. లక్ష్మిరెడ్డి
విశ్రాంత ఆచార్యులు, న్యూఢిల్లీ,
ఫోన్ : 9818431620

యంత్రానువాదం

– అద్దంకి శ్రీనివాస్

పరిచయం : అనువాద ప్రక్రియ సంకల్పితం. రెండు భాషల మధ్య భేదసాదృశ్యాలు, వ్యాకరణ నిర్మాణాలు, భాషాపరమైన స్థితిగతులూ బాగా తెలిసినప్పుడే అనువాదం సాధ్యం. అనువాదకుడి జ్ఞానశాతంపైనే అనువాదపు నాణ్యత ఆధారపడి ఉంటుంది. కానీ రెండు భాషలు తెలిసిన వాళ్ళు లేదా మాట్లాడ గలవారు ఉత్తమ అనువాదకులౌతారని చెప్పలేం. భాషల స్వరూప స్వభావాలూ, నిర్మాణాలు సమూలకంగా తెలిసి ఉండాలి. భాష ఎల్లల్ని దాటి విస్తరించేందుకు దోహదం చేస్తుంది. అనువాదానికి ఇదే మౌలికసూత్రం. అంటే భాషావ్యవస్థల నిర్మాణాల భేదసాదృశ్యాల అధ్యయనం, అవగాహన పరిశీలన అనే మౌలిక సూత్రమే – మానవేతర శక్తిని యుక్తిగా మార్చే యంత్రం ద్వారా అనువాదం సాధించవచ్చుననే ఆలోచనకి తెరతీసింది.

యంత్రానువాదం – నిర్వచనం : మానవబుద్ధికి సాధ్యమైన అనువాద ప్రక్రియను నిర్దిష్ట సూత్రనియమాల సహాయంతో, వ్యాకరణాధారంగా సాధించటం యంత్రానువాదం. భాషకు ఉండే సహజమైన మౌలిక లక్షణాలను అధ్యయనం చేసి భిన్న భాషల మధ్య విషయపరివర్తనాన్ని జరిగేలా చూడడం సహజ భాషాప్రకర్మలో (Natural Language Processing) (NLP) ఒక భాగం. అంతేకాదు యంత్రానువాదమే ఈ సహజ భాషా ప్రకర్మ అనువర్తనాలలో అత్యంత ముఖ్యమైనదీ, ప్రయోజనకరమైనదీనూ. ప్రపంచ వ్యాప్తంగా ఈ యంత్రానువాద విధానంలో అనేకరకాల పద్ధతులు వాడుకలో ఉన్నాయి. ముఖ్యంగా 1. ప్రత్యక్ష అనువాదాలు 2. అంతరభాషానువాదాలు 3. పరివర్తన ఆధారిత అనువాదాలు. వీటన్నిటితో పాటు సాంఖ్యిక భాషానిధి ఆధారిత పద్ధతుల సమ్మేళనాలూ ఉన్నాయి.

యంత్రానువాదం ఆరంభవికాసాలు : అనలు యంత్రానువాదం సాధ్యమేనా !! అన్నది ప్రశ్న! దీనికి సమాధానంగా సాధ్యమేనని నిరూపించే పరిశోధనలూ, కృషి మనకు అందుబాటులోకి వచ్చాయి.

హేతువులు : 1. రెండు భాషల మధ్య వ్యాకరణాత్మక సంబంధం ఉండటం. 2. మానవజీవనం, అనుభవం, ప్రకృతి భిన్నభాషావ్యవహర్తలందరికీ ఒక్కటే కావటం మొదలైనవి. ఈ ఆలోచనలే యంత్రానువాదం సాధ్యమేననే దిశగా పరిశోధనలు జరపడానికి ఆస్కారం ఏర్పరిచాయి. 1946లో వారన్ వీవర్, ఏ.జీ.బూత్ పరిశోధనలు ప్రారంభించారు. రెండవ ప్రపంచయుద్ధంలో శత్రువుల రహస్య లిపుల్ని ఛేదించడానికి యంత్రానువాదం తోడ్పడుతుందనీ, డిజిటల్ కంప్యూటర్ కోశానువాదం చేయగలదనీ విశ్వసించారు.

1948లో ఆర్.హెచ్ రిచెన్స్ పదప్రత్యయ విభాగం ద్వారా అనువాదం చేయవచ్చునన్నాడు. 1949 నుంచీ పాశ్చాత్యదేశాలలో కృషి ప్రారంభించి యంత్రానువాదం స్వాప్నిక భావన కాదని, వాస్తవసాధ్యమేననీ నిరూపించారు. భారతీయ భాషలలో యంత్రానువాద వ్యవస్థలు (Machine Translation) 1980 దశకంలోనే ప్రారంభం అయ్యాయి. ఇప్పుడిప్పుడే ఒక నిర్దిష్టరూపాన్ని సంతరించు కొంటున్నాయి. యంత్రానువాదం సైద్ధాంతిక విధానాల అనువర్తనంతోనే సాధ్యం. ఇందుకోసం...

1. పదవిశ్లేషణలనూ, పదజనకాలనూ, సాంఖ్యిక ద్విభాషానిఘంటువులనూ ఏర్పాటుచేసుకోవాలి. 2. కొన్ని అర్థ సందిగ్ధతలను తీర్చాలి. దీనినే Word Sense Disambiguation అంటారు. 3. వ్యాకరణాధారంగా భాషా పరివర్తన సూత్రాలను నిర్మించాలి.

యంత్రానువాద వ్యవస్థ – పరిచయం :

సహజభాషా ప్రకర్మ అనువర్తనాలలో (NLP Applications) యంత్రానువాద వ్యవస్థ అత్యంత ముఖ్యమైనది. ఈ వ్యవస్థను ఆధారంగా చేసుకొని సమాన ధర్మాలుకల భాషలమధ్యేకాదు విజాతిభాషల మధ్య కూడా యంత్రానువాద వ్యవస్థను, అందులోనూ పటిష్టమైన వ్యవస్థను సూత్రాల ఆధారంగా తయారుచేయవచ్చు.

ప్రధాన యంత్రానువాద వ్యవస్థలు : 1. ప్రత్యక్ష అనువాద వ్యవస్థ 2. అంతర భాషానువాద వ్యవస్థ 3. పరివర్తన ఆధారిత యంత్రానువాద వ్యవస్థ. ఇవేకాక మళ్ళీ వీటిలో సాంఖ్యిక (Statistical) భాషానిధిని (Carpus) ఆధారంగా చేసుకొన్న కొన్ని సమ్మేళన పద్ధతులూ వ్యవహారంలో ఉన్నాయి.

భారతీయ భాషలు – యంత్రానువాద వ్యవస్థ : భారతీయ భాషలన్నీ ఒకే కుటుంబానికి చెందినవి కావు. అందువల్ల ఈ భాషలమధ్య పోలికలతో పాటుగా భేదాలూ ఉంటాయి.

పద, వాక్య, అర్థ, స్తరాలలో కావలసినంత భిన్నత్వం ఒక భాషకూ మరో భాషకూ మధ్య ఉంటుంది. ఇటువంటి సందర్భాలలో పరివర్తన ఆధారిత పద్ధతిలో మూలభాష నుండి లక్ష్యభాషకు కొన్ని నియమాల ఆధారంగా యంత్రానువాద వ్యవస్థ నిర్మించవలసి ఉంటుంది. ఈ వ్యవస్థలో అనేక విభాగాలుంటాయి. అన్ని విభాగాలూ క్రమక్రమంగా ప్రత్యేక స్థాయిలలో సమర్థవంతంగా పనిచేసి కావలసిన అనువాదాన్ని అందిస్తాయి. ఈ భాగాలు ప్రధానంగా మూడు ప్రాథమిక విభాగాలుగా విభజించవచ్చు. అని –

యంత్రానువాద వ్యవస్థ



విధానం : యంత్రనువాద వ్యవస్థలో మొదట 1. మూలభాషను విశ్లేషించాలి 2. విశ్లేషించిన భాషా నిర్మాణాలను లక్ష్యభాషలోనికి వర్తింపచేయాలి 3. లక్ష్య భాషను నిప్పన్నం చేయాలి.

దీని స్వరూపం ఈ క్రింది విధంగా ఉంటుంది



పరివర్తక శ్రేణి నిర్మాణం (Dash board) : యంత్రానువాదం నిర్వహించడానికి వీలుగా అన్ని Modules కనిపించే విధంగా, ఎప్పుడు ఏ మాడ్యూల్ కావాలంటే ఆ మాడ్యూల్ మీట నొక్కితే కనిపించే విధంగా ఇది రూపొందింపబడింది. ఒక క్రమం లేకుండా ఏ విభాగానికైనా (Module) వెళ్ళి కావలసిన మార్పులు చేసుకోవటానికి వీలుగా ఇది ఉంటుంది. ఇందులోని విభాగాలు (Modules) పనిచేయడానికి ఒక నిర్దిష్టక్రమం అంటూ ఉండదు. ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా విభాగాలను

మార్పులూ చేర్పులూ చేసుకోవచ్చు. దీనివల్ల ప్రతి విభాగమూ వేరొక విభాగంలో సులభంగా ప్రతిఫలిస్తుంది. మధ్యలో ఏదైనా విభాగం విఫలమైనా తక్కినవన్నీ పనిచేస్తాయి. ఒక్క విభాగం పనిచేయనంత మాత్రాన మొత్తం అనువాదం దెబ్బతినటాన్ని ఇది నిరోధిస్తుంది. ఈ Dash board ను Black board ఆర్కిటెక్చర్‌లో నిర్మించారు. అంటే కంప్యూటరు స్క్రీన్ పై మనకు కావలసిన చోట కావలసిన విధంగా ఏర్పాటుచేసుకొనే వెసులుబాటు కల్పించడమన్న మాట. ఇవి కాక పైప్ లైన్ ఆర్కిటెక్చర్, క్లౌడ్ ఆర్కిటెక్చర్ అనే విధానాలు ఈ వ్యవస్థలో వాడవచ్చు. ఒకవైపు లక్ష్యభాష, మరోవైపు మూలభాష మధ్యలో మాడ్యూల్స్ ఉండేలా రూపొందించిన విధానమిది. ఈ వ్యవస్థ మొత్తం శక్తి ప్రామాణిక రూపం (Sakti standard form - SSF) అనే ప్రత్యేకమైన నమూనాలో పని చేస్తుంది. బ్లాక్ బోర్డ్ ఆర్కిటెక్చరు, పైప్ లైన్ ఆర్కిటెక్చరూ, రెండూ యంత్రానువాద వ్యవస్థలలో పరివర్తక శ్రేణిలో ఉపయోగిస్తున్నారు. హైదరాబాదు విశ్వవిద్యాలయం, అనువర్తి భాషాశాస్త్ర, అనువాద అధ్యయనాల శాఖలో హిందీ తెలుగు తమిళ భాషలకు ద్విదిశాత్మక యంత్రానువాద వ్యవస్థ నిర్మాణంలో ఉంది. ఆ కేంద్ర అధ్యక్షులు ఆచార్య జి. ఉమా మహేశ్వర రావు యంత్రానువాదంలో విశేషమైన కృషి చేస్తున్నారు. అనువాద ప్రక్రియను సులభతరం చేయటం, వేగవంతం చేయటం, రెండు భాషలు తెలియకుండానే సంగణకాల సాహాయ్యంతో మనకు కావలసిన అనువాదాన్ని క్షణాల్లో జరుపుకోవటం ఈ వ్యవస్థల మానవాళికి ఒనగూరే తక్షణ ప్రయోజనాలు. వీరి పరిశోధన ఫలాలు ఇప్పటికే వివిధ దశలవారీగా భాషా ప్రపంచానికి అందుబాటులోనికి వచ్చాయి. మరికొన్ని రానున్నాయి. ఈ కృషి మరింత పుష్పించి, కృత్రిమ మేధ వికసించాలని ఆశిద్దాం. మి

డా॥ అద్దంకి శ్రీనివాస్,
పరిశోధన అధికారి, కేంద్రీయ విశ్వవిద్యాలయం,
హైద్రాబాదు, ఫోన్ : 9848881838



సప్తపర్ణి

333 ఆర్ట్‌పేపర్ పుటలతో,
హార్డ్‌కేస్ బౌండ్ 514 చిత్రాలతో
కళాత్మకంగా వెలువడిన అద్భుతమైన గ్రంథం.

—ప్రముఖుల అభిప్రాయాలు—

"It is a joy to hold, A beauty to behold
Just like Krishna, What more can i say"
-V. A. K. Ranga Rao

సప్తపర్ణి (₹ 777/-) **మిసిమి** పాఠకులకు
కేవలం ₹ **500/-** లకే అందజేస్తున్నాము.

మీ కాపి కోసం మిసిమి కార్యాలయాన్ని సంప్రదించండి.

మిసిమి మాసపత్రిక
Kala Jyothi Process Pvt.Ltd.,
1-1-60/5, R.T.C 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020
Ph : 040-27645536, Cell: 99480 83387
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

వలసవాదుల కవిత్వం :

ఆస్ట్రేలియా–న్యూజిలాండ్

– ముకుంద రామారావు

ఆస్ట్రేలియా: భూమికి దక్షిణార్ధగోళంలో ఉన్న ఆస్ట్రేలియా, ప్రపంచంలో ఆరవ అతి పెద్ద దేశం. ప్రపంచంలో అతి పెద్ద ద్వీపం కూడా. తూర్పు తీరాన పసిఫిక్ మహా సముద్రం; పశ్చిమ తీరాన హిందూ మహా సముద్రం; దక్షిణ కోస్తాతీరాన దక్షిణ సముద్రం; ఉత్తర తీరాన తైమోర్, అరాఫురా సముద్రాలు; ఆగ్నేయాన – (ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌కి మధ్య) తస్మాన్ సముద్రం; ఈశాన్యాన కోరల్ సముద్రంతో ఆస్ట్రేలియా చుట్టూ సరిహద్దులుగా ఏడు సముద్రాలు. ఉన్న భూభాగంలో ఎక్కువ భూభాగం ఆరిడ్ ఎడారితో నిండి ఉంది.

200 వరకూ భాషలు, మాండలికాలూ ఉన్నాయి, అందులో 45 దేశీయమైన భాషలు. ఆంగ్లం కాకుండా ప్రచిలిత భాషల్లో ఇటాలియన్, గ్రీక్, అరబ్బీ, కంటొనీస్, వియత్నమీస్, మండరీన్ భాషలు ఉన్నాయి. 64 శాతం ప్రజలు క్రైస్తవ మతస్థులు, 19 శాతం ఏ మతానికీ చెందిన వారు కాదు. మిగతా వారిలో కొందరు ఇస్లాం, మరికొందరు బౌద్ధ మతస్థులు.

ఆస్ట్రేలియా చరిత్ర : హిమయుగం అంత్యదశలో 50 వేల సంవత్సరాల క్రితం, ఆగ్నేయాసియా నుండి, పడవల్లో వచ్చిన ఆదిమవాసులు అక్కడ మొట్టమొదట స్థావరం ఏర్పర్చుకున్న వారు. దాదాపు పది లక్షలమంది వరకూ ఆదిమవాసులు,

ఆస్ట్రేలియాలో మొట్టమొదటి పార్లమెంటు

ఆ మహాద్వీపమంతా చెదిరిపోయి వారి వేటకు, తిండికి, ఉండేందుకు అనుకూలమైన ప్రదేశాల్లో ఉండిపోయారు. 300 వరకూ తెగలు, 250 భాషలు, 700 మాండలికాల్లో వారు మాటాడుకునేవారని అంచనా. ఒకవిధమైన ఆధ్యాత్మిక అనుబంధంతో ఆద్యంతరహితమైన స్వప్నమయ మాయా ప్రపంచంలో ఆయా ప్రదేశాల్లో వారంతా బతికేవారు.

1601లో పోర్చుగీస్ వాసి మాన్యూల్ గోధినో డె ఎరెడియ, 1605లో స్పెయిన్ వాసి లూయిస్ వేజ్ డె టోర్రెస్ ఈ ప్రాంతాన్ని చూసామని చెప్పినా, 1606లో డచ్ నివాసి విలియం జాన్స్జూన్ అక్కడకు చేరిన మొదటివాడు. ఆ తరువాత డచ్ నావికులు ఆ ప్రదేశాన్ని సందర్శించి వారే న్యూహోలండ్‌గా దానికి నామకరణం చేశారు. అలా 17వ శతాబ్దంలో యూరప్ నుండి అన్వేషకులు అప్పటి న్యూహోలండ్‌గా పిలవబడ్డ ఆ ప్రాంతాన్ని కనుగొన్నారు. దరిమిలా 1770లో నౌకాధిపతి జేంస్ కుక్ తూర్పు కోస్తాతీరం ద్వారా ప్రవేశించి, ఆ మహాద్వీపాన్ని బ్రిటీష్ సామ్రాజ్యంలోని భాగంగా ప్రకటించుకున్నాడు. ఈ కొత్త ప్రాంతాన్ని వాడుకుందుకు వీలుగా 26 జనవరి 1788 న, 1500 మందితో, అందులో ఎక్కువ భాగం ఖైదీలతో మొట్టమొదటి నౌకాదళం సిడ్నీ ఓడరేవుకి వచ్చిచేరింది. అప్పటినుండీ అది బ్రిటన్ నుండి, నేరస్థుల్ని, దివాలాతీసిన వారిని, పనికిరానివారిని తెచ్చి నింపే ప్రదేశంగా బ్రిటీష్ వారికి ఆ ప్రాంతం చాన్నాళ్లు పనికొచ్చింది. ఆస్ట్రేలియా ఒక విశాలమైన కారాగారంగా మార్చబడింది. 1790 నాటికి బ్రిటన్ నుండి ఖైదీలో కాకుండా, భూమ్యాక్రమణ దారులు, ప్రభుత్వాధికారులు, మధ్య తరగతి వృత్తిపరులు, వ్యాపారాల కోసం, ధనార్జన కోసం, అదృష్టాన్ని వెతుక్కుంటూ వచ్చే అక్కడి సామాన్య జనం సైతం రావడం మొదలైంది. అది తతిమా యూరప్ దేశాలకూ పాకింది. ఖైదీలు అత్యంత దుర్భరమైన జీవితం గడపాల్సుండేది. కొన్ని శతాబ్దాలుగా

ఉన్న ఆదిమవాసుల్ని అణగదొక్కి వారిని తరివేసి ప్రయత్నాల్లో, కొత్తగా వచ్చిన వలసవాదులు ఉండేవారు. బ్రిటన్ నుండి వలసవాదులు 1835 నాటికి, బ్రిస్బేన్, పెర్థ్, మెల్ బోర్న్, అడిలైడ్ లాంటి ప్రదేశాల్లో స్థిరపడిపోయారు. న్యూ సౌథ్ వేల్స్ లోను మధ్య విక్టోరియాలోనూ బంగారం లభ్యం కావడంతో ప్రపంచం నలుమూలల్నుండి ఆ బంగారం గనుల్లో పనిచేసేందుకు వలసలు ఎక్కువయాయి. వాటిమూలంగా అప్పటికే అక్కడున్నవారు, కొత్తగా వస్తున్న వారి మధ్య ఎప్పుడూ సంఘర్షణ వాతావరణం ఉండేది. బంగారం మూలంగా వచ్చిన సంపదతో సిడ్నీ లాంటి అనేక నగరాలు అభివృద్ధిచెందాయి. 1 జనవరి 1901 లో, న్యూ సౌథ్ వేల్స్, క్వీన్స్ లాండ్, విక్టోరియా, సౌథ్ ఆస్ట్రేలియా, టాస్మేనియా, వెస్టెర్న్ ఆస్ట్రేలియా – ఈ ఆరు రాష్ట్రాలతో కూడిన ఆస్ట్రేలియా దేశంగా ప్రకటించబడింది. సుమారు 200 దేశాల నుండి వచ్చిన వలసవాదుల దేశం అది. ''మొదటిసారిగా చరిత్రలో, మా మహాద్వీపానికింకో దేశముంది, మా దేశానికో మహాద్వీపముంది'' అని ఆ దేశ ప్రజలందరూ గర్వపడ్డారు. రెండు ప్రపంచ యుద్ధాల్లోనూ ఆస్ట్రేలియా పాల్గొంది. ఆ యుద్ధాల్లో అనేకమంది చనిపోయారు. అనేకమందిగాయపడ్డారు. యుద్ధాలనంతరం వివిధ ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో ఆస్ట్రేలియా ఒక సంపన్న దేశంగా మారింది. 1945 నుండి 1965 వరకూ వలసల్ని అరికట్టే చట్టం అమలులో ఉంచారు. సమయానుకూలంగా అవసరంకొద్దీ అందులో మార్పులు ఇప్పటికీ జరుగుతూనే ఉన్నాయి. ఈ చట్టాల మూలంగా ఆస్ట్రేలియా, ఆస్ట్రేలియా వాసులకే అన్న భరోసా అక్కడి ప్రజలకు కల్పించగలిగారు.

ఆస్ట్రేలియా కవిత్వం : ఆస్ట్రేలియాలోకి బ్రిటీష్ వారు ప్రవేశించక పూర్వం, ప్రవేశించిన తరువాత అని స్థూలంగా రెండు విభాగాలుగా ఆస్ట్రేలియా కవిత్వాన్ని చూడొచ్చు.


ఆస్ట్రేలియా ఆదిమవాసులు

బ్రిటీష్ వారు ప్రవేశించక పూర్వం – ఆదిమవాసుల మౌఖిక సాహిత్యమే ఉండేది. అవి పాటలుగా సాంప్రదాయక క్రతుసంస్కారాలకు, నృత్యాలకు అనుబంధంగా ఉన్నా, జానపదకవితలు, ఇతిహాసాలు, పౌరాణిక గాథలు, పరిసర ప్రకృతి, జంతు పక్షి జాలం, సృష్టి గాథలను ఇతివృత్తాలుగా చేసుకున్నవి ఉన్నాయి. వాటిని సేకరించి, వారి స్థితిగతుల్ని ఊహించి రాసిన ఆదిమవాసుల కవిత్వంగా కొంత చలామణిలో ఉంది.

బ్రిటీష్ వారు ప్రవేశించిన తరువాత – 1890 కి ముందు, ప్రకృతి వర్ణనలతో కూడిన సాహిత్యమే ఎక్కువ వచ్చింది. అందులో ప్రముఖంగా చెప్పుకో తగ్గ, అప్పుడే మొదలైన కవిత్వం బుష్ కవిత్వం. ఆస్ట్రేలియాలోనే మొదలైన జానపద ధోరణిలో అశ్విక సమాజపు సాహస కార్యాలకు ధీటుగా ఆడం లిండ్సే గోర్డన్ (1833-1870) లయబద్ధమైన గేయలు రాసారు. బార్రన్ ఫీల్డ్ (1786-1846) ఇంగ్లాండ్‌లో జన్మించిన ఆస్ట్రేలియా న్యాయవాది, కవి. 1819లో ప్రచురించిన ''ఆస్ట్రేలియా కవిత్వ తొలి ఫలాలు'', ఆస్ట్రేలియాలో ప్రచురించబడ్డ 12 పేజీల తొలి కవిత్వ సంకలనం.

బుష్ కవిత్వం : వలసవాదుల కాలంలో, వారి రోజువారీ కార్యకలాపాల్ని భావాల్ని, పాటల రూపంలో వ్యక్తపర్చిన కవిత్వం ఇది. రానురాను బుష్ కవిత్వంగా రూపాంతరం చెందింది. అప్పట్లో అలా పాటలరూపంలో పాడేవారు ఎక్కువగా పొద(Bush) ల్లో నివసించేవారు కావడంతో ఈ రకమైన కవిత్వానికి ఆ పేరు స్థిరపడిపోయింది. ముఖ్యంగా వినోదం కోసం యతిప్రాసలతో మొదలయిన కావ్య ప్రక్రియ. ఒక కథను, ఊహను, సన్నివేశాన్ని, హాస్యాన్ని, లేదా ఉద్రేకాన్ని, ఒక్కోమారు ఆకర్షించగలిగే నాటకీయతని జొప్పించి చెప్పగలిగే కవిత్వం. ఒక విధంగా అది ప్రాసతోకూడిన లయాత్మక పద్యాలు. సాంప్రదాయక సంస్కృతిని ప్రతిబింబిస్తూ గ్రామ్య భాషలో కుల మతాల తీరుని

కంగారూ

ప్రస్తావిస్తూ తమదేశం విలక్షణతని గుర్తుచేస్తూ సాగే కవిత్వం. 19వ శతాబ్దం చివర్లో, 20వ శతాబ్దం మొదట్లో రాత రూపంలో అనేకమంది కవులు సాంస్కృతిక సంపదగా దాన్ని అనుసరించారు. వారిలో ప్రముఖులు బంజో పాటెర్సన్ (1864–1941), హెన్రీ లాసన్ (1867–1922), డోరొథా మకెల్లర్ (1885–1968), సి.జె. డెన్నిస్ (1876–1938), ఎడ్విన్ జి మర్ఫీ (1866–1939) మొదలైనవారు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఈ రకం కవిత్వానికి ఆదరణ తగ్గడం మొదలైంది. అది కవిత్వమే కాదన్న వాదనకూ తెరతీసింది. కానీ సామాన్య ప్రజల్లో దీనిపట్ల ఉన్న అనుబంధంతో, 1920 నుండి ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చింది. 20వ శతాబ్దం చివరికి ఈ కవిత్వం పట్ల మోజు పెరిగింది. ఫలితంగా అది ప్రదర్శనకు వీలైన కళగా అభిమానం పెరగడంతో, బుష్ కవిత్వ పోటీలు, ప్రదర్శనలు, సంఘాలు కూడా ఎక్కువవుతూ వచ్చాయి. మేరీ ఈ ఫుల్లెర్టన్ (1868–1946), మేరీ గిల్మోర్ (1865–1962) లాంటి కవయిత్రులలో కూడా బుష్ కవిత్వం రాసినవారున్నారు.

బంజో పాటెర్సన్ (1864–1941) : అసలుపేరు ఆండ్రూ బారటన్ పాటెర్సన్. బంజో అన్నది తనకి ఇష్టమైన ఒక గుర్రం పేరు. బుష్ కవిత్వంలో ప్రముఖుడుగా గుర్తింపు పొందారు. కవి, కథకుడు, నవలాకారుడు, పాత్రికేయుడు, సంపాదకుడు, సంకలనకర్త. జీవనోపాధికోసం అనేక ఉద్యోగాలు చేసారు. విలోఖరిగా చైనా, ఇంగ్లాండ్ పర్యటించారు. వీరు రాసిన కవిత *వాల్జింగ్ మాటిల్డాని* అనధికార జాతీయగీతంగా భావిస్తారు. ఆస్ట్రేలియా పది డాలర్ల బేంక్ నోటుమీద, తపాలా బిళ్ళ మీద వీరి ముఖచిత్రం ముద్రించబడ్డ ప్రసిద్ధ కవి. వీరి పేరుమీద పాఠశాలలు, కళాశాలలు, అవార్డులు ఆస్ట్రేలియాలో ఉన్నాయి. ఈ క్రింది కవిత వీరి బుష్ కవిత్వ సంకలనానికి వీరే పీఠికగా రాసుకున్నది.

పీఠిక :

మైదానపు అంచున / గాలిలో వర్షంలో
పశుశాలలుండే ప్రదేశాలనుండి
చాలా దూరంనుండి ఈ కథల్ని సేకరించాను.
పశ్చిమ స్థలమార్గాల మీద / నీడలు పొడవైనపుడు
ఈ పాట శకలాలకు / పట్టుదలతో వేడుకతో ఒక రూపమిచ్చాను
దుఃఖంలో సంతోషంలో / సంచరించిన సంవత్సరాల దస్తావేజులవి
అవి కేవలం విన్న మొరటు కథలు / నా పాత సహచరులారా
వాటి విలువ పరిమితం / వాటి యోగ్యతలు నిజానికి తక్కువైనా
అవి మీకు క్షణికానందాన్ని
కలగజేసినా / నేను చింతించను

హెన్రీ లాసన్

హెన్రీ లాసన్ (1867–922) : పాటెర్సన్ సమకాలికుడు. తల్లి లౌసా లాసన్ స్త్రీవాద కవయిత్రి, ప్రచురణకర్త. బాల్యంలో అనారోగ్యం మూలంగా వినికిడి సమస్య మొదలై, జీవితాంతం వీరిని వెన్నాడింది. 18ఏళ్ల ప్రాయంలోనే తల్లిదండ్రుల విడాకులు మానసికంగా కృంగదీసింది. విలేఖరిగా, కవి, రచయితగా స్థిరపడాలన్న తపన ఉన్నా, తాగుడుకు బానిస కావడంతో భార్యా, పిల్లలు, ఆరోగ్యం అన్నింటికీ దూరమయారు. మానసికస్థితి సరిలేక కొన్నాళ్లు యాచకుడుగా గడిపారు. అయితేనేం పాటర్సన్ తోపాటు వీరు కూడా ప్రముఖ బుష్ కవిగా, ప్రజాకవిగా ఆస్ట్రేలియా గుర్తించింది. వీరి చిన్న కథలకు మరింత ఆదరణ ఉంది. ప్రభుత్వ లాంఛనాలతో వీరి అంతిమ సంస్కారాలు జరిగాయి. ఈ గౌరవం ఆస్ట్రేలియా సాహిత్యకారుల్లో పొందిన మొట్టమొదటి కవి వీరు. 1966లో పది డాలర్ల నోటు, 1949లో తపాలాబిళ్ల, వీరి ముఖచిత్రంతో విడుదలయాయి.

నీ తుపాకీ పరిధివరకూ

వెయ్యేళ్ల పేదరికం, సంపద, అభిమానంతో మగ్గిన బానిసల్లారా, మీరనుకుంటున్నారా –
విశాలమైన కొత్త నేలలో స్వేచ్ఛపొందిన దయ్యాన్ని మీరు అణగదొక్కొచ్చని
రైతు చివరి బంధాలు చెదిరిపోయాక, యుద్ధం కూడా కాస్త ఆగిపోయాక
నేల నీ అధీనంలో ఉంటుందని, అవును నీ తుపాకీ పరిధిలో ఉన్న నేలంతా నీ అధీనంలో ఉంచుకోవచ్చని

ప్రతి కొండనీ నీ బంగారం చదునుచేసేంతవరకూ
గాయపడిన వారు విశ్రమించనీ
వెన్నెల లోని రాత్రిని నీ బంగారం వెలిగించేంతవరకూ
ఎదిరించేవారిని విహరించనీ
మరణించిన నేల ప్రేమికుడ్నుండి గతాన్నీ ఓదార్చి,
భవిష్యత్తు నిరూపించబడేవరకూ
నేల నీ అధీనంలోనే ఉంచుకోవచ్చు,
అవును నీ తుపాకీ పరిధిలో ఉన్న నేలంతా
నీ అధీనంలోనే ఉంచుకోవచ్చు

మేరీ ఈ ఫుల్లెర్టన్ (1868–1946) : తండ్రి కట్టించిన పొదలాంటి ఇంటిలో పుట్టి పెరిగారు. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, కవయిత్రి, సంపాదకురాలు. 'ఈ' అన్న పేరుతో రచనలు చేసారు.

హెచ్చుతగ్గుల మగవాని మనస్థితి
మోహంలో తీవ్రత, ఉదారతలో ఉదాసీనత
బజారులో అరుపులు ,వాదనలో పిరికితనం
మట్టికరిచిన శత్రువు పట్ల అలక్ష్యం
శిశువు కనికరం పట్ల మూలుగు
గంట గంటకు మారుతున్న మగవాని మనస్సు
క్రోధం, మెరిసే పక్షుల అడవి గానం
సరసమైన స్నేహితులతో నవ్వు,
బలంగా గుచ్చుకున్న ఆమె మాటాడని మాటలకు ఏకాంత దుఃఖం
ఈ వారసత్వపు హృదయం మనస్సుతో, అయితే అతనేమిటి
విరుద్ధ మానసికస్థితిలో అతను మనిషేనా
లోదా అగాధమైన ఆవరణలో ఉన్నాడా
ఇంకా దాక్కుని దీర్ఘంగా ఆలోచిస్తూ ఆకృతిమారుస్తున్నాడా

బుష్ కవిత్వం మొదలైన దరిమిలా, బ్రిటన్ నుండే కాకుండా యూరప్, అమెరికా నుండి సైతం ఆంగ్లంలో విస్తృతమైన సాహిత్యం లభిస్తున్నా 1890-1950కి మధ్య కాలంలో యతిప్రాసలు అనుసరించని వచన కవిత్వం వచ్చింది. జాన్ షా నీల్సన్ (1872-1942) లలిత మధురమైన గీతాలకు, క్రిస్టోఫర్ జాన్ బ్రెన్నన్ (1870- 1932) యూరోపియన్ కావ్యాలలోని ప్రతీకాత్మకతకు ప్రసిద్ధి. అప్పట్లో యూరప్‌లో వస్తున్న ఆధునిక కవిత్వం అక్కడ అంతగా ఊపందుకోలేదు. అప్పటి సమూల సంస్కరణవాద కవయిత్రి లెస్బియా హార్పర్ (1891-1927), ఆ పరిస్థితిని 1917లో ఇలా రాసుకుంది.

లెస్బియా హార్పర్

పాత పద్యాల్లో
కొత్త పదాలు బిడియంతోనే వస్తున్నాయి
ఇక్కడో ధైర్యవంతుడు
వ్యాపారాన్ని రసహీనంగా పాడుతున్నాడు

వేగంగా దూసుకుపోతున్న కార్లు
దేశం నగరాలగుండా ఎగిరిపోతున్నాయి
సిగరెట్లు లానే / అవి పాడేందుకు పనికిరానివి
పాత పద్యాల్లో / కొత్త పదాలు నెమ్మదిగా చొచ్చుకొస్తున్నాయి
అవి పూర్తిగా వస్తే / సమయానికి సలాము చేయాలి

కొత్తయుగాన్ని వ్యక్తపరిచే కవిత్వ భాషకోసం హార్పర్ అలా తపనపడింది. అయినా యూరప్‌లో అప్పడొస్తున్న అభ్యుదయవాదం ఆస్ట్రేలియాని అంతగా తాకలేదు. ఎక్కువ భాగం కవిత్వం అప్పట్లో విక్టోరియన్ రొమాంటిక్ సంప్రదాయాలనే అనుసరించి సాగింది. అయినా ప్రముఖ కవయిత్రి డోర్థీ పోర్టర్ (1954-2008) అన్నట్టు "ఆధునిక ఆస్ట్రేలియా కవిత్వం ఆస్ట్రేలియా కథల్ని, నిజాల్ని కవిత్వ భావం వచ్చేలా చేసి, చెప్పని అనేక విషయాల్ని కవితాత్మలో స్వచ్ఛంగా ప్రవేశపెట్టింది".

1930-40 ప్రాంతంలో ఆధునిక కవిత్వం మీద అనేక వాదోపవాదాలు జరిగాయి. ఫలితంగా 1930లో రెండు కవిత్వ ఉద్యమాలు "జిండీవొరొబాక్స్", "ఆంగ్రీ పెంగ్విన్స్ (క్రోధిత పెంగ్విన్లు)" పేరుమీద బయటకొచ్చాయి. జిండీవొరొబాక్స్ అంటే-కలుపుకోవడం, చేర్చుకోవడం. జిండీవొరొబాక్స్ ఉద్యమకారులు ఆస్ట్రేలియా సారాన్ని తమదైన భాషలో వ్యక్తపర్చమని కోరితే (ఒకవిధంగా అది జాతీయవాదం), ఆంగ్రీ పెంగ్విన్స్ ఆస్ట్రేలియా కవిత్వం ఇంకా ఎక్కువ సృజనాత్మకంగా ఉండాలని, అధివాస్తవికతను అనుసరించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కోరుకున్నారు. వాటి ప్రభావంతో ఆధునిక కవిత్వ రూపంలో మార్పులు, గీతమాలికలు, స్వేచ్ఛా కవిత్వం నుండి అత్యంత జయప్రదమైన కవిత్వ నవలవరకూ కొనసాగింది. రెక్స్ ఇంగమెల్స్ (1913-1955), ఇయాన్ మూడే (1911-1976), రోనాల్డ్ రాబిన్సన్ (1912-1992) మొదలైనవారు జిండీవొరొబాక్స్ ఉద్యమానికి నాయకత్వం వహించి ముందుకు నడిపిస్తే, మాక్స్ హారీస్ (1921-1995), జెఫ్రే డట్టన్ (1922-1998), సాం కెర్, పాల్ ఫైఫెర్, ఎర్న్ మాల్లో (1918-1943) మొదలైనవారు ఆంగ్రీ పెంగ్విన్స్ ఉద్యమానికి మార్గదర్శనం చేశారు.

ఇయాన్ మూడే

ఇయాన్ మూడే (1911-1976) : కవి, చరిత్రకారుడు, రచయిత, జాతీయవాది. జిండీవొరొబాక్స్ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ఆస్ట్రేలియా సాహిత్యానికి ఒక సువిశేషవక్త. అనేక సాహిత్య సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేసారు.

డోళ్ల వాయింపు
ఆస్ట్రేలియా వాసులారా, మీ తీరంలో బలంగా నిలబడండి
ముందెన్నడూలేనట్టు
తుపాకీ గుండ్లకు బెదరక ధైర్యంగా నిలుచోండి
మీ దీపాన్ని భవిష్యత్తుని రక్షించుకోండి
మీ వీధి కందకం నుండి
మీ లోతు అంగడినుండి లేవండి
ఈ యుద్ధం ఆగిపోయేవరకూ
ఒక్కటిగా శాశ్వతంగా నిలబడండి

నా తోటి ఆస్ట్రేలియావాసులారా మేల్కోండి
మంట, కోపం వస్తేరానీ
దోళ్ల వాయింపులతో
మీ జాతీయత్వపు ఘడియా వస్తుంది

ఎర్న్ మాల్లో (1918-1943) : ఆంగ్రీ పెంగ్విన్స్ ఉద్యమంలో ముఖ్య కవిగా భావించబడే కవి, కానీ ఎన్నో సంవత్సరాలు ఎవరికీ తెలియకుండా బతికాడు. 14 ఏళ్లకే చదువు విడిచిపెట్టి, కొన్నాళ్లు మోటర్ మెకానిక్‌గా, మరి కొన్నాళ్లు వాచీలు బాగుచేస్తూ చిన్న చిన్న ఉద్యోగాలు చేసాడు. యుద్ధ సమయంలో సైన్యంలో చేర్చుకునేముందు జరిపిన వైద్య పరిక్షల్లో అతను భయంకరమైన వ్యాధితో ఉన్నాడని, వెంటనే శస్త్రచికిత్స చేయనిదే ఎన్నాళ్లో బతకడని తేలింది. అందుకు అతను నిరాకరించడంతో రేపోమాపో అన్న ఎరుకతోనే మిగిలిన కాలాన్ని గడిపాడు. పాతికేళ్లకే అతను మరణించే ముందు తన ప్రేయసి కూడా తనతోనే ఉంది. కొన్నాళ్లుగా రాస్తున్న కవితల్ని మరణించే కొన్ని రోజుల ముందే మార్పులు చేర్పులు చేశాడు. అవన్నీ కలిసి 16 కవితలో, అయినా అవి తన ఆత్మకథల్లా ఉండటం, మరణంతో తన పరిశోధన, యుద్ధంలా ఉండటంతో బాటు, అత్యంత శక్తివంతమైనవిగా కూడా ఉండటంతో వాటిని ఇప్పటికీ ఆస్ట్రేలియా కవిత్వంలో ప్రముఖంగా పేర్కొంటారు.

విల్లియం మనోహరం

నీ విశాల ఇంగ్లీష్ నేత్రాల్ని నేను తప్పించుకున్నాను
కానీ ఇప్పుడు వాటి సుడిగుండలో గిరగిరా తిరుగుతున్నాను
నా రక్తం, చెడిన మనిషవుతోంది
సరిగ్గా మీ శ్వేత ద్వీపంలా;
నా రాతి కాళ్లతో తప్పకుండా వెళ్లాలి
కండల మెట్ల దిగువకి, ఎక్కడైతే
ఝుల్లుమనిపించే ఆలింగనంలో
తూలిపోయే నా పరస్పరవైరుధ్యాలు
మన్నించరాని మానభంగంతో అశ్లీలానికి తలొగ్గొచ్చో

పగటి ఆ ఒక్క క్షణం నాకుండనీ
వైరాగ్యంతో చీకటిలో ఊపుతున్న తెల్లటి చెయ్యిలా
ఆ ఒక్క క్షణం నేను
అనివార్యంగా వెంటనే సంతకం చేస్తాను
ఎలా అయినా (వెక్కి వెక్కి ఏడుపుతో కన్నీళ్లు రక్తాలు కారుస్తున్నా)
నిశ్శబ్దంగా నా తెల్లహంస
నా నల్లహంస గుండెమీద ప్రతిష్టితమై పడుంటుంది

యుద్ధానంతర కవుల్లో అత్యున్నతులుగా తీసుకోబడ్డ వారు ఏ.డి. హోప్‌గా పిలవబడే ఆలెక్ డెర్వెంట్ హోప్ (1907-2000), జూడిథ్ అరుండెల్ రైట్(1915-2000).

ఆలెక్ డెర్వెంట్ హోప్ (1907-2000) : కవి, విమర్శకుడు, సమీక్షకుడు, సంపాదకుడు. శోకగీతాలకు, వ్యంగ్య కావ్యాలకు ప్రసిద్ధి. వీరి కవిత్వం సాంప్రదాయకం అనిపించినా పూర్తిగా ఆధునికం. ధార్మిక ఆధ్యాత్మిక కవిత్వంతో పాటు శృంగార కవిత్వం, సాంస్కృతిక సంస్థల మీద దాడులుచేస్తూ కూడా కవిత్వం రాసారు. వీటిమూలంగా తరచుగా వివాదాల్లో చిక్కుకునేవారు. అనేక అవార్డులతోబాటు, వీరి కవిత్వ సేవకు గుర్తింపుగా 1972లో బ్రిటీష్ ప్రభుత్వం, 1981లో ఆస్ట్రేలియా ప్రభుత్వ గౌరవాల్నీ పొందారు.

ఒక తుపాను మధ్యాహ్నం

పళ్లతో ఛేదిస్తున్న / రెండు గడ్డాల నవ్వు
అడుగున / నడుస్తున్న నాలుగు కాళ్లు
పెనుగాలి వీస్తోంది / చెట్లు ఊగుతున్నాయి
ఆడపిల్లని అల్లరిచేస్తూ / గౌనులు ఎగురుతున్నాయి
నవ్వులు, ఆకులు / కాళ్లు దాటుకుంటూ పోతున్నాయి
గాలి విసురుకు విరుద్ధంగా
అంగలువేస్తూ ఇంకా నేను తొందరగా పోతున్నాను
నేనెక్కడికి పోతున్నాను / దేనికి నేను జాగ్రత్తపడాలి
ఊదేస్తున్నందుకు తేలిపోతూ / సజీవ గాలి?

1950-60 ప్రాంతాల్లో విభిన్నమైన కవిత్వం రావడం మొదలైంది. కవిత్వంలో భయావహమైన, పరిహాసకరమైన, సామాజిక నైతిక విషయాల పట్ల ఆందోళన కనిపించసాగింది. ఈ రకమైన కవిత్వానికి ఆద్యులు కెన్నెథ్ స్లెస్సర్ (1901-1971), రోబెర్ట్ డేవిడ్ ఫిట్జెరాల్డ్ (1902-1987), డౌగ్లస్ అలెక్సాండర్ స్టెవార్ట్ (1913-1985) మొదలైనవారు.

కెన్నెథ్ స్లెస్సర్ (1901-1971): పూర్తిపేరు కెన్నెథ్ అడాల్ఫ్ స్లెస్సర్. ఆస్ట్రేలియా ప్రముఖ కవి, పాత్రికేయుడు.

వీరి మొదటి కవితలు అద్భుతమైన శైలీవిన్యాసంతో, జీవితంలోను, అందంలోను ఉన్న విచ్చలవిడి ఆనందాన్ని వ్యక్తపరిస్తే, తరువాతి కవితల్లో ఆస్ట్రేలియా ఇతివృత్తాలకు సాంకేతిక సృజనాత్మకతను జోడించారు. స్వతంత్ర ప్రాసలు, ప్రయోగాత్మక లయలు, ఉత్తమ భావాలు, నాటకీయ మర్మాల్ని వినియోగించు కున్నారు.

వ్యాకులం, భ్రమ వీరి కవిత్వ స్వాభావిక లక్షణాలైనా, వైయక్తికత, జీవితం పట్ల అభిలాష కూడా అంతే ప్రముఖం.

సమయం, సముద్రం, జ్ఞాపకాల చింత, కాల్పనిక సన్యాసం, మొదలైన విషయాలు వీరి కవిత్వంలో ఎక్కువగా కనిపిస్తాయి.

50వ పుట చూడండి...

తెర దించిన తెలుగు తేజం

*తె*లుగు చలన చిత్రం పలుకు నేర్చినప్పటి నుంచి 'రాముని దగ్గర నుండి వాల్మీకి' వరకు ఆయన ప్రవేశించని పౌరాణిక, చారిత్రక, సాంఘిక 'జీవితం' వెదికి చూసినా కనపడదు. తన జీవితాన్నే చరిత్రగా మలుచుకొన్న ధన్యజీవి అక్కినేని నాగేశ్వరరావు. ఆయన లేకుండా తెలుగు సినిమా చరిత్ర లేదు. అలాగే తెలుగు సినిమా లేకుండా అక్కినేనిది జీవిత చరిత్రా కాదు. ఇంతగా పెనవేసుకు పోయిన ఈ జీవిత–చలనచిత్ర చరిత్రలో, అదీ తొంభైయ్యవ పడిలో నిటారుగా నిలబడి తన జీవన ప్రయాణాన్ని, తెలుగు చలనచిత్ర యానాన్ని నిబద్ధతతో సింహావలోకనం చేసుకోగలిగి నిజాయితీగా, నిర్భయంగా తన ఆలోచనలను పలికిన, నిజ జీవితంలో నటించటం తెలియని వ్యక్తి శ్రీ అక్కినేని.

సినిమా అన్నా, నటన అన్నా, అబద్ధమేనని, లేనిది ఉన్నట్లుగా నమ్మించటమేనని, అంతా కృతకమేనని– అంతవరకు ఎందుకు నిజ జీవితంలో ఎన్నో రకాలుగా నటిస్తాం, అలా చేయకుండా రోజు గడుస్తుందా? అని అన్న అక్కినేని నిజంగానే వెళ్ళిపోయారా? ఇది కూడా అబద్ధమైతే ఎంతబాగుండును!



శలవా మరి...

"భారతదేశపు చిత్రసీమలో ఒక్కడే దేవదాసు, అది అక్కినేని" అంటూ మేటినటుడు విషాద చిత్రాల రారాజైన దిలీప్‌కుమార్‌తో ప్రశంలందుకున్నాడు.

సూపర్ హిట్ చిత్రాలైన లైలామజ్ను, అనార్కలి చిత్రాలలో ముస్లిం పాత్ర ధరించి మెప్పుపొందిన ఏకైక దక్షిణ భారతీయ నటుడు. లేత బుగ్గలు పాలుగారే వయసులో బాలరాజుగా ప్రవేశించి చివరి వరకు కాంతులీనే పాలబుగ్గలతోనే అందరినీ అలరించిన నవలా నాయకుడు.

తమిళుడైన విప్రనారాయణ, ఒడిషాకు చెందిన జయదేవుడు, ఉత్తరాదికి చెందిన కాళిదాసు, మహారాష్ట్రకు చెందిన తుకారాం మొదలైన పాత్రలలో రూపాంతరం పొంది ఒదిగిపోయిన సమగ్ర భారతీయతకు ప్రతీకైన నటుడు. ఈ విషయంలో ఆయనతో సరితూగ గలిగేవారు మరెవరూ లేరు.

ఇప్పుడు ఆయనే లేరు!

ఆస్ట్రేలియా–న్యూజిలాండ్

48వ పుట నుంచి.....

నిద్ర

నిన్ను పూర్తిగా నాకు అర్పించుకుంటావా
శరీరం అశరీరంతో, కండతో కండలోకుందా
క్షణికంగానో, గుడ్డిగానో, కటువుగానో కాకుండా
ఏ కోరికాలేని పసిబిడ్డలా / అవును పూర్తిగా
నా నదీముఖద్వారం వరకూ అప్పుడు నిన్ను సహిస్తాను
నిన్ను మోస్తాను, భావగర్భితంగా సమాధికి రేవుదాటిస్తాను
నిన్ను హరిస్తాను, మింగుతాను నిన్ను
బ్రహ్మాండమైన గుహలో, నా పొట్ట,
పెద్ద అలలతో నిరంతరం, నిన్ను స్నానముచేయిస్తుంది
నువ్వు అక్కడ అంటుకుని పాకుతుంటావు
నీమీద సవారీ చేస్తున్న నా ఎముకల్లో గుడ్డిగా,
నా మాంసాన్ని తవ్వుతూ, కరిగిపోతూ తిష్టవేసి
కనిపించని యేర్పడ్డ కవాటాలగుండా
ఆ మూగ గదిలో అక్కడ కునుకుతుంటావు
నా రక్తంతోబాటు కొట్టుకుంటుంటావు, నా గుండె చప్పుడు వింటుంటావు
కావున / వెలుగొచ్చేవరకూ బహిష్కరణ మేలుకొలుపు
ముందుకి చీల్చుకుంటూ, తోసుకుంటూ
క్రూరమైన పటకారు సైగతో జీవితం
బాధల నమ్మకద్రోహాల నిష్కరమైన పుట్టుక

ద్వీపవాసులు, పశ్చిమ ఆస్ట్రేలియాలోని ఆరిడ్ ప్రాంతంనుండి వచ్చిన వారు కూడా ఆ ప్రాంతపు తమదైన కవిత్వాన్ని వినిపించారు. వారిలో ప్రముఖులు జాక్ దేవిస్ (1917–2000), డోరోథీ హెవెట్ట్ (1923–2002), ఓడ్గెరూ (1920–1995).

డోరోథీ హెవెట్ట్ (1923–2002) : కవయిత్రి, నవల నాటక కథ వ్యాస రచయిత్రి. కమ్యూనిస్ట్ పార్టిలో కొన్నాళ్లు పనిచేసింది. పశ్చిమ ఆస్ట్రేలియా తండ్రి గోధుమతోటల్లో ఏకాంతంగా పెరిగింది. సంఖ్యలో ఎక్కువైన వీరి కవిత్వానికి, నవలలకు, నాటకాలకు అనేక అవార్డులొచ్చాయి. సాహిత్యంలో వీరి కృషికి గుర్తిస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వ సత్కారం లభించింది.

నా మోహమా

సైప్రస్ మీంచీ ఎర్ర సూర్యుడు కుంగుతాడు
ఇప్పుడు కుంగుతున్నట్టు /నీ నల్లతల అలానే తారాడుతోందా
నీ కనుబొమమీద క్షీణిస్తున్న సూర్యకాంతి
అంత శీతలం పవిత్రంగా రెండు ముఖాలుగా
నువు చాలా చురుకుగా కదులుతావు నా శ్వాస తీవ్రమయేట్టు
అయ్యో నల్లమొహమా చావు సైప్రస్ మీద
అయ్యో బక్కపల్చని శరీరమా చావు సైప్రస్ సూర్యుడిలో
లోదా నీ అఘోరమైన ఆకారం పరుగులుతీయడం తప్పక నేను చూడాలా
దినాంతమైందని నన్ను హత్తుకో
సూర్యుడు కుంగుతాడు, ఆ కుంగడంతో
నువ్వూ చస్తున్నావనుకుంటాను / నా మోహమా, వీడ్కోలు

1980–90 మధ్య సాంద్రమైన కవిత్వం కోసం, నిశిత పరిశీలన, అభివ్యక్తి రమ్యతతో వెతుకులాట మొదలైంది. ఆ కాలంలో వచ్చిన ప్రముఖ కవుల్లో లెస్లీ అల్లన్ ముర్రే (1938), డేవిడ్ గోర్ది జోసెఫ్ మలౌఫ్ (1934), జోన్ ట్రాంటెర్ (1943), రోబెర్ట్ గ్రే (1945) మొదలైనవారు.

జోన్ ట్రాంటెర్

జోన్ ట్రాంటెర్ (1943) : అనేక సంకలనాలు ప్రచురించారు, అందులో 20కి పైగా కవిత్వ సంకలనాలు. ప్రచురణకర్తగా, బోధకుడుగా, రేడియో కార్యక్రమ కర్తగా కూడా పనిచేసారు. లండన్, సింగపూర్, బ్రిస్బేన్, సాన్ ఫ్రాన్సిస్కో లాంటి నగరాల్లో నివసించారు. ఫ్రెంచి, అమెరికన్ కవిత్వాల ప్రభావం వీరి కవిత్వం మీద ఎక్కువ. అత్యాధునిక కవిత్వాన్ని రాయాలన్న తపన వీరి కవిత్వంలో కనిపిస్తుంది

సమతౌల్యం

పాలిపోయిన పుల్లని ద్రవంతో ఉన్న గ్లాసుని తిప్పుతూ
టేబుల్ దగ్గర తలవంచుకుని యాత్రికుడు
మసకగా ఉన్న మూలన ఎవరో మాండలిన్ వాయిస్తున్నారు
ద్వారం దగ్గర వేడి గాలులు

ఎక్కడో తెలియని చోటుకొచ్చినా
ఎదారిలోకి బస్సు పోవడం అతను గమనించగలడు
తుపాకీ హాయిగా చేతిలో సమతౌల్యంతో ఇమిడిపోయినట్టు
జతలో కొంతభాగం విడదీసినట్టు అనిపిస్తుందతనికి

1993 నుండి 1996 మధ్య 250 కవిత్వ సంకలనాలొస్తే 2006 నాటికి అది వంద సంకలనాలకే పరిమితమయింది. కవిత్వ సంకలనాలు కొనేవారి సంఖ్య తగ్గడంతో ప్రచురణ కూడా తగ్గింది. ప్రచురణ నిరాశ కలిగిస్తున్నా సమకాలీన కవుల్లో కవిత్వం పట్ల ఎనలేని ప్రేమ, శ్రద్ధ వారి చేత రాయిస్తూనే ఉన్నాయి. వారిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గ వారు లెస్ ముర్రే (1938), బ్రూస్ డావ్ (1930), రోబెర్ట్ గ్రే (1945), జాన్ ఫోర్బెన్ (1950–1998), జాన్ ట్రాంటెర్ (1943), జాన్ కిన్సెల్ల (1963), జుడిథ్ బెవెరిడ్జ్ (1956) మొదలైనవారు.

జుడిథ్ బెవెరిడ్జ్ (1956) : ప్రఖ్యాత సమకాలీన కవయిత్రి, సంపాదకురాలు.

తెల్లకొంగ

కీటకం వైపు అడుగువేసేముందు
తెల్లకొంగ సందేహిస్తుంది
లోదుస్తుల్లా దాని నిశ్చలత్వం అరిగిపోతున్నట్టు
సంసార విరక్త బ్రహ్మచారిలా / దాని తెల్లటి పింగాణీ మెడ వైపు
దాని ప్రతిబింబం బహుశా మోకాలొంచి దండము పెడుతుంది.
గోళ్లుగీళ్లూ లోని ఓ కీటక వస్తువా, నువ్వు
ధార్మిక తెగలు వాడని దీపపువత్తివి.

జుడిథ్ బెవెరిడ్జ్

సాహిత్యానికి నోబెల్ బహుమతి ఆస్ట్రేలియాలో ఇప్పటివరకూ ఒక్క నవలకే వచ్చింది. ఫేట్రిక్ విక్టర్ మార్టిండాలె వైట్ (1912-1990కు, 1973లో ఈ బహుమతి వచ్చింది.

ఆస్ట్రేలియాలో కూడా కవుల కేమీ కొదవలేదు. వర్షం ఒక్కోమారు పడాలనుకున్నా పడక పోవచ్చు, తళతళమెరిసే ఇసుకశయ్య మీద నదులు ఎండిపోవచ్చు, కానీ కవిత్వ ఊట ఏదోవిధంగా ఎక్కడో చోట నిరంతరం ఊరుతూనే ఉంటుంది. ఆస్ట్రేలియా అయినా అందుకు మినహా యింపు కాదు. జ్ఞానం ఏ ప్రాంతానికీ పరిమితం కాదు, ప్రాంతాల్ని దాటి ప్రవహిస్తుంది, అలాగే కవిత్వం కూడా.

న్యూజిలాండ్ : న్యూజిలాండ్ ఆస్ట్రేలియాకి చాలా దగ్గర, ఒక వంతెన దాటుతే చాలు - అని చాలామంది ఎందుకు అనుకుంటారా అని, ప్రసిద్ధ అమెరికన్ రచయిత మార్క్ ట్వెయిన్ 1891లో న్యూజిలాండ్ సందర్శించినపుడు అనుకున్నాడు. నిజానికి రెంటిమధ్య 1243 మైళ్ల నిత్యం ప్రకోపించే తస్మాన్ సముద్రం ఉంది. అలా అని రెండు దేశాల మధ్య రాకపోకల్ని ఎవరూ ఆపలేకపోయారు. తస్మాన్ సముద్రాన్ని, అదేదో గొయ్యని దాటిపోతున్నట్టు దాటిపోతారని అనేకులు చెబుతారు.

నైరుతి పసిఫిక్ సముద్రంలోని అనేక దీవుల మధ్య మహాసముద్ర గోళంలో న్యూజిలాండ్ ఉంది. ఉత్తర ద్వీపం, దక్షిణ ద్వీపం, ఈ రెండు పెద్ద భూభాగాల ప్రాంతం న్యూజిలాండ్. ఆ రెండు ద్వీపాల మధ్య, కుక్ సముద్రమార్గం 24 నుంచి 92 కిలోమీటర్ల దూరం ఉంది. న్యూజిలాండ్ చుట్టూ ఉన్న నివాసయోగ్యమైన, నివాసముంటున్న ద్వీపాల్లో - స్టెవార్ట్ ద్వీపం, ఛాతం ద్వీపాలు, గ్రేట్ బారియర్ ద్వీపం ఉన్నాయి. నివాసయోగ్యం కాని ద్వీపాల్లో-ఆక్లాండ్ ద్వీపాలు, కేంప్ బెల్ ద్వీపం, ఏంటీపోడ్స్ ద్వీపాలు, బౌంటీ ద్వీపాలు, కెర్మడెక్ ద్వీపాలు ఉన్నాయి. సమీపంలో అదీ 1243 మైళ్ల దూరంలో ఉన్న దేశం వాయువ్యాన ఉన్న ఆస్ట్రేలియానే.

న్యూజిలాండ్ చరిత్ర : క్రీ.శ. 950-1130కి మధ్య పోలినేసియన్ నుండి వచ్చిన మవోరీలు అక్కడ ఉన్నట్టు చరిత్ర చెబుతుంది. న్యూజిలాండ్‌ని మొదట కనిపెట్టిన యూరప్ వాసి, డచ్ నావికుడు ఆబెల్ జాన్స్జూన్ టాస్మన్. సముద్రయానం చేస్తూ 1642-43లో అక్కడ కొన్నాళ్లు ఆగాడు. ఆ తరువాత 1769-78 మధ్య సముద్రయానాలు చేసిన బ్రిటన్ నావికాధిపతి జేంస్ కుక్ ఆ ప్రాంతాన్ని బ్రిటీష్ పరం చేయగలిగాడు. బ్రిటన్ నావికాధిపతి జేంస్ కుక్, కేబిన్ బోయ్ "యంగ్ నిక్" మొదట చూసిన ప్రాంతానికి "యంగ్ నిక్ హెడ్"గా నామకరణం చేసారు. ఒకరికి తెలియకుండా ఒకరు అదే సమయంలో ఫ్రెంచి నావికాధిపతి మారియె డె సర్విల్లె తమ వాణిజ్య నౌకతో అక్కడికి చేరుకున్నాడు. ఫ్రెంచ్ ప్రభుత్వం దక్షిణ ద్వీపాన్ని, బ్రిటీష్ ప్రభుత్వం ఉత్తర ద్వీపాన్ని ఆక్రమించుకోవాలన్న ప్రయత్నాన్ని, 6 ఫిబ్రవరి 1840న బ్రిటీష్ ప్రభుత్వం, అక్కడి స్థానికులతో చేసుకున్న "వైటంగీ" ఒప్పందంతో అది సాధ్యంకాలేదు. వలసవాదులు అక్కడి స్థానికుల మూలంగా తలెత్తిన రాజకీయాలు వివాదాలతో 1815-1840 మధ్య అనేక వేల మంది స్థానిక మవోరీలు చనిపోయారు. 1840 దరిమిలా బ్రిటీష్ ప్రభుత్వంతో స్థానికులకు సంధి కుదిరినా, 1860-1872 వరకూ ఆ అంతర్యుద్ధం కొనసాగింది. 19వ శతాబ్దం మొదట్లో ఆస్ట్రేలియానుండి చేపలు పట్టే వాళ్లు, నావికులు, తప్పించుకుని పారిపోయిన ఒకప్పటి ఖైదీలు, మొదలైన వారంతా ఎక్కువగా ఆక్లాండ్, న్యూజిలాండ్‌కి వచ్చి చేరారు. అందులో బ్రిటన్లో పుట్టినవారు, సిడ్నీ ఆస్ట్రేలియాలో పుట్టిన వారూ ఉన్నారు. 1850లో ఆస్ట్రేలియాలో వచ్చిన అనావృష్టి మూలంగా, అనేకమంది అక్కడి గొర్రెల కాపర్లు న్యూజిలాండ్‌కి వచ్చిచేరారు. 1861లో


జేంస్ కుక్

Young Nick's Head, Newzealand

ఆస్ట్రేలియా వాసి గాబ్రియల్ రీడ్ న్యూజిలాండ్ దక్షిణ ద్వీపంలోని ఒటాగోలో బంగారం నిక్షేపాల్ని కనుగొన్నాడు. వాటిని వెలికి తీసేందుకు 50 వేలమంది ఆస్ట్రేలియా నుండి అక్కడకు చేరారు. కొందరు వారిలో అక్కడే స్థిరపడిపోయారు. 1911 నాటికి ఆస్ట్రేలియానుండి న్యూజిలాండ్‌లో ఉన్న వారి సంఖ్య 50 వేలకు పైనే. 2006 నాటికి ఆ సంఖ్య 62 వేలకు దాటింది. అయితే న్యూజిలాండ్ నుండి ఆస్ట్రేలియాకి వచ్చిన వారి సంఖ్య కూడా తక్కువేమీ కాదు. 2006 నాటికి ఆస్ట్రేలియాలో న్యూజిలాండ్ వాసుల సంఖ్య నాలుగు లక్షలకు చేరింది. ఈ రెండు దేశాల మైత్రి మూలంగా రెండు ప్రపంచ యుద్ధాలలోను, ఇరు దేశాల సైన్యాలు కలిసి పాల్గొన్నాయి. 1947లో న్యూజిలాండ్ పూర్తి స్వతంత్ర దేశమయింది. 20వ శతాబ్దం చివర్లో బ్రిటన్‌తో సంబంధాలు బెడిసికొట్టాయి. ఆ కారణంగా ఆస్ట్రేలియాతోను, ఆసియా దేశాలతోను సంబంధాలు పెరిగాయి. 1990లో అనేకమంది ఆసియావాసులు అక్కడికి వలస వెళ్లారు. న్యూజిలాండ్ ఇప్పటికీ ముఖ్యంగా వ్యవసాయం మీద ఆధారపడ్డ దేశం. ప్రఖ్యాతి చెందిన కివీ ఫలాల్ని ప్రపంచమంతటా ఎగుమతి చేస్తున్న దేశం.

ఆంగ్లం, మవోరీ రెండూ అధికారిక భాషలుగా గుర్తించారు. 2003 నాటికే 99 శాతం అక్షరాస్యత సాధించారు. క్రైస్తవానికి సంబంధించి వివిధ మతస్తులున్నా, ఏ మతాన్నీ ఆచరించని వారి శాతమే (26 శాతం) అక్కడ ఎక్కువ.

న్యూజిలాండ్ కవిత్వం : వారసత్వం, పరిసరప్రభావాల సంయోగం న్యూజిలాండ్ కవిత్వం. యూరప్ నుండి సంక్రమించిన ఆంగ్ల కవిత్వం అక్కడి కవులమీద తప్పించుకోలేని బరువు మోపుతూనే ఉంది. పరిసర ప్రభావాలు సమసమాజం కోసం ఒత్తిడి చేస్తూనే ఉన్నా, ఈ రెంటినీ కాదని వ్యక్తిగత దృష్టి ఆవశ్యకతని గుర్తుచేసే కవిత్వవాదం మరొకవైపు, న్యూజిలాండ్ కవిత్వాన్ని నడిపించాయి. ఆస్ట్రేలియా కంటే 50 ఏళ్లు ఆలస్యంగా న్యూజిలాండ్ ఏర్పడడం మూలాన 1840-1940 మధ్య కాలం అక్కడి సాహిత్యం ప్రాథమిక రచనలకే పరిమితమయింది. 19వ శతాబ్దంలో 1920 వరకూ, చాలావరకు కవిత్వం, అతి సాధారణ అనుకరణతో సాగిన కాల్పనికవాద పునరుద్ధరణ మాత్రమే. పేర్కొనదగ్గవి ఏవైనా ఉంటే అవి వాటి చారిత్రక సామాజిక ఆసక్తితోనే చేయొచ్చు. చార్లెస్ బోవెన్ (1835-1894), థోమస్ బ్రాకెన్ (1843-1898), బ్లాంచె బౌఘన్ (1870-1958), జేంస్ బార్ (1779-1860), డేవిడ్ మెఖీ రైట్ (1869-1928), కవయిత్రి కేథెరిన్ మాన్స్ఫీల్డ్ (1888-1923), ఆల్ఫ్రెడ్ డొమెట్ (1811-1887), జాన్ బార్ (1809-1889) మొదలైన కవుల్ని అలా గుర్తించుకోవచ్చు.

R.A.K మాసన్ (1905-1971) వ్యాకులం, వైయక్తికం, పొందికగా పొదిగిన వాక్యాల కవిత్వంతో ఒక కొత్త గొంతుతో ప్రవేశించారు. 1920లో రాసిన వీరి కవిత్వం మరో ఒకటి రెండు దశకాలవరకూ గుర్తింపుకు నోచుకోలేదు. అదేకాలంలో J.R. హెర్వే (1889-1958), J.C బీగ్లెహోల్ (1901-1971), కవయిత్రి ఐలీన్ డుగ్గన్ (1894-1972), కవయిత్రి మేరీ ఉర్సులా బెథెల్ (1874-1945), డిఆర్సీ క్రెస్స్వెల్ (1896-1960), A.R.D ఫెయిర్బర్న్ (1904-1957), కవయిత్రి రోబిన్ హైడ్ (1906-1939) కూడా వైయక్తిక కవిత్వంతో గుర్తింపు పొందిన కవులో. 1930 ప్రాంతంలో ఇలియట్ ఎజ్రాపౌండ్ ప్రభావంతో కవిత్వం రావడం మొదలైంది. ఫెయిర్బర్న్, ఉర్సులా బెథెల్, అల్లెన్ కర్నోవ్ (1911-2001), ఛార్లెస్ బ్రాస్ట్ (1909-1973), డెనిస్ గ్లోవెర్ (1912-1980) - ఈ అయిదుగుర్ని ప్రముఖంగా ఆ ధోరణిలో రాసిన వారిగా పేర్కొంటారు.

R.A.K **మాసన్ (1905-1971) :** పూర్తిపేరు రోనాల్డ్ ఆల్లిసన్ కెల్స్ మాసన్. ఇంటిలో పిలిచే పేరు జోన్. బిచ్చగాడు పేరుమీద వచ్చిన తన మొదటి కవిత్వ సంకలనం ఎవరి దృష్టినీ ఆకర్షించక, ఎవరూ వాటిని కొనక పొందిన నిస్పృహలో ఆ పుస్తకాలన్నింటినీ ఆక్లాండ్ హార్బర్‌లోపడేసిన

R.A.K మాసన్

కవి, ఆ తరువాత వాటిలోని కవితలతోనే న్యూజిలాండ్‌లో అత్యంత ప్రతిభావంతుడైన కవిగా కొనియాడబడ్డారు. 30 ఏళ్ల వయస్సు తరువాత కవిత్వం కంటే ఇతర విషయాలైన నాటకాలు, రాజకీయాలు, కార్మిక సంఘాల్లో ఎక్కువ శ్రద్ధ చూపించారు. ఆ విధంగా మాసన్ కవిత్వం తక్కువ రాసినందుకు కూడా న్యూజిలాండ్ సాహిత్యకారులు ఆ తరువాత మధనపడ్డారు. వీరిది కఠినమైన, చిక్కుపడ్డ, పట్టు దొరకని కవిత్వం. నాణ్యంగా సృష్టించబడ్డ గీతమాలికలు, ద్వేష పూరిత ప్రేమ కవితలు, వంచనలమీద మరణం మీద నిష్ఠుర ఆలోచనలు – ఇవేవీ అంత సులభంగా అక్షరాక్షరం అందవు. తాత్విక కవిత్వం, రాజకీయ కవిత్వం కూడా రాసారు. ఎప్పుడేమి రాస్తారో తెలియదని మిత్రులు వాపోయేవారు. వీరి లాటిన్ చదువు వీరి కవిత్వంలోని అన్నింటినీ ప్రభావితం చేసింది.

మరణించిన తరువాత

ఈ వ్యాఖ్యానం ఉదహరిస్తున్న సందర్భాన్ని చూడు
ఏర్చితీయడానికి కేవలం విలువైన పండ్లే ఉంటాయి,
చూడటానికి రత్నాలు
అయినా కాంతిహీనంగా సూర్యుడు చంద్రుడైనా ఉండరు;
తెంపడానికి చక్కని పూలుంటాయి
వర్షం అంతే అందంగా ఉంటుంది
కానీ నాకోసం కాదు.

ద్రాక్షలతల నుండి ఏ వైభవమూ పోదు
చెట్టు నుండైనా;
యెహోవా దేదీప్యమానమైన చిహ్నం ఆకాశంలో
ఇంకా ప్రకాశిస్తూనే ఉంటుంది
దాక్కుని నిగనిగలాడుతూ గుర్రాలమీద నర్తిస్తున్న
సూర్యుడు సుకుమారుడికంటే తక్కువ కాదు
అయినా అందమైన రేఖలా రథం వెంట వేగంగా పోతుంటుంది
కానీ నాకోసం కాదు

ఇత్తడిమీద అపురూపానికి తక్కువగా ఏమీ చెక్కరు జనం
అయినా సముద్రాన్ని ఊదుకుంటూ పోతారు
ఇసుకగుట్టమీద తక్కువకాని ప్రకాశమానమైన నీడ మీద
విసిరిన చిరు అలల పాటలు ఆగిపోవు
వెన్నెలలో వెలిగే గడ్డిమీద కాంతి ఇంకా,
నీడలతో చుట్టుముడుతూనే ఉంటుంది
కానీ నాకోసం కాదు

మేరీ ఉర్సులా బెథెల్ (1874-1945) : ఆధునిక న్యూజిలాండ్ కవిత్వంలో వీరొక ప్రముఖ కవయిత్రిగా గుర్తింపుపొందారు. ఆంగ్ల మూలాలు, న్యూజిలాండ్ పట్ల సానుభూతి మూలంగా ఒక సంఘర్షణ వాతావరణంలో బతికారు. దినవారీ అనుభవం, ధార్మిక నమ్మకం, వీటిమధ్య సంఘర్షణ కలవరపరిచేవి. తన విస్తృతమైన అవగాహనని కవిత్వమయం చేయడంలో సృజనాత్మక ధైర్యాన్ని ప్రదర్శించేవారు, ఫలితంగా వీరి పరిశీలనలన్నింటిలో ఒక కొత్త చూపు కనిపిస్తుంది.


మేరీ ఉర్సులా బెథెల్

తయారు

వసంతం ఇంకా రాలేదు కానీ, చలికాలపు చివరి అంకం.
గాలివాన. వడగళ్ళు. వర్షం, వర్షం, వర్షం,
పూలన్నీ కిందికి కొట్టుకుపోయాయి, పక్షుల నిశ్శబ్దం.

ఆ తరువాత ఎక్కువగా కష్టపడటం. ఎక్కువయే వెన్నునొప్పి.
బురద జోళ్లు. గీరుకున్న చేతులు. గాఢనిద్ర.
ఆ తరువాతే ఒక ఉదయం అంతా పచ్చదనం,
గులాబీ పొదలన్నీ చిగుర్లతో చిట్లి –

A.R.D ఫెయిర్‌బర్న్ (1904-1957) : పూర్తిపేరు ఆర్థర్ రెక్స్ డుగర్డ్ ఫెయిర్‌బర్న్. కవిత్వాన్ని కళని అంతగానే ప్రేమించిన వైవిధ్యభరితమైన కవి, తార్కికుడు. మాసన్ సమకాలికుడు, అతని అత్యంత దగ్గరి మిత్రుడు. ఎక్కువభాగం కవిత్వం వివాదాస్పదం. దానికి కారణం-న్యూజిలాండ్‌ని చారిత్రక, సామాజిక, వ్యక్తిగతంగా చూడటం, మార్క్స్, డగ్లాస్‌ల తీవ్ర ప్రభావం, శిల్పపరంగా ఇలియట్ ఎజ్రాపౌండ్‌ల ప్రభావాలు. అయినా వీరి కవిత్వంలో మనిషి పట్ల, ప్రకృతి పట్ల ఆనందం, చారిత్రక సామాజిక వక్రబుద్ధి పట్ల తీవ్రమైన బాధ, అంతర్లీనంగా కనబడుతూనే ఉంటుంది. స్నేహితులు, బంధువులు, ప్రకృతి మధ్య హాయిగా గడపాలన్న ఆలోచనలు, సమాజాన్ని సమూలంగా మార్చాలన్న సంస్కరణ భావాలు ఫెయిర్‌బర్న్‌ని ఉక్కిరిబిక్కిరి చేసేవి. వీరి కవిత్వం చాలావరకు సంగీత భరితం.


ఆర్థర్ రెక్స్ డుగర్డ్

వీడ్కోలు

ఏముంది చెప్పడానికి?
చెప్పడానికి మనకేమీ లేదు / చేయాల్సిందీ ఏమీలేదు
మాటలతో సూర్యున్ని తూర్పుకు మళ్లించడానికి
లేదా మరణించినవారిని బతికించడానికి
దినం సమయాన్ని తిప్పలేనప్పుడు.

నా జీవితాన్ని ప్రేమించినట్టే, నిన్ను నేను ప్రేమించాను
నీకోసం చాచిన నా చేయి
నేను ప్రేమతో తొందరపడేవరకూ
తిరిగొస్తున్న నోవా శాంతిదూతలా
చూసేందుకు కొత్త నేలని తెచ్చింది
కానీ సమయం కత్తి పదునవుతోంది

సమయం నవ్వుతూ దాని కత్తిని పదును పెడుతూనే ఉంది
లోతుగా పూడ్చి,
మాటాడకుండా లేదా ఆలోచించకుండా
లేదా నిద్రలోనైనా గుర్తుంచుకోకుండా
తొందరగా ఏదో ఒకటి తేల్చుకుంటుంది
నువు జీవించాలి, నీ జీవితం కొనసాగాలి.

1940-50ల మధ్య కవిత్వం ఒక చర్చా వేదికగా మారి, కవిత్వం పట్ల ఆసక్తి పెంచింది. భావవాదం అభ్యుదయ వాదుల మధ్య వాదోపవాదాలు జరిగిన కాలమది.

తెన్నెథ్ అడాల్ఫ్ స్లెస్సర్

ప్రముఖ కవి సంకలనకర్త అల్లెన్ కర్నోవ్ (1911-2001), బాసిల్ కైర్న్స్ డౌలింగ్ (1910-2000), J.R హెర్వే (1889-1958), కవయిత్రి ఐలీన్ డుగ్గన్ మొదలైనవారు భావ కవిత్వపు జాతీయవాదాన్ని నీతివాదాన్ని అనుసరిస్తే, జేంస్ కైర్ బాక్స్టర్ (1926-1972), లూయిస్ జాస్సన్ (1924-1988), కెండ్రిక్ స్మిథిమన్ (1922-1995), అలిస్టైర్ కేంప్బెల్ (1925-2009), W.H ఓలివెర్ (1925-), హుబెర్ట్ విథెఫోర్డ్ (1921-2000), కవయిత్రి మేరీ స్టాన్లీ (1919-1980), కవయిత్రి హెలోనా రూథ్ ఫ్రాన్స్ (1913-1968), విల్లియం కెండ్రిక్ స్మిథిమన్ (1922-1995) మొదలైన ఆధునిక వాదులు దానిని తిరస్కరించారు.

ఆల్లెన్ కర్నోవ్ (1911-2001) : ఆల్లెన్‌గా పిలవబడే థోమస్ ఆల్లెన్ మొన్రో కర్నోవ్, ప్రముఖ కవి, సంకలనకర్త, విమర్శకుడు, పాత్రికేయుడు, రచయిత, అధ్యాపకుడు. జాతీయంగా అంతర్జాతీయంగా కూడా వీరి కవిత్వానికి అనుచరవర్గాన్ని సంపాదించుకున్న కవి. మేధావిలా వివాదాస్పదంకాని బలమైన ఆలోచనలు కవిత్వంలో కనిపిస్తాయి. తొలి కవితల్లో కొంత వ్యంగ్యం ఉన్నా, వారి కవిత్వం వర్తమాన ఆందోళనల్ని వాటి చారిత్రక మూలాల్ని ఆధ్యాత్మిక సారాన్ని పట్టుకున్నాయి. న్యూజిలాండ్‌ని విశాల ప్రపంచంతో కలుపుతూ పోతున్న పోలినేసియన్ లేదా యూరోపియన్ నావికుడులా వీరి ఊహలుసాగుతాయి.

అజ్ఞాత సముద్రాల్లోంచి కనిపించే నేల

కొత్త దిక్కుకు సముద్రయానం చేస్తున్నపుడు
నువు ప్రపంచాన్ని విశాలం చేస్తావు.
నువు నీ నౌకాధిపతిని ఎన్నుకున్నావు,
ఆవిష్కరణల్లో ఆసక్తి, వాటిని సాధించే శక్తితో,
ఉన్నవాటిలో ఏ నౌకని ఉపయోగించినా,
ఏదాది సాహసాలకు అత్యావశ్యక కొలువు
తోచే అనుమానాల్నిదృష్టిలో పెట్టుకుని
అజ్ఞాతానికి పయనిస్తున్నపుడు
బంగారు తీరాల్లో ఊహా క్రూరుల కథలన్నింటినీ
జరగని, జరగబోయే పరిస్థితుల్ని
సామాన్య సూచనల్లో జీర్ణించుకోవాలి

ఇవన్నీ అయినాక, నువు పూర్తిగా జలప్రవేశం చేస్తావు
సంవత్సర మంచి సమయాన, ఒక శుభోదయాన
ఆకాశం విశాలమవుతూ,
వేసవితో సముద్ర తీవ్రత అణచబడుతున్నపుడు
నిదానించి చూసుకుంటూ వెళ్లే సమయం దగ్గరవుతుంది
దేవుని పేర ఒక శుభోదయాన,
అనామక ప్రపంచ నీళ్లలోకి

మేరీ స్టాన్లీ (1919-1980) : ఈ కవయిత్రి రాసింది తక్కువైతేనేం, రాసినవన్నీ ఉత్తమ శ్రేణికి చెందిన కవితలుగా న్యూజిలాండ్ సాహిత్యలోకం గుర్తించింది. కొందరు విమర్శకులు భావించినట్టు 1950 ప్రాంతంలో ఉన్న కవుల (పురుషుల) ఆధిపత్య భావాల మూలంగా ఎక్కువగా రాయలోకపోయారన్న విమర్శకు జవాబుగా, వీరి రెండవ భర్త అందులో నిజం లేదని, వీరికి అప్పట్లో ఉన్న కవులందరితోనూ సత్సంబాంధాలున్నాయని చెప్పుకున్నారు. వీరికి అనేక పురస్కారాలు లభించాయి. వీరి కవిత్వం - భావగర్భితమైన మరణం, దుఃఖం, భౌతికవాదం, అణుయుద్ధంలాంటి విషయాలమీద, జాగ్రత్తగా చెక్కిన, వ్యక్తిగత అంతరంగిక ఇతివృత్తాలు. వీరి అద్భుతమైన భావనల్ని, ప్రముఖ ఆస్ట్రేలియా కవి జూడిథ్ రైట్‌తో పోలుస్తారు.

భగ్ననౌక

తీరానికి దూరంగా,
సముద్రం ఈ శిథిలాల్ని ఒడ్డుకు నెట్టింది, వాటి పక్కెముకల్ని
లవణాల రుతువులతో పరిశుభ్ర పరుస్తూ, ఇక్కడ
బలాత్కరించే కెరటం చివరికి లోబరచుకుంటుంది
మోగే ఏ గంటా సమాధికోసం కాదు, నీటికాకి, సముద్రపుకొంగ
వాటి పిచ్చిమతాల్ని మునిగిపోయినందుకని ఉపదేశిస్తాయి
చెడిపోయి విసిరేసినవాటికోసం ఎవరూ ఏడ్వరు

1940లో ముఖ్యంగా ఇద్దరు కవులు జేంస్ కైర్ బాక్స్టర్, కెండ్రిక్ స్మిథిమన్ కవిత్వంలో తమ స్థానాన్ని తాము చాటుకుని, కర్నోవ్, బ్రాస్ సరసన చేరగలిగారు. లూయిస్ జాన్సన్ (1924-1988), పేట్రిక్ విల్సన్ (1926-), హుబెర్ట్ విథెఫోర్డ్ (1921-2000) లాంటి కవులు అప్పట్లో కవిత్వ రంగ ప్రవేశం చేసినా, అడపా దడపా కొన్ని కవితలతో తప్ప అంతగా గుర్తింపు పొందలేకపోయారు.

కొత్తగా న్యూజిలాండ్‌కి వచ్చిన ఇద్దరు కవులు ఛార్లెస్ (మైక్) డోయ్లె (1928-), పేటెర్ బ్లాండ్ (1934-), సముద్రాలు దాటుకుని ద్వీపాల్లోకి వచ్చిన తరువాత వారి అనుభూతుల్ని వ్యక్తం చేయగలిగారు. ముగ్గురు కవయిత్రులు మేరీ స్టాన్లీ, రూథ్ డల్లస్ (1919-2008), హెలోనా రూథ్ హెండెర్సన్/ఫ్రాన్స్ (1913-1968) వారి వారి అనుభవాల్ని స్త్రీ దృక్కోణంలో చూపించగలిగారు.

మిచెల్ కెనెడీ జోసెఫ్ (1914-1981) : ఛార్లెస్ స్పియర్ (1910-1985) లాంటి కవులు కేవలం వైయక్తిక కవిత్వానికే పరిమితమయారు. ఛార్లెస్ స్పియర్ తప్ప తతిమా అందరి కవుల్లోనూ న్యూజిలాండ్‌తో ఉన్న ఘనిష్ఠ సంబంధం అడుగడుగునా కనిపిస్తూనే ఉండడం విశేషం. న్యూజిలాండ్‌లో కూడా కవులు, కవయిత్రుల సంఖ్య తక్కువేమీ కాదు. కవిత్వాన్ని కవులను ప్రోత్సహించే దిశగా అక్కడ 1997 నుండి ఆస్థానకవుల సంప్రదాయం (బ్రిటన్ నుండి ఎరువుతెచ్చుకున్నది) మొదలైంది. సమకాలీన కవుల్లో ప్రసిద్ధులైన వారినే ఆస్థానకవులుగా ఎంపికచేస్తారు. వారి రెండేళ్ల పదవీకాలంలో ఆస్థాన కవుల కవిత్వ సంకలనాలను ప్రచురించడం వాటికి ప్రచారం కల్పించడం జరుగుతుంది. విల్లియం బిల్ మనిర్ (1946-) వారి మొదటి ఆస్థానకవి. ఇప్పటి వరకూ అలా 8మంది ఆస్థాన కవుల్ని ఎన్నుకున్నారు. వీరిలో నలుగురు స్త్రీలు. హోన్ తువ్హరె (1922-2008), కవయిత్రి ఎలిజబెథ్ ఎడ్విన స్మిథెర్ (1941-), బ్రియన్ లిండ్సే టర్నెర్ (1944-), కవయిత్రి జెన్నిఫెర్ మేరీ బోర్థ్వోల్ట్ (1960-), కవయిత్రి మిచెల్ జోయ్ లెగ్గొట్ట్ (1956-), కవయిత్రి ప్రిసిల్ల మురియెల్ "సిల్ల" మెకీన్ (1949-), ఇయన్ కర్టిస్ వెడ్డె (1946-) తతిమా ఏడుగురు ఆస్థానకవులు. వీరిలో ఇప్పటి ఆస్థానకవి ఇయన్ కర్టిస్ వెడ్డె.

ఇయన్ కర్టిస్ వెడ్డె

జెన్నిఫెర్ మేరీ బోర్థ్వోల్ట్ (1960-) : ఆస్థాన కవులందరిలో చిన్నది, ఆస్థానకవులందరూ ఏదో ఒక సందర్భంలో వీరి కవిత్వాన్ని ప్రశంసించకుండా ఉండలేకపోయిన కవయిత్రి. దినవారీ జీవితంలోని విషయాల్ని అద్భుతమైన వివరణలతో, పిట్టకథలతో, సంఘటనలతో, జీవితం, శృంగారం, కుటుంబం, జ్ఞాపకాల సమాహారంగా వీరి కవిత్వం నిండి ఉంటుంది.

ఫ్రాన్స్

నీ పన్ను విరుగుతుంది, మోహిని వస్తుంది
చేతుల్ని ఎవరో ఒకరు కనిపెట్టినందుకు నువు సంతోషిస్తావు
రోజులు గడుస్తుంటాయి సాకుల్లోను ముసుగుల్లోను
పోరాడతావు ఇంకొకర్ని ప్రేమిస్తావు

ఒక్కోమారు ఒంటరిగా ఉండాలనుకుంటావు
నీ గదికోసం పూలు కొంటావు
నీ చేతులేమి చేయగలవోనని ఆశ్చర్యపోతావు
సొరంగం నిర్మిస్తావు, రైలు దానిగుండా పోతుంటుంది వేగంగా

నిన్ను ఇక్కడ దొరికించుకోవచ్చని
మోహినికెలా తెలిసిందని ఆశ్చర్యపోతావు
నీ ఇంటి చిరునామాని గొణుక్కుంటూ
ఆపదలో రాత్రంతా మేలుకొనే ఉన్న
మీ చిన్న తమ్ముడ్ని ఆమె వినే ఉంటుంది

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ రెండు దేశాలూ బ్రిటన్ దత్తత తీసుకున్నవే. వారిని తరచు అందుకే దాయాదులుగా భావిస్తారు. న్యూజిలాండ్లో ఎక్కువగా స్కాటిష్ వాసులు, ఆస్ట్రేలియాలో ఐరిష్ వాసులు ఉన్నారు. రెండు దేశాల్లో ప్రజలు ఇటు అటు మారుతూ ఉన్న కలయికతో, ఒకరి ప్రభావం మరొకరిమీద పడుతూనే ఉంటుంది. అది ఈ రెండు దేశాల సాహిత్యం మీద కూడా ఉంది.

ముకుంద రామారావు
కవి, పరిశోధకులు, హైద్రాబాదు,
ఫోన్ : 99083 47273

మఖ్దూమ్ కవిత్వ సౌరభం

– దేవరాజు మహారాజు

మఖ్దూమ్ కవి సౌందర్యోపాసకుడు, విప్లవ కవి. జీవితంలో కూడు, గుడ్డ, గూడు తప్పనిసరే కాని, వాటితో పాటు సౌందర్య భావన కూడా తప్పసరి అని భావించిన వాడు మఖ్దూమ్ మొహియుద్దీన్ (4 ఫిబ్రవరి 1908–25 ఆగష్టు 1969). ప్రపంచమంతటా ఆ భావన చిరస్థాయిగా నెలకొనాలంటే ఉద్యమాలు కూడా తప్పవని తన కవితల ద్వారా, ఉపన్యాసాల ద్వారా చాటి చెప్పాడు. సుఖప్రదమైన, శృంగారమయమైన జీవితం ప్రజల హక్కు – అని నొక్కి చెప్పాడు.

ఆయన అనర్గళంగా ఉపన్యసించగల గొప్పవక్త. అంతకు మించి జనసామాన్యానికి అందిన మహాకవి. "యె జంగ్ హై జంగె ఆజాది" గీతం దేశంలోనే కాదు, విదేశాల్లో సైతం ప్రాచుర్యం పొందింది. 'జంగె ఆజాదీ' కవికి సుస్వాగతమంటూ అక్కడ బేనర్లు ఆహ్వానంపలికేవి. శ్రోతలు అతను రాసిన *జంగె ఆజాదీ, ఖైద్, చారగర్* గీతాల్ని చదవమని ఉపన్యాసం చివర ఫర్‌మాయిష్ చేస్తుండేవారు.

మఖ్దూమ్ కొన్ని చరణాలు చదివి ఆపేస్తే మిగతా భాగాన్ని శ్రోతలే పూర్తి చేసేవారు. మళ్ళీ మఖ్దూమ్ అందుకునేవాడు. ఆ రకంగా జనబాహుళ్యాన్ని ఉర్రూతలూగించగల ప్రతిభ ఎందరికుంటుంది? ఈ ప్రాచుర్యం, ఈ గౌరవం, ఈ ప్రేమ అతికొద్దిమంది కవులకు మాత్రమే లభిస్తుంది. దీనికి ఏ అవార్డులూ సరితూగవు. ఆయన కవితా గానశైలి ఝరీ సమానమైంది.

"యె జంగ్ హై జంగె ఆజాది
ఆజాదీ కి పర్చమ్ కె తలె
హం హింద్ కె రహ్నె వాలోంకి
మహ కూ మోంకి మజ్బూరోంకి
దహెఖానోంకి, మజ్దూరోంకి
ఆజాదికె మత్వాలోంకి
యె జంగ్ హై జంగె ఆజాది
సారా సంసార్ హమారా హై,
పూరబ్, పశ్చిమ్, ఉత్తర్, దక్కన్
హం అమెరీకి, హం అఫ్రంగి,
హం చీనీ జాంబాజానె వతన్"

1. ఇది స్వాతంత్ర్య సమరం. భారత దేశంలోని తాడిత పీడిత జనుల సమరం. కార్మికుల కర్షకుల పోరాటం. 2. మేం అమెరికన్‌లం, మేం ఆఫ్రికన్‌లం, మేం చైనీయులం.. ఉత్తరం, దక్షిణం, తూర్పు, పడమర ప్రపంచమంతా మేమే. ఈ ప్రపంచ సంగ్రామం ప్రపంచ పౌరులందరిదీ అని మఖ్దూమ్ దీన్నొక అంతర్జాతీయ గీతంగా మలిచాడు.

మఖ్దూమ్‌వి అతిసున్నితమైన, ఆరోగ్యప్రదమైన, గౌరవప్రదమైన శృంగార భావనలు. ఉదాహరణకు :

"ఎక్ చంబేలీ మండ్వేతలే
మై కదేసె జరాదూర్ ఉస్ మోడ్ పర్
దో బదన్ ప్యార్‌కి ఆగ్‌మె జల్ గయె
ప్యార్ హర్వె వఫా
ప్యార్ ఉన్‌క ఖుదా
ప్యార్ ఉన్‌కి చితా
మస్జిదోంకె మినారోంనె దేఖా ఉన్హే
మందిరోంకె కినాధోనె దేఖా ఉన్హే
మై కదేకి దరాడోనె దేఖా ఉన్హే
యె బతా చారగర్
తేరి జన్ బేల్ మె
మస్ఠయె కీ మ్యాయె మొహబ్బత్ భి హై?
కుచ్ ఇలాజొ మదానాయె ఉల్ఫత్ భి హై?

1. ఒక చంబేలి పూల పందిరి కింద పాఠశాలకు కొద్ది దూరంలోని మలుపులో రెండు శరీరాలు ప్రేమాగ్నిలో దహించుకు పోయాయి.
2. ప్రేమే వారి దైవం. ప్రేమే వారి చితి.
3. మసీదులోని స్థంభాలు, మందిరాలలోని స్తూపాలు, పాఠశాల ద్వారాలు అన్నీ వారి ప్రేమను నిశితంగా గమనించాయి. పవిత్రమైన వారి ప్రేమకు సాక్ష్యంగా నిలిచాయి.

4. ఓ సృష్టి కర్తా! ఎన్నో మహిమలకు ప్రసిద్ధిపొందిన నీ జోలెలో ప్రేమను రక్షించడానికి, ప్రేమికులని ఆదరించడానికి చిట్కాలు ఏమైనా ఉన్నాయా అని అన్నదాత అయిన ఆ సృష్టి కర్తను మఖ్దూమ్ ఆ కవిత ద్వారా ప్రశ్నించాడు. మొదటి కవితకు రెండవ కవితకు వైవిధ్యముంది. మొదటిది జనాన్ని పోరుబాటలో నడిపించే విశ్వగీతమైతే, రెండవది విశ్వజనీనమైన ప్రేమ ఔన్నత్యాన్ని చాటి చెప్పింది.

మఖ్దూమ్ క్షణం తీరికలేని కమ్యూనిస్ట్ – రాజకీయ కార్మిక నాయకుడు. పుంఖాను పుంఖాలుగా రచనలు చేయగల తీరిక లేనివాడు. రాసినవి కొద్దిగానైనా అన్నీ అగ్ని కణికల్లాంటివే. ఆణి ముత్యాల్లాంటివే. అందమైన భావాలకు తన అక్షర రత్నాలను పొదిగి కవిత్వాభరణాలు చేయగలగడం ఆయనకు సహజంగా అబ్బిన కళ. ఆయన ప్రచురించిన కవితా సంపుటులు రెండు. *సుర్ఖ్ సవేరా* (అరుణారుణ ఉషోదయం) *గులెతర్* మళ్ళీ ఆ రెండింటిని కలిపి ముద్రించిన సర్వ కవితా సంపుటి *బిసాతె రఖ్స్* ఈ పుస్తకాలు ఇంగ్లీషు, రష్యన్, హిందీ, తెలుగు భాషల్లోకి అనువాదమయ్యాయి. 1933–34 ప్రాంతంలో మఖ్దూమ్ విద్యార్థిగా ఉన్నప్పుడే కవితలు రాయడం ప్రారంభించాడు. అది ఆయనకు ఉరుదూ, ఫారసీ కవితాతత్వాన్ని ఆకళింపు చేసుకుంటున్న తరుణం. తొలిదశలో *టూర్, వీలాదుశాల* గీతాలతో కవిగా పరిచయమైన మఖ్దూమ్, అనేక సీరియస్ అంశాలపై కవిత్వ పరంగా స్పందించాడు.

సామ్రాజ్య వాదాన్ని, ఫ్యూడలిజాన్ని దుయ్యబడుతూ *ఫగ్ పూర్ ఆత్మ* అనే కవిత ప్రకటించాడు. (దుర్మార్గాలకు పేరుగాంచిన ఆనాటి చైనా చక్రవర్తి ఫగ్‌పూర్) మతం ఒకవైపు, మౌఢ్యం మరోవైపు చుట్టుముట్టి దేశాన్ని నాశనం చేస్తున్నక్రమాన్ని ఆయన తన 'హవేలి' (దయ్యాల మేడ) కవితలో వర్ణించాడు. భారతదేశ సౌభాగ్యాన్ని నిలపడం కోసం యువకులంతా కదిలిరండని *ఆజాదీ యే వతన్* గేయంలో పిలుపునిచ్చారు. మనిషిని నానాటికి హీనుణ్ణి చేసిన సామ్రాజ్యవాద వ్యవస్థపై తన *మౌత్ క గీత్* (మృత్యుగీతం) ఎక్కుపెట్టాడు. రాముడు, గౌతముడు, మహాత్ముడు నడచిన ఈ భూమి మీద ప్రస్తుతం మృత్యువు మొలకెత్తుతోందని అన్నాడు. *అంధేరా, జుల్ఫె చలీపా* గీతాలలో – 1951లో జైల్లో ఉన్న కాలంలో ఆయన *ఖైద్* అనే కవిత, 1958లో *చాంద్ తారోంక బన్* (తారా చంద్రుల వనం) వంటివి రాశాడు. ఈ గీతం స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం తరువాత –భవిష్యత్తు – మూడు కాలాలను వివరించింది. ఆయన రాసిన ప్రతి కవితా, ప్రాచుర్యం పొందిందే!

"అంగ్డాయియా లేతా హూఆ తుఫాన్ె జవాని
మల్తా హూ ఆ ఆంఖేఁ ఉఠా ఫిత్నోంకో జగానె"

స్త్రీ పట్ల, ప్రేమపట్ల, ప్రేయసిపట్ల ఆయనకున్న సున్నితమైన భావాలు ఎలాంటివో చూడండి.

యవ్వనం ఒళ్ళు విరుస్తూ, ఉప్పెనలా పొంగుతూ, ఎన్నో వికారాలతో చమత్కారాలు చేస్తుంది అంటూ యవ్వన అనుభూతుల్ని, ఆలోచనల్ని ఆయన అక్షరీకరించాడు.

"రాత్ భర్ దీదయె నమ్నాక్మె లహరాతె రహే
సాన్స్ కి తరహ ఆప్ ఆతే రహే, జాతే రహే"

రాత్రంతా కన్నీళ్ళు కార్చడంతోనె సరిపోయింది. ప్రతి ఉచ్ఛ్వాసలో నీవు వస్తున్నట్లు, ప్రతి నిశ్వాసలో నువ్వు వెళ్ళిపోతున్నట్టు నాకు అనిపిస్తోంది – అని అంటాడు. ఇక్కడ మఖ్దూమ్ గాలిబ్ శైలిని అందుకున్నాడు.

అలాగే మరో అద్భుతమైన కవిత చూడండి.

"పానీ మె లగీ ఆగ్, పరేషాన్ హై మచిలీ
కుచ్ షోల బదన్ ఆయే హై పానీమె నహానె"

నీటిలో జ్వాలలంటుకున్నవేమిటని చేపలు ఆందోళన పడ్డాయి. అందమైన అమ్మాయిల శరీరాలు కొన్ని స్నానం కోసం నీటిలోకి దిగాయి–ఒక సాధారణమైన అంశాన్ని అతి రమణీయంగా, రొమాంటిక్‌గా వర్ణించిన కవి ప్రతిభకు ఎంత మెచ్చుకున్నా తక్కువే –

"దిలోమె ఆజ్ ధామ్ ఆర్జూ లబ్ బంద్ రహేథే
నజర్ సె గుఫ్తగు హోతీథీ దమ్ ఉల్ఫత్ క భర్తే థే"

మనసులో ఎన్ని ప్రేమ భావనలున్నా పెదాలు కదిలేవి కావు. చూపులతో ప్రేమను వ్యక్తం చేసుకునేవాళ్ళం. పరవశమైన మనసుతో ప్రేమను నింపుకునే వాళ్ళం. ప్రేమతో కొన్ని అనుభవించవల్సిన అవస్థలు మాత్రమే ఉంటాయి. వ్యక్త పరచగలిగేవి ఉండవు. అలాంటి మధురమైన అనుభూతులను సైతం మఖ్దూమ్ తన కవితలో స్పర్శించాడు.

"ఎక్ అయిన గంజో ఆం సూ బన్ కె బహె సక్తా నహీఁ
దిల్ సె మహసూస్ కర్ సక్తాహై కహెసక్తా నహీ"

కంటి నుండి కన్నీరై ప్రవహించలేని బాధ మనసును తాకుతుంది. అనుభవించుతుంది కాని, బయటికి

వెలిబుచ్చలేదు. ఇది ప్రేమికుల్లో నిగూఢంగా ఉండే అనుభూతి.

మానవతావాది, అకళంక దేశభక్తుడు, రాజకీయ, ప్రజా, సామాజిక జీవితంలో ప్రమాణాలకు, నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చిన ప్రజాస్వామ్య వాది. విప్లవ గీతాలు రచించినా, ఆయన ఆకాంక్షించింది యుద్ధాలు సమసి పోవాలని, శాంతి వర్ధిల్లాలని మాత్రమే ! ఉదాహరణకు యుద్ధ భీభత్సాన్ని అద్భుతంగా వర్ణించిన కవిత *సిపాహి* పరిశీలించొచ్చు. అలాగే *తెలంగాణ* కవిత తరతరాలను ఉత్తేజపరచగలది. భాష తెలియపోయినా ఒక ప్రవాహంలా సాగే *జంగె ఆజాదీ* గీతానికి రష్యన్లు సైతం ఊగిపోయారు. *ఇంతెజార్, సాగర్ కె కినారె, చంబేలీ కె మండ్వే తలె* వంటి గీతాల్ని... ఆయన లేఖిని నుండి జాలు వారిన అమృత ధారలు!



తన *గులెతర్* (తాజారోజా) కవితా సంపుటికి ముందు మాట రాసుకుంటూ ఇది సమాజ పురోగతిని, చైతన్య స్రవంతిని ప్రతిబింబిస్తుంది. ఇందులో మానవత, ప్రగాఢమైన రసానుభూతి, ఇంద్రియానుభూతి ఉమ్మడి విలువలుగా మిగిలి పోతాయి'' అని ఆశించాడు. బహుముఖ ప్రజ్ఞాశాలి! విద్యావంతులకు, సాహితీ ప్రియులకు మఖ్దూమ్ – ఒక మహాకవి! పామరులకు, శ్రమజీవులకు – ఒక కామ్రేడ్!!

తెలుగు మహాకవి దాశరథి కృష్ణమాచార్యకు మఖ్దూమ్‌కు మధ్య గాఢ స్నేహం పరిఢవిల్లింది. 1945లో దాశరథికి మఖ్దూమ్ *దివానె గాలిబ్* గ్రంథాన్ని బహూకరించాడు. దానిని దాశరథి జైలులో ఉన్నప్పుడు కూడా దగ్గర ఉంచుకునే వాడు. ఒకసారి ఒక జైలు నుండి మరొక జైలుకు తరలిస్తున్న సందర్భంలో, జైలర్ ఆ గ్రంథాన్ని తీసుకుని, ఇచ్చేది లేదన్నాడట. దాశరథి అంతకన్నా మొండికేసి "అది నాకు ఒక మహాకవి ఇచ్చిన బహుమతి, అది ఇవ్వకుంటే నీళ్ళు, అన్నం ముట్టను. ఈ జైలు విడిచి పోను. ఇక్కడే ప్రాణాలు విడుస్తాను" అని నిజామాబాదు జైలులో భీష్మించుకుని కూర్చున్నాడట! తెలంగాణ సాయుధ పోరాటంతో ప్రత్యక్షంగా సంబంధమున్న మఖ్దూమ్ మొహియుద్దీన్, వట్టికోట ఆళ్వారు స్వామి దాశరథి కృష్ణమాచార్యలాంటి వారి స్థాయి మహోన్నతం! మన దౌర్భాగ్యమేమంటే ఇలాంటి వారిని మరిచిపోయి, నిజాం దగ్గర చిన్న ఉద్యోగం కోసం వెంపర్లాడిన వారిని, నైతికంగా దిగజారిన వారిని, మహాకవులుగా కొందరు ప్రచారం చేస్తుంటారు. ప్రజా పోరాటాలతో మమేకమయిన వారికి ఎప్పుడూ ప్రథమ స్థానమివ్వాలి!! పరిపూర్ణ వ్యక్తిత్వం గల మఖ్దూమ్‌లాంటి మహాకవులు కాలప్రవాహంలో ఎప్పుడోగాని జన్మించరు. మఖ్దూమ్ కవిత్వాన్ని గజ్జెల మల్లారెడ్డి చాలా వరకు తెలుగులోకి అనువదించారు. ఆయన జీవితం గూర్చి, సాహిత్య కృషి గురించి డా. రాజబహదూర్ గౌడ్, దేవుల పల్లి మదన్‌మోహన్‌రావు ప్రభృతులు విపులమైన వ్యాసాలు రాశారు.

ఉర్దూలో మఖ్దూమ్ పై చాలా రచనలు వచ్చాయి. అంజుమనె తరఖి ఉర్దూ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వంటి సాహిత్య సాంస్కృతిక సంస్థలలో ముఖ్యుడు మఖ్దూమ్. భారత కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో పాల్గొనడానికి ఢిల్లీ కెళ్ళిన మహాకవి మఖ్దూమ్, 25 ఆగష్టు 1969న గుండెపోటుతో కన్నుమూశారు. సాహిత్య కారులు, సాహిత్య విమర్శకులు చేస్తున్న పెద్ద పొరపాటేమిటంటే తెలంగాణ పోరాటంతో ప్రత్యక్షంగా సంబంధమున్న మఖ్దూమ్ మొహియుద్దీన్ లాంటి కవిని స్మరించుకోరు. వట్టి కోట ఆళ్వారు స్వామిని తలవరు. స్వయంగా తుపాకి పట్టుకొని పోరాటంలో పరిగెత్తిన దాశరథి కృష్ణమాచార్యను గుర్తుంచుకోరు. అదే సమయంలో ఒక చిన్న ఉద్యోగం కోసం నిజాం దేవుడీ చుట్టు ప్రదక్షిణలు చేసిన శ్రీశ్రీని మాత్రం మహాకవిగా కీర్తిస్తూనే ఉంటారు.

ఎంత గొప్ప వారైనా వ్యక్తి గతక్రమశిక్షణ లేక, విలువల్ని వొలిచేసుకున్న వారిని ఒక పరిమితిలో ఉంచడం మేలు ! జనంతో మమేకమై జన పోరాటాలతో మమేకమైన వారికి ఎప్పుడూ ప్రథమ స్థానం దక్కాలి! ఆధునిక విప్లవ తెలంగాణ నిర్మాతలలో అగ్రగణ్యుడైన తేజోమూర్తి ముఖ్దూమ్ మొహియుద్దీన్ – సర్వదా స్మరణీయుడు!!

డా॥ దేవరాజు మహారాజు
హైదరాబాదు, ఫోన్ : 9908633949

జడ అల్లి జడకుచ్చులిడిన
రాయప్రోలు

– గెల్లి రామమోహనరావు

ఏదేశమేగినా, ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము *(ఆంధ్రావళి)*

అని ఎలుగెత్తి చాటిన దేశభక్తిని ప్రభోదించిన తెలుగు వాడు. అభిమానంలో, భావాలలో, పోడిమలో, పోకడలలో తీయని, మెత్తని పదాలను సున్నిత శ్రావణంతో ఏరి నాజూకుగా పాడగల నవీనాంధ్ర కవితాయుగకర్త రాయప్రోలు సుబ్బారావుగారు! వీరు గుంటూరు జిల్లా గార్లపాడులో 1892లో మార్చి 15న జన్మించారు. 1908లో కవిత్వ రచన ప్రారంభించారు. 1910లో ఉన్నత పాఠశాలలో చదివారు. గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో కళాశాల విద్యకు శ్రీకారం చుట్టారు. హైద్రాబాదు నిజాం కాలేజిలో చదువు సాగించారు. 1915 డిశంబరు మొదలు మూడేళ్లు శాంతినికేతనంలో రవీంద్రుని అంతేవాసిత్వం లభించింది. అక్కడ నుండి కాశీనగరానికి వెళ్లారు. ఒక సంవత్సరం పాటు పండితులతో శాస్త్ర చర్చలు చేశారు.

1921లో ఉస్మానియా విద్యాలయ తెలుగు శాఖకు అధ్యక్షులయ్యారు. క్రమంగా రీడరు, ప్రొఫెసరు అయ్యారు. వరంగల్లు కాలేజి ప్రిన్సిపాలుగ పదవీ బాధ్యతలు స్వీకరించారు. వరంగల్లు నుండి తిరుపతి విశ్వవిద్యాలయానికి వెళ్ళారు. తెలుగు శాఖాధిపతి అయ్యారు. మూడేళ్ళపాటు ఆ పదవిని నిర్వర్తించారు. పిదప ఉద్యోగం విరమించారు. సికింద్రాబాదులోని మారేడుపల్లిలో స్వగృహంలో స్థిరపడ్డారు. జీవిత కాలంలో సన్మానాలు సత్కారాలు పొందారు. హాయిగా జీవితాన్ని గడిపారు.

ఈయన లలిత, తృణకంకణము, కష్టకమల, స్నేహలతాదేవి, తెనుగుతోట, స్వప్న కుమారము, మధుకలశము, మాధురిదర్శనము, రమ్యాలోకము, ఆంధ్రావళి, రూప నవనీతము, మిత్రమంజరి మొదలైన కావ్యాలు, కాళిదాసుని *మేఘసందేశము,* రవీంద్రుని *కవితలు, భవభూతి ఉత్తరరామచరిత్ర,* ఉమర్ ఖయ్యాము *రుబాయీలు,* ఈ నాలుగింటిని అనువదించి తెలుగువారికందించారు.

రాయప్రోలు వారిపై ఆంగ్ల కాల్పనిక కవుల ప్రభావము పొడచూపింది. కావ్యాలు నవ్య కవిత్వ యుగానికి స్వాగతం పలికాయి. "కాల్పనిక కవుల కవిత్వమునకు ప్రాణభూతమైన కల్పనకగ్ర తాంబూలమిచ్చిరి. సౌందర్యముతో అద్భుతత్వమును సమ్మేళనమొనర్చిరి. నేపథ్యములో నిలిచి పోయిన ప్రకృతిని రంగస్థలముపైకి తెచ్చిరి. సామాన్య వస్తువులకు మాన్యతనిచ్చిరి. అనాదృత విషయములకు ఆసనము వేసిరి".

కాల్పనిక కవిత్వాన్ని భావకవిత్వమని పిలవటం పరిపాటయింది. దరిదాపుగా ముప్పై సంవత్సరాలపాటు భావకవిత్వం సాహితీ సామ్రాజ్యాన్ని ఏలింది. కవిత విస్తృతి పెరిగింది. ప్రాచీన సాహితీ సంప్రదాయకులు సహితం భావ కవిత్వంపై మక్కువ చూపారు.

శేషాద్రి రమణ కవులు, కొమండూరి కృష్ణమాచార్యులు వంటి విద్వత్కవులు భావకవితారచనలు చేశారు. సద్విమర్శకులు పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు శాస్త్రీయ దృష్టితో భావకవిత్వాన్ని పరిశీలించి ఒప్పు మెప్పులు కలిగించారు. అభ్యుదయ కవిగా లబ్ధప్రతిష్ఠులైన శ్రీశ్రీ సహితం భావకవితా ఖండికలు తొలిరోజుల్లో రచించారు. తరువాత కాలంలో దాని నుండి బయటకు వచ్చారు. నూతన కవితారచనకు ఆద్యులయ్యారు.

విమర్శకులు ప్రణయతత్వం, ప్రకృతి ప్రీతి, దేశభక్తి, ఆత్మాశయత్వం భావ కవితాలక్షణాలని వివరించారు. ఈ కవితా మార్గంలో రాయప్రోలు, దేవులపల్లి, విశ్వనాథ, తల్లావజ్ఝుల, బసవరాజు, బాపిరాజు, నండూరి, నాయని వైతాళికులు – ముద్దుకృష్ణ, ఆధునికాంధ్ర కవిత్వము – ఆచార్య సి. నారాయణరెడ్డి వంటి కవులు భావకవితకు తుష్టి, పుష్టి కలిగించారు. ఈ కవులందరూ ప్రాచీన సాహిత్యాన్ని ఆపోసనపట్టినవారే.

ప్రణయతత్వం : "స్త్రీ పురుషుల ఆత్మలు మొదట అఖండముగా, ఏకముగా నుండునని, ఆ అఖండాత్మయే రెండుగా విడిపోయి స్త్రీ పురుషులుగా రూపొందినదని, మరల వీరిద్దరు ప్రణయ సూత్రములో ముడి పడిపోయినప్పుడు అఖండాత్మల కేకీకరణము జరుగును. ఈ తత్వమునే కాల్పనిక కవుల ప్రతిపాదించిరని ఆచార్య నారాయణరెడ్డిగారు ప్లేటో తత్వాన్ని పరామర్శిస్తూ తమ పరిశోధక గ్రంథంలో పేర్కొన్నారు. కాల్పనిక కవులైన మనవారు స్త్రీని కామదృష్టితో చూడలేదు. ఆమె తోడిదే లోకం అని విశ్వసించి ఆరాధించారు. కైమోడ్పుల కానుకలు సమర్పించారు. సంయోగంలో సంతోష తరంగ డోలికలూగారు. వియోగంలో విషాదవీచికల్లో మునిగారు.

సుబ్బారావు గారు తమరచనలైన లలిత (అనువాద కావ్యము) తృణ కంకణము, కష్టకమల, స్వప్నకుమారము మున్నగు వాటిలో ప్రణయమే ప్రధాన సూత్రమయ్యింది.

నా ప్రియసఖి, అనురూప గు
ణ ప్రచుర, ప్రసన్నశీల; నవనీత శిరీ
ష ప్రణయ మృదుల హృదయ *(లలిత)*

నాయికా నాయకులు ప్రణయపాశంలో చిక్కుకున్నారు. కాని వియోగ తప్తులు కాలేదు. తాను ప్రేమించిన స్త్రీ అన్యదత్తమైనదని ప్రియుడు విలపించాడే కాని ఆమెను తృణీకరించక అనురాగామృతాన్ని పంచి ఇచ్చాడు. వారి ప్రణయ ఔన్నత్యానికి గీటురాయి.

ప్రకృతి ప్రీతి : భావకవులు ప్రకృతి ఆరాధకులు, లలిత సుమాళిల గుభాళింపులు, జలధారల పరుగులు, మెరపుల ఫెళఫెళార్భటులు, తరువుల ఆర్భాటాలు, చిగురుల పదవిడులు, విహంగాల కిలకిలారావాలు ప్రకృతిలో దర్శనమిచ్చే అపూర్వదృశ్యాలు. కవులు ప్రకృతి కాంతతో దోబూచులాడారు. అనంతాంబరపు నీలినీడలమాటున హాయిగా కేరింతలాడారు. కలనైనా, కలవరమందైన ప్రకృతి పారవశ్యమే పరమానందమైంది.

రాయప్రోలు వారి కావ్యాల్లో ప్రకృతి పరవశించి పాడింది. పాఠాలు నేర్పింది. పరిష్వంగంలో పరమార్థాన్ని చూపించి లాలించింది. వెన్నెలలు కురిపించింది. ఉద్వేగోల్లాసాలు, హాసత్రాసాలు, వినోదవిస్మయాలు ఛందోరూపమెత్తి మధురకవితలుగా అవతారం దాల్చాయి.

కవిగారి రచన జడకుచ్చులు కావ్యం అందులో ప్రకృతిని రాగరంజితంగా చిత్రించారు. ఆ వసంతంలో నిఖిల తరువుల పుష్పఫలశోభితమై అలరారాయి. కలికి కోయిల గొంతులో మొలక గీతికల సోయగం కన్నుల నింపి వీనుల విందు చేశారు. సుమబాలలు తీయతెనెలు నింపుకొన్నాయి. పొదల వాకిళ్ళు తెరచి ఉంటాయి. తుమ్మెద కుమారితలు ఝంకారం చేశాయి. మోళ్ళు మోసులెత్తాయి అంటూ...

కొమ్మకొమ్మన ఆకునాకున నలంది
పూవుపూవున చివురు చివురున జింద
చిలికితి నూత్న చైత్ర కాశ్మీర రుచులు
పుడమినవకమ్మునకు వన్నెలిడు వసంత

చైత్రమాసంలో వచ్చే వసంత ఋతువిలాసంలో సుమాల గుబాళింపులు నలుదెసలకు వ్యాపిస్తాయి. ప్రకృతి ప్రియులు సుఖరక్తితో సోలిపోతారు. నవనవలాడే చిగురుటాకులు మిలమిలామెరుస్తాయి. వసంత సౌభాగ్యాలింతింతని చెప్పడం సులభంకాదు.

కష్టకమల కావ్యంలో ప్రకృతి వర్ణన బహు రమ్యంగా చేశారు కవి. ముత్తెపు దండవలె ఏగెడి పొటుపుటేరు, నిగనిగలెగయు కన్నె చిగుళ్ళ గుత్తుల నీడలారెడు చిరునిమ్మచెట్లు, పున్నాగ మొక్కలు, చేమంతి మడులు, బంతిపూల కుదురులు మున్నగు పూలను వర్ణించారు. రాయప్రోలువారు గార్లపాడు పల్లెలో జనించిన కారణం చేత ప్రకృతి ప్రాభవాన్ని చిన్ననాటి అనుభూతితో రంగరించి చెప్పారనిపిస్తుంది.

దేశభక్తి : "1913 నాటి ఆంధ్రోద్యమము ఈయన దృష్టికి ఆంధ్రతేజస్సును సాక్షాత్కరింపించింది. ఒకనాటి ఆంధ్రౌన్నత్యాన్ని అపూర్వ కవితాదృష్టితో చూడగల్గాము. ఆనాటి మహత్కార్యాలకు తన జాతిని పురికొల్పి తనకవిత్వాన్ని కళనూ, ఆవేశాన్ని ఉపయోగించి దేశీయ హృదయాలను కలచి భక్తితో, బాధతో, ఆందోళనతో, కారుతూ వున్న కన్నీటి జాలు వెలుగులో పూర్వపుటాంధ్రౌన్యత్వాన్ని, భావి శోభను దర్శింప చేశారు." సుబ్బారావుగారు.

స్వరాజ్య ఉద్యమంలో ఆంధ్ర రాష్ట్రోద్యమం మొలకలెత్తింది. ప్రధాన కారణాలు రెండు. ఒకటి ఆంధ్రులు తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకొనుట, మరొకటి ప్రత్యేకాంధ్ర రాష్ట్ర స్థాపన. బ్రిటీషువారి పాలనాకాలంలో మనమంతా మదరాసీయులమే. అలనాడు ఆంధ్రుల దేశచరిత్రలో ప్రముఖ స్థానం వహించారని అందరికీ తెలుసు. కాలవశాన తమిళ తంబిల మధ్య ఇరుక్కుపోయాం. ఆ ధృతరాష్ట్ర కౌగిలి నుండి బయట పడాలని పలువురు ఆరాటపడ్డారు. దీనికి తోడు వంగ విభజన ప్రభావం చూపింది. ఆ తరువాత

భాషాప్రయుక్త రాష్ట్ర విభజన ముందుకు వచ్చింది. ఆంధ్రుల్లో కదలిక ప్రారంభమయింది. ఉద్యమానికి కృష్ణ, గుంటూరు ప్రదేశాలు ప్రాణం పోశాయి. 1903-04 ప్రాంతంలో యువజన సాహితీ సమితి ప్రారంభింపబడింది. 1907-08 సంవత్సరంలో బందరులో ఉద్యమ సంబంధ సభ జరిగింది. ఈ సభలో నైజాం ఆంధ్రులు పాల్గొన్నారు. ఉద్యమం కొనలు సాగుతూంది. 1913లో బాపట్లలో ప్రథమ మహాసభ జరిగింది. రాష్ట్రోద్యమం పరుగులు పెట్టింది. ఆధునిక తెలుగు కవులు బానటగా నిలబడ్డారు. దేశీయాభిమానం పెచ్చుపెరిగింది. ప్రబోధగీతాల రచనతో నడుంబిగించారు. అట్టి వారిలో రాయప్రోలు వారు పేర్కొనదగిన వారు. తెలుగుదేశంలో కలుగుతున్న ఉత్తేజాన్ని నూతనశక్తిని అనుభవించి ఆంధ్రాభిమానంతో ఉడికిపోయిన భావకవి ఈయన. కవితలు వ్రాశారు. ఉత్సాహాన్ని రేకెత్తించారు. విశ్వనాథ, కొడాలి, బసవరాజు, జాషువా, తుమ్మల మొదలైన వారు రాయప్రోలు వారి బాణిలో రాష్ట్రగానం చేశారు.

ఈ స్వర్గఖండంలో జనించటం, పూర్వజన్మ సుకృతం, లేదురా ఇటువంటి భూదేవియందు, లేరురా మనవంటి పౌరులింకెందని, ఈ నేల, జాతి గొప్పదనాన్ని చాటి చెప్పారు. పొలాల్లో రత్నాలు మొలిచాయి. సంపదను చైయెత్తి జైకొట్టి ఎలుగెత్తారు. అవమానవేలరా, అనుమానవేల, భారతీయుడవంచు భక్తితో పాడమని ప్రబోధించారు కవి. ఈ ప్రబోధాల ప్రభావంతో జాతి జీవనంలో చైతన్యం పెల్లుబికింది.

రాయప్రోలు వారి *ఆంధ్రావళి* గీతికలు ఆంధ్ర దేశమును, ఆంధ్రమహాపురుషులను, ఆంధ్రుల చరిత్ర చరిత్రయందలి మహోజ్వల ఘట్టములను బహుదా ప్రశంసించియున్నారు. అంతటి భావోద్రేకముతోనే భరత భూమిని కీర్తించి యున్నారు. నిజమునకానాటి మహాకవులందరును ఈ మార్గమునే అనుసరించిరి. ఆంధ్రయశోగీతికల నాలపించిన కవులందరకును సుబ్బారావు మార్గదర్శకులు.

సంస్తుతి : రాయప్రోలు తమకవితల్లో శివశంకర శాస్త్రి, శ్రీమతి సరోజినీనాయుడు, కట్టమంచి రామలింగారెడ్డి వంటి ప్రసిద్ధులను అభిమానించారు. ఆ అభిమానమే గీతికాలాపనకు ప్రేరకమయ్యింది. తనతోటి కవి శివశంకర శాస్త్రిని రజని నందిలి వీడి రాలేక, రాలేక, వెనుకముందాడేటి విరహగంధవహుండు, నిండురెక్కల క్రింద నిదురించు నెలకూనలను లేప పాడేటి నునుపుల్గు బాలెంత, తూర్పు వాకిలి ముందు తొగరు వన్నెల నూలు, అలవోక వడికేటి అనుణాంశుక కుమారి, నీ స్వప్న నగరాల, నీ పచ్చవాకిండ్ల, నవద్వంచుత రుచుల్ శివశంకర కవీంద్ర! అని అక్షతలు వెదజల్లారు. సరోజినీదేవి భారత కోకిల. ఆమె కవితలు మందార మాలలు. బాలమామిళ్ళలో, తీయగా రాగాలు తీసేటి కోయిలలు, హాయిగా ఆడుచూ పాడుచూ విశ్వమోహనంగా విహరించే కలహంసల ఆనంద బంధ సుందర గీతాలు. ఆమె స్వాదు పదావళి సామ్రాజ్యానికి రాణియై, కవన కల్యాణియై వర్థిల్లింది. దౌర్భాగ్య భారత తంత్ర తంతులు తెంచాలని, సౌభాగ్య భారత జాతకం రచించాలని కామాక్షియై మహాకాళియై, సౌందర్య మాతయై, స్వచ్ఛంద దూతియై ఈ నేలపై అడుగు మోపిందని సరోజినీదేవిని కీర్తించారు.

కట్టమంచి రామలింగారెడ్డి – ఆంధునికాంధ్ర కవితా సమీక్ష – డాక్టర్ కాకర్ల వెంకటరామ నరసింహంని తెలియని వారు లేరు. ప్రాచీన కవితా సంప్రదాయాలను ఆమూలాగ్రంగా గ్రహించిన వారు. కొత్తదనపు తావులెగజిమ్మెడు ముసలమ్మ మరణము కావ్యాన్ని రచించారు. 1889లో చెన్నపట్టణం క్రైస్తవ కళాశాలలో *ఆంధ్రభాషాభి రంజనీ* సమాజ స్థాపకుడు సమర్థి రంగయ్య శ్రేష్ఠి కావ్య రచనలను ప్రోత్సహించుటకై ఏర్పరచిన పోటీ పరీక్షలో ముసలమ్మ మరణము కావ్యం నెగ్గింది. వారిని ప్రశంసిస్తూ...

ఉత్తమ అధ్యాపకుండవయి యొప్పినావు
విశ్వవిద్యాలయము మోడి వెలసినావు
సహృదయ స్వామివై కళల్ సాకినావు
కట్టమంచి రసాల శాఖా ఫలంబు *(ఆంధ్రావళి)*

అని అన్నారు. కాశీనాథుని నాగేశ్వరరావు ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు. వారి ఔదార్యం, సహాయ సహకారాలు అనిర్వచనీయం. ఆ మహనీయుని గుణగణాలను కీర్తించారీ విధంగా...

అడిగినది లేదను నడు నెన్నడేని నా
ల్మకు రాని యర్థాధి కల్పశాఖ
రచయింతు మనుచు చేరగ శతపత్రముల్
వ్రాయకుండని కావ్య రసిక మౌళి
చిత్రించు మనుచు వచ్చిన పిడికిళ్ళనీ
యకపోవ లేని కళాభి మాని
ఆశ్రమ స్థాపనమన్న వేయారు స

మర్పింపకుండని త్యాగరాజు.
ఖండ ఖండాతరముల నుండి గంగబోలె
నింటికేతెంచు ద్రవ్యవాహినికి పెక్కు
గండ్లుగొట్టి సంతోషించు కర్మయోగి
ఈశ్వరుండీయడేల నాగేశ్వరునకు *(ఆంధ్రావళి)*

ఆ మహనీయుని అజరామరంగా నిలిచేవారు. వారి ఉదాత్తతను, గంభీర మనోభావాలను, వైయక్తికంగా వర్ణించి చెప్పాడు.

తెలుగు నవకవులు ఆంగ్లాది భాషలధ్యయనం చేశారు. అయినను మాతృభాషపై మమకారాన్ని పెంచుకొన్నారు. మధుర కవితలల్లి తెనుగుకు శోభ కలిగించారు. తెలుగుభాషంటే తేనెలొల్కు భాషయని రాయప్రోలు వారి అభిప్రాయం. మాతృ భాషలో మార్దవం ఉంది, మిగడులున్నాయి, తేనె చుక్కలు జాలువారుతాయి, పూల లావణ్యాలు పొంగులువారతాయి, సెలయేటి ఉయ్యాల కులుకుటొయ్యారాలూగుతాయి. ముద్దుముచ్చటులు ముప్పిరి గొంటాయి అనుచూ తెలుగు పలుకుల కమ్మదనాన్ని రుచి చూపించి మా తెలుగు తల్లి మెడకిదే మల్లెదండని అక్షరహారతులిచ్చారు.

సంక్రాంతి తెలుగుపల్లెల సిరులపూబంతి, తెలుగు బిడ్డల తేనెవాకలు, తెలుగులోగిళ్ళు ముత్యాల ముగ్గుల పందిళ్ళు, పంటపొలాలకాంత్రి సంక్రాంతి, పల్లీయుల పరమానంద సౌభాగ్యానికి, సంక్రాంతి ప్రతీక. రైతు పంటరాసులపై పవళించి లేస్తాడు. తెలుగు వాడలను పరికిస్తాడు, జనావళికి కడుపు నింపుతాడు.

తెలుగు తల్లులు వన్నెముగ్గులతో వాకిళ్ళు తీరుస్తారు. పూదేనితో వారం పోస్తారు. బొమ్మల కొలువులు పెడ్తారు. పేరంటాళ్ళను తమ ఇంటికాహ్వానిస్తారు. చిన్నారులను ఆసనాలపై కూర్చోండపెడతారు. లలనామణులు పాలబుగ్గల చిన్నారులపై అక్షతలు జల్లుతారు. భోగిపళ్ళు శిరంపై పోసి ఆశీర్వదిస్తారు. అది తెలుగువారి సంప్రదాయం, తెలుగుజాతీయుల సంక్రాంతిని *సంక్రాంతి* గేయంలో చక్కగా చెప్పారు.

రాయప్రోలువారు సంస్కార వాణి. వారు రచించిన *తృణకంకణము, స్నేహలతాదేవి, స్వప్నకుమారము* కావ్యాల్లో సంఘ సంస్కరణ దృష్టికన్పిస్తుంది. *తృణకంకణము* కావ్య విషయాన్ని ఖండవల్లి లక్ష్మీనిరంజనంగారు పేర్కొన్నట్లుగా Insolated wire కాలగమనము, తిరుగుబాటు ఆటుపోట్లు తృణకంకణం అనే జీవ విద్యుత్తంత్రి మీద సంరక్షక ఆచ్ఛాదనమును కల్పించియుండవచ్చును. కాని దానిని ముట్టుకు చూస్తే దానియందలి జీవలక్షణం చురుక్కున భావహస్తమునకు తగలక మానదు. సాత్విక చైతన్య లక్షణం అంతా అంతే... *స్నేహలతాదేవి* వరకట్న దురాచారంపై వరకట్న తిరుగుబాటు అస్త్రం ప్రయోగించిన కావ్యం. *స్వప్న కుమారము* సోదరీత్వానికి మాతృత్వానికి చిహ్నంగా ఉంటుదీకావ్యం. స్త్రీని భోగ్యవస్తువుగా తలంచే వారికి ఈ కావ్యం కనువిప్పు కలిగిస్తుంది.

కవి ఆశించిన సంఘసంస్కార ధోరణులు ఈ కావ్యాల్లో చూపించారు. తెలుగు సాహితీ ప్రాంగణంలో అవధానాలు జరుగుతున్నాయి. ఏ భాషలో కూడ ఈ అవధాన ప్రక్రియలేదు. కేవలం ఈ అవధానాలు తెలుగువారితోనే ప్రారంభమయ్యింది. తెలుగుభాషకివి మణిమయ మకుటాలు. అవధానాలు తెలుగుసాహిత్యాన్ని ఏలుతున్నాయి. అట్టి తరుణంలో రాయప్రోలు వారికభిమానం కలిగింది. తిరుపతి వేంకటకవుల శిష్యుడైన అవ్వారి సుబ్రహ్మణ్యం శాస్త్రి రాయప్రోలు వారికి మేనమామ. మొదట్లో మేనమామ, మేనల్లుడు అవధానాలు సాగించారు. ఆ విధంగా కొంతకాలం జరిగింది. ఒకసారి సుబ్బారావు గోపాలరెడ్డి ఆహ్వానం మీద బుచ్చిరెడ్డి పాలెం వెళ్ళారు. గోపాలరెడ్డి జనకులు పట్టాభిరామిరెడ్డిని గూర్చి ఆశువుగా పద్యాలు చెప్తున్నప్పుడు ధార కుంటుపడింది. అవధానాలు, ఆశుకవితలపై విరక్తి కలిగి జననీ! యేమిటికింక ఆశుకవితా సన్యాస మిప్పింపవే అంటూ దుర్వ్యసనంజేటికి, త్రిప్పుమీక జననీ రమ్యాక్షర క్షోణికిన్ మరల్చుమని ఇష్టదేవతను ప్రార్థించారు. నాటి నుండి అవధానాలకు భరతవాక్యం, అభినవకవితకు నాంది పలికారు.

నవ్యాంధ్ర సాహిత్యానికి చైత్రపల్లవాల తీయని కవితల రాగాలాపన చేసిన నవయుగ సూత్రధారి. జాతీయాభిజాత్యానికి కవితామాలికలందించి, నవ్య కవితాకాంత చరణ చక్రవర్తి రాయప్రోలు సుబ్బారావుగారు. ఆయన కవితలు సూర్యుని వెలుతురు సోకునందాక, పున్నమి వెన్నెల కురియు నంతవరకు, తెలుగువాని జిహ్వలపై నవరసాల నర్తనాలు సలుపుతూనే ఉంటాయి.

గెల్లి రామమోహనరావు
గుంటూరు, ఫోన్ : 0863-2357514

సంజీవదేవ్

ప్రజ్ఞా సంజీవనం

– సి. వేదవతి

జీవితాన్ని కాంతిలో జీవించి, శాంతితో మరణించడాని కంటే మించిన ఆనందం మరేమున్నది కనుక! అనగలిగిన జీవన దార్శనికుడు సంజీవదేవ్.

జీవితాన్ని కాంతిమయం చేసుకొని, ఆ కాంతిని ఇతరులకూ పంచిపెట్టటమూ–

మరణాన్ని కూడా శాంతిమయం చేసుకొని, ఆ తరవాత కూడ జీవన సౌరభాన్ని వెదజల్లటమూ –

చేతనయిన కొద్దిమంది అపురూపపు వ్యక్తులలో ఎన్నదగిని వాడు సంజీవదేవ్!

తెలుగు వాడు అతడు – తెలుగు గడ్డ నడిబొడ్డున నిన్నమొన్నటి వరకూ ఋషిలాగ జీవించిన వాడు.

పేరులోనే కాదు – బ్రతుకులోనూ సంజీవన రసరాగాలను నిలుపుకొన్న వాడు. మనిషిగా జీవిస్తూ ఋషిత్వాన్ని అందుకొన్నవాడు. ఋషిత్వంలోనూ మనిషితనాన్ని మరువని వాడు.

సామాన్యంగా కనిపించే, అసామాన్యజీవి ఆయన. బహుముఖీనమైన ప్రజ్ఞా తత్త్వం ఆయనది.

నిపుణుడైన రచయిత. ప్రకృతి చిత్రకారుడు, విమర్శకుడు, ఉపన్యాసకుడు, జీవన తత్త్వవేత్త, కళాదర్శకుడైన రసవేత్త. మనోవైజ్ఞానిక శాస్త్రవేత్త. కళా తపస్వి – అన్నిటినీ మించి మానవ హృదయ స్పందనలను ఎరిగిన మనస్వి– సంజీవదేవ్.

అద్భుతంగా అనిపిస్తుంది కానీ, ఈ ప్రజ్ఞా తత్త్వమంతా ఆయన స్వయం సాధనతో సిద్ధింప చేసుకున్నదే!

మేధావులందరికి మల్లేనే మొక్కుబడి చదువుల్లో ఇమడ లేకపోయాడు సంజీవదేవ్. అంతులేని జిజ్ఞాసతో, ఇంటి నుండి బయటపడి, జీవన విశ్వవిద్యాలయంలోకి అడుగు పెట్టాడు.

తన పదహారవ ఏట ఒంటరిగా హిమాలయాలకు వెళ్లటం, అక్కడ పరిచయమైన ఎందరో మేధోజీవుల సాహచర్యంతో, నిరంతర అధ్యయనంతో, కృషితో, కాలక్రమాన తానే హిమాలయమంత ఎత్తుకు ఎదగడం – అదంతా ఒక అద్భుతమైన కథ!

ఆ వాస్తవ స్వీయ జీవన కథను, తెగిన జ్ఞాపకాలుగా, స్మృతి బింబాలుగా, మరెన్నో వ్యాస చిత్రాలుగా, అక్షర రూపంలో అందించాడు సంజీవదేవ్.

ఆ తొలి యాత్రా పర్వంలోనే ఆయనకు గొప్ప మిత్ర సంపద లభించడం ఆయన అదృష్టం! ఆ హిమాలయ సానువుల్లో, మిత్రుల సాంగత్యంలో, అనేకానేక లౌకిక, అలౌకిక, తాత్త్విక, కళాతత్త్వ విషయాల గురించి చర్చించి, అవగాహన చేసుకొనే అవకాశం లభించింది. నిరంతర చింతనతో, అధ్యయనంతో, ఆయన మానసక్షేత్రం పండి పరిపుష్టమై పోయింది. లేత వయసులోనే అలా సాగించిన స్వయం అధ్యయన యజ్ఞఫలంగా సంజీవదేవ్ ప్రతిభర్తి బహు ముఖాలుగా విస్తరించింది.

సంస్కృతం, హిందీ, ఉర్దూ, బెంగాలీ, ఇంగ్లీషు – వంటి పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించాడు. అంర్జాతీయ భాషగా గుర్తింపు పొందిన 'ఎస్పరాంటో' భాషను కూడా నేర్చుకొన్న మొదటి తెలుగువాడు కూడా ఆయనే!

భాషలు నేర్వడం ఒక ఎత్తు – ఒక సృజనాత్మక కళగా దానిని తీర్చిదిద్దుకోవడం మరొక ఎత్తు! లలిత కళలను గురించీ, జీవన సంస్కృతిని గురించీ, దార్శనిక విషయాల గురించీ సంజీవదేవ్ అసంఖ్యాక రచనలు చేశారు. విమర్శనాత్మక, విశ్లేషణాత్మక, కళాత్మక, ప్రామాణిక రచనలు అవి. వాటిని ప్రసంగాల రూపంలోనూ ప్రసారం చేశారు.

విశ్వవిఖ్యాత రష్యన్ చిత్రకారుడు నికొలస్ రోరిక్, అసిత్ కుమార్ హాల్దార్ వంటి ప్రముఖులతో ఏర్పడిన మైత్రి ఆయనలో చిత్రకళారచనాభిరుచినీ పెంపొంద చేసింది. స్వయం సాధనతోనే ఆయన అనేక ప్రకృతి చిత్ర కళాఖండాలు చిత్రించారు. నీరూ, కొండా, పచ్చని చెట్లూ, ఎండిన ఒంటరి చెట్టు మోడూ, సంధ్యారాగం, కొండ ప్రక్కనే ఏరూ, జలపాతం – ఇవన్నీ సంజీవదేవ్ చిత్ర రచనలలో ఎక్కువగా కనిపించే ప్రకృతి దృశ్యాలు.

కుంచెతోనూ, కలంతోనూ ఆయన చేసిన అద్భుత కళాసృష్టి – రాశిలోనూ వాసిలోనూ హిమాలయమంత

ఎత్తుకు ఎదిగింది. ఆయన రచన ఒక రస భాండం. ఆయన చిత్ర రచన ఒక దృశ్యగీతం!

లలిత కళలను గురించీ, రసతత్త్వాన్ని గురించీ, అంతకు ముందు తెలుగులో లేని విశిష్ట రచనలు చేయడమే కాక, భావుకుడైన కవిగా ఆంధ్రాంగ్ల భాషల్లో అనేక కవితలు కూడా వ్రాశారు సంజీవదేవ్. Grey & Green Blue Blooms వంటి కవితల గ్రంథాలు – ఆయనలోని మానవతా దృష్టికీ, భావుక పరిపుష్టికీ అద్దం పడతాయి.

అన్నిటికన్నా ఆయనకు ఇష్టమైన నిత్య కర్మానుష్ఠానం ఒకటి ఉంది. అది లేఖా రచనం. ఉత్తరం వ్రాయడాన్ని ఒక కళగా, కమ్మని అనుభవంగా, రెండు మనుసుల మధ్య సాగిపోయే పువ్వుల వంతెనగా, తీర్చి దిద్దిన స్నేహమూర్తి సంజీవదేవ్.

పరిచితులూ, మిత్రులూ మాత్రమే కాక ఎందరో కొత్తవారు కూడా, విజ్ఞాన జిజ్ఞాసువులై, సంజీవదేవ్‌తో మైత్రిని కోరుకుంటూ ఉత్తరాలు వ్రాస్తారు. దేశ విదేశాల నుండి – ఎందరెందరో భిన్న ప్రకృతుల వాళ్లు, భిన్న సంస్కృతుల వాళ్లు, భిన్న ధోరణులలో వ్రాసే ఆ ఉత్తరాలను అందుకొని – ఆయన వెంటనే బదులు వ్రాశారు. అందులో వివిధ విషయాలను గురించి ఆయన స్పందనలు ఉంటాయి. ఆత్మీయ రాగాలతో కూడిన హృదయ స్పర్శలు ఉంటాయి. చమత్కారపు చెణుకులూ ఉంటాయి. పన్నీటి చిలకరింపుగా అనిపించే చల్లని పలకరింపులూ ఉంటాయి.

లేఖారచనలో సంజీవదేవ్ శైలి అనితర సాధ్యం. అందమైన కాయితం మీద ముత్యాల సరాలుగా అనిపించే దస్తూరితో, మిత్రులకు ఆయన వ్రాసిన లేఖలు కొన్ని సంపుటాలుగా అచ్చు అయినాయి. ఇంకా అచ్చుకావలసినవి మరెన్నో ఉన్నాయి. వ్యక్తుల మధ్య నడిచినవే అయినా, అవి సాహిత్య ప్రయోజనం కలిగి ఉండి, విశ్వజనీనమైన మానవతా విలువలు సంతరించుకొన్న కారణాన – తెలుగు సాహిత్యంలో సంజీవదేవ్ లేఖాప్రవంతి ఒక అపురూప రచనా ప్రక్రియగా పేరెన్నిక పొందింది. మేధను కదిలించి, హృదయానికి రసోల్లాసం కలిగించి, మంచినీ, మానవతనూ మేలుకొలిపే తేజోరేఖల వంటివి ఆ లేఖలు.

ఇంతటి రసతత్త్వవేత్త ఆయిన సంజీవదేవ్ గొప్ప జీవన తత్త్వవేత్తకూడా! ఆయన మనిషిని గురించీ, మనిషి పొందే సంవేదనల గురించీ ఆలోచించాడు. నవ్వులకూ, కన్నీళ్లకూ మధ్య లోలకంగా ఊగే మనిషి మానసిక స్థితిని గురించి అధ్యయనం చేశాడు. లోతైన ఆలోచనతో, మనోవైజ్ఞానిక శాస్త్ర విజ్ఞానంతో, జతచేసి, తనదైన పద్ధతిలో జీవన తత్త్వానికి భాష్యం చెప్పాడు సంజీవదేవ్. దిగుళ్ల నుంచీ, వేదనల నుంచీ, విషాదాల నుంచీ విముక్తం కావడానికి మనిషి సాగించ వలసిన మనోధర్మాన్ని గురించి వివరించి చెప్పాడు.

మేధకంటే మానవత గొప్పదనీ, రసానుభూతితో పాటు హేతుబద్ధమైన ఆలోచనా విధానం పెంచుకోవాలనీ, వైజ్ఞానిక తృష్ణతోపాటు కళాత్మక దృష్టినీ కలిగి ఉండాలనీ – చెప్పడమే కాక, ఈ అద్భుతమైన సమగ్ర తత్త్వాన్ని ఒక జీవన కళగా అభ్యసించి, ఆచరణలో పెట్టిన జీవన తాత్త్వికుడు సంజీవదేవ్!

ఇంతటి ప్రజ్ఞామూర్తి – ఏ మాత్రమూ భేషజం ఎరుగని సాత్విక మూర్తి కూడా! తాను పుట్టి పెరిగిన తుమ్మపూడి అనే పల్లెటూరులో, 'రసరేఖ' అని పేరు పెట్టుకొన్న స్వగృహంలో నిరాడంబరంగా జీవించాడు ఆయన. నిత్య చేతనగా తీర్చిదిద్దుకున్న తన సాహితీ, సాంస్కృతిక, కళాత్మక, కార్యకలాపాలన్నిటికీ ఆ 'రసరేఖ' కేంద్రస్థానం. ఎందరో సాహితీ మూర్తులు – రాహుల్ సాంకృత్యాయన్ వంటి ప్రముఖ తత్త్వవేత్తలు – సంజీవదేవ్ అనే ప్రజ్ఞా మూర్తితో కొంత కాలం గడపాలన్న ఆకాంక్షతో తుమ్మపూడికి వచ్చి 'రసరేఖ'లో రాచమర్యాదలు పొందినవారే! ఆ వచ్చిన వారంతా సంజీవదేవ్, సులోచన దపంతులు అందించే ఆదరపూర్వకమైన ఆతిథ్యంతో, సరస సంభాషణంతో – సేద తీరి హృదయోల్లాసం పొందిన వారే.

చలం సంజీవదేవ్‌కు వ్రాసిన ఒక ఉత్తరంలోని పంక్తులు ఇవి –

"ఏ హిమాలయాల్లోనో, కాశ్మీర్‌లోనోకాక, తుమ్మపూడి రేగడి నేలలో– మీరు ఋతువుల అందాన్ని ఆస్వాదిస్తున్నారంటే – మీ దృష్టి ఎంత ఆర్టిస్టిక్ డెప్త్‌ని పొందిందో అనుకుంటాను!"

తెలుగునాట ఒక వెన్నెల వాగుగా సాగిన జీవనది వంటిది సంజీవదేవ్ జీవితం. జిజ్ఞాసాపరులైన వారి హృదయక్షేత్రాలలో తరగని పెన్నిధిలాగ నిలచిపోతుంది ఆయన అందించిన ఆలోచనామృతం!

అందుకే – ఆయ నిత్య సంజీవి ! చిరంజీవి !

(ఇది సంజీవదేవ్ శత జయంతి సంవత్సరం)

సి. వేదవతి

హైద్రాబాదు, ఫోన్ : 9392467795

ఎలన్ డేనియెలో సిద్ధాంతం

– నండూరి పార్థసారథి

ఇండియాలో ఎప్పుడూ ప్రధానంగా మూడు విభిన్న సంస్కృతులు కనిపిస్తూ ఉంటాయి. ఒకటి–భాషలు మాట్లాడే ఆదివాసుల సంస్కృతి. రెండవది – ద్రావిడ భాషలు మాట్లాడే వారి సంస్కృతి. ఆర్యులు వాయవ్యభారతాన్ని జయించినప్పుడు వారిని ప్రతిఘటించినది ద్రావిడ భాషల వారే. ఆర్యుల కంటే వారిది గొప్ప సంస్కృతి. భారతీయ సంగీత చరిత్ర ఎప్పుడూ ఈ మూడు భిన్న సంస్కృతులతో ముడిపడే ఉంది. కాని, వాటి మధ్య ఎన్నడూ నిజమైన ఏకత్వం లేదు. ముండా తెగల్లో ఆదివాసీ సంగీతం, దక్షిణభారతంలో ద్రావిడ సంగీతం, ఉత్తర భారతంలో సంస్కృత సంగీత పద్ధతీ ఉన్నాయి. వీటిమధ్య సిద్ధాంతపరమైన సమాచార వినిమయం, పరస్పర ప్రభావాలు, విదేశీ ప్రభావాలు ఉన్నప్పటికీ భాషాపరమైన, జాతిపరమైన మూడు భిన్నవర్గాల సంగీత పద్ధతులు ఇప్పటికీ దేశంలో కనిపిస్తాయి. విశ్వ విఖ్యాత సంగీత పరిశోధకుడు ఆలెన్ డేనియెలో (ALAIN DANIELOU) చెప్పిన మాటలు అవి. సంగీత రంగంలో ఆయన చేసిన కృషి గురించి ముందుగా తెలుసుకుందాం.

డేనియెలో ఫ్రాన్స్ దేశస్థుడు. 1907 అక్టోబరు 4వ తేదిన పారిస్‌లో ఆయన జన్మించాడు. 1930 దశకం మధ్యలో ఆయన తన సంగీత శోధన యాత్ర ఆరంభించాడు. అప్పటి నుంచి 1994 తన 97వ యేట మరణించే వరకు ఇంచుమించు అరవై సంత్సరాల కాలం ఆయన శోధన నిరాఘాటంగా సాగింది.

యూరప్ నుంచి బయలుదేరి ఉత్తర ఆఫ్రికా దేశాలలో పర్యటించి, అక్కడి నుంచి ఇరాక్, ఇరాన్, టర్కీ, అఫ్ఘనిస్థాన్‌ల మీదుగా చైనా, ఇతర దూర ప్రాచ్య దేశాలన్నీ తిరిగి చివరకు భారతదేశానికి వచ్చాడు. భారతీయ సంగీత శోధనలో నిమగ్నుడైన తర్వాత ఇంకెక్కడికీ వెళ్ళాలనిపించ లేదు ఆయనకు.

రవీంద్రనాథ్ ఠాగోర్ ఆయనను శాంతినికేతన్‌లోని సంగీత పాఠశాలకు డైరెక్టర్‌గా నియమించాడు. ఆ పదవిలో కొన్ని సంవత్సరాలున్నాక ఆయన వారణాసికి వెళ్ళాడు. వారణాసి ఆయనను బాగా ఆకర్షించింది. అక్కడ పదిహేడు సంవత్సరాలుండి పోయాడు. తీగలాగితే డొంకంతా కదిలినట్లు సంగీత పరిశోధన ప్రారంభిస్తే మొత్తం భారతీయ ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను సమూలంగా అధ్యయనం చేయవలసి వచ్చింది. శివేంద్రనాథ్ బసు అనే విద్వాంసుని వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకొన్నాడు. ధ్రుపద్ శైలిలో రుద్రవీణ వాయించడం నేర్చుకున్నాడు. శైవమతం పట్ల ఆకర్షితుడై కరపత్రజీ మహరాజ్ అనే గొప్ప సన్యాసి వద్ద దీక్ష తీసుకున్నాడు. తన పేరును 'శివశరణ్'గా మార్చుకుని అచ్చమైన శైవజీవన పద్ధతిని అలవరచుకున్నాడు. తాను హిందువుననీ, తన అసలైన దేశం భారతదేశమేననీ ప్రకటించుకున్నాడు.

1949లో ఆయన బెనారస్ హిందూ యూనివర్సిటీ సంగీత కళాశాల డైరెక్టర్‌గా నియుక్తుడై ఆ పదవిలో ఐదేళ్ళున్నాక 1954లో మద్రాసులోని అడయార్ లైబ్రరీకి డైరెక్టర్‌గా కొన్ని సంవత్సరాలు పనిచేశాడు. 1960 ప్రాంతంలో ఆయన తన ఆధ్యాత్మిక గురువైన కరపత్రజీ మహరాజ్ ఆదేశంపై యూరప్‌కు తిరిగి వెళ్ళి భారతీయ సంగీత ప్రచారాన్ని ఒక ఉద్యమంగా సాగించాడు. ఫోర్డ్ ఫౌండేషన్ సహాయంతో బెర్లిన్, వెనిస్ నగరాలలో అంతర్జాతీయ తులనాత్మక సంగీత పరిశోధన సంస్థను నెలకొల్పాడు. ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యునెస్కో ఆధ్వర్యాన ఆసియాకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుల కచేరీలను నిర్వహించి, వారి రికార్డులను విడుదల చేయించి, వాటి ద్వారా యూరప్‌లో భారతీయ శాస్త్రీయ సంగీతానికి గుర్తింపు తెచ్చాడు. భారతీయ సంగీత శోధనపై డేనియెలో

సామవేదకాలం నుంచి తన కాలం వరకు సంస్కృతం, హిందీ, ఉర్దూ, మరాఠీ, గుజరాత్, బెంగాలీ, ఇంగ్లీషు, ఫ్రెంచ్, పర్షియన్ భాషలలో వెలువడిన వందలాది గ్రంథాలను అధ్యయనం చేశాడు. మిక్కిలి అరుదైన 800 లిఖిత ప్రతులను పరిశీలించాడు. తన జీవితంలో సగం కాలం హిందువుగా జీవించిన ఆయన తన మరణానంతరం హిందూ సంప్రదాయానుసారం తనకు అంత్యక్రియలు జరగాలని కోరుకున్నాడు. అలాగే జరిగింది.

గ్రంథాల నుంచి, విద్వాంసుల నుంచి తాను సేకరించిన సమాచారాన్ని, వాటిపై తన అభిప్రాయాలను, విశ్లేషణలను ఆయన ఎప్పటికప్పుడు కార్డుల మీద, కాగితాల మీద రాసుకొంటూ ఉండేవాడు. టైప్‌రైటర్ అందుబాటులో ఉంటే టైప్ చేసేవాడు. వాటిని, ఇండియాలో తాను సేకరించిన గ్రంథాలను ఆయన వెనిస్ (ఇటలీ)లోని 'ది వెనిస్ అండ్ ది ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్'కు విరాళంగా సమర్పించాడు. ఇండియా, దూర ప్రాచ్యదేశాల సంగీత సంస్కృతుల అధ్యయనాన్ని, పరిశోధనను ప్రోత్సహించడానికి, సమాచారాన్ని భద్రపరచడానికి 1958లో నెలకొల్పబడినది ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్. డేనియెలో ఈ సంస్థకు అప్పగించిన తన నోట్స్ కార్డులు, కాగితాల సంఖ్య ఇంచుమించు మూడు లక్షలు! వీటిలో కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. ఈ సమాచారమంతటినీ డిజిటలైజ్ చేసే పని, కేటలాగ్ చేసే పని ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ 2001లో చేపట్టి పూర్తి చేసింది.

'ఎలన్ డేనియెలో ఇండొలాజికల్ ఆర్కైవ్స్' ప్రాజెక్ట్‌లో ఇది మొదటి దశ. రెండవదశ అతి ముఖ్యమైన సుమారు అరవైవేల కార్డులలోని సమాచారాన్ని కేటలాగ్ చేసి ఇంటర్నెట్‌లో పెట్టడం జరగుతుంది. నిజానికి ఈ పని భారతీయ పరిశోధక సంస్థలే చేయవలసింది, కాని, అవి అంతగా ఆసక్తి చూపక పోవడంతో ఇటలీ ప్రభుత్వం సాంస్కృతిక వ్యవహారాల శాఖ అందించిన ఆర్థిక సహాయంతో ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఈ పని చేపట్టింది. డేనియెలో వదిలి వెళ్ళిన నోట్స్ అంతటినీ ఒక క్రమపద్ధతిలో సంకలనం చేస్తే అది భారతీయ, దూర ప్రాచ్యసంగీతాలకు, సంస్కృతులకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వమే అవుతుంది.

యునెస్కో సంస్థ డెనియెలో పర్యవేక్షణలో 'యునెస్కో కలెక్షన్' అనే పేరుతో ఆసియా, ఆఫ్రికా, యూరప్, దక్షిణ అమెరికా ఖండాలకు చెందిన పెక్కు దేశాల సంప్రదాయ సంగీతాలను రికార్డ్ చేసి లాంగ్‌ప్లే రికార్డులుగా వెలువరించింది. 'Musical Anthology of the orient', 'Musical sources', 'Musical Atlas' అనే మూడు వేర్వేరు సీరిస్‌లో ఆ రికార్డులు తయారైనాయి. ఈ మూడు సీరీస్‌లోనూ, ఇంటర్నెట్ మ్యూజిక్ కౌన్సిల్ కోసం సిద్ధంచేసి మరి రెండు సీరిస్‌లలోనూ భారతీయ సంగీతానికి సంబంధించి మొత్తం 17 ఎల్.పి. రికార్డులు వెలువరించారు. గాత్ర సంగీతం ధ్రుపద్, ఖ్యాల్, విద్య సంగీతం సితార్, వేణువు, సారంగి, సరోద్, వీణ, షెహనాయి; దక్షిణ భారతీయ వాద్య, నృత్యసంగీతం, కర్ణాటక గాత్ర సంగీతం, భజన్, ఠుమ్రీ, టప్పా, తబ్లా, పఖావజ్, ఉత్తర భారత జానపద సంగీతం, బెంగాలీ జానపద సంగీతం – ఇవన్నీ ఆ రికార్డులలో ఉన్నాయి.

'మ్యూజికల్ అట్లాస్' సీరీస్‌లో అల్జీరియా, బాలి, బహరేన్, కంబోడియా, కేమరూన్, చిలీ, దహోమీ, గ్రీస్, హాంగ్‌కాంగ్, ఇరాక్, ఐవరీకోస్ట్, జపాన్, జావా, మొరాకో, ఉత్తర యెమెన్, పాకిస్థాన్, పోర్చుగల్, రుమేనియా, సిరియా, థాయ్‌లాండ్, వియత్నాం సంగీతాలకు ఒక్కొక్క దానికి ఒక్కొక్క ఎల్.పి చొప్పున వెలువరించారు. ముప్పయి, నలభై, యాభై సంవత్సరాల క్రిందట వెలువడిన ఆ ఎల్.పి. రికార్డులు ఇటీవల సి.డి.లుగా తయారైనాయి. కాని, ఇవి మనదేశంలో ఎక్కడా మార్కెట్‌లో లభించవు. కేంద్ర సంగీత నాటక అకాడెమీ, నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (NCPA) వంటి కొద్ది సంస్థలలో మాత్రమే అవి ఉన్నట్లున్నాయి. ఆ రికార్డుల స్లీవ్ నోట్సుని ప్రత్యేకంగా ఒక గ్రంథంగా వెలువరించినా పరిశోధకులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రపంచంలో ఎప్పుడైనా, ఎక్కడైనా ఇంత గొప్ప సంగీత పరిశోధన కేవలం ఒక్క వ్యక్తి ద్వారా జరిగిందా? ఈ వ్యాస పరంపరలో డేనియెలో గురించి ఇంత దీర్ఘంగా రాయడం ఎందుకంటే భారతీయ సంగీతంపై మాట్లాడేందుకు ఆయన కెంత అధికారం ఉందో తెలియజేయడానికే.

ఇప్పుడిక భారతీయ సంగీతం గురించి ఆయన చెప్పిన కొన్ని ముఖ్యవిషయాలను సంక్షిప్తంగా చెప్పుకుందాం:

* జ్ఞాన సంపద అంతటికీ మూలం ఆర్యుల వేద వాఙ్మయమేనని విశ్వసించే బ్రాహ్మణ వర్గం చేతుల్లోనే సంగీత సిద్ధాంతం ఉంది – ద్రావిడ ప్రాంతాలలో కూడా.

దీనివల్ల ఆర్యేతర సంగీతం గురించి, దాని మూలం గురించి అపోహలకు ఆస్కారం ఏర్పడింది. ఐతే ఇది సిద్ధాంతానికే పరిమితం. ప్రయోగంలో మాత్రం ద్రావిడ సంగీతం – శాస్త్రీయంగాని, జానపదంగాని– తన ప్రత్యేకలక్షణాలను కాపాడుకొంటూనే వచ్చింది.

* భారతీయ సంగీతశాస్త్రం, నాట్యకళ అతి పురాతన మైనవన్న సంగతి ప్రాచీన ప్రపంచమంతటికీ తెలుసు.

* శ్రుతి, లయ, వాద్యాలు తమకు మొట్టమొదటగా థ్రేస్ నుంచి, ఆసియా నుంచే వచ్చాయని గ్రీకులు భావించారు.

* ఇండియాతో సహా ఆసియా అంతా డయొనైసస్ పవిత్ర విహార భూమి అనీ, సంగీతం దాదాపు పూర్తిగా ఆసియా నుంచే ఉద్భవించిందనీ గ్రీకుల విశ్వాసం. (డయొనైసస్ గ్రీకుల దేవుళ్ళలో ఒకడు.)

* మెగస్తనీస్ క్రీస్తు పూర్వం 302వ సంవత్సరంలో భారతదేశాన్ని సందర్శించాడు. అంతకంటే ముందు – క్రీస్తు పూర్వం 329లో అలెగ్జాండర్ పంజాబ్‌లో అడుగుపెట్టాడు. డయొనైసస్ నుంచి అలెగ్జాండర్ వరకు 6042 సంవత్సరాల కాలంలో 153 మంది రాజులు పరిపాలించినట్లు భారతీయులు లెక్కకట్టారని మెగస్తనీస్ పేర్కొన్నాడు. భారతీయుల పురాణాలలో కూడా రాజవంశాల లెక్కలున్నాయి. గ్రీకులు లెక్కకట్టిన కాలాలను, భారతీయులు లెక్కకట్టిన కాలాలను పోల్చి చూసిన మీదట డయొనైసస్ భారతదేశ చరిత్రలోని ఎవరో ఒక ప్రాచీన మహాపురుషుడై ఉంటాడని – బహుశ మనువుగాని, కృష్ణుడుగాని కావచ్చునని పలువురు భావించడం జరిగింది. కాని, గ్రీకు పురాణాలలో డయొనైసన్‌ను గురించిన వర్ణన భారతీయ పురాణాలలోని శివుని వర్ణన ఇంచుమించు ఒకే మాదిరిగా ఉంటాయి. శైవపురాణాలలోని శివుని రూప వర్ణనను బట్టి శివుడు, గ్రీకుల డయొనైసస్ ఒకరేనని ఖచ్చితంగా చెప్పవచ్చు. అరణ్య ప్రాంతాలలో దిగంబరంగా తిరుగాడే శివుడే భారతదేశంలో అత్యంత ప్రాచీన సంగీతాన్ని, నృత్యాన్ని బోధించాడు. ఈ శివమతం వైదిక ఆర్యుల సంగీత పద్ధతికి భిన్నమైనది. అది ఆర్య నాగరికత కంటే ప్రాచీనమైనది. శివమత సంగీత లక్షణ గ్రంథాలు ఇప్పటికీ ఉన్నాయి. శివమతంలో ప్రాథమిక మూర్ఛనలు (MODES) ఐదే స్వరాలు కలిగినవి. ఏడు స్వరాలు గల మూర్ఛనలు వాటి జన్యాలై ఉంటాయి. శివమతంలో ఐదు అంకెకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

* శివమతం (లేక సోమేశ్వర మతం), భరత మతం, హనుమాన మతం, కల్లినాథ మతం అనే నాలుగు సంగీత సంప్రదాయాలు భరతఖండంలో ఉన్నాయి. అవి ఒకే మూలం నుంచి వచ్చినవి కావు. దేని మూలం దానిదే. బహుశా అవి వేర్వేరు సంస్కృతుల నుంచి వచ్చి ఉంటాయి.

* శైవ సంగీత పద్ధతికి భిన్నమైన, ఇరానియన్, గ్రీక్ లక్షణాలతో కూడిన మరొక సంగీత పద్ధతిని వైదిక ఆర్యులు భారతదేశంలో ప్రవేశపెట్టారు. ఉత్తర భారతంలో ఇప్పటికీ ఆ రెండు సంప్రదాయాలు కనిపిస్తున్నాయి.

* కర్ణాటక సంగీత శుద్ధ స్వర మూర్ఛన హిందూస్థానీ సంగీత శుద్ధ స్వర మూర్ఛనకు ఎప్పుడూ భిన్నంగానే ఉంటూ వచ్చింది. అది ఒక దాని నుంచి మరొకటి వచ్చాయని చెప్పడానికి వీల్లేదు.

* బెంగాల్‌లో, ఒరిస్సాలో ప్రత్యేక, స్వతంత్ర సంగీత పద్ధతులున్నాయి. అవికాక అస్సాంలో, నేపాల్‌లో, హిమాలయ ప్రాంత దేశాలలో చైనా–టిబెటన్ కుటుంబానికి చెందిన కొన్ని సంగీత రూపాలున్నాయి.

* తమదంటూ ఒక ప్రత్యేక నాగరకత కలిగిన పెక్కు 'నిమ్నకులాలు', ఆదిమ జాతులు ఇండియాలో ఇప్పటికీ ఉన్నాయి. అవి తమ స్వంత సంగీత రూపాలను కాపాడుకొంటూ వస్తున్నాయి. నాట్యశాస్త్రంలో, *సంగీత రత్నాకరం*లో పేర్కొన్న సంగీత రూపాలతో వాటికి ఏమాత్రం సంబంధం లేదు. ఉత్తర భారతంలోని 'అహీర్'ల (ప్రాచీన అభీరుల) సంగీతం ప్రత్యేకంగా చెప్పుకోదగినది. పై స్థాయి ఆధార స్వరం నుంచి అవరోహణ క్రమంలో మూర్ఛన కలిగి ఉండే ప్రాచీన సంగీత పద్ధతి పెక్కు ప్రాంతాలలో– ముఖ్యంగా హిమాలయాలలోని కొన్ని లోయలలో– ఇప్పటికీ

ఉంది. కొన్ని ప్రాచీన సంగీత గ్రంథాలను అర్థం చేసుకోడానికి ఈ అవరోహ మూర్ఛన అధ్యయనం ఉపయోగపడుతుంది.

* ఇండియాలోని విభిన్న సంగీత సంప్రదాయాలు *నాట్య శాస్త్రం, సంగీత రత్నాకరం* వంటి ప్రాచీన లక్షణ గ్రంథాలే తమకు ప్రామాణికమని చెబుతున్నప్పటికీ ప్రయోగంలో వాటి మధ్య కొన్ని ముఖ్యమైన భేదాలు ఇంకా మిగిలే ఉన్నాయి. వాటిని కప్పి పుచ్చుకోవడానికి ఒక్కసారి ఆ గ్రంథాలలోని పాఠకులకు తమకు అనుకూలమైన అర్థాలు చెప్పుకోవడం జరుగుతున్నది. కర్ణాటక సంగీతంలోని ఏ మేళకర్తా హిందూస్థానీ పద్ధతిలోని మరొక మేళకర్తతో సమంగా ఉండదు. అయినా అవి చెప్పుకొనే మూలం ఒక్కటే. ఉత్తర భారతంలో కూడా ఒక రాష్ట్రానికీ ఇంకో రాష్ట్రానికీ మధ్య రాగ రూపాలు, గాయన శైలులు భిన్నంగా ఉండడం కనిపిస్తుంది.

* ఉత్తర భారతీయ సంగీతం విదేశీ ప్రభావాలతో పరిణామం చెందినది కాగా దాక్షిణాత్య సంగీతం అలా మార్పు చెందని అతి ప్రాచీన పద్ధతి అనే భావం దక్షిణ భారతంలో కనిపిస్తుంది. ఏవో కొన్ని చిన్న విషయాలలో తప్ప ఈ అభిప్రాయం సరికాదు. నిజానికి ఉత్తర, దక్షిణ పద్ధతులు రెండూ అతి ప్రాచీనమైనవే. దాక్షిణాత్య సంగీతంలో క్రమబద్ధీకరణకు, వర్గీకరణకు సంబంధించిన పెక్కు సంస్కరణలు జరిగాయి. ప్రధాన సంస్కర్తలలో ఒకరు పదిహేడవ శతాబ్దికి చెందిన వెంకట మఖి. ఉత్తర భారతీయ సంగీతం అప్పుడప్పుడు కొన్ని తాత్కాలికమైన కొత్తరీతులకు లోనైనప్పటికీ రాగాలను గాని, గాయన పద్ధతులను గాని క్రమబద్ధీకరించడానికి ప్రయత్నించలేదు. తాత్కాలికమైన మార్పుల సంగతెలా ఉన్నా మొత్తం మీద అది యథాపూర్వంగానే ఉంది. దాని లక్షణాలు కొన్ని ప్రాచీన గ్రంథాలలోని నిర్వచనాలకు అనుగుణంగానే ఉన్నాయి.

* ముస్లిములు పాలించిన కాలంలో ఉత్తర భారత సంగీతంలో కొత్త కొత్త రీతులు వాడుకలోకి వచ్చినట్లు చెప్పే కథలు చాలావరకు కల్పితాలే. ఎప్పటివో పూర్వకాలపు కథలను తీసుకొని అవి అక్బర్ దర్బారులో జరిగినట్లుగా కల్పించి చెప్పారు. ముస్లిము ప్రభువులను మెప్పించి సన్మానాలు అందుకోవడం కోసం చెప్పిన కథలు అవి. అలా పాతకథలను కొత్తగా చెప్పడం ప్రతి చోటా తరచుగా జరిగేదే. అందుకే ప్రాచీన సంగీత ప్రక్రియలకు, వాద్యాలకు పర్షియన్ పేర్లు తగిలించడం, అవన్నీ మొగల్ ప్రభువుల హయాంలో కొత్తగా తయారైనట్లు చెప్పడం జరిగిందంటే ఆశ్చర్యపోనక్కర్లేదు.

* ఇప్పుడు ఉత్తర భారతీయ ఉస్తాదులు పాడుతున్న రాగాలన్నీ టర్కిష్, అరబ్, పర్షియన్ సంగీతాల ప్రభావంతో తయారైనవనడం నిజం కాదు. ఆ సంగీతాల స్వరూపం, భారతీయ సంగీత స్వరూపం పూర్తిగా భిన్నమైనవి. భారతీయ సంగీతం ఎంతో ఉత్కృష్ట మైనదనీ, విదేశీయులు ఇరవయ్యేళ్ళు సాధన చేసినా దానిపై పూర్తి ప్రావీణ్యం సంపాదించలేరనీ అమీర్‌ఖుస్రోయే చెప్పాడు. ఆకాలపు హిందూ పండితులకు టర్కిష్ సంగీత పద్ధతి గురించి తెలుసు. టర్కిష్-పర్షియన్ సంగీతాన్ని వారు 'తురుష్క' సంగీతమని వ్యవహరించారు.

* విదేశీ దండయాత్రల వల్ల సంగీత సిద్ధాంతం క్షీణించినా ప్రయోగం మాత్రం తన ప్రమాణాలను కాపాడు కొంటుంది. అయితే, లక్ష్యలక్షణ సమన్వయ సాధనకై ప్రాచీన సిద్ధాంతాన్ని పునరుద్ధరించి, దానొకొక కొత్తరూపు ఇవ్వడానికి అప్పుడప్పుడూ కొందరు లక్షణ కర్తలు ప్రయత్నిస్తూ ఉంటారు. అటువంటి ప్రయత్నం చేసిన వారిలో *స్వరమేళ కళానిధి* రచించిన రామామాత్యుడు (1549), *రాగవిబోధ* రచించిన సోమనాథుడు (1610), *సంగీత దర్పణం* రచించిన దామోదర మిశ్రుడు (1625) ముఖ్యులు. వీరందరి కంటే ముఖ్యుడు – దాక్షిణాత్య సంగీతాన్ని క్రమబద్ధీకరించడానికై *చతుర్దండి ప్రకాశిక* గ్రంథాన్ని రచించిన వెంకట మఖి (1620). అయితే వారి రచనల వల్ల సమన్వయం కుదరకపోగా గందరగోళం ఇంకా పెరిగింది. వైరుధ్యాలను పరిహరించడం కోసం వారు ప్రాచీన సాంకేతిక పదాలకు, సిద్ధాంతాలకు కృత్రిమమైన వ్యాఖ్యానాలు చేయడమే అందుకు కారణం.

నండూరి పార్థసారథి,
హైదరాబాదు, ఫోన్ : 9959734534

నాటకము : రసానుభూతి

– భూపతి లక్ష్మీనారాయణ రావు

రసాస్వాదన యనునది మనస్సునకు సంబంధించిన విషయమనియు, దానికి భావనావ్యాపారము ప్రధానముగా నాశ్రయ మగుచున్నదనియు నిదివరలో వివరింపబడినది. సామాజికునియందు రసోత్పత్తి యెట్లు కలుగుచున్నదనెడి విషయమును గూర్చి చర్చించుటకు పూర్వము మానవమనస్తత్వమును గూర్చియు, చిత్తవృత్తులగు భావముల స్వభావమును గూర్చియు, నీ రెండిటికిని గల పరస్పర సంబంధమును గూర్చియు కొంత విమర్శ యవసరమగుచున్నది.

కారణరూపమగు నాలంబన విభావము నాధారమున భావము మనస్సునందుద్బుద్ధమై, ఉద్దీపన విభావాదులచే వికసించి స్థాయిగా నేర్పడుచున్నది. అట్లు మనస్సున నెలకొన్న స్థాయిభావ ప్రాబల్యమున చిత్తము పరిపరివిధములగు నలజడికి లోనగుచున్నది. సంచారిభావోత్పత్తికి ఈ యలజడియే సన్నిహితమగు హేతువు. ప్రత్యక్షము, ప్రబలమగు విభావము, ఆలంబనము కాకుండుటవల్లను, చిత్తము ఇదివరకే సారవంతమగు నొక భావముచే నాక్రాంతమై యుండుటవల్లను, ఈ సంచారులు తాత్కాలికముగా మాత్రమే ప్రవర్తించును. మరియు, చిత్తము నాక్రమించియున్న స్థాయీభావమే యీ తాత్కాలిక భావపరంపరల యుత్పత్తికి సన్నిహితాలంబన మగుటచే దానిని త్రోసిరాజనుటకు వీనికి శక్తియును లేదు. కావున సంచారులగువానికి రసముగ పర్యవసించు నధికారము లేదు.

స్థాయీభావము మాత్రమేకాక ప్రత్యక్షమగు సన్నివేశమో విషయమో ఆధారముగా నిట్టి తాత్కాలిక భావములు మనసున పొడమవచ్చును. వీని యుత్పత్తి కాధారమగు నా విభావ మల్పమైనదియై యుండుటయే యీ భావములు తాత్కాలికము లగుటకు కారణము. కావున అల్పవిభావముల వలన నుత్పన్నములైన భావములు సంచారులుగ మాత్రమే ప్రవర్తింపగలుగుచున్నవి. ఆలంబనము ప్రకృష్టము. సమర్థమునై యున్నప్పుడే మనస్సు నందుద్బుద్ధమైన భావము మనస్సు నాక్రమించి, స్థిరపడి, దానిపై నధికారమును వహింపగలుగుచున్నది. అట్టిభావమే స్థాయి యగుచున్నది.

ప్రశాంతముగ నున్న కొలను నీటిలో బరువగు వస్తువు పడుటతో నొక పెద్దయల యుత్పన్నమై నలువైపుల ప్రసరించుటయు, నా యల యితరములగు చిన్న చిన్న యలల యుత్పత్తికి కారణమగుటయు ప్రకృతి సిద్ధమగు విషయము. స్థాయిసంచారి భావముల విషయమున నిది స్థూలమగు భౌతిక దృష్టాంత మగుచున్నది. తరంగోత్పత్తికి కారణభూతమగు వస్తువు యొక్క భారమును, పరిమాణమును, వేగమును ననుసరించి తరంగమున కున్నతియు, శక్తియు సిద్ధించునట్లే, విభావము యొక్క ప్రకర్షము ననుసరించి భావము స్థాయియో సంచారియో అగుచున్నది. స్వల్పమగు శక్తియు, తాత్కాలిక ప్రవృత్తియు మాత్రమే కల సంచారికి రసపర్యవసాయియగు సామర్థ్యము లేదు. మానవ మనస్తత్వమునకీ విషయముతో సమన్వయము చక్కగ కుదురుచున్నది.

జీవితమున నేర్పడు సంఘటనలన్నియు మనస్సు నలజడి నొందింపజాలవు. అల్పవిషయము లన్నిటికిని మనస్సుపై నట్టి ప్రాబల్యమే యున్నచో జీవితము నడచుటయే దుర్ఘటము కాగలదు. జీవితమున మన కయిష్టములగు నల్పవిషయములు జరుగుటయు, తత్కారణముగా మనస్సున ఖేదమో, కోపమో, విసుగో తాత్కాలికముగ నేర్పడుటయు సహజమే. ఈ ఖేదాది చిత్తవృత్తులు తాత్కాలిక ప్రవృత్తిని కల్గి మరునిముషముననే లయించిపోవుచున్నవి. చిత్త మన్యభావమున కాకరమగుచున్నది. భయత్రాసములకును, క్రోధరోషములకును గల భేద మీ విషయమును సువ్యక్తము చేయగలదు.

"వ్యాఘ్రదర్శనాది జన్మా పరమానర్థ విషయకో
వైక్లబ్యాఖ్య శ్చిత్తవృత్తివిశేషః భయం"

అను లక్షణమును బట్టి పరమార్థవిషయకమగు వైక్లబ్యము భయమని తెలియుచున్నది. ఇందు వ్యాఘ్రాదులవలన వ్యక్తికి మరణాది రూపమగు భావము కలుగుచున్నది.

"స్త్రీ నీచప్రకృతికం గురురాజాపరాధశ్వాపదశూన్యాగారాటవీ
పర్వతగహన గజాదిదర్శన నిర్భర్తనకాంతర దుర్దిన
నిశాంధకారోల్కూక నక్తంచరారావ శ్రవణాదులు"

భయమునకు కారణములుగను (విభావములు) కర చరణ హృదయ కంపనములు, ముఖశోషణ జిహ్వా పరిలేహన, స్వేద వేపథు సంభ్రాంతాదులు, (కార్యములు గను) అనుభావములుగను నాట్యశాస్త్రమున పేర్కొనబడినవి. రౌద్రమూర్తియై తమ్మాక్రమింపవచ్చు భీముని గని, ఉపకీచకులు...

"ఇదె గంధర్వులు వచ్చి ముట్టికొని రింకెట్లొక్కొయించున్ భయం
బొదవం బల్లములందు దాంగియు సమీపోర్ధ్వజముల్ వ్రాంకియుం,
జెదఱం, బాఱియు, నీరు సొచ్చియును నిశ్చేష్టం బదద్వంద్వముల్
గుదివడ్డం బెగడొందియున్, భరితసంక్షోభాత్ములై రత్తరిన్."

ఈ వర్ణన భయమునకు చక్కని లక్ష్యము. ప్రళయకాలాంతక మూర్తి యగు భీముని రాక ఉపకీచకులకు ప్రాణాంతమగు మహానర్థమైనది. కావున ప్రాణభీతిచే వారు సంక్షోభాత్ములై ప్రవర్తించినారు. అనుభావరూపమగు వారి ప్రవర్తనచే చిత్రప్రవృత్తి చక్కగ వ్యక్తమగుచున్నది. ఇందు విభావము ప్రకృష్టమైనది యగుటచే చిత్తమునకు కలిగిన అలజడియు, తత్ఫలమగు అనుభావరూప బాహ్య ప్రవృత్తియు కూడ ప్రకృష్టములేయై యున్నవి. కావున, భయమనెడి చిత్తవృత్తికి స్థాయితార్హత కలిగినది. ఇక, త్రాస విషయము వేరు. "ఆకస్మికభయా చ్చిత్తవిక్షోభ స్త్రాసః" అనియు, విద్యుదుల్కాశనినిపాత నిర్ఘాతాంబుధర మహాసత్త్వ పశురవాదుల వలన గలుగు చిత్త వృత్తివిశేషము త్రాసమనియు...

"భీరో ర్ఘోరసత్త్వదర్శన స్ఫూర్జథు
శ్రవణాది జన్మా చిత్తవృత్తి విశేష స్త్రాసః"

అనియు లక్షణములు. ఇందు పేర్కొన్న విభావములు సామాన్యములగుటచే హృదయమునం దేర్పడిన భావము కూడ నల్పమైనదియే యగుచున్నది. మరణాదిరూపమగు మహానర్థశంక యిందేమాత్రమును లేదు. సెలగోల పట్టి తన్ను దండించుటకై వచ్చు యశోదను చూచి కృష్ణుడు పరుగిడుచు...

"స్తభాదికంబులు తనకు నడ్డంబైన నిట్టట్టునని పట్టనీనివాని
నీతప్పు సైరింపు మింక దొంగిలఁబోవ నేనని మునుముట్టనేడ్చువానిఁ,
గాటుక నెఱయంగఁ గన్నులు నులుముచు వెడలు కన్నీటితో వెగచువాని,
నేదెస వచ్చునో యిది యని పలుమాఱు సురుగుచుఁ గ్రేఁగంటఁ
జూచువాని",

యను వర్ణన త్రాసమునకు లక్ష్యమగుచున్నది. కృష్ణున కిందు కలిగిన భీతికి కారణము సామాన్యమైనదియే కాని, మహానర్థకారి కాదు. ప్రాణాపాయశంక యిందేమాత్రమును లేదు. కావున చిత్తమునకు కలిగిన యలజడి కూడ స్వల్పమైనదియే. రసగంగాధర లక్ష్య మీ విషయముననే బాగుగ వ్యక్తమొనర్చుచున్నది.

"మాకురు కశాం కరాబ్జే కరుణావతి, కంపతే మమ స్వాంతం
ఖేలన్నజాతు గోపై రంజ విలంబం కరిష్యామి"

అని కృష్ణుని పల్కు కావున హఠాత్తుగా గలిగిన యీ చిత్త విక్షోభము శ్రీఘ్రమే అణగునదే కాని, హృదయమున కావేగమును కలిగించునది కాదు. కావున త్రాసము సంచారి యగుచున్నది. అట్లే నాట్యశాస్త్రమున ...

ఆధర్షణాకృష్ణ కలహ వివాద ప్రతికూలాదులు క్రోధమునకు విభావములుగను, వికృష్ణ నాసాపుట ఉద్వృత్తనయన సందోష్టోష్ట పుట గండస్ఫురణాదులు అనుభావాదులుగను వివరింపబడియున్నవి.

"గురుబంధువధాది పరమాపరాధజన్మా
ప్రజ్వలనాఖ్యుః చిత్తవృత్తివిశేషుః క్రోధుః"

అను రసగంగాధర లక్షణమునందలి 'పరమాపరాధ జన్మా', 'ప్రజ్వలనాఖ్యుః' అను ప్రయోగములు క్రోధ స్వభావమును బాగుగ వ్యక్తము చేయుచున్నవి. చిత్తమును ప్రజ్వలింపచేసెడు పరమాపరాధ మిందు విభావము. అపరాధినాశముతో గాని చిత్తమునకు స్థిమిత మేర్పడదు. కావుననే 'అయం చ పరవినాశాది హేతుః' అనియు వివరింపబడియున్నది. దుశ్శాసన, కీచకకృత ద్రౌపదీ విషయక మహాపరాధము భీముని చిత్తమును ప్రజ్వలింపజేసినది. తదపరాధులు నశించు వరకును భీముని చిత్తము క్రోధభావాక్రాంతమై యుండక తప్పదు. అట్లే, ఉపకీచకకృత ద్రౌపదీవిషయక పరిభవముచే చిత్తము ప్రజ్వలింపగా భీముడు...

"వికటభ్రూకుటి ఘోరఫాలకలిత స్వేదోద్ధటుండుం జల
ద్వికృతోష్ఠద్వయుండుం భ్రమర్దన దశావిర్భావ సంభావితాం
గకుఁడుం జిత్తవిదాహదోహలసమగ్రక్రోధవేగుండునై"

శుంభస్మార్తివిస్ఫూర్తితో విజృంభించి నూటయేవు రుపకీచకులను ననుయించి శమితక్రోధుఁడైనాడు. కనుక నీ చిత్తవృత్తి స్థాయి యగుచున్నది. ద్రౌపది హృదయము

కూడ నిట్లే దుశ్శాసనవధాంతము వరకును క్రోధమునకు నిలయమై యున్నది.

"నెట్టిన నిట్టియల్క మదినిల్పితి రక్కెసతాల్మిఁ జిచ్చొడిం
గట్టినయట్లు పెద్దయునుగాలము."
"ఈ వెండ్రుకలు వట్టి యీడ్చిన యీచేయి దొలుతగాఁ బోరిలో దుస్సనేను
తనువింతలింతలు దునియలై చెదరి రూపఱియున్నఁ గని యుడుకాఱుగాక
యలుపాలఁ బొనుపడునట్టి చిచ్చే యిది."

ఇత్యాది ద్రౌపదీవాక్యము లింతనుసంధేయములు. ఇక, అమర్ష మనెడి (రోష) సంచారి భావము యొక్క లక్షణమును బరికింతము.

"విద్యైశ్వర్యబలాధికై రధిక్షిప్తస్య
అవమానితస్యవా సముత్పద్యతే"

యని, విద్యాశౌర్యాదులం దధికులైనవారిచే జరిగిన అవమానాదులు ఉత్సాహులగు వారియందు రోషమునకు కారణములుగా నాట్యశాస్త్రమున పేర్కొనబడియున్నవి. శిరఃప్రకంపన స్వేదాదులు, అధోముఖ విచింతనాదులు మున్నగునవి యిందనుభావములు.

"పరకృతాపజ్ఞాది నానాపరాధజన్యఃమౌనవాక్యాది పారు
ష్యాది కారనీభూత శ్చిత్తవృత్తివిశేషో-మర్షఃు"

అను రసగంగాధర లక్షణమును బట్టి స్వల్పకారణోత్పన్నమైన కోపలేశము అమర్షమనియు, నది తాత్కాలిక మనియు వ్యక్తమగుచున్నది. అపరాధులగువారి విషయమున మౌనమువహించుట లేక పరుషవాక్కులను బల్కుట యిత్యాదుల వలననిది గమ్యమానమగుచున్నది.

క్షుద్రాపరాధజన్మాతు పరుషవచన అసంభాషణాది
హేతుఃు అయమేవ అమర్షాఖ్యో వ్యభిచారీతి వివేకఃు"

అను వివరణ మీవిషయమును వ్యక్తమొనర్చుచున్నది

"ఇంతుల నేచుపాతక మదింతట నంతటఁ బోదు పాంథలో
కాంతక నిన్ను ఘోరతమమై ఘనమై యజహత్కళంకమై
వంతలఁ బెట్టి యాఱుపది వ్రక్కలు సేయక పూర్వపక్షపుం
గంతులకేమి చూచెదవుగా తుది నీ బహుళార్తిఖేదముల్."

అను గిరికాకృత చంద్రదూషణ మిందు లక్ష్యమగు చున్నది. ఇట్లు భయత్రాణముల విషయముననను, క్రోధరోషముల విషయముననను నొసంగిన లక్ష్యములు స్థాయిసంచారులకు గల భేదమును సువ్యక్త మొనర్చుచున్నవి.

కారణములగు విభావాదుల యోగ్యత ననుసరించి హృదయమున గలుగు భావము స్థాయిగనో, సంచారిగనో ప్రవర్తిల్లుననుట గమనింపదగిన విషయము.

"భావశబ్దేన తావ చ్చిత్తవృత్తివిశేషా ఏవ వివక్షితాఃు !
తేషాంతు యోగ్యతావశా ద్యథాయోగం స్థాయిసంచారి
విభావానురూపతా సంభవతిఃు।"

అను వివరణ మీ విషయమునం దనుసంధేయము. అదికాక,

"స్థాయినో వ్యభిచారితా భవతి న తు వ్యభిచారిణాం స్థాయితా !
ఏవం హి సతి తదాస్వాదే రసాంతరమపి స్యాత్।।"

స్థాయీ భావము లాయా నందర్భములందు సంచారులుగా ప్రవర్తిల్లగలవు గాని, సంచారులకు స్థాయితార్హత లేదనియు పైవాక్యము తెలుపుచున్నది. మనసునాక్రమించియున్న స్థాయిభావకారణముగా నుత్పన్నమైన సంచారిభావమునకు కూడ స్థాయిత్వమే సిద్ధించుచో, ఆస్వాదన సందర్భమున రసాంతరమునకు గూడ నవకాశ మేర్పడగలదు. అది ప్రకృతికి విరుద్ధమగు విషయము. రతిభావము క్రమముగా పరిపుష్టమై శృంగారముగా ఆస్వాద్యమగు పరిస్థితిలో, తత్పోషణయందు సహకరించిన హాసమునకుగాని, కరుణకుగాని ప్రసక్తి యుండదు. బాహ్యేంద్రియప్రవృత్తి యడగుట, చిత్తము రసోన్ముఖముగ పరిణతిజెందిన రతిభావముతో తాదాత్మ్యమును పొందుట జరిగినప్పుడే శృంగార రసాస్వాదన కవకాశమున్నది. అట్టిచో మరియొక భావము చిత్తము నాక్రమించుట జరుగజాలదు. కావున, స్థాయిభావ పోషకములగు సంచారులకు స్థాయితార్హత లేదు.

"వ్యభిచారినా మపి చ వ్యభిచారిణా మపి చ వ్యభిచారిణో భవంతి !
యథా నిర్వేదస్య చింతా, శ్రమస్య నిర్వేద ఇత్యాదిఃు।"

అని, నిర్వేదమునకు చింతయు, శ్రమమునకు నిర్వేదమును సంచారులగునవి వివరణము. అతిశయ దుఃఖోర్వాదుల వలన కలిగిన విషయద్వేషమనెడి చిత్తవృత్తి నిర్వేదము. రోదన, దీర్ఘశ్వాస దీనముఖాదులు అను భావములుగా నిర్వేదము వ్యక్తమగును.

"యది లక్ష్మణ పా మృగేక్షణా న మదీక్షాసరణిం సమేష్యతి
అమునా జడజీవితేన మే జగతా వా విఫలేన కిం ఫలమ్"

అని రసగంగాధర లక్ష్యము. సీతా వియోగము కారణముగా రామునకు గలిగిన శోకము నిర్వేదమునకు హేతువైనది. ఈ నిర్వేదము చింతకు మాత్రమే కాక వితర్కమునకు కూడ కారణము కాగలదు. చింతకు పూర్వమును పిమ్మటను కూడ వితర్కమనెడి సంచారి భావమునకు ప్రవృత్తి కలుగునని – "వితర్కోఽస్యాఃు క్షణే పూర్వే పాశ్చాత్యే వోపజాయతే" అను వాక్యమున వివరింపబడినది. ఇట్లు, స్థాయీభావ ప్రాబల్యము కారణమున నుత్పన్నములైన సంచారులు కూడ నితర సంచారి భావముల యుత్పత్తికి కారణములు కావచ్చును.

"యత్రాపి వ్యభిచారిణి వ్యభిచార్యంతరం సంభావ్యతే.
తద్యథా పురూరవస్య ఉన్మాదెఽపి తర్కచింతా ది :
తత్రాపి రతిస్తాయిభావస్యైవ వ్యభిచార్యంతరం యోగః
న కేవల మమాత్యస్థానీయేనోన్మాదేన కృతోపరాగః ॥"

అని అభినవగుప్తుడు, విక్రమోర్వశీయ చతుర్థాంక మందలి పురూరవుని చిత్తస్థితి యుదాహరణముగా నీ విషయమును వివరించియున్నాడు. విప్రలంభము ననుభవించుచున్న పురూరవుడున్మాద మనెడి సంచారి భావమునకు లోనైయున్నను, తర్క చింతాదులు కూడ నా స్థితి యందు ప్రవృత్తమగుచున్నవి. అందును రతిభావమే స్థాయియనియు, ఉన్మాద మమాత్యస్థానమును మాత్రమే వహించి దాని కుత్కర్ష నాపాదించుచున్నదనియు వ్యక్తీకరించియున్నాడు. సంచారులగు నీ తర్కచింతాదులు స్థాయియగు రతిభావమునకు పోషకములగునేకాని, ఉన్మాదమునకు కాదు అని, "తత్రాపి రతిభావస్యైవ వ్యభిచార్యంతరం యోగః" అను వాక్యమున వ్యక్తపరచి యున్నాడు. కావున స్థాయిభావాక్రాంతమైయున్న మనస్సున, తద్భావప్రాబల్యముచే భావపరంపర లొకదానివెంబడి యొకటిగాని, యొకప్పుడేకకాలమునగాని యుత్పన్నము కావచ్చును. సంచారి భావము లెన్ని కలిగినను స్థాయికిగల ప్రాధాన్యమున కేమాత్రమును భంగము కలుగజాలదు. రసముగా పర్యవసించు సామర్థ్యము స్థాయికి మాత్రమే కలదనియు, సంచారులకు లేదనియు నాట్యశాస్త్రమున లౌకికదృష్టాంతముచే వివరింపబడియున్నది.

"యథా హి సమానలక్షణా స్తుల్యపాణిపాదోదర శరీరాः
సమానాంగప్రత్యంగాः అపి పురుషాः కులశీలవిద్యాకర్మ
శిల్పవిచక్షణత్వా ద్రాజత్వ మాప్నువంతి, తత్రైవ చాన్యేఽ
ల్పబుద్ధయ స్తేషా మేవానుచరా భవన్తి, తథా విభావాను
భావవ్యభిచారిణः స్థాయీభావా నుపాశ్రితా భవన్తి !
బహ్వోశ్రయత్వా త్స్వామిభూతాः స్థాయినోభావాः
తద్వత్ స్థానీయపురుషగుణభూతా అన్యేభావాः తాన్ ఉపాశ్రయన్తేः"

పురుషులు సమానలక్షణములు, సమానాంగ ప్రత్యంగములు కలవారే యైనను, వారిలో కులశీల విద్యాదులందు విశిష్టులైనవారు మాత్రమే ప్రభువులగుట, నితరులు పరిజనులగుటయు లోకప్రసిద్ధమగు విషయము. అట్లే విభావానుభావ వ్యభిచారులు స్థాయిభావము నాశ్రయించి వర్తించును. విభావానుభావ వ్యభిచారి పరివృతమైన స్థాయీభావము రసమని వ్యవహృత మగుచున్నది. ఈవిధమున, ప్రకృష్ట విభావము కారణముగా నుద్బుద్ధమై అనుభావాదులచే వికసించి స్థాయిగా నేర్పడిన భావమనెడి చిత్తవృత్తి, సంచారులనెడి యితర చిత్తవృత్తుల యుత్పత్తికి కూడ కారణమగుచున్నది. మానవ స్వభావము ననుసరించి అట్లుత్పన్నములగు చిత్తవృత్తులు అసంఖ్యాకము లనియే చెప్పవలెను. ఐనను, వానిలో ప్రధానములు, సువ్యక్తములు నైనవానిని మాత్రమే గ్రహించి వానిసంఖ్య నలుబదితొమ్మిది యని అలంకారికులు వివరించినారు.

తత్రాష్టౌ భావాः స్థాయినः త్రయస్త్రింశ ద్వ్యభిచారిణः
అష్టౌ సాత్త్వికా ఇతి త్రిభేదాः ఏవ మేతే కావ్యరసాభి
వ్యక్తిహేతవ ఏకోనపంచాశద్భావాः ప్రత్యవగంతవ్యాः
ఏభ్యశ్చ సామాన్యగుణయోగేన రసా నిష్పద్యంతే.

స్థాయిభావము లెనిమిదియు, సంచారులు ముప్పదిమూడును, సాత్త్వికము లెనిమిదియు చేరి నలుబదితొమ్మిది. ఇవియే కావ్యరసాభివ్యక్తి హేతువులనియు, వీనినుండియే సామాన్యగుణయోగమున రసములు నిష్పన్నములగుననియు నాట్యశాస్త్రము వివరించుచున్నది. కాని, వీనిలో సాత్త్వికములు అయత్నజములుగ దేహమునందు గలుగు కార్యములే యగుటచే నవి చిత్తవృత్తులు కావు.

"సత్త్వం నామ మనఃప్రభవమ్, మనసः సమాధౌ
సత్త్వనిష్పత్తిర్భవతి, తస్య చయోఽ సౌ స్వభావో
రోమాంచాశ్రువైవర్ణ్యాది లక్షణో యథాభావోపగతः
స న శక్యో అన్యమనసా కర్తు మితి."

భావముపై మనస్సు కేంద్రీకరించియుండు సమయమున (భావ సమాధి) మనస్సునుండి సత్త్వము నిష్పన్న మగుననియు, రోమాంచాశ్రువైవర్ణ్యాది తల్లక్షణములు భావస్వభావము ననుసరించి పైకి వ్యక్తములగుననియు తెలియుచున్నది. దీనినిబట్టి రోమాంచాదులు సత్త్వప్రదర్శకములగు కార్యములే కాని చిత్తవృత్తులు కాజాలవని వ్యక్తమగుచున్నది. కావున, సాత్త్వికములగు వీనిని పరిహరింపగా, మిగిలిన స్థాయి సంచారులు, నలుబదియొకటి మాత్రమే చిత్తవృత్తులగు చున్నవి. శాంతమునకు స్థాయిభావముగా కొందరు పేర్కొన్న శమము యొక్క స్థితియే వివాదగ్రస్తము కనుక అది చిత్తవృత్తియా యను ప్రశ్నకూడ అనిశ్చితమే. మరి కొందరు మాత్సర్య, ఉద్వేగ, సంశయ, ఈర్ష్యాదులు కూడ చిత్తవృత్తులే యనియు, ఇవికూడ సంచారులలో చేరుననియు తెలిపినారు. కాని యవి భరతాదులు పేర్కొన్న ముప్పదిమూడు సంచారి భావములలోనే యంతర్భావమును బొందుచున్నవి. మాత్సర్య

మసూయయందును, ఉద్వేగము త్రాసమునను, ఈర్ష్య రోషమునను, సంశయము వితర్కమునను చేరిపోవుచున్నవి. ఇట్లే స్థాయిభావ యోగముచే అసంఖ్యాకములుగ హృదయమునందుత్పన్నములగు భావాంతరములన్నియు ముప్పదిమూడు సంచారులలో గాని, యితరములగు స్థాయీభావములలోగాని చేరిపోవుచున్నవి. కావున భరతాదుల ననుసరించి స్థాయిసంచారులని వ్యవహృతములగు చిత్తవృత్తుల సంఖ్య నలుబదియొక్కటి యని నిర్ణయము. ఐనను, భరతాదులు భావములని పేర్కొన్న సంచారులన్నియు చిత్తవృత్తులేనా యను ప్రశ్నకు అవకాశమును లేకపోలేదు. భరతాదులొనంగిన లక్షణలక్ష్యములను బట్టి యేవి చిత్తవృత్తులో, యేవి కావో పరిశీలింతము.

రతి : యువతీయువకులందు అన్యోన్యాలంబనము కారణముగా కలుగు ప్రేమయనెడి చిత్తవృత్తి విశేషము రతి. "స్త్రీ పుంసయో రన్యోన్యాలంబనః ప్రేమాఖ్యశ్చిత్తవృత్తివిశేషో రతిః స్థాయిభావః" రతి చిత్తవృత్తి విశేషమని లక్షణమున వాచ్యముగనే యున్నది. అదియునుగాక యిది మనః ప్రవృత్తి యను సత్యము స్త్రీపురుషులెల్లరకును అనుభవసిద్ధమే.

హాసము: "వాగంగాది వికారదర్శనజన్మా వికాసాఖ్యో హాసః" అను లక్షణమునుబట్టి వికృతాకార వాగ్వేషచేష్టాదుల దర్శనమువలన గలిగిన చిత్తవికాసము హాసమని తెలియుచున్నది. రదనప్రకాశన నయనవికాస అశ్రుపాతాదులగు కార్యములచే అంతరంగ ప్రవృత్తి వ్యక్తమగుచున్నది. ఈ అనుభవాద్యుత్పత్తికి దైహికములగు కారణము లేవియు లేకుండుటవలన చిత్తవృత్తియే కారణమని అంగీకరింపవలెను.

శోకం : "పుత్రాది వియోగ మరణాది జన్మా వైక్లబ్యాఖ్యశ్చిత్తవృత్తివిశేష శోకః" అని లక్షణము. ఆప్తులు, ప్రియులు నగువారికి కలిగిన మహానర్థము, వారివలని యెడబాటు మున్నగునవి కారణములుగా చిత్తమునకు వైక్లబ్యము కలిగినది. ఈ అలజడి మనస్సునకు సంబంధించినది. యనుట సువ్యక్తము. రోదన దీర్ఘనిశ్వాసాద్యను భావములును, నిర్వేదాది సంచారులును దీనివలన కలుగుచున్నవి. కనుక శోకము చిత్తవృత్తి కాకతప్పదు.

క్రోధము: గురుబంధవధాది పరమాపరాధములు. కారణములుగ కలిగిన చిత్తప్రజ్వలనము క్రోధము. చిత్తమునకు గలిగిన యీ అలజడి కారణముగా భృకుటీభంగ, రదనపీడన, నేత్రరక్తిమాదులగు ననుభావములు కలుగుచున్నవి. దైహికములగు నీ మార్పులకు చిత్తప్రజ్వలనమే హేతువగుటచే క్రోధము చిత్తవిశేషమని నిశ్చయమగుచున్నది.

ఉత్సాహము : "పరపరాక్రమ దానాది స్మృతిజన్యా ఔన్నత్యాఖ్య శ్చిత్తవృత్తి విశేష ఉత్సాహః" అని లక్షణము. ఉదాత్త కార్యనిర్వహణాదులందు ఇతరుల నధిగమింపవలెననెడి చిత్తౌన్నత్యము కారణముగా ముఖవికాసాద్యనుభావములు కలుగుచున్నవి. అట్టి చిత్తవృత్తికి లోనైనవ్యక్తి అసాధారణ ప్రయత్నాదికమునందు ప్రవర్తిల్లును.

భయము : "వ్యాఘ్రుదర్శనాదిజన్మా పరమానర్థవిషయకో వైక్లబ్యాఖ్య శ్చిత్తవృత్తి విశేషః భయం." వ్యాఘ్రము, విషసర్పము, క్రూరశత్రువు మున్నగువానిని చూచుటవలన మరణాదికమగు భీతి మనస్సున నేర్పడి, తత్ఫలముగా కంపము, ముఖశోష ఇత్యాదనుభావములు కలుగును. ప్రాణరక్షణార్థమై పరుగిడుట అరచుట మున్నగు చేష్టలయందు వ్యక్తి ప్రవర్తిల్లును. చిత్తము భావప్రాబల్యమునకు లోనగుటయే యిందులకు హేతువు.

విస్మయము : "అపూర్వవస్తుదర్శనా చ్చిత్తవిస్తారో విస్మయో మతః" "అలౌకివస్తుదర్శనాదిజన్మా ఆశ్చర్యాఖ్యోవిస్మయం" అలౌకికము, అసాధారణము, అపూర్వమునగు వస్తుదర్శనము వలన గలుగు చిత్తవిస్తృతి విస్మయ మనెడి లక్షణమును బట్టియు, విస్మయమునకు లోనైన వ్యక్తుల చేష్టాద్యనుభావములను బట్టియు నిది భావమని నిశ్చయమగుచున్నది.

జుగుప్స : "కదర్యవస్తువిలోకనజన్మా విచికిత్సాఖ్య శ్చిత్తవృత్తివిశేషో జుగుప్సా" అని లక్షణము. పురిషాదివస్తువులను జూచుటవలన మనస్సున కేవగింపు కలుగుటయు, వ్యక్తి తద్వస్తువులనుండి దూరముగ బోవ ప్రయత్నించుటయు జరుగును. ముఖ సంకోచ నిష్ఠీవనాది చేష్టలును, నొకప్పుడు వమనాదికమును కూడ

జరుగవచ్చును. దైహికములగు నీ కార్యములన్నిటికిని చిత్తవృత్తియే హేతువనుట సువ్యక్తము.
ఇట్లు రతిహాసశోకాదులగు నెనిమిదియు సంపూర్ణముగ చిత్తవృత్తులని నిర్ణయమగుచున్నది. ఇక సంచారులను బరిశీలింతము.

నిర్వేదము : "నీచపురుషేషు ఆక్రోశన అధిక్షేప వ్యాధి తాడన దారిద్ర్య ఇష్టవిరహ పరసంపద్దర్శనాదిభిః, ఉత్తమేషు తు అవజ్ఞాదిభిః జనితా విషయద్వేషాఖ్యా, రోదస దీర్ఘశ్వాస దీనముఖతాది కారిణీ చిత్తవృత్తి ర్నిర్వేదః" అతిశయమగు దుఃఖ ఈర్ష్యా తిరస్కారాదుల వలన చిత్తమునకు విషయములందు గలుగు అరతి నిర్వేదమని లక్షణము. నిశ్వాస రోదనాదు లింతనుభావములు. ప్రాపంచిక విషయములందు విముఖత చిత్తసంబంధి యనక తప్పదు.

చపలత : "అమర్షాదిజన్యా వాక్పరుష్యాది కారణీభూతా చిత్తవృత్తి ర్చపలతా." "మాత్సర్యద్వేషరాగాదే శ్చాపల్యంతు అనవస్థితిః" అను లక్షణములను బట్టి, చిత్తమునకు గలిగిన అనవస్థితియే చాపల్యమని తెలియుచున్నది. జడత యను చిత్తస్థితికిది పూర్తిగ విరుద్ధమగుట చిత్తప్రవృత్తియగును.

అవహిత్థ : "వ్రీడాదిభిర్నిమిత్తై హర్షాద్యనుభావానాం గోపనాయ జనితో భావిశేషోఽవహిత్థమ్"
భావప్రాబల్యకారణముగా కలిగిన హర్షపులకాది కార్యములను మరుగుపరుచుటకై మనసున కలిగిన భావవిశేషము అవహిత్థ యనుటచే వ్రీడాదు లిందు విభావములగును. అనుభావాదులను చూచి యితరులు మనోగతభావమును గుర్తెరుంగుదురని తెలియుటయు, తదనుభావములను మరుగుపరచు ప్రయత్నమున క్రిందియములను పురికొల్పుటయు మనోవ్యాపారమే యగుటచే అవహిత్థ చిత్తవృత్తి యగుచున్నది.

త్రాసము : "ఆకస్మికభయా చ్చిత్తవిక్షోభ స్త్రాసః" అను లక్షణమును బట్టి దీనిని భయమనెడు స్థాయిభావమున చేర్పవచ్చును. ఐనను, విభావముల విషయముననను, సందర్భము విషయముననను గల భేదములను బట్టి త్రాసము తాత్కాలికము, అల్పము నగుటచే సంచారిగా పరిగణింపబడినది. భయత్రాసములకు గల భేదమెట్టిదైనను త్రాసము చిత్తవృత్తి యనుట నిస్సందేహము.

శంక : "కిమనిష్టం మమ భవిష్యతీత్యాకార శ్చిత్తవృత్తి విశేష శ్శంకా". అనిష్టమగు కార్యము జరుగునేమో యనెడి జంకు చిత్తవృత్తియే. ముఖవివర్ణత, కంపము, పనులయందు తొట్రుపాటు, స్థిమితము లేకుండుట మున్నగువాని కిది హేతువగుచున్నది.

హర్షము : "ఇష్టప్రాప్త్యాదిజన్మా సుఖవిశేషో హర్షః" ప్రసన్న ముఖనేత్రములు, మాటలయందు తొట్రుపాటు, పులకాంకుర స్వేదాదులు, అశ్రూదయము ఇత్యాది కార్యములచే చిత్తవృత్తి వ్యక్తమగుచున్నది.

దైన్యము : "దుఃఖ దారిద్ర్యాపరాధజనితా స్వాపకర్షకారణాదిహేతుశ్చిత్తవృత్తివిశేషో దైన్యమ్."
అతిశయదుఃఖ, దారిద్ర్యాదులవల్ల వ్యక్తికి స్వశక్తిసామర్థ్యములందు విశ్వాసము నశించుటయు, తత్కారణముగా నతడు తన్ను గూర్చి జాలిపుట్టునట్లు పలుకుటయు, మున్నగునవి లోకవృత్తములు కనుక దైన్యము చిత్తవృత్తియనుట నిస్సందేహము.

ఉగ్రత : "అధిక్షపాపమానాదిప్రభవా కిమస్యకరోమి ఇత్యాద్యాకారా చిత్తవృత్తి రుగ్రతా." అవమానము, నింద మున్నగువాని వలన చిత్తమున కొక్కసారిగా గలుగు ప్రజ్వలన ముగ్రత. ప్రచండమగు నీ చిత్తవృత్తిచే వధేచ్ఛ బొడముచున్నది. వ్యక్తి తన్ను మరచి పరునిపై బడి కొట్టుట, వధించుట మున్నగు ప్రవర్తనకు లోనగును. ఈ చిత్తవృత్తి చాలకాలముండునది కాదు; క్షణికమైనది. ఉగ్రతకులోనై దీర్ఘకాలము ప్రవర్తించుటకు చిత్తమునకు సామర్థ్యములేదు. కావున నిది సంచారి యగుచున్నది. క్రోధము చిరకాలము నిలిచి యుండునది కావున నది స్థాయి యగుచున్నది.
"నాప్యసౌ క్రోధః తస్య స్థాయిత్వేన అస్యాః సంచారిణీత్వేనైవ భేదాత్." అని ఉగ్రతకును క్రోధమనెడి స్థాయిభావమునకును గల భేదమును రసగంగాధరకారుడు వివరించినాడు.

చింత : "ఇష్టాప్రాప్త్య నిష్టాప్రాప్త్యాది జనితా ఆధ్వానపరపర్యాయా, వైవర్ణ్య భూలేఖన, అధోముఖత్వాది హేతు

శ్చిత్తవృత్తివిశేష శ్చింతా."

ఇష్టమైనది సిద్ధింపకుండుటయు, అనిష్టమైనది జరుగుటయు మున్నగు కారణములవలన గలిగిన ఆధ్యానమనెడి చిత్తవృత్తియే చింత. వైవర్ణ్యము, శూన్యదృష్టి, నిశ్వాసము, నేలనువ్రాయుట, తల వంచుకొనియుండుట, యిత్యాదులచే నీ చిత్తవృత్తి వ్యక్తమగుచున్నది.

అసూయ : "పరోత్కర్షదర్శనాదిజన్యః పరనిందాది కారణీభూత శ్చిత్తవృత్తివిశేషోఽసూయా."

ఇతరుల యుత్కర్షను చూచి సహింపలేని మనః ప్రవృత్తి అసూయ. వారియెడ కోపముగ ప్రవర్తించుట, తూలనాడుట, యిత్యాదులచే నీ మనోభావము వ్యక్తమగుచున్నది.

అమర్ష : పరకృతమగు అవజ్ఞారూపాద్యపరాధములవలన జనించిన కోపవిశేషమే అమర్షమని యిదివరకే వివరింపబడియున్నది. క్రోధభేదముగా దీనిని పరిగణించుటకును నవకాశమున్నది. ఎట్లున్నను, రోషము చిత్తవృత్తియనుటలో సందేహములేదు.

గర్వం : "గర్వోమదః ప్రభావ శ్రీ విద్యా సత్కులతాదిజః" "రూపధనవిద్యాది ప్రయుక్తాత్మోత్కర్షజ్ఞానాధీన పరావహేలనం గర్వః" అను లక్షణములనుబట్టి ఆత్మోత్కర్ష జ్ఞానమువలన గలిగినదియు పరులను నిరసించునదియునగు చిత్తవృత్తి గర్వమని తెలియుచున్నది. ఇతరులను గణింపక పలుకుట, ఆటోపముగ నడచుట మున్నగు చేష్టలచే గర్వము వ్యక్తమగుచున్నది.

వ్రీడ : "స్త్రీణాం పురుషముఖావలోకనాదేః పుంసాం చ ప్రతిజ్ఞాభంగపరాభవాదే రుత్పన్నా వైవర్ణ్య అధోముఖత్వాది కారణీభూత శ్చిత్తవృత్తివిశేషో వ్రీడా." ప్రతిజ్ఞాభంగపరాభవాదులు కారణములుగా పురుషులయందును, పురుషముఖావలోకనాదులచే స్త్రీలయందును గలుగు చిత్తవృత్తివిశేషము వ్రీడ. వైవర్ణ్యాధోముఖత్వాదులకు చిత్తవృత్తియే కారణము.

ఆవేగము : ప్రియాప్రియప్రాప్తి సందర్భమున గలిగిన మనస్సంభ్రమము ఆవేగము.

"అనర్థాతిశయజనితా చిత్తస్య సంభ్రమాఖ్యావృత్తిరావేగం" అను లక్షణమును బట్టియు నిది చిత్తవృత్తియే. ఇక, అనర్థాతిశయమును మాత్రమే విభావముగా జెప్పనవసరములేదు. ప్రియము సిద్ధించినప్పుడు గూడ మనస్సునకు సంభ్రమము కలుగవచ్చును.

వితర్కము : "తర్కో విచారః సందేహాత్"

"సందేహాద్యనంతరం జాయమాన ఊహో వితర్కః"

అనులక్షణములను బట్టి సందేహమేర్పడినపుడు తన్నిర్ణయజ్ఞానమునకు తోడ్పడు ఊహ వితర్కమని తెలియుచున్నది. సందేహ విషయమున వినిశ్చయమునకు సాధనమగునది చిత్తవృత్తియే యగుట నిస్సందియము.

విషాదము : "ప్రారబ్ధకార్య అసిద్ధ్యాదే ర్విషాదః"

"ఉపాయాభావజన్మాతు విషాదః సత్త్వసంక్షయః"

అను లక్షణములను బట్టి, ప్రయత్నసిద్ధి కాకుండుటవలనను, నిస్సహాయతాదుల వలనను గల్గు అనుతాపము విషాదమని తెలియుచున్నది. ముఖసంకోచ, నిశ్వాసాదులచే విషాదము వ్యక్తమగును.

ఔత్సుక్యము : "అధునైవా స్యలాభో మమాస్తు ఇతీచ్ఛా ఔత్సుక్యమ్." అను లక్షణమును బట్టి, ఇష్టవిషయమును బొందుటలో మనస్సు చెందెడి తొందరపాటు ఔత్సుక్యమని తెలియుచున్నది. వాంఛితమును బొందు విషయమున చిత్తమునకు గల తొందరపాటు అనుటచే నిది చిత్తవృత్తియనుట నిక్కము.

ఇట్లీ పదునేడు సంచారులును సంపూర్ణముగా చిత్తవృత్తులని నిర్ణయింపవచ్చును. ఇక –

గ్లాని : **"రత్యాయాస మనస్తాప క్షుత్పిపాసాది సంభవా / గ్లాని ర్గ్లపణాకంపకార్యానుత్సాహతాదికృత్"**

"ఆధివ్యాధిజన్య బలహానిప్రభవో వైవర్ణ్యశిథిలాంగత్వ / దృగ్గ్రమణాదిహేతుః దుఃఖవిశేషో గ్లానిః"

సురతాయాస, మనస్తాప క్షత్పిపాసాదులవలన గలిగినది గ్లాని యనియు, ఆధివ్యాధిజన్యమగు బలహీనతవలన గలిగిన దుఃఖవిశేషము గ్లానియనియు వివరింపబడినది. దుఃఖవిశేషమే గ్లాని యగుచో నిది శోకమునం దతర్భావమును బొందగలదు. మరియు సురతాయాసము కారణముగా మనస్సునకు గలిగిన అనుభవము దుఃఖవిశేషము కాజాలదుకదా? వైవర్ణ్య శిథిలాంగత్వ దృగ్గ్రమణాదులకు బలనాశ, ఆయాసములు హేతువులగుచున్నవే కాని చిత్త ప్రవృత్తికాదు కదా? కావున –

గ్లాని చిత్తవృత్తియా యను విషయము సందేహగ్రస్తము.

శ్రమ : **"శ్రమః ఖేదోఽ ధ్వగరత్యాదేః"**

"బహుతర శారీరవ్యాపారజన్మా నిశ్శ్వాసాంగసమ్మర్దకారణీ భూతః ఖేదవిశేషః శ్రమః" ప్రయాణము, సురతము, వ్యాయామము మున్నగు శారీరవ్యాపారాదులు కారణములుగా గలిగిన ఖేదవిశేషము శ్రమ యని లక్షణము. నిశ్శ్వాస, అంగసమ్మర్ద, నిద్రాదులు అనుభావములుగా పేర్కొనబడినవి. శరీరవ్యాపారమువలన కలిగిన అలసట దేహమునకు సంబంధించినదియే కాని మనస్సునకు సంబంధించినది కాదుకదా? శరీరవ్యాపారాతిశయమువలన మనస్సునకు కూడ అలసటకలుగవచ్చునని యొప్పుకొన్నను, అలసటను చిత్తప్రవృత్తి యన వీలులేదుకదా! అలసట చైతన్యమును తగ్గించునదియే కాని, ప్రవర్తింపజేయునది కాదు మరియు, సురతాదిక వ్యాపారముచే దేహమునకు అలసట గలిగినను మనస్సునకు గల్గునది ఉల్లాసమే యగును గాని ఖేదము కాజాలదు కదా! ఈ కారణములనుబట్టి శ్రమ చిత్తవృత్తి యనుట విమర్శనీయాంశము. కావున, శ్రమ మనసునకు గలిగిన అనుభూతి విశేషమే యనియు, నిది గ్లానివంటిదే యనియు చెప్పవలెను.

ధృతి : **"జ్ఞానాభీష్టాగామ్యైస్తు సంపూర్ణస్పృహతాధృతిః"** అను సాహిత్యదర్పణ లక్షణమును బట్టి అభీష్టసిద్ధి వలన సంపూర్ణమగు మనస్సంతృప్తి లేక కృతార్థత ధృతి యని తెలియుచున్నది. ఇది ప్రశాంతమగు చిత్తస్థితిని సూచించుచున్నది. "చాపలాద్యుపశమోనుభావః" అని మనస్సు చాపలమునుండి యుపశమించి యుండుట అనుభావముగా జగన్నాథుడు పేర్కొనియుండుటయు, "ప్రాప్తానామ్ ఉపభోగ అప్రాప్తే నశోకః" అని ప్రాప్తించినదాని నుపభోగించుట "ప్రాప్తింపనివానికై వెతపడకుండుట అనునవి ధృతిలక్షణములుగా నాట్యశాస్త్రము వివరించియుండుటయు కారణములుగా, ధృతి యనునది చిత్తస్థితియేకాని చిత్తవృత్తి కాదని తెలియుచున్నది.

అసలత : **"అతి తృప్తి గర్భ వ్యాధి శ్రమాదిజన్మా చేతః క్రియానున్ముఖతా ఆలస్యం"** క్రియల విషయమున మనస్సునకు గలిగిన వైముఖ్యము ఆలస్యమగుటవలన నిదియు చిత్తస్థితియే గాని చిత్తవృత్తి కాదని తెలియుచున్నది. క్రియాప్రవృత్తి యందు వైముఖ్యమును చిత్తప్రవృత్తిగా నెన్నుట యెట్లు ?

జడత : "చింతోత్కంఠా భయ విరహ ఇష్టానిష్టదర్శన శ్రవణాదిజాన్య, అవశ్యకర్తవ్యార్థ ప్రతిసంధానవికలా చిత్తవృత్తిర్జడతా." చింత, భయము, విరహము, ఇష్టానిష్టప్రదర్శన శ్రవణాదులు కారణములుగా జడత కలుగుననియు, నిది కారణముగా నవశ్య కర్తవ్యముల విషయమునను వ్యక్తి విమూఢుడగుననియు లక్షణము. చింతాదులు విభావములనియు ఇతికర్తవ్యతావిమూఢత్వ మనుభావమనియు ఆశయము. కాని, ఇతికర్తవ్యతా విమూఢత్వము చిత్తము యొక్క స్థితివిశేషమని యేల చెప్పకూడదు ? (చింతాదులు కారణముగా చిత్తము జడతారూపమున ప్రవర్తిల్ల విమూఢత్వమును కలిగించుననుట మానవ మనస్తత్వముతో సమన్వయమగునా?)

స్మృతి : "సంస్కారజన్యం జ్ఞానంస్మృతిః సంస్కార రూపమున నున్న పూర్వానుభవ జ్ఞానము స్మృతి యని యర్థము. సదృశ వస్తువు యొక్క అవలోకనచింతనాదుల కారణముగా పూర్వానుభూతమగు విషయము చిత్తమునకు వచ్చుట స్మృతి యని ఆశయము. సంస్కారరూపమున నణగియున్న అనుభవము ప్రతిబోధకు వచ్చుట చిత్తవృత్తి యెట్లగుచున్నది? పూర్వానుభవము ప్రతిబోధకు వచ్చుటకు కారణభూతమైన చిత్తప్రవృత్తి స్మృతి

యన్నచో పైలక్షణము కుదరదు. కనుక స్మృతి చిత్తమునందు జరుగు నొక వ్యవస్థాపరిణామమే యగుచున్నది కాని చిత్త ప్రవృత్తి కాదు.

మరణము : "రోగాదిజన్యా మూర్ఛారూపా మరణప్రాగవస్థా మరణం" మూర్ఛారూపమగు మరణపూర్వావస్థయే మరణమని గ్రహించినను, నది చిత్తవృత్తి కాజాలదు కదా? మరణమున కున్ముఖమగు చిత్తప్రవృత్తి యని చెప్పిననే యిది భావము కాగలదు.

మదము : "హర్షోత్కర్షో మదః" అను లక్షణమునను సరించుచో నిది హర్షభేదమే యగుచున్నది. "మద్యాద్యుపయోగజన్మా ఉల్లాసాఖ్యః శయనహసితాది హేతుశ్చిత్తవృత్తివిశేషో మదః" మద్యపానాదులవలన చిత్తమునకు గలిగిన ఉల్లాసము మదమనియు, నిద్రాహసితవాచాలతలు కార్యములనియు అర్థము. మోహసంతోషములు ఏకకాలమున కలుగుననియు, వాని కలయిక మదమనియు కూడ వివరించినారు. "సమ్మోహానందసందోహో మదోమద్యోపయోగజః" మదిరాదిద్రవ్యముల యుపయోగముచే మోహము కలుగవచ్చును కాని ఆనందము కలుగుననుట సందేహము. మద్యపానమువలన నింద్రియములు ప్రకోపించి నిద్రావాచాలతాది కార్యములను కలుగజేయుచున్నవా, లేక ఉల్లాసమనెడి భావము మద్యపానముచే నుద్బుద్ధమగుచున్నదా యని ప్రశ్న కావున మదమును చిత్తవృత్తి యనుట పొసగదు.

సుప్తి : "నిద్రామగ్నస్య విషయానుభవ స్వప్నః కోపావేగభయగ్లాని సుఖదుఃఖాదికారకః" నిద్రయందున్న వ్యక్తికి గలుగు విషయానుభవము స్వప్నము. జాగ్రదావస్థయందు వ్యక్తి అనుభవింపగల సుఖదుఃఖాది భావములనన్నిటిని వ్యక్తి స్వప్నమునందును ననుభవింపగలడు. ఇది అంతశ్చైతన్యము యొక్క విపరీత ప్రవృత్తి యని చెప్పవచ్చును.

నిద్ర : "శ్రమాదిప్రయోజ్యం చేతస్మమ్మీలనం నిద్రా." శ్రమాదులు కారణములుగా కలిగిన చిత్తసమ్మీలనము నిద్రయగుచో, నది చిత్తవృత్తి యగుట యెట్లు? చిత్తప్రవృత్తి ఆగుటయేకదా నిద్ర? దీని నొక చిత్తస్థితి యనవచ్చునే కాని చిత్తవృత్తి యనజాలము.

విబోధ : "నిద్రానాశోత్తరం జాయమానో బోధో విభోధః." నిద్రానంతరము గలుగు మెలకువ విబోధము. అక్షిమర్దన, జృంభాదులనుభావములుగా పేర్కొనియున్నారు. మెలకువ చిత్తముయొక్క స్థితియే కాని ప్రవృత్తి కాదనుటకు వీలున్నది. జాగ్రదవస్థకు చిత్తమువచ్చుటయే కదా విబోధ? అట్టి పూర్వావ్యవస్థను తదనంతర ప్రవృత్తి యనుట యెట్లు?

అపస్మారము : "వియోగ శోక భయ జుగుప్సాదీనా మతిశయాత్ గ్రహావేశాదేశ్చ ఉత్పన్నో వ్యాధివిశేషోపస్మారః" ప్రియవియోగము, శోకము మున్నగువాని అతిశయమువలన గలిగిన వ్యాధివిశేషము అపస్మారమనుట వలన నిది చిత్తవృత్తి కాదని తోచుచున్నది. వియోగాదులవలన చిత్తస్వాస్థ్యమునకు కలిగిన భంగమే వ్యాధివిశేషమన్నను, అపస్మారము చిత్తస్థితియగునే కాని చిత్తప్రవృత్తి కాదని చెప్పవలసివచ్చును.

మోహము : "భయవియోగాది ప్రయోజ్యా వస్తుతత్త్వా నవధారిణీ చిత్తవృత్తి ర్మోహః" అను లక్షణమును బట్టి మోహము చిత్తము యొక్క అస్వస్థస్థితి యని చెప్పవలసియున్నది. వస్తుతత్త్వమును తెలియజాలనట్టి చిత్తస్థితి వియోగాది కారణముగా నేర్పడినది. మోహోవిచిత్తతా భీతిదుఃఖావేగానుచింతనైః అను లక్షణము ననుసరించి, భీతి దుఃఖావేగాదుల కారణముగా కలిగిన విచిత్తతయే మోహమని తెలియుచున్నది. విచిత్తతను చిత్తప్రవృత్తి యనుటకు వీలులేదు. కావున మోహము చిత్తస్థితియే, కాని చిత్తవృత్తికాదు.

మతి : "శాస్త్రాదివిచారజన్యం అర్థనిర్ధారణం మతిః" అను లక్షణమును బట్టి అలజడిలేని మనస్థితి మతి యని తెలియుచున్నది. శాస్త్రవిచారముచే అర్థనిర్ణయమైన పిమ్మట మనస్సునకు ప్రవృత్తి యెట్టిది? హర్షమో, సంతుష్టియో కలుగువచ్చును.

వ్యాధి : "రోగవిరహాదిప్రభవో మనస్తాపో వ్యాధిః" రోగాదికారణములుగా మనస్సునకు గలిగిన తాపము వ్యాధి యన్నచో నది చిత్తమునకు గలిగిన యనుభవమే కాని చిత్తవృత్తి కాజాలదు.

ఉన్మాదము : "విప్రలంభ మహాపత్తి పరమానందాది జన్మా అన్యస్మిన్నన్యావ భాసః ఉన్మాదః" విప్రలంభ మహాపదాదులు కారణములుగా జనించినట్టిదియు, ఒక వస్తువును మరియొక వస్తువుగా భ్రమింపజేయునట్టియు చిత్తవృత్తివిశేషమున్మాదము.

"చిత్తసందేహ ఉన్మాదః కామశోకభయదిభిః"

అను లక్షణమునుబట్టియు, చిత్తసమ్మోహ మున్మాదమగుచున్నది. ఇది చిత్తము యొక్క స్థితివిశేషమే కాని ప్రవృత్తి యని చెప్పలేము. చిత్తము స్వాస్థ్యమును గోల్పోవుటయేకదా ఉన్మాదమునకు కారణము?

ఇట్లీ పదునాలుగును సంపూర్ణమలుగ చిత్తవృత్తులా యను విషయమున సందేహమున కాస్పదమున్నది. ఐనను వివిధములగు నీ వ్యవస్థలన్నియు నంతరంగమునకు సంబంధించియుండుటయు, సారవంతమగు భావము నాధారమున నేర్పడుటయు కారణములుగా వీనిని చిత్తవృత్తిభేదములుగా అలంకారికులు పరిగణించినారు. కావున భావములసంఖ్య నలుబదియొక్కటి యను పరిణామము సంప్రదాయముగ నేర్పడినది. వీనిలో సంచారులగు ముప్పది మూడు భావములును అల్పవిభావములవలన నుత్పన్నమై తాత్కాలికముగ మాత్రమే ప్రవర్తించుననియు, కనుక అవి రసపర్యవసితములు కాజాలవనియు ముందే వివరింపబడినది. ఇక స్థాయిభావములగు రత్యాదులన్నిటికిని రసముగ పర్యవసించు శక్తి కలదని చెప్పుటకును వీలులేదు. మానవ జీవితమునందు మిక్కిలి ప్రధానములుగ వర్తించునవి రత్యుత్సాహములు రెండే యని అంగీకరింపక తప్పదు. అనురాగము, వాత్సల్యము, ప్రేమ, భక్తి, మధురము, ఇత్యాదులన్నిటికిని రతిభావమే మూలమనుటలో విప్రతిపత్తి లేదు. ఏదో యొక రూపమున మానవ జీవితమునంతను రతిభావ మాక్రమించియున్నది. కావున రతి రసముగ పర్యవసించి ఆనందమును గూర్పకలదు. అట్లే, మానవుని ప్రయత్న సర్వస్వమునకును, అతడొనర్చు ప్రతికార్యమునకును ఉత్సాహమే మూలము. ఉత్సాహ శూన్యమగు మానవజీవితము నిరర్థకమగుట నిస్సందేహము. కావున ఉత్సాహము కూడ రసముగ పర్యవసింపగలదు. శోకము కూడ జీవితమున సర్వసాధారణము. మానవమాత్రుడైనవానికి ఇష్టజనవినాశక్లేశాదులు తప్పనివగుటచే శోకము మనలను వెన్నాడుచునే యుండును. కావున శోకము కూడ కరుణగా నాస్వాద్యమానమగు చున్నది. రత్యుత్సాహశోకములకు జీవితమున గల ప్రాధాన్యము హాసక్రోధాది విశుద్ధమగు నంతఃకరణమున విభావానురూపమగు భావముద్బుద్ధ మగుట కపకాశమున్నది. మరియు, వ్యక్తి మనస్సునం దాభావము వాసనా (సంస్కార) రూపమున నుండుట కూడ యవసరము. అట్టి పరిస్థితులయందు బోధచెందిన భావము అనుభావాదులచే వికానమును గాంచి వ్యాప్తి నందుచున్నది. దీనినే, విభావాదిదర్శనాదికముచే సహృదయుని సత్త్వగుణ ముద్రిక్తమగుచున్నదనియు, తదుద్రేకకారణముచే వాసనారూపమున నున్న స్థాయిభావము విభావాను గుణమగు రత్యాది రూపమున నుద్బుద్ధమగుననియు అలంకారికులు చెప్పుదురు. విభావానుభావములు పదేపదే భావితములై వ్యభిచారులను స్ఫురింపజేయును. అనగా, విభావానుభావచర్వణము వ్యభిచారచర్వణమున పర్యవసించుచున్నది. వ్యభిచారులనెడు చిత్తవృత్తుల చర్వణము కూడ స్థాయిభావము తదాధారముగ మెలగుచునే యుండును. హారమందలి మణులన్నింటికి నాధారమగు సూత్రము లోపలనుండునట్లు స్థాయి ప్రవర్తిల్లునని దీనిని దృష్టాంతముగా నిచ్చియున్నారు. ఇట్లు వ్యభిచారి చర్వణయందు స్థాయి కూడ చర్వితమగుచున్నది. కావుననే వ్యభిచారులు స్థాయికి పోషకములని చెప్పుట. ఈ విభావానుభవవ్యభిచారి చర్వణమే రసస్ఫూర్తి కాధారము. ఇట్లు చర్వితమైన స్థాయి చిత్తవృత్తియే పరిణతస్థితిలో రసముగా నాస్వాద్యమగునని కొందరి మతము. స్థాయిభావము జడమగు నంతఃకరణధర్మము మాత్రమే యనియు, రసము చిద్ఘనమగు నాత్మస్వరూప మగుటచే నది వేరనియు కొందరి మతము. విభావానుభావచర్వణ మూలమున చర్వితమగు స్థాయియే రసచర్వణ మొదవించి, దానిని సంస్కరించు ననియు, నప్పుడు రసము స్థాయి రూపోపహితమై ఆస్వాదింపబడుననియు వీరి వాదము. ఏది నిజమైనను, విభావానుభావసంచారీభావముల చర్వణ రసానుభూతికాధారమగుచున్నదనుటలో విప్రతిపత్తి లేదు.

(కిన్నెర : సంపుటము 5, సంచిక 11, నవంబరు 1953)

స్మృతి శకలాలు

– అంకే శ్రీనివాస్

ఈ కొత్త శతాబ్ద మొదటి పాతికలో నిలబడి గతచరిత్ర స్మృతి శకలాలను తవ్వితే తెలుగువారి ఆహారంలో వరి ప్రాధాన్యత ఎంతో అర్థమవుతుంది. ఇదే ప్రాంతంలోని కొన్ని ప్రాచీన నగరాల్లోని వీధులలో బంగారం, వజ్రాలు, రత్నాలు బహిరంగంగా రాసులుగా పోసి వ్యాపారం చేసేవారని చరిత్ర చెప్పే సాక్ష్యం. అంతటి సౌభాగ్యాన్ని విదేశీయులు దోచుకెళ్ళారని సరిపెట్టుకున్నా, ఆ సంపద ఎలా పోగుపడింది అని ప్రశ్నిస్తే వ్యవసాయంద్వారానేనని తెలుస్తుంది– విదేశాలకు ఎగుమతి చేసే వస్తురాశిలో సింహభాగం వ్యవసాయోత్పత్తులే వుండేవి.

ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం ఈ రోజుల్లో అత్యధిక వరి దిగుబడి సాధిస్తున్న దేశం చైనా! అయితే అత్యధిక వరివంగడాల్ని పండిస్తున్న దేశం భారతదేశం. శ్రీకృష్ణదేవరాయలు ప్రతిరోజు ఒక్కో దేవాలయానికి వెళ్ళేవారట. ఆ దేవాలయంలో ఒక ప్రత్యేకమైన వరి రకంతో వండిన ప్రసాదాన్ని భోంచేసేవారట. ఇదే విధంగా సంవత్సరమంతా ఒక్కో దేవాలయం వద్ద ఒక్కోరోజు ఒక్కో ప్రత్యేకమైన వరి వంగడంతో తయారుచేసిన భోజనాన్ని దైవ ప్రసాదంగా తినేవారట. అయినప్పటికీ ఇంకా అనేకరకాల వరిరకాలు మిగిలిపోయేవని ప్రముఖ కాలమిస్టు నాగసూరి వేణుగోపాల్ అన్నారు.

వరినాట్లు

వరి పూర్తిగా ఆరుతడి పంట. చెఱువుల నుండి, నదుల నుండి వరిమళ్ళకు కాలువలు ఉండేవి. ఈ కాలువల గురించి *ఆముక్తమాల్యద, శుకసప్తశతి* కావ్యాలు వివరిస్తున్నాయి. ఆరోజుల్లో కూడా రెండు పంటకాలాలు వుండేవి. అవి వైశాఖం, కార్తీకం. వీటిలో కార్తీకమాసం పంట చాలా ముఖ్యమైనది. అక్టోబరు, నవంబరులలో కార్తీకమాసం పంట 'మాసూళ్ళు' జరుగుతాయి. అన్నట్టు ఈ కార్తీకవైశాఖాలు నేటి ఖరిఫ్, రబీలే! ఈ పంటకాలాల్లో పండించే ముఖ్యమైన పంట వరి.

– అయితే ఆనాటి అనేకమైన వరివంగడాలు నేడు కనిపించడంలేదు. సాహిత్యాధారాల ద్వారా ఇక్కడ కొన్ని రకాల వరివంగడాలను చర్చిద్దాం:

'కోద్రవ', 'వ్రీహి' అనేరకాలు తూర్పుతీర ప్రాంతాల్లో పండేవని మల్లంపల్లి సోమశేఖర శర్మ చెప్పారు. ఆయనే తూర్పు చాళుక్యుల పత్రాల్లో 'ఆది' అనే వరిరకం ప్రస్తావన వున్నట్లు కూడా రాశారు.

"కంపా తరంగిణీ నదీమాతృకాయ మాన విశ్వంభరా భరిత 'కలిమ', శాలి, సిరాముఖ షాష్టిక, పతంగ, హయన" ప్రముఖ బహువిధ వ్రీహిభేద సంపత్సంపన్నంబును...

(హరవిలాసం–1–10)

ఇక్కడ 'కలిమ, శాలి, సిరాముఖ, షాష్టిక, (సాష్టిక) పతంగ, హయన అనే వరిరకాలు తెలుస్తున్నాయి. 'సాష్టిక' రకం కేవలం రెండు నెలల్లోనే పండే రకమని మల్లంపల్లివారు చెబుతున్నారు. భీమేశ్వర పురాణంలో కూడా వీటి ప్రస్తావన ఉన్నది.

"పథిక నాసాపుటీ.... వ్రాలున వియునై కలిమశాలి శారదా ముఖాది వ్రీహిసస్యంబుల వలనను (భీ.పు.–2–55) హరవిలాసంలో చెప్పిన 'సిరాముఖం' ఇక్కడి 'శారదాముఖం' రకాలు ఒకటేనా లేక వేర్వేరా అని నిర్ణయించడానికి తగిన ఆధారాలు లేవు. ఈ రెండు సందర్భాల్లో చెప్పిన 'కలిమ' రకాన్ని శ్రీకృష్ణదేవరాయలు కూడా చెప్పాడు (... కలిమాన్నము

నొల్చిన...ఆముక్తమాల్యద 1-80) అదే విధంగా "ఏరుబ్రాల కలిమాహారంబు ...(భీ.పు - 2-14) అని కూడా శ్రీనాథుడు చెప్పివున్నాడు. పైవాటిని బట్టి 'కలిమ, శాలి, సాష్టిక, పతంగ, హయన, సిరాముఖం (శారదాముఖం?) వంటి రకాలు తెలుస్తున్నాయి.

భీమేశ్వరపురాణంలోనే ''ప్రాసంగు వరిచేల పసిడిచాయ..." (1-54) అనే మాటను బట్టి 'ప్రాసంగు' అనే ఇంకొక రకం కనిపిస్తోంది. "ఏరబ్రాల తెల్లప్పురభోగి వంటకం... (భీ.పు 2-139) అనేవాక్యం.

'కప్పురభోగం' అనే మరోరకం వరివంగడ ప్రస్తావనను చెబుతుంది. ఈ రకాన్ని గురించి శ్రీనాథుని సాహచర్యంలో వినుకొండ వల్లభామాత్యుడు రాసిన *క్రీడాభిరామం*లో కూడా ప్రస్తావనకొచ్చింది (కప్పురభోగి వంటకం కమ్మని గోధుమపిండి...166).

చెబుతున్న సందర్భాన్ని బట్టి 'కప్పురభోగం' అనే రకం చాలా శ్రేష్ఠమైనదని అంచనా వేయవచ్చు. ఆనాటి ప్రముఖ పూటకూళ్ళఇళ్ళలో (Hotels) ఈ కప్పురభోగమే వండేవారని క్రీడాభిరామం సాక్ష్యం ఇస్తోంది. శ్రీనాథుని తర్వాత రెండువందల సంవత్సరాలకు చెందిన రఘునాథ భూపాలుడు కూడా ఈ కప్పురభోగం రకాన్ని ప్రస్తావించాడు. "కప్పురభోగి వంటకం గమ్మగసేవడి యన్నుజించి'' (*రఘునాథ రామాయణం* 2-13) అని కోసల దేశంలోని రెడ్లను వర్ణిస్తారు. కోసల దేశంలో రెడ్లు వుండరన్నది వేరే సంగతి.

జక్కన తన *విక్రమార్కచరిత్ర*లో మరొక వరిరకాన్ని చెబుతారు. "చెరకును రాజనంబు కృషి ...1-76" ఈ 'రాజనం' రకాన్ని ప్రౌఢకవి మల్లన కూడా ఉదహరించి వున్నాడు. "రాలెల్లను రత్నంబులు చేలెల్లను రాజనంబు..." (*రుక్మాంగద చరిత్ర* 3-10)

పైన వివరించిన పన్నెండు రకాలకు తోడు శ్రీకృష్ణ దేవరాయలు మరికొన్నింటిని చెబుతున్నారు.

సొరిదింబేర్చిన తీగ మల్లియలు ఖర్జూరంబులు న్నుప్పమం
జరులున్మామిడి గుత్తులున్ గుసుమముల్పంపెంగలు న్నుచ్చగ
న్నెరులు న్నాళలు గల్గి రాజనపు గాంతిం దారముల్సూసిపిచె
లరు దారన్నగుబూవుదోటల బలాకానీక దంభంబునన్

(ఆముక్తమాల్యద - 1-66)

తీగమల్లెలు, ఖర్జురాలు, పుష్పమంజరులు, మామిడి గుత్తులు, కుసుమాలు, సంపెంగలు, పచ్చగన్నేరులు, పాళలు, రాజనాలు అనే తొమ్మిదిరకాలు ఇక్కడ లభించాయి. రాజనం రకాన్ని ఇంతకు ముందే ప్రస్తావించడం జరిగింది. రాజనం అంటే రాజులు మాత్రమే భోంచేసే సన్నని జాతిబియ్యమని వేదం వేంకటరాయశాస్త్రి, తుమ్మపూడి కోటేశ్వరరావు తమ ఆముక్తమాల్యద వ్యాఖ్యల్లో వివరించారు. అంటే ఇంతకు ముందు చర్చించిన 'కప్పురభోగం' లాంటి శ్రేష్ఠమైన వరిరకం అన్నమాట! సన్నబియ్యంతో వండిన అన్నాన్ని నేడు కూడా ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు కదా! శ్రీనాథుడు పల్నాటి సీమలో "...సన్నన్నము సున్న సుమీ" అని వాపోయిన విషయాన్ని కూడా ఇక్కడ గుర్తించుకోవాలి. శ్రీనాథ, శ్రీకృష్ణదేవరాయల పద్యాల ఆధారంగా 'కలిమ' రకం కూడా శ్రేష్ఠమైన వరిరకం. రాజనాలు, కప్పురభోగాలు, కలిమలు ఉన్నవర్గాలు తినే రకాలు. ఇక్కడ భాషా సంబంధమైన ఒక ముఖ్యవిషయాన్ని విశ్లేషించుకోవాలి. పై పద్యంలోని 'పాళలు' అంటే బియ్యం. వరిబియ్యాన్ని ఆరోజుల్లో సాధారణ బహువచన ప్రయోగంగా వాడేవారు. అయితే ఈ బహువచన ప్రయోగం కాలక్రమంలో కనుమరుగయి బియ్యం అనే ఏకవచన ప్రయోగం వ్యవహారంలో స్థిరపడింది. అయితే ఇతర సజాతీయ ద్రావిడభాషల్లో 'పాళ' ప్రయోగం నిలిచే వుంది. తెలుగులో కూడా 'తలంబ్రాలు, ఒడిబ్రాలు' అనే కొన్ని మాటలు మాత్రం నిలిచి వుండి ప్రాచీన బహువచన ప్రయోగానికి సాక్ష్యం ఇస్తున్నాయి.

శ్రీకృష్ణదేవరాయల తర్వాత వందసంవత్సరాల కాలానికి, తంజావూరును రాజధానిగా చేసుకొని పరిపాలించిన రఘునాథభూపాలుడు తన రఘునాథ రామాయణంలో మరికొన్ని రకాల్ని చెబుతున్నారు.

పుష్పమంజరులిప్పపుష్యరాజనములు కస్తూరి నిగరాలు గంధసరులు
గంగాజలంబులు బంగారు తీగియ లేనుంగు దంతముల్ దీపసరులు
సన్నవంకెలు ముత్తసరులు ప్రాసంగులు రాయమెచ్చులు నీశ్వరప్రియములు
నయములు రామబాణములు సీతాభోగములు బాలకేసరుల్ మోసములు
కతియ మేనులు సన్నబంకపూండ్లు మఱియు
గలుగు ధాన్యంబులు లెల్ల ముక్కారుబండి
నిండి యెల్లెడ జూచిన నెగడు చుండు
క్షామమనుపేరు నెఱుగరాభూమి ప్రజలు *(ద.రా.2-11)*

ఇరవైరెండు రకాల ధాన్యాలు 'ముక్కారు'గా పండిస్తూ అయోధ్యనగర ప్రజలు కరువనే మాట తెలీకుండా సుఖంగా

జీవించారట. ఇవి వరిధాన్యాల పేర్లా? అనే అనుమానం అవసరం లేదు. శ్రీకృష్ణదేవరాయలు చెప్పిన పుష్పమంజరులు, రాజనాలు అనేరకాలు ఈ పద్యం మొదటిపాదంలో వున్నాయి. శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో చెప్పిన 'ప్రాసంగులు' అనే రకం పై పద్యం మూడోపాదంలో వుంది. కాబట్టి ఇవన్నీ వరిరకాలే! అన్నట్లు ఆధునికయుగంలో విశ్వనాథ సత్యనారాయణగారు కూడా తమ రచనల్లో రాజనాలు, బంగారు తీగలు వంటరకాల్ని చెప్పారు.

దువ్వూరి రామిరెడ్డిగారు తను 'కృషీవలుడు' కావ్యంలో కూడా ఈ రెండు రకాల ప్రస్తావన వుంది. ఇవి పై పద్యంలోనూ వున్నాయి. కప్పురభోగాలు, సీతాభోగాలు అనే వంగడాలు ఇరవై సంవత్సరాల కిందటి వరకూ ఆంధ్రదేశమంతా వున్నా 'ఢిల్లీభోగాలు' అనే రకాన్ని గుర్తుచేస్తున్నాయి. వల్లభరాయలు, శ్రీకృష్ణదేవరాయలు, రఘునాథరాయలు పాలకులు అనే విషయాన్ని కూడా ఇక్కడ గమనించాలి. వారిదైనందిన జీవితంలో ఆహారంగానే గాక పాలనావ్యవహారాల్లో, పన్ను నిర్ణయ సందర్భాల్లో వీటి గురించిన అవగాహన వారికి వుంటుంది.

పైన చర్చించిన వరిరకాల్ని వరసగా చదువుదాం. ''కోద్రవలు, వ్రీహిలు, ఆదులు, కలిమలు, శాలులు, సిరిముఖాలు (శారదాముఖం?) సాష్టికలు, పతంగలు, హెయనాలు, ప్రాసంగులు, రాజనాలు, కప్పురభోగాలు, తీగమల్లెలు, ఖర్జూరాలు, పుష్పమంజరులు, మామిడిగుత్తులు, కుసుమాలు, సంపెంగలు, పచ్చగన్నేరులు, పాళలు, ఇప్పలు, పుమ్యాలు, కస్తూరినిగరాలు, గంధసరులు, గంగాజలాలు, బంగారుతీగలు, ఏనుగుదంతాలు, దీపసరులు, సన్నవంకలు, ముత్తసరాలు, రాయమెచ్చులు, ఈశ్వరప్రియాలు, నయాలు, రామబాణాలు, సీతాభోగాలు, బాలకేసరులు, మోసనాలు, కఱియమేనాలు, సన్నబంకపూండ్లు" మొదలగునవి.

అపురూపమైన ఈ వరి వంగడాలు ఏమయి పోయాయి. కేవలం రెండునెలల్లోనే పండే 'సాష్టిక' రకం పేరుకూడా మనం వినలేదు. కేసర్లు, చెన్నంగులు (తోకపడ్లు) వంటి ఒకటిన్నర దశాబ్దం కిందటవున్నవి కూడా ఇప్పుడు కనిపించడంలేదు. వ్యవసాయవిధ్వంసం జరుగుతూ ఎన్నో వరివంగడాలతో పాటు, ఎక్కడ చూసినా రైతు ఆత్మహత్యలు, చేతికొచ్చిన వరిపంటను చేజేతులా కాల్చుకోవడం వంటి దురదుష్టకర పరిణామాలు చూసి దేశప్రజలు విస్తుపోతున్నారు.

రైతు పాట్లు

భారతదేశం వ్యవసాయదేశం. రైతు దేశానికి వెన్నెముక. ఆ వెన్నెముక ఇప్పుడు విరిగిపోతోంది. దేశం పారిశ్రామికీకరణ జరగాల్సిందే! కాని వ్యవసాయాన్ని నాశనం చేసుకోవాల్సిన అవసరం లేదుకదా!

ఆంధ్రదేశంలో వరిప్రాధాన్యతను గుర్తించి హరితవిప్లవంలో భాగంగా, అధికోత్పత్తి లక్ష్యంగా ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అధిక దిగుబడిని సాధించారు. దాదాపు నూట ఇరవైకోట్ల పైబడిన భారతజనాభాకు (ప్రపంచ జనాభాకు కూడా) ఆకలి తీర్చే కొన్ని ముఖ్యమైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకగుర్తింపు పొందింది. అందుకే ఆంధ్రరాష్ట్రాన్ని 'అన్నపూర్ణ'గా పిలుస్తున్నారు. హరితవిప్లవం వల్ల అధికదిగుబడి సాధించినప్పటికీ కొన్ని పూడ్చుకోలేని నష్టాలు జరిగాయన్నది వాస్తవం.

ప్రకృతి సహజసిద్ధమైన సేంద్రియ వ్యవసాయం (Organic Cultivation) నాశనమయ్యింది. రసాయనిక ఎరువుల వాడకం ఎక్కువయిపోయి కంచంలోని అన్నం విషంగా మారి పోయింది. వ్యవసాయంలోకి వ్యాపారం కూడా ప్రవేశించి రైతు ఆత్మహత్యలకు కారణమయ్యింది. ఇదే పరిణామంలో కొన్ని రకాల వరి వంగడాల్ని మాత్రమే పండించడం ప్రారంభమయి అమూల్యమైన వందలాది వరి వంగడాలు కనుమరుగయిపోయాయి.

డా॥ అంకే శ్రీనివాస్
ఫోన్ : 9652471652

తెలుగు యాత్రా చరిత్రలు

– ఎమ్. ఆదినారాయణ

మనకి తెలియని వారూ, దూర దేశాలకి చెందిన వారూ చేసిన పెద్ద యాత్రలకంటే; మన భాష మాట్లాడేవారూ, మనకి తెలిసిన వారూ, చేసిన ప్రయాణాలు చిన్నవైనా వాటిపట్ల మనం కుతూహలం చూపుతాం.

స్పెయిన్ దేశపు రాజు గారి ఆర్థిక సహాయంతో ఒక సుదీర్ఘమయిన సముద్ర యాత్ర చేసిన క్రిష్టఫర్ కొలంబస్ అన్వేషణ (క్రీ॥శ॥ 1492) గొప్పదే అయినా; మన ఏనుగుల వీరాస్వామి గారు వందమంది పరివారాన్ని, నాలుగువేల కిలోమీటర్ల దూరం నడిపించుకొంటూ కాశీ యాత్ర (క్రీ॥శ॥ 1830–31) చేయించటం మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. ఆయన పట్టుదలకి, ధైర్యసాహసానికి సాష్టాంగ ప్రణామం చేయాలనిపిస్తుంది.

అరేబియా ఎడారిలో సాహస ప్రయాణాలు చేసిన ఛార్లెస్ డఫీ కంటే; అప్పు తీర్చటం కోసం (క్రీ॥శ॥ 1873వ సం॥లో) ఆదిభట్ల నారాయణదాసు గారి కుటుంబం అంతా నడుచుకొంటూ జగన్నాధం యాత్ర చేశారని తెలుసు కొంటున్నప్పుడు వారి నిజాయితీని మెచ్చుకొంటాం.

డిక్ రూటన్, జీనాయేగర్ 1986వ సంవత్సరంలో వాయేజర్ అనే విమానంలో చేసిన 'నాన్ స్టాప్ ట్రావెల్ ఎరౌండ్ ది గ్లోబ్' కంటే; అత్యం నరసింహమూర్తిగారు చేసిన భూప్రదక్షిణ యాత్ర (1929–32) మనల్ని ఆనందపరుస్తుంది.

అలాగే వెన్నెలకంటి సుబ్బారావు గారు చావు బ్రతుకుల మధ్య అంచెబళ్ళమీద, పల్లకీల మీద కాశీ యాత్రకి వెళ్ళినప్పుడూ, స్వామి జ్ఞానానంద (108 మహారాజ్) 17 సంవత్సరాల వయసులో గొరగనమూడి గ్రామం నుండి హిమాలయాలకు నడుచుకొంటూ వెళ్ళాడని తెలుసు కొంటునప్పుడూ, ప్రాణాపాయపరిస్థితుల్లో మోతడక కొండల్లోకి పరుగులు తీస్తున్న షేక్‌నాజర్ భయాన్ని ఊహించు కొంటున్నప్పుడూ మనకి కళ్ళనీళ్ళు తిరుగుతాయి.

1953 సంవత్సరం నాటికే టంగుటూరి సూర్యకుమారి ప్రపంచ యాత్ర పూర్తి చేసిందనీ, మొదటిసారి అష్టావధానం చేసిన డబ్బుతోనే చెళ్ళపిళ్ల వెంకట శాస్త్రి గారు కాశీ యాత్ర చేశారనీ, అంధుడైన చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు హంపీ వెళ్ళినప్పుడు అక్కడి శిల్పాల్ని చేతితో తడిమి చూసి ఆనందించారనీ తెలుసుకొన్నప్పుడు ఉద్వేగానికి లోనౌతాం.

ఏడిదము సత్యవతి తన భర్తని బతికించుకోవటం కోసం ఒరిస్సా అడవుల్లో ఉన్న గ్రామాలకి చేసిన ప్రయాణం చదువుతున్నప్పుడు మనసు వికలమౌతుంది. గున్నయ్యవొత్తు చేసిన మారిషస్ ప్రయాణం గురించీ, ఆ దేశం వారికి ఆయన చేసిన సేవల గురించి తెలుసుకొంటున్నప్పుడు ఆ మనిషి పట్ల మనకి ఆరాధనా భావం కలుగుతుంది.

1990వ సంవత్సరం నుండి నేను యాత్రా సాహితీ క్షేత్రంలో కృషి చేస్తుండటం వలన నా వద్ద పెద్ద సంఖ్యలోనే యాత్రా సాహిత్య సంపద సమకూరింది. వివిధ దేశాల వారు రాసుకొన్న ఆ యాత్రా గ్రంథాల్లో తెలుగువారి యాత్రానుభవాలు వందకిపైగా ఉన్నాయి. వాటిల్లో వెన్నెలకంటి సుబ్బారావు రాసుకొన్న 'The life of Vennalacunty Soobrow' మొదలుకొని నల్లవారి గౌతమ్‌రెడ్డి రాసుకొన్న 'Seyya Project' వరకూ చోటు చేసుకొన్నాయి.

యాత్రా సాహిత్యాభిమానుల చేత ఇవన్నీ చదివించాలి అనిపించేది. అది ఎలాగూ సాధ్యం కాదు కాబట్టి వీటి నుంచి మంచి సంకలనం (Anthology) తయారుచేయవచ్చు అనిపించింది. ఇంతవరకూ తెలుగులో యాత్రాసాహిత్య సంకలనం రాలేదు కూడా. నేను ఇలా అనుకొంటున్న సమయంలో ఒక సభలో కొందరు మిత్రులు కలిసి "మీ అంతగా ప్రయాణాలు చేసిన వారు మరెవ్వరూ ఉండరు" అంటూ నన్ను పొగడ్తలతో ముంచేస్తున్నప్పుడు నేను వారికి సమాధానం చెబుతూ ''మన తెలుగు వారు ఎన్నో

అద్భుతమైన ప్రయాణాలు చేశారు. దాదాపు రెండు వందల సంవత్సరాల యాత్రా సాహిత్యం మనకి ఉంది. సమకాలీనులూ కొన్ని మంచి యాత్రలు చేశారు. వారందరి యాత్రా సాహిత్యాన్ని ఒక చోటుకి చేర్చి 'తెలుగువారి ప్రయాణాలు' అనే గ్రంథాన్ని మీకు త్వరలోనే అందజేయబోతున్నాను" అని విన్నవించు కొన్నాను. అప్పటి నుండీ మిత్రులు అందరూ ఈ పుస్తకం కోసం ఎదురు చూడసాగారు. ఇంతమంది యాత్రికుల అనుభవాలని ఎడిట్ చేస్తున్నప్పుడు నాకు ఎన్నో కొత్త విషయాలు తెలిశాయి. ప్రయాణం చేయకుండానే ఇరవై దేశాల్లో విహారం చేసిన అనుభవం వచ్చింది. అది నా 'భూ భ్రమణకాంక్ష'ని మరింతగా పెంచింది.

ఆధునికుల్లో ముందుగా కాశీ యాత్ర (1822 – 23) చేసిన వెన్నెలకంటి సుబ్బారావు గారూ, తన కాశీ యాత్రని ముందుగా ముద్రించిన (1838) ఏనుగుల వీరాస్వామి గారూ దేవాలయాల్ని దర్శించటం కోసం ఎన్నో కష్టాలు పడ్డారు. నిజానికి ఆ ఇద్దరూ దేవుడి లాంటివారే. దేవుడు ఎలాంటి గొప్ప పనులు చేస్తాడో, ఆ ఇద్దరూ అలాంటి పనులే చేశారు. మహా పండితులు, మానవతావాదులు అయిన ఆ ఇద్దరూ ఒకరితో ఒకరు పోటీ పడి సమాజానికి సహాయం చేశారు. వందమంది భక్తుల్ని కాశీ యాత్రకు తీసుకువెళ్ళటం, గుంటూరు కరువు (1832 – 33)లో వందలమందికి అన్నదానం చెయ్యటం, కూతురు పెళ్ళికి పెద్ద ఎత్తున అన్నసంతర్పణ ఏర్పాటు చేయటంలాంటి మూడు గొప్ప పనులు చేశారు వీరాస్వామి.

వెన్నెలకంటి సుబ్బారావు గారు విషాదభరితమైన జీవితాన్ని కొనసాగిస్తూనే తన చుట్టపక్కాల ఆర్థిక పరిస్థితుల్ని బాగు చేయటానికి ఎకరాల కొద్దీ భూమిని వారికి దానం చేశారు. ఒక ఆడపిల్లని దత్తత తీసుకొన్నారు. పాత సింగరాయ కొండ (ఒంగోలు దగ్గర) జాతీయ రహదారి పక్కన తన భార్య పేరు మీద 'కనకమ్మ సత్రం' (1832) నిర్మించి బాటసారుల ఆకలి దప్పులు తీర్చారు.

మానవతా విలువలు మూర్తీభవించిన ఈ ఇద్దరికీ నా హృదయ పూర్వక నమస్కారాలు తెలియజేసు కొనటంతో పాటుగా, సుఖాన్ని వదలుకొని, సుదూరాలు ప్రయాణించిన మన యాత్రా ముత్తాతల పాద పద్మాలకు నా ముద్దులతో అభిషేకం చేస్తున్నాను.

అలాంటి గొప్ప ధృవతారాద్వయాన్ని స్ఫూర్తిగా తీసుకొన్న మన తెలుగు మిత్రులు రాష్ట్రాలు, దేశాలు దాటి ఆరు ఖండాల్లోనూ ప్రయాణాలు సాగించగలిగారు.

తీర్థయాత్రల ద్వారా జన్మ రాహిత్యం పొందాలనుకొనే భక్తులూ, తమ కవితా పరిమళాల్ని విదేశాలలో వెదజల్లాలి అనుకొన్న కవులూ, ప్రపంచమంతటా తమ కళాకాంతుల్ని విరజిమ్మాలను కొన్న కళాకారులు, ప్రకృతే పరమాత్మ అనుకొంటూ తిరిగిన సౌందర్యారాధకులూ, తమ పాండిత్యంతో ప్రపంచం అంతటా పూజలందుకొన్న పండితులూ, భూప్రదక్షిణం చేసినవారూ, ప్రజల వద్దకి ప్రయాణాలు సాగించిన రాజకీయ నాయకులూ లాంటి వైవిధ్య భరితమైన ఆలోచనాపరులూ ఈ సంకలనంలో చోటు చేసుకొన్నారు.

ప్రయాణాలు చేయటం నాగరికత నేర్పిన ప్రథమ పాఠం అనీ, ప్రయాణాలు చెయ్యటం వల్లనే విజ్ఞానులు అవుతారనీ, సకలకళల వికాసానికీ ప్రయాణాలే మూలమనీ ఈ యాత్రికులందరూ పరోక్షంగా తెలియజేశారు. మన తెలుగువారికి ఎంతో చరిత్ర కలిగిన భాష ఉంది. అన్ని ఖండాల్లోనూ అఖండ విజయాల్ని సాధిస్తున్న తెలుగువారి ప్రయాణాలు ఎప్పటికైనా చంద్రమండలం వరకూ చేరుకొంటాయని త్రికరణశుద్ధిగా నమ్ముతాను.

నిజానికి వీరాస్వామి గారి కంటే పూర్వమే చాలా పెద్ద యాత్రలు జరిగి ఉంటాయి. దైవభక్తిలోనే జీవితాన్ని గడపటానికి చాలా ఎక్కువ సమయం దొరికే ఆ రోజుల్లో భారతీయులందరూ సుదీర్ఘ ప్రయాణాలు చేసి ఉంటారు. అలాంటి ప్రయాణాలన్నిటికీ ప్రతీకగా వీరాస్వామిగారి కాశీ యాత్ర మనకి మిగిలిపోయింది. రాజులు, కవులూ ఎంతో మంది కాశీయాత్ర చేసినా, "వీరాస్వామి ఒక్కరే కాశీ యాత్ర చేశారు" అన్నంతగా పేరు వచ్చిందాయన యాత్రకి. తరతరాల తీర్థయాత్రికుల హృదయస్పందన, దేశాటనారాటం, ఆయన రచనలో ప్రతిధ్వనించింది. ఆత్మపిండాలు పెట్టుకొని యాత్రలకు వెళ్ళిపోతున్న ఆ రోజుల్లో, తన తెలివితేటలతో వందమంది చేత కాశీ యాత్ర చేయించగలగటం గొప్పతనమే.

సముద్రాలమీద సాహసయాత్రలు చేసిన వ్యాపారులు, ఎడారి మార్గాల్లోకి ప్రయాణించిన సార్థులు, శత్రువుల్ని వెంటాడిన సైనికులు, మూడు సముద్రాల మధ్యనున్న దేశమంతా తిరిగిన తెలుగు పండితులూ తమ అనుభవాలని

గ్రంథస్తం చేసి ఉంటే ఎంత బాగుండేదో? సుదూర ప్రయాణాలు చేసి నలంద, తక్షశిల, విక్రమశిల లాంటి విశ్వవిద్యాలయాల్లో చదువుకోవటానికి వచ్చిన తూర్పు దేశాల వారందరూ కూడా తమ ప్రయాణాల వివరాలు మనకి అందించి ఉంటే ఆనందించేవాళ్ళం.

శాతవాహనుల కాలంలో సముద్ర ప్రయాణాలు బాగా జరిగేవని యజ్ఞశ్రీ శాతకర్ణి వేసిన పడవ బొమ్మగల నాణేలను బట్టి తెలుస్తుంది. గాథాసప్తశతిలోని రచనల్లో ప్రయాణీకుల్ని వర్ణించిన సందర్భాలు చాలా ఉన్నాయి. 'వర్షాకాలానికి ముందే ఇంటికి చేరుకోవాలని తొందరపడే' బాటసారుల గురించిన ప్రస్తావనలు తరచూ వస్తుంటాయి.

ద్వీపాంతర భారతదేశంగా గుర్తింపు తెచ్చుకొన్న సిలోన్, సయామ్, బర్మా, మలయా, బోర్నియో దేశాల వారికి; తూర్పుతీరంలో ఉండే బెంగాలీ, ఒరిస్సా, ఆంధ్ర, తమిళనాడు వారికి ఎన్నో సముద్ర వ్యాపార సంబంధాలు ఉన్నాయి. కౌండిన్య బ్రాహ్మణులు తూర్పుదేశాలకి వెళ్ళిన మొదటి ప్రవాసీయులుగా చారిత్రక ఆధారాలున్నాయి. క్రీ॥శ॥ 8వ శతాబ్దంలో శైలేంద్ర, శ్రీవిజయ రాజులు, 12వ శతాబ్దంలో సూర్యవర్మ రాజులు, తూర్పుదేశాల్లో రాజ్యాలు స్థాపించారు. రెండవ సూర్యవర్మరాజు (1113 - 1145) అంకోర్‌వాట్ బౌద్ధ ఆలయాన్ని నిర్మించినప్పుడు ఆంధ్రదేశం నుండి చాలామంది శిల్పులు అక్కడికి ప్రయాణం చేసి ఉంటారు.

గుప్తుల కాలంలో మొదలైన బౌద్ధుల విదేశీ ప్రయాణాలు తూర్పు దేశాలైన బర్మా, మలయా, చైనా దేశాల్లోకి ఎక్కువగా కొనసాగాయి. అలాంటివారిలో తెలుగువారు ఉండకమానరు. సముద్రాల మీద తిరిగేవారు 'మణివేఘులా దేవి'ని, నేలమీద ప్రయాణించేవారు 'మాణిభద్ర యక్షుణ్ణీ' పూజలు చేసుకొంటూ ధైర్యంగా ముందుకి సాగేవారు.

వీరాస్వామికి ముందున్న తెలుగువారిలో శ్రీనాథుడు ఎక్కువగా ప్రయాణాలు చేసినట్లుగా తెలుస్తూ ఉంది. కొండవీటి రెడ్డి రాజైన పెదకోమటి వేమారెడ్డి (క్రీ॥శ॥ 1380 - 1470) ఆస్థానంలో శ్రీనాథుడు విద్యాధికారిగా ఉన్నప్పుడు కాశీని దర్శించి, ఆ తరువాతే కాశీఖండం రచించాడని అంటారు. శ్రీనాథుడు రాసిన 'హరవిలాసము' అనే కావ్యంలో ఆంధ్రులు తూర్పుదేశాలతో వ్యాపారం చేస్తున్నట్లుగా స్పష్టంగా తెలుస్తూ ఉంది. ఈ గ్రంథాన్ని అంకితం తీసుకొన్న వ్యక్తి ప్రముఖ సముద్ర వ్యాపారవేత్త అవచి తిప్పయ్యశెట్టి, తన సోదరులైన చామిశెట్టి, తిరుమల శెట్టిల సహాయంతో తూర్పుదేశాల్లో ప్రయాణాలు చేసి ఎన్నో సుగంధ ద్రవ్యాలు తీసుకొచ్చేవారు.

ఈ ముగ్గురు అన్నదమ్ములు మనకు మార్కోపోలో కుటుంబాన్ని గుర్తుకు తెస్తారు. కుమారగిరి రెడ్డి సుగంధ భాండాగారానికి అధ్యక్షుడుగా ఉన్న ఈ అవచి తిప్పయ్యశెట్టి గారు చేసిన ప్రయాణాల వివరాలు తెలియటం లేదు. ఆయన మోటుపల్లిరేవు ద్వారానే తూర్పు దేశాలకి ప్రయాణాలు చేసి సుగంధ ద్రవ్యాలు తెచ్చి ఉంటాడు. అలాంటి ప్రయాణాలను లిఖితబద్ధం చేసి ఉంటే తెలుగువారికి ఆయా దీవుల్లోకి వెళ్ళి నివాసం ఏర్పరచుకొనే అవకాశం దొరికి ఉండేదేమో! 14వ శతాబ్దానికి చెందిన వినుకొండ వల్లభరాయ కవి రాసిన 'క్రీడాభిరామం'లో మంచనభట్టు, టిట్టిభశెట్టి అనే ఇద్దరు యువకులు వరంగల్లు నగరంలో తిరుగుతూ కొత్త విషయాలు తెలుసుకొంటున్నప్పుడు మనకి అదొక యాత్రా కథనంగా అనిపిస్తుంది.

ఆంధ్రదేశంలోని తూర్పుతీరంలో ఈనాటికీ ఎన్నో బౌద్ధ స్థూపాలు బయటపడుతూనే ఉన్నాయి. ఆ శిధిలాల వద్ద ఇప్పటికీ రోమన్ల నాణేలు దొరుకుతునే ఉంటాయి. ఇన్ని దేశాలతో తెలుగువారికి సంబంధం ఉన్నా సరే వాటి వివరాలు దొరకనందుకు బాధగా ఉంటుంది మనకు. కృష్ణాజిల్లా, దివి తాలూకాలోని మొవ్వ గ్రామనివాసి అయిన క్షేత్రయ్య దక్షిణ భారత దేశంలో చాలా క్షేత్రాలు తిరిగి మువ్వగోపాల పదావళిని ప్రచారం చేసినట్లుగా పండితుల అభిప్రాయం. క్షేత్రాలు తిరిగాడు కాబట్టే క్షేత్రయ్య అని పిలిచారట ఆయన్ని.

కాకినాడ వద్ద ఉన్న కోరంగి గ్రామంలో జన్మించిన మల్లాడి సత్యలింగ నాయకర్ (1840-1915) బర్మాకి వెళ్ళే నౌకల్లో కళాసీగా పనిచేసి, ఎంతో అనుభవం గడించి, వ్యాపారం చేసి ధనవంతుడయ్యాడు. ఆయన స్థాపించిన M.S.N. Charities ఇప్పటికీ అనేక విద్యాలయాల్ని నడిపిస్తున్నాయి. సత్యలింగ నాయకర్ తన అనుభవాలని రాయించి ఉంటే ఎంతో ప్రయోజనం జరిగి ఉండేది. అప్పటికి మోటుపల్లి, తాళ్ళరేవు, కోరంగి, కొత్తపట్నం రేవుల్లో

వాణిజ్యం జరుగుతూనే ఉంది. ఆ తరువాత క్రమంలో జరిగిన యాత్రల్లో 1937వ సం॥ జూలై నుండి 1938వ సం॥ మార్చి వరకూ జరిగిన 'ఆంధ్రా రైతు రక్షణ యాత్ర' ఒక ముఖ్యమైన ఘట్టం. జమీందారీ వ్యవస్థ రద్దు కోసం ఉద్యమాలు చేస్తూ, ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకూ జరిగిన పాదయాత్రలో వందల కొద్దీ రైతులు పాల్గొన్నారు. 130 రోజుల పాటు సాగిన ఈ యాత్రలో 2000 కిలోమీటర్లు నడవటం జరిగింది. ఈ ఉద్యమానికి సారధులు కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి, చలసాని వాసుదేవరావు. ఈ యాత్రకి ప్రేరణ గాంధీగారి సబర్మతి – దండి పాదయాత్ర (1930) కావచ్చు.

1937వ సంవత్సరంలో దక్షిణ భారత రైల్వేవారు 'బైరాగి టికెట్' అనే ఒక చౌక టికెట్ ప్రవేశపెట్టారు. దీని ఖరీదు రూ.12-50పైసలు. మూడవ తరగతి పెట్టెలో ఎక్కువ దూరాలు ప్రయాణించటానికి వీలుగా ఇలాంటి అవకాశం కల్పించారు. చౌక ధరలో ఉన్న ఈ టిక్కెట్టు మీద ప్రయాణించిన వారు అందించిన యాత్రా సాహిత్యం కూడా ఏమీ లభ్యంకాలేదు.

'కాశీయాత్ర' పుస్తకం ముద్రణకి, రైతురక్షణ యాత్రకీ మధ్య గడిచిన శతాబ్ధ కాలం (1838-1938)లో వచ్చిన యాత్రా గ్రంథాలు 20 కంటే ఎక్కువ లేవు. స్వాతంత్ర్య పోరాట సమయంలో యాత్రలు తక్కువగానే జరిగినా గొప్పవే జరిగాయి.

ఒకప్పుడు తీర్థయాత్రల కోసం ప్రయాణాలు జరిగాయి. ఆ తరువాత విదేశాల్లో విద్య కోసం ప్రయాణాలు కొనసాగాయి. వీటిల్లో డి.వి సుబ్బారెడ్డి గారి ఇంగ్లండు యాత్ర (1928), అత్యం నరసింహం చేసిన అమెరికా యాత్ర (1929-32) గమనించదగ్గవి. బొబ్బిలిరాజాగారు 1887వ సంవత్సరంలో సంపూర్ణ భారతదేశయాత్ర చేయగా, 1930వ సంవత్సరంలో పిఠాపురంరాజా గారు విహారయాత్రల కోసం ఐరోపాకి వెళ్ళాడు. 20వ శతాబ్దంలో విదేశాలకి వెళ్ళటం ఒక స్టేటస్ సింబల్‌గా మారింది అనటానికి ఇది మంచి ఉదాహరణ.

1938వ సంవత్సరం తరువాత కూడా తీర్థయాత్రలు కొనసాగుతూనే ఉన్నాయి. సాంస్కృతిక పరమైన అవసరాల కోసం విదేశీ యాత్రలు కొనసాగించటం కూడా ఆనవాయితీగా మారింది. అలాంటి వాటిల్లో టంగుటూరి సూర్యకుమారి ప్రపంచయాత్ర (1953), అక్కినేని నాగేశ్వరరావు అమెరికా యాత్ర (1965) చెప్పుకోదగ్గవి.

ఆ క్రమంలో రష్యా, చైనా దేశాలకి సాంస్కృతిక రాయబారం చేయటానికో లేదా ద్వైపాక్షిక మైత్రీ సంబంధాల కోసమో కొన్ని యాత్రలు జరిగాయి. వాటిల్లో 1980లో శ్రీశ్రీ చేసిన చైనా యాత్ర, 1985లో రావూరి భరద్వాజ చేసిన రష్యాయాత్ర ముఖ్యమైనవి.

ఆ తరువాత కాలంలో ఆర్థికస్థితులు మెరుగుపడటం వలన విహార యాత్రలు ప్రాముఖ్యం వహించాయి. ఇలాంటి విహార యాత్రల్లో మొదటిది శేషాచల కవి చేసిన 'నీలగిరి యాత్ర' (క్రీ॥శ॥ 1846). అయినా ఆధునిక కాలంలో మమ్మన్నేని లక్ష్మీనారాయణ ఇలాంటి విహార యాత్రకి విద్యార్థులతో హంపి వెళ్ళినట్లు తెలుస్తుంది. 1954వ సంవత్సరంలో ఆయన ముద్రించిన యాత్రా గ్రంథం పేరు "అంతేవాసులతోడ హంపీ యాత్ర". దీని తరువాత 1967లో నాయని కృష్ణకుమారి చేసిన కాశ్మీరు యాత్ర ముఖ్యమైనది. 1988వ సంవత్సరంలో వచ్చిన వాసా ప్రభావతిగారి 'రష్యాలో స్నేహ యాత్ర' కూడా చెప్పుకోదగ్గదే. వాటి తరువాత 1989వ సంవత్సరంలో మల్లాది వెంకట కృష్ణమూర్తి గారి 'తూర్పు ఐరోపా దేశాల యాత్ర' (ట్రావెలాగ్ యూరప్) కూడా ముఖ్యమైనదే.

ప్రపంచం క్రమంగా మారిపోతూ ఉంది. మార్పులు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. గ్లోబలైజేషన్ వలన ప్రయాణాలు అనివార్యం అయ్యాయి. యాత్రా సాహిత్యం క్రమేణా పెరిగిపోయి, యాత్రా సాహిత్యం మీద పరిశోధన చేయాల్సిన అవసరం వచ్చింది.

మచ్చ హరిదాసు గారు 'తెలుగులో యాత్రా చరిత్రలు' అనే అంశం మీద 1987-89వ సంవత్సరాల్లో పరిశోధన చేయగా ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు ఆయనకి 1990వ సంవత్సరలో డాక్టరేట్ అవార్డు ప్రదానం చేశారు. తెలుగువారు చేసిన అనేక యాత్రల గురించి వివరంగా తెలియజెప్పే మంచి పుస్తకం ఇది. ఈ విధంగా 1836 సంవత్సరం నుండి 1990వ సంవత్సరం వరకూ కొనసాగిన ఒకటిన్నర శతాబ్ద కాలంలో 70 కంటే ఎక్కువే యాత్ర గ్రంథాలు వచ్చాయి. తెలుగు యాత్రా సాహిత్య చరిత్రలో వచ్చిన ఈ పరిణామం ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

ఇప్పటివరకూ మనం తెలుసుకొన్న విద్యా, ఉద్యోగ, సాంస్కృతిక, మత, విహార యాత్రలది ఒక సాంప్రదాయ పంథా. అయితే ఆధునిక యాత్రాసాహిత్యంలో కొన్ని మార్పులు వచ్చాయి. కొత్త ప్రదేశాల్లో ఉండే ప్రజలతో మమేకం చెందటం, వారి జీవన స్రవంతిలో కలిసిపోయి వారితో పాటుగా సుఖఃదుఃఖాలు పంచుకొనటం, పరిసరాల్లోని ప్రకృతిని ఆరాధించటం, పర్యావరణాన్ని కాపాడటం లాంటి ప్రయాణాలు చెయ్యటానికి ఇష్టపడే వాళ్ళు ముందుకి వచ్చారు. ఇలాంటి ఆధునిక ఆలోచనా ధోరణికి ఆద్యుడు, ఆధునిక ప్రపంచ యాత్రా సాహిత్య పితామహుడు విల్‌ఫ్రెడ్ థెసిగర్ (1910 – 2003). ఇలాంటి వారి నుండి స్ఫూర్తి పొందిన రష్యాపౌరుడైన యూరి షుమిట్‌స్కీ (జననం–1943) 1979వ సంవత్సరంలో తూర్పు రష్యాలోని వ్లాడివోస్టోక్ నగరాన్నుండి నడుచుకొంటూ బయలుదేరి 12 నెలల తరువాత మాస్కోకి చేరుకొంటాడు. దారిలో ఎంతోమందిని కలిసి వారితో తన అనుభవాలను పంచుకుంటాడు. అప్పటికి ఆయన వయసు 36 సంవత్సరాలు మాత్రమే.

1984వ సంవత్సరం నుండీ షుమిట్‌స్కీ లాగా ప్రయాణాలు చేద్దామని ఉండేది నాకు. అయితే 1990వ సంవత్సరంలో నా మొదటి పాద (లేపన) యాత్ర హిమాలయ పర్వతాల్లో జరిగింది. ఆ చిన్న అనుభవాన్ని 'Himalayas: My Cherished Dream' అనే పేరుమీద యూత్‌హాస్టల్ మాగజైన్‌లో ముద్రించాను. అది నా మొదటి రచన.

ఆ విధంగా మొదలైన నా పాద యాత్రల ప్రభంజనం 2006వ సంవత్సరం వరకూ కొనసాగింది. వివిధ సందార్భాలను పురస్కరించుకొని నేను చేసిన పదిహేను పాదయాత్రల కోసం 20,000 కిలోమీటర్ల దూరాన్ని ఆనందంగా నడిచాను. నా ప్రయాణాల్లో భాగంగా 'నడవటానికి ఇష్టపడండి', 'భ్రమణ కాంక్ష', 'రాహుల్జీ చివరి మజిలీ' లాంటి విషయాలపై అనేక కరపత్రాల్ని పంచాను. యాత్రాల ప్రాముఖ్యతని గురించి ఉపన్యాసాలు ఇచ్చాను. నా ప్రయాణాల గురించి పుస్తకాలు రాద్దామని ఎప్పుడూ అనుకోలేదు. డైరీలు మాత్రం రాసుకొన్నాను. ప్రయాణంలోని సౌందర్యాన్ని అనుభవిద్దాం అనే ఆలోచనతో నచ్చిన పనిచేసుకొంటూ పల్లెటూర్లగుండా, నదుల వెంట, సముద్ర తీరాల్లో, కొండల్లో కోనల్లో స్వేచ్ఛగా తిరిగాను. ఆ తర్వాత నా మిత్రులు, విద్యార్థులు 'మీతో ఎలాగూ మేం ప్రయాణించలేకపోయాం. మీ యాత్రానుభవాలు మాకు తప్పనిసరిగా తెలియజేయాలి" అని కోరటంతో 1993 వేసవి నుండి 1994 వేసవి దాకా చేసిన మూడు పాదయాత్రల్ని కలిపి 'భ్రమణ కాంక్ష' అనే పేరుతో 1999వ సంవత్సరంలో ముద్రించాను. ఆ పుస్తకం సాధించిన విజయాల నేపద్యంలో తెలుగు యాత్రా సాహిత్యాన్ని పటిష్ఠమైన పునాదుల మీద నిర్మించాలి అనే ఆలోచనలతో 2002వ సంవత్సరంలో 'జిప్సీలు' (ప్రపంచవ్యాప్త సంచార జీవితాలు), 2005వ సంవత్సరంలో 'స్త్రీ యాత్రికులు' (ప్రపంచ వ్యాప్తంగా ప్రయాణాలు చేసిన 28 మంది స్త్రీమూర్తులు), 2008వ సంవత్సరంలో 'మహా యాత్రికులు' (ఆరు ఖండాల్లోనూ ప్రయాణాలు చేసిన 24 మంది సాహసికులు) అనే పుస్తకాలు రాశాను.

విద్యార్థుల్లో యాత్రల పట్ల అవగాహన పెంచటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'భ్రమణ కాంక్ష'లోని ఒక భాగాన్ని పాఠ్యాంశంగా పదవ తరగతి వారికి నిర్ణయించినప్పటి నుండే చాలామంది యాత్రా ప్రేమికులు నాకు పరిచయం అయ్యారు. లోక సంచారతత్వం ఉన్న రచయితలు, కవులు తమ ప్రయాణాల పిపాసని వ్యక్తీకరించుకోవటానికి 'భ్రమణ కాంక్ష'ని ఒక పర్యాయ పదంగా గుర్తించి, తమ రచనల్లో ప్రయోగించటం గమనించి ఆనందపడ్డాను. ఒక వార పత్రిక వాళ్ళు కొంత కాలంపాటు తమ యాత్రా రచనల పేజీని 'భ్రమణ కాంక్ష'తో పిలిచారు. మిత్రులు కొందరు తమ భవనాలకి ఈ పేరే పెట్టుకొని తమలోని ప్రయాణాల ప్రేమని తీర్చుకొన్నారు.

ఈనాడు ప్రపంచం అంతా ఒక గ్లోబల్ విలేజ్‌గా మారిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యాత్రా ప్రేమికుల్ని కలుస్తూ 'వారిలో ఒకరిగా జీవించాలి' అనే 'భూభ్రమణ కాంక్ష'తో, ఒక గ్లోబియన్ (గ్లోబల్ సిటిజెన్)గా ఇప్పటివరకూ మూడు ఖండాల్లోని, ఆరు దేశాల్లో (నేపాల్, భూటాన్, ఇరాన్, స్వీడన్, చైనా, నైజీరియా) పాద యాత్రలు చేశాను. ఆ అనుభవాలన్నీ ఎప్పటికప్పుడు ప్రజలకి అందజేస్తూనే ఉన్నాను.

సాటి రచయితల్ని కలిసినప్పుడల్లా "మీరు చేసిన యాత్రల గురించి ఒక పుస్తకాన్ని రాయండి" అని కోరుతూ

ఉంటాను. 1990వ సంవత్సరం నుండి ఇప్పటి వరకూ అంటే గత 23 సంవత్సరాల కాలంలో దాదాపు 50కి పైగా యాత్రా గ్రంథాలు వచ్చాయి; సరాసరిన సంవత్సరానికి రెండు చొప్పున. ఇది ఎంతగానో ఆనందించదగ్గ విషయం. ఈ సంఖ్య క్రమంగా పెరుగుతూ పోతుందనటం నిజం.

ఈ యాత్రా సంకలనం తేవాలనుకొన్నప్పుడు యాత్రల పేరుతో వచ్చిన గ్రంథాలనే కాకుండా, జీవిత చరిత్రలు కూడా చదివాను. యాత్రా వ్యాసాలు కూడా తీసుకొన్నాను. అలాగా మొదలైన అన్వేషణ 'నేతి', 'నేతి' అనుకొంటూ వందకి చేరుకొంది. మొదట్లో వంద మంది ప్రయాణికులతో వెయ్యి పేజీలతో ఈ యాంథాలజీని తెద్దామనుకొన్నాను. తీరా పని మొదలుపెట్టేసరికి ఒకే దేశాన్ని గురించి రాసే వాళ్ళు ఎక్కువగా తేలారు. చర్విత చర్వణం ఎందుకని ఒక పద్ధతికి వచ్చేసరికి 50 మంది మిగిలారు. ఆరు ఖండాల్లో ప్రయాణం చేసిన వారి అనుభవాలు సేకరించి, పాఠకుడికి ప్రపంచం అంతా తిరిగిన అనుభూతి కలిగించాలి అనే తపనతో మరికొంత కష్టపడి వారి సంఖ్యను 64వరకూ పొడిగించాను. జీవిత చరిత్రల ద్వారా సేకరించిన ప్రయాణానుభవాలు చిన్నవైనా ఎంతో క్లుప్తంగానూ, చాలా అందంగానూ ఉన్నాయి. పైగా స్వీయ చరిత్రల్లో ఆయా వ్యక్తులు చేసిన యాత్రానుభవాల్ని ఈ సంకలనంలో పెట్టటం వలన, వారి జీవితాలను గురించి తెలుసుకొందామన్న ఆతృత కూడా పాఠకుడికి కలుగుతుంది.

ఆదిభట్ల, నాజర్, కె.ఎన్. కేసరి, శ్రీపాద చేసిన చిన్న ప్రయాణాలన్నీ వారి జీవిత చరిత్రలు చదవటం వల్లనే నాకు తెలిశాయి. తెలుగు మాతృభాషగా ఉన్న వాళ్ళు ఏ భాషలో రాసినా ఈ సంకలనంలోకి తీసుకొన్నాను. అలా చేయబట్టే వెన్నెలకంటి సుబ్బారావు, గౌతమ్ రెడ్డి ఈ సంకలనంలో స్థానాన్ని సంపాదించగలిగారు. లేని పక్షంలో ఒక Old Master నీ, Young Writer నీ మిస్ అయ్యేవాళ్ళం.

ఈ సంకలనంలో మొత్తం 64 మంది అనుభవాలు ఉన్నాయి. కాబట్టి ఖండాలవారీగానే ఈ విశ్లేషణ చేస్తున్నాను. వీరిలో ఆసియాలో ప్రయాణాలు చేసినవారు 49 మంది, ఐరోపాని దర్శించిన వారు ఏడుగురు, ఆఫ్రికా ఖండాన్ని చూసినవారు ఇద్దరు, ఉత్తర అమెరికాలో ప్రయాణాలు చేసిన వారు నలుగురు, దక్షిణ అమెరికాలో ఒకరు, ఆస్ట్రేలియాలో మరొకరు ఉన్నారు.

దేశ దిమ్మరిగా ప్రపంచం అంతా ప్రయాణాలు చేద్దామనే ఆశయాలు ఉన్న వి.ఎన్.శర్మ, జె.బాపురెడ్డి, మల్లాది వెంకట కృష్ణమూర్తి, అశ్వనీకుమార్, అమరేంద్ర, చినవీరభద్రుడు లాంటి వారి యాత్రా నుభవాలు; తీర్థయాత్రలు చేయటానికి ఎలాంటి ఇబ్బందులొచ్చినా తట్టుకొని నిలబడిన వెన్నెలకంటి, వీరాస్వామి, మండపాక పార్వతీశం, ప్రణవానంద, ప్రాతూరి, పి.వి.మనోహరరావు గార్ల అనుభవాలు; విజ్ఞానదాహంతో విస్తృతంగా పర్యటనలు జరిపిన చిలకమర్తి, బాపిరాజు, జొన్నలగడ్డ, జగ్గన్నశాస్త్రి, తిరుమల రామచంద్ర, ఎన్.గోపి లాంటి పండితులు దాచుకున్న జ్ఞాపకాలు.

ప్రకృతిని ఆరాధించిన చలం, జానకిరామ్, బుజ్జిబాబు, సంజీవదేవ్ లాంటి స్వాప్నికుల సందేశాలు; సరదా కోసరమో, గాలి మార్పుకోసమో విహార యాత్రలు చేసిన కురుమెళ్ళ వెంకటరావు, కాళోజీ, నాయని కృష్ణకుమారి, బనవరాజు అప్పారావు దంపతులు, సుజాతారెడ్డి లాంటి వారు పదిలపరచుకొన్న ఆలోచనలు; పై చదువుల కోసం సుదూరాలు ప్రయాణించిన అత్యం నరసింహమూర్తి, స్వామి జ్ఞానానంద, టంగుటూరి ప్రకాశం, ఉప్పల లక్ష్మణరావు లాంటి విద్యావేత్తల స్మృతులు; కుటుంబ సభ్యుల్ని కలవటానికి ప్రయాణించిన కె.ఎన్.కేసరి, దువ్వూరి వెంకటరమణశాస్త్రి, ఏడిదము సత్యవతి వర్ణించిన సాహస ప్రయాణాలు; విదేశాల్లో మన పాండిత్యాన్ని, కళనీ ప్రదర్శించాలనే ఆశయాలతో బయలుదేరిన టంగుటూరి సూర్యకుమారి, శ్రీశ్రీ, అక్కినేని, యెండ్లూరి సుధాకర్ లాంటి లలిత కళాకారుల కమనీయ అనుభవాలు; వృత్తి పరమైన బాధ్యతల్లో భాగంగా ప్రయాణాలు చేసిన శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి, స్థానం నరసింహారావు, భానుమతి, పద్మనాభం లాంటివారి మధుర స్మృతులు.

ఉద్యోగ నిర్వహణలో భాగంగా సుదూర ప్రయాణాలు చేసిన కోలా శేషాచలం, బి.వి.ఎన్. మూర్తి లాంటి మహానుభావుల హావభావాలూ; ప్రతికూల పరిస్థితుల్లో ప్రయాణాలు చేయాల్సి వచ్చిన కందుకూరి, నాజర్, ఆలూరి భుజంగరావుల బాధలూ; రాజకీయ కారణాల వలన ప్రయాణం చేయటం అవసరమైన దరిసి చెంచయ్య, దాశరథి, ఉపేంద్ర, వేమూరి బలరామ్, కరుణాకర రెడ్డి, లక్ష్మీ ప్రసాద్ లాంటివారి ప్రజా నంబంధమైన

ప్రతిస్పందనలూ ఈ యాత్రా సంకలనం ద్వారా మరోసారి తెలుగు పాఠకులకు దగ్గర కాబోతున్నాయి.

ఆసియాలో ప్రయాణాలు చేసిన నలభై తొమ్మిది మందిలో మొదటగా ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రయాణం చేసిన వారిని తీసు కొన్నాను. ఆంధ్రదేశంలో ప్రయాణించినవారు పన్నెండుమంది ఉన్నారు. వీరిలో పదకొండు మంది ప్రయాణాలని వారి స్వీయచరిత్రల నుండే గ్రహించాను. గురజాడ అప్పారావు గారి డైరీలు, శ్రీపాద, టంగుటూరి ప్రకాశం, దువ్వూరి వెంకటరమణ శాస్త్రి, దాశరధి, నాజర్, బుచ్చిబాబు, ఆలూరి భుజంగరావు, పర్వతనేని ఉపేంద్ర గార్ల స్వీయచరిత్రలు, జానకిరామ్ 'స్మృతి పథంలో', చలం గారి 'మ్యూజింగ్స్' ఇందు కోసం ఉపయోగపడ్డాయి. భూమనకరుణాకర రెడ్డిగారు రాసుకొన్న 'ప్రజాప్రస్థానం' అనే యాత్రా గ్రంథం నుండి రాజశేఖరరెడ్డిగారి యాత్రని తీసుకొన్నాను.

భారతదేశంలో ప్రయాణించిన ఇరవై ఐదుమందిలో మొదటగా కాశీయాత్ర చేసిన వెన్నెలకంటి సుబ్బారావు గారి స్వీయచరిత్ర నుండి వారి కాశీ యాత్రని తీసుకొన్నాను. ఎందుకంటే ఈయన కాశీయాత్ర; వీరాస్వామి యాత్రకంటే ఎనిమిది సంవత్సరాలకి ముందే జరిగింది కాబట్టి. అయితే ఆయనకి ఉన్న అనారోగ్య కారణాల వలన తన ప్రయాణాలని వెంటనే రాయలేకపోయారు. వీరాస్వామిగారి పుస్తకం ఎంతో పేరు తెచ్చుకొన్న గ్రంథం కాబట్టి వీరాస్వామిగారినే తెలుగు యాత్ర సాహిత్యానికి ఆధ్యుడుగా గౌరవించాను. నిజానికి ఇద్దరూ దగ్గిర బంధువులే. ఇద్దరూ ఆనాటికి ఒకే జిల్లా (నెల్లూరు) వాసులు.

ఈ ఇరవై అయిదుమందిలో సుబ్బారావు, వీరాస్వామి, శేషాచల కవి, పార్వతీశ్వరశాస్త్రి, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, ప్రాతూరి, జొన్నలగడ్డ సత్యన్నారాయణ, అడవి బాపిరాజు, నాయని కృష్ణకుమారి, పి.వి. మనోహరరావు, అమరేంద్ర, చినవీరభద్రుడుతో సహా పన్నెండు మంది అనుభవాలను తాము నేరుగా రాసుకొన్న యాత్రా సాహిత్యం నుండే తీసుకొన్నాను.

అయితే ఆదిభట్ల, కె.ఎన్. కేసరి, వీరేశలింగం, దరిశి చెంచయ్య, చిలకమర్తి, బసవరాజు రాజ్యలక్ష్మమ్మ, ఏడిదము సత్యవతి, భానుమతి, పద్మనాభం, కాళోజీ లాంటి వారి అనుభవాల్ని వారు రాసుకొన్న స్వీయచరిత్రల ద్వారానే తెలుసుకోగలిగాను. ఇక ఈ భాగంలో మిగిలిన స్వామి ప్రణవానంద, ముదిగంటి జగ్గన్న శాస్త్రి, సంజీవదేవ్‌ల మూడు ప్రయాణాల గురించి వారే వ్యాసాల రూపంలో రాసుకొన్నారు.

భారతదేశం దాటి ఆసియాదేశాల్లో ప్రయాణాలు చేసిన పన్నెండు మందిలో అత్యం నరసింహమూర్తి, శ్రీశ్రీ, రావూరి భరద్వాజ, కవనశర్మ, పి.వి.రంగనాయకులు, మల్లాది వెంకటకృష్ణమూర్తి, లక్ష్మీప్రసాద్, లోకేశ్వర్‌లు తాము పుస్తకాల రూపంలో రాసుకొన్న అనుభవాలనే తీసుకొన్నాను. గౌతమ్‌రెడ్డి అనుభవాలని అతడు ఇంగ్లీషులో రాసుకొన్న మ్యానుస్క్రిప్ట్ నుండి, మిగిలిన ముగ్గురూ అయిన స్థానం నరసింహారావు, తిరుమల రామచంద్ర, బి.ఎస్. ఎన్. మూర్తి అనుభవాలని వారి స్వీయ చరిత్రల్లోనుంచి తీసుకొన్నాను.

యూరప్ దేశాల్లో ప్రయాణం చేసిన ఏడుమంది యాత్రికుల్లో కురుమెళ్ళ వెంకటరావు, బాపురెడ్డి, అశ్వనీకుమార్ తమ ప్రయాణాలని ముద్రించారు. స్వామి జ్ఞానానంద, ఉప్పల లక్ష్మణరావు, స్వీయచరిత్రల్లోనే వారి ప్రయాణాలు వివరించారు. వి.ఎన్.శర్మగారు మాత్రం తన ఐరోపా యాత్ర అనుభవాల్ని వ్యాసరూపంలోనే ఉంచారు. నా స్వీడన్ యాత్ర కూడా వ్యాసరూపంలోనే వచ్చింది.

ఆఫ్రికా ఖండంలోని మారిషస్ దేశానికి ప్రయాణం చేసిన ఎన్. గోపి గారు, ఈజిప్టు దేశాన్ని చూసిన సుజాతారెడ్డిగారూ స్వయంగా పుస్తకాలే ముద్రించుకొన్నారు. ఉత్తర అమెరికా ఖండంలో యాత్ర చేసిన నలుగురిలో సూర్యకుమారి, ఆరుద్ర వ్యాసాలు రాసుకొంటే; అక్కినేని, యెండ్లూరి సుధాకర్ స్వయంగా పుస్తకాలు ముద్రించుకొన్నారు.

అయితే దక్షిణ అమెరికాలో ప్రయాణాలు చేసిన తెలుగువారు తక్కువ. ఓపిగ్గా వెతికేసరికి ఒక పుస్తకం దొరికింది. భారతదేశానికి 10వ ప్రెసిడెంట్ హోదాలో కె.ఆర్.నారాయణన్ బ్రెజిల్ దేశానికి వెళ్ళినప్పుడు ప్రెస్‌వారిలో ఒకరిగా వేమూరి బలరామ్‌గారు ఆదేశానికి వెళ్ళటం జరిగింది. ఈ విధంగా మనకి బ్రెజిల్ ప్రయాణపు అనుభూతులు పంచిన తెలుగువారు ఒక్కరు దొరికారు.

అలాగే ఆస్ట్రేలియా ఖండంలో ప్రయాణించిన తెలుగు వారిని కూడా అన్వేషించగలిగాను. గొడవర్తి సత్యమూర్తి రాసుకొన్న 'సిడ్నీ సిటీ' వలన ఆ లోటు తీరింది. ఈ రెండు

ఖండాల్లో తిరిగిన అనుభవాలు ఎవరి వద్ద సంపాదించాలో తెలియక కంగారు పడుతున్న సమయంలో ఈ రెండు పుస్తకాలు దొరికి మనల్ని ఆదుకొన్నాయి. ఈ విధంగా ఆరు ఖండాలలోనూ ప్రయాణాలు చేసిన అరవై నాలుగు మంది అనుభవాలను ఒక పద్ధతిలో ఎడిట్ చేసి, పాఠకుడికి ప్రపంచయాత్రానుభవాన్ని కల్గించటానికి ప్రయత్నించాను. చిన్నదై పోయిన ఈనాటి ప్రపంచాన్ని ప్రేమించటానికి ఈ గ్రంథం ఒక దిక్సూచిగా మారగలదని నా విశ్వాసం. ఇలాంటి సంకలనం వలన సామాన్య పాఠకుడికి కూడా ప్రపంచం పట్ల ఒక సమగ్ర అవగాహన, యాత్రల పట్ల అంతులేని కుతూహలం కలుగుతుందని నా నమ్మకం.

వీళ్ళందరూ విభిన్న ప్రదేశాలలో, విభిన్న అవసరాల కోసం ప్రయాణాలు చేయటమే కాకుండా, భిన్నమైన వాహనాలను కూడా ఉపయోగించారు. భారతీయులు అనాది నుండి నడకనే ఒక ప్రధాన వాహనంగా చేసుకొని ప్రయాణాలు చేశారు. వీరాస్వామి, ఆదిభట్ల నారాయణ దాసు, స్వామి జ్ఞానానంద, భూమన కరుణాకరరెడ్డి మన పూర్వీకుల పద్ధతిలో కాలినడకనే ప్రయణించారు. ఒరిస్సా అడవి మార్గంలో బల్లిగూడ నుండి దారిగంబాడీ వెళ్ళేదారిలో ఏడిదము సత్యవతి గారికి డోలీ మీద ప్రయాణించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. కె.ఎన్.కేసరి పూర్తి ప్రయాణం బకింగ్‌హోమ్ కాలువ మీదనే జరిగింది. మండపాక పార్వతీశ్వరశాస్త్రి, చెళ్ళపిళ్ళ, నాయని కృష్ణకుమారి కూడా వారి ప్రయాణాల్లో పడవల్ని ఉపయోగించారు.

సంజీవదేవ్ గారు హిమాలయ పర్వతాల్లో ప్రయాణించేటప్పుడు కంచర గాడిద అవసరం అయింది. కోలా శేషాచలకవి నీలగిరిని చేరుకోవటానికి ఎద్దులబళ్ళ మీద వెళ్ళారు. అడవి బాపిరాజు, ప్రకాశం పంతులు, జానకీరాం కూడా ఎద్దులబళ్ళ సహాయం తీసుకున్నారు. గుర్రబ్బండిని ఉపయోగించిన వారిలో దాశరథి, బుచ్చిబాబు, ప్రాతూరి శివరామశర్మ ఉన్నారు.

ఆ రోజుల్లో అంచెబళ్ళ మీదనే ప్రయాణాలు సాగేవి. ఈ విధంగా టంగుటూరు ప్రకాశం గారికి ఒంగోలు నుండి రాజమండ్రి చేరుకోవటానికి 14 రోజులు పట్టిందట. వెన్నెలకంటి సుబ్బారావు గారు నెల్లూరు నుండి మద్రాసు చేరుకోటానికి అంచెబళ్ళు, బోయీలు మీద నాలుగు రోజులు వట్టిందట. స్టీమరు ప్రయాణాలకి వస్తే అత్యం నరసింహమూర్తి 1929వ సంవత్సరంలో స్టీమరుమీదనే బర్మా మీదుగా న్యూయార్క్ చేరుకొన్నారు. స్థానం నరసింహారావు మద్రాసు నుండి ఓడ మీద బర్మా చేరుకొనేసరికి వారం రోజుల పట్టింది.

కురుమెళ్ళ వెంకటరావు 1930వ సంవత్సరంలో బాంబే నుండి ఐరోపా దేశాలకి వెళ్ళినప్పుడు వైస్‌రాయ్ ఆఫ్ ఇండియా ఓడమీద ప్రయాణం చేశారు. వారి ఓడ సూయజ్ కాలువ మీదుగా ప్రయాణించింది కాబట్టి 14 రోజుల్లోనే లండన్ చేరుకున్నారు. ఉప్పల లక్ష్మణరావు స్టీమరు మీద బాంబే నుంచి లండన్ వెళ్ళటానికి మూడు వారాలు పట్టిందట. సూయజ్ కాలువ తవ్వకముందు (1869వ సంవత్సరంలో కాలువ తెరవబడింది) రోజుల్లో లండన్ వెళ్ళటానికి నాలుగున్నర నెలలు పట్టేది. 1824వ సంవత్సరంలో మెడోస్ టైలర్ (1808–1876) లండన్ నుంచి బాంబే రావటానికి, గుడ్‌హోప్ ఆగ్రం చుట్టూ తిరిగి రావాల్సి వచ్చింది. ఆ సమయంలో మెడోస్ టైలర్ హిందూస్థానీ పుస్తకాలు చదువుకుంటూ కాలం గడిపాడట.

సుదీర్ఘమయిన రైలు ప్రయాణం చేసిన అదృష్టం బి.ఎస్.ఎన్.మూర్తి గారికి దక్కింది. పెకింగ్ నుండి మాస్కోకి తొమ్మిదిరోజుల పాటు రైల్లో ప్రయాణించారు. జొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తిగారు మహారాష్ట్ర ప్రయాణంలో రైలు బండి మీద ప్రయాణించారు. భానుమతి తొలిసారిగా సినిమా వేషం కోసం వెళ్ళినప్పుడు కలకత్తాకి రైల్లోనే వెళ్ళారు. తిరుమల రామచంద్ర, శ్రీపాద గారూ కూడా రైళ్ళ మీదే తమ ప్రయాణాలను పూర్తి చేశారు.

ఈ యాత్రికుల్లో సైకిలు మీద సుదూరాలు ప్రయాణాలు చేసిన వారు ఎవరూ లేకపోయినా చలంగారు, భుజంగరావు గారు సైకిళ్ళ మీదనే తిరిగారు. ఎన్.టి. రామారావు గారు ఒక పాత షెవర్లెట్ వ్యానుకి రూపురేఖలు మార్చి, తన 'చైతన్య రథాన్ని' తయారు చేసుకొని దాని మీదే ఎన్నికల ప్రచారం సాగించారు. చినవీరభద్రుడు గారు కారులోనే తన భోపాల్ యాత్ర చేశారు. అమరేంద్ర గారు అయితే స్కూటరు మీదే సిమ్లా యాత్ర చేశారు. ఇక మిగిలిన వారందరూ ఆధునిక వాహనం అయిన విమానం మీదనే విదేశాలకి ప్రయాణించారు.

ఈ సంకలనంలోని యాత్రికులందరినీ క్రోనలాజికల్ ఆర్డర్‌లో అమర్చుకొంటూ వచ్చాను. గురజాడ అప్పారావు

గారి వెలగాడ కొండమీద విహారాన్ని మొదటి ప్రయాణంగా పెడదామనుకొన్నాను. ఇది యాత్రా సంకలనం కాబట్టి యాత్రలు చేసిన మొదటి వ్యక్తి వెన్నెలకంటి సుబ్బారావు ఆయన చేసిన కాశీ యాత్రనే మొదటగా ఉంచాను. నిజానికి అప్పారావు గారు ఇండియా అంతా అనేకసార్లు ప్రయాణాలు చేశారు. ఆయన అవన్నీ ఒక పుస్తకంగా రాసి ఉంటే బాగుండేది.

పి.వి.మనోహరరావు గారు యాత్రకి వెళ్ళే ముందు సందిగ్ధావస్థలో పడిన విధం ఎంతగానో నచ్చింది. కాబట్టి అంతవరకే ఉంచి యాత్ర చేసిన భాగాన్ని తీసేశాను. మద్రాసును ఆ రోజుల్లో పూందమిల్లి (పూందమిల్లి/పూనమల్లి రాజా అయిన వెంకటాద్రి చెన్నప్పనాయకుడు ఇచ్చిన భూమి మీద బ్రిటిషువారు క్రీ॥శ॥ 1639వ సంవత్సరంలో కోట కట్టారు కాబట్టి ఆ ప్రాంతాన్ని మొదట్లో పూందమిల్లి అనే పిలిచేవారు. ఆ తరువాత అది చెన్నప్ప పట్టణంగా మారింది. అదే చివరకి చెన్నైగా రూపాంతరం చెందింది.) అని పిలిచేవారని శేషాచలకవి చెప్పేంతవరకూ నాకు తెలియదు. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి గారు కాశీకి ప్రయాణించినప్పుడు విజయవాడ నుండి కాశీకి రైలు టిక్కెటు 18 రూపాయలు అంటే నమ్మలేక పోతాం. మద్రాసు నుండి కొత్తపట్నం వరకూ బకింగ్‌హోమ్ కెనాల్ మీద చేసిన పన్నెండు రోజుల ప్రయాణానికి టిక్కెట్ ఒక్క రూపాయి అంటే మరీ ఆశ్చర్యంగా ఉంటుంది. దువ్వూరి వెంకటరమణ శాస్త్రి, చెళ్ళపిళ్ళ లాంటి గ్రాంథిక వాదులు కూడా చివరకి తమ పుస్తకాలని వ్యవహారిక భాషలో రాయటం మనల్ని ఆశ్చర్యంలో ముంచేస్తుంది.

ఈ విధంగా గడిచిన దాదాపు రెండు వందల సంవత్సరాల్లోని ముఖ్యమైన ప్రయాణీకులందరూ స్థల, కాలాదుల పరిధుల్ని దాటుకొని పక్కపక్కనే ఒక చెట్టుకి కాసిన కాయలు మాదిరిగా, ఒక తల్లికి పుట్టిన బిడ్డల మాదిరిగా ఈ సంకలనంతో ఇమిడిపోయారు.

వీరాస్వామి గారి తెలుగుతో మొదలైన భాషాశైలి క్రమేణా ఎలా మారిపోతూ ఉందో కూడా తెలుసుకోవచ్చు. వీరాస్వామికి యాభై సంవత్సరాల తరువాత రాసిన మండపాక పార్వతీశం గారు వీరాస్వామి శైలినే అనుకరించారని స్పష్టంగా తెలుస్తూ ఉంది. 1910వ సంవత్సరం నుండి వాడుక భాషా ఉద్యమాన్ని గిడుగు రామ్మూర్తి పంతులుగారు నడిపిస్తున్నప్పటికీ 1930 సంవత్సరంలో రాసిన ముదిగంటి జగ్గన్న శాస్త్రి, ఏడిదము సత్యవతి గార్లు గ్రాంథిక భాషని వదల్లేదని గమనించ వచ్చు. చలం, బాపిరాజు ఒక వయస్సు వారే అయినా, బాపిరాజు పూర్తిగా వ్యవహారిక భాషను అందుకోలేక పోవటాన్ని కూడా తెలుసుకొంటాము. వీరాస్వామి గారి గురించి 2006వ సంవత్సరంలోనే 'తెలుగు యాత్రా సాహితీ నిర్మాత' అనే పేరు మీద వ్యాసం రాశాను. వారు కాశీ నుండి మద్రాసు వెళ్ళే తిరుగు ప్రయాణ మార్గంలో మా స్వగ్రామం అయిన చవటపాలెం (ఒంగోలు దగ్గర) గ్రామంలోని దండుబాటలో 1831వ సంవత్సరం ఆగష్టు 22వ తేదీన ప్రయాణించారు. ఆ బాటని 'కాశీయాత్రా మార్గ మజిలీ' అని గుర్తించి గత సంవత్సరం ఆగష్టు, 22వ తేదీన అక్కడ శిలాఫలకాన్ని ఆవిష్కరించాను. అదే రోజు మధ్యాహ్నం ఆయన భోజనం చేసిన మా పక్కఊరు అమ్మనబ్రోలులో కూడా ఆ విషయాన్నే వివరిస్తూ అదే రోజున శిలాఫలకాన్ని స్థాపించాను.

వెన్నెలకంటి సుబ్బారావు గారి స్వీయ చరిత్ర ద్వారా తెలుసుకొన్న విషయాల ఆధారంగా ఆ మహానుభావుడు నిర్మించిన 'కనకమ్మ సత్రాన్ని' వెతికి, అది 'సుబ్బారాయుడి సత్రం' అనే గ్రామంగా రూపాంతరం చెందినదని తెలుసుకొని, ఆయన సమాధి కూడా అక్కడే జరిగిందని రుజువు చేసి, ఈ విషయం మీద 'విస్మృత యాత్రికుడు; వెన్నెలకంటి సుబ్బారావు' అనే వ్యాసం రాసి అందరికీ తెలియజేశాను. ఆ ప్రదేశంలో ఒక స్మారక చిహ్నం నిర్మించమని INTACH (Indian National Trust for Art and Cultural Heritage) వారిని కోరాను.

ఒంగోలు నగరానికి దగ్గరలో ఉన్న ఇనమనమెళ్ళూరు అనే గ్రామంలో జన్మించిన కోటా నరకేసరి (కె.ఎన్.కేసరి) తన చిన్ననాడు పొట్టచేత పట్టుకుని నడుచుకొంటూ మద్రాసు వెళ్ళాడని తెలుసుకొని ఆ మహానుభావుడి మీద గౌరవంతో ఆయన ఇంటి నుండి మద్రాసులోని కేసరి కుటీరం వరకూ నడుచుకొంటూ నడకనీరాజనం అర్పించాను. ఈ విధంగా నాకు అందుబాటులో ఉన్న గొప్ప ప్రయాణికుల చరిత్రని నాకు చేతనైనంత వరకూ వెలుగులోకి తీసుకురాగలిగాను.

సంజీవదేవ్, ఆలూరి భుజంగరావు, కవనశర్మ, బి.యస్.ఎన్.మూర్తి, మల్లాది వెంకట కృష్ణమూర్తి, ఎన్.గోపి వీరందరూ నాకు పరిచయం ఉన్న వాళ్ళే. జి. సత్యమూర్తి,

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వి. అశ్వనీకుమార్, భూమన కరుణాకర రెడ్డి, లోకేశ్వర్, సుధాకర్, చినవీరభద్రుడు, అమరేంద్ర నాకు మిత్రులు.

ఇకపోతే బాపురెడ్డి, మనోహరరావు, సుజాతా రెడ్డి, వేమూరి బలరాం, అక్కినేని నాగేశ్వరరావు గార్లతో నాకు పరిచయం లేదు. మిగిలిన వారంతా కీర్తిశేషులు. తెలుగు సాహిత్యంలో వివిధ సాహిత్య శాఖలు ఎంతో శోభాయమానంగా రంగు రంగుల పూలతో, పళ్ళతో బరువెక్కి విల్లు మాదిరిగా వొంగిపోతునట్లుగానే, యాత్రా సాహిత్యశాఖ కూడా అలాంటి వికాసానికి చేరువకావచ్చింది అనే నమ్మకం కుదిరింది. ప్రతి తెలుగు రచయిత, కవీ కనీసం ఒక యాత్రా గ్రంథాన్ని లేదా వ్యాసాన్ని రాసినా చాలు! యాత్రా సాహిత్యం ప్రతి ఒక్కరికి చేరువై పోతుంది. మనలోని యాత్రికుడు కూడా విముక్తి మార్గాన్ని చేరినట్లవుతుంది.

తెలుగు సాహిత్య చరిత్రకారులు ఇంత వరకూ యాత్రా సాహిత్య చరిత్రని అసలు ముట్టుకోలేదు. దాదాపు రెండు శతాబ్దాల యాత్రా సాహిత్య ఉనికిని మరిచిపోవటానికి మనసెలా వొప్పిందో ఈ చరిత్రకారులకి నాకర్థం కావటం లేదు! ఈ పుస్తకంలో ఇస్తున్న పుస్తకాల పట్టీల ఆధారంగా అయినా పనిమొదలు పెడతారని ఆశిస్తాను. ఇప్పటికైనా యాత్ర సాహిత్యాన్ని మనస్సులో ఉంచుకొని తెలుగు సాహిత్య చరిత్రకి సంపూర్ణ స్వరూపాన్ని ఇవ్వమని కోరుకొంటున్నాను. విశ్వవిద్యాలయాల్లోని పరిశోధకులకి పనికి వచ్చే చాలా విషయాలు యాత్రా సాహిత్యంలో చాలా ఉన్నాయి. 'యాత్రా సాహిత్య విజ్ఞాన సర్వస్వాన్ని' తయారుచేయటానికి పరిశోధక పండితులు ముందుకు రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నాను.

అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ పోటీలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తునట్లే యాత్రా సాహిత్యానికి కూడా పోటీలు నిర్వహించి, అవార్డులు ప్రకటించినప్పుడు రచయితల దృష్టి యాత్రల మీదికి వెళుతుంది. కొత్త యాత్రికులు కూడా తయారవుతారు. కాలేజీ సిలబస్‌లో యాత్రా సాహిత్యం ప్రవేశపెట్టాలి. ప్రతి మాష్టర్ కోర్సులో కూడా యాత్రా సాహిత్యాన్ని ఒక Optional Paper కింద పెట్టినప్పుడే దీని ప్రాముఖ్యతను తెలుసుకుంటారు. ఇతర భాషల్లో ఉన్న యాత్రా గ్రంథాల్ని తెలుగులోకి అనువాదం చేసుకోవటానికి కూడా తగిన ఏర్పాట్లు కూడా చేసుకొంటే మరీ మంచిది.

ప్రపంచమంతా ప్రయాణించిన మన తెలుగు తుమ్మెదలు మోసుకొచ్చిన తేనె బానని మీకు అందిస్తున్నాను. తమ ప్రయాణాల ద్వారా అంతర్జాతీయ గీతాలాపన చేసిన వీరందరికి నా కృతజ్ఞతలు. మన కలల్లో కొన్నిటినైనా నిజం చేసుకొనేందుకు ప్రయాణాల అవసరం ఎంతో ఉందని మరోసారి దారి చూపిన దౌత్యవేత్తలందరికి హృదయ పూర్వక నమస్కారాలు తెలియజేసుకొంటున్నాను.



ప్రొఫెసర్ ఎమ్. ఆదినారాయణ
ఆంధ్ర విశ్వకళాపరిషత్తు,
విశాఖపట్నం.
ఫోన్ : 9849883570

ఓడ ప్రయాణం

గిడుగు సీతాపతిగారు, రాధాకృష్ణన్‌గారు ఓడలో ప్రయాణిస్తూ ఇంగ్లండు వెళ్తున్న సంఘటన.

మార్సెయిల్స్‌లో ఓడదిగి కెలే వరకూ రైలులో ప్రయాణించారు. రాధాకృష్ణగారు పై బెర్తు మీద, సీతాపతిగారు క్రింది బెర్తు మీద ఉన్నారు. రాధా క్రిష్ణగారు క్రిందికి దిగి సీతాపతిగారిని పైకి వెళ్లమన్నారు. అందుకు ఆయనకు ఉక్రోషం వచ్చింది. నేను ఆయన కంటె వయసులో పెద్దవాణ్ణి నన్ను పైకి వెళ్లంమటున్నాడేమిటి? నా పై అధికారి కదా? అందుకు అలా శాసించాడు" అని అనుకున్నారట... ప్రతీ స్టేషను దగ్గర రైలు ఆగగానే కొంతమంది రచయితలు వచ్చి రాధాకృష్ణన్‌గారితో పరిచయం చేసుకొని వారి పుస్తకాలిచ్చి వెళ్ళేవారట. ఇంక ఉండబట్టలేక సీతాపతిగారు క్రిందికి దిగి "వీరందరికీ మీరు వస్తారని ఎలా తెలుసు" అని అడిగారట. ఇచ్చట రైలులో ఎవరైనా రచయితలు ప్రయాణం చేస్తుంటే, రచయితలకు ఆ విషయం తెలియజేస్తారు. తూర్పొయిల్సులో ఏజెంటు ఈ ఏర్పాటులన్ని చూసుకుంటాడు. ఇది ఇక్కడి ఆచారం అని చెప్పారట. అప్పుడు రాధాకృష్ణగారి గొప్పతనమేమిటో బాగా అర్థమయింది.

సేకరణ : కణుగుల వేంకటరావు

జూ ర న్

- ఓం ప్రకాశ్ వాల్మీకి

ఉపాధ్యాయుల ఆదర్శ రూపాన్ని నేనింతవరకు చూసిన దాన్నిబట్టి అది నా స్మృతిఫలకం నుండి చెదిరిపోవడం లేదు. ఎప్పుడైనా ఒక ఆదర్శవంతమైన గురువుకి సంబంధించిన ప్రస్తావన వచ్చినపుడు నాకు శిక్షించే అమ్మలక్కలు తిట్టే గురువులే కనబడతారు. అందమైన పిల్లల బుగ్గలు నిమురుతూ వాళ్ళని ఇళ్ళకి పిలిచి వాళ్లతో పనికిమాలిన పనులు చేయించేవారు.

ఒకరోజు హెడ్‌మాస్టర్ కాళీరామ్ నన్ను ఆయన గదికి పిలిచి "నీ పేరు ఏంటి" అని అడిగాడు.

"ఓం ప్రకాష్" అని భయపడుతూ నేను సమాధానం చెప్పాను. హెడ్‌మాస్టర్‌ను చూడగానే పిల్లలు భయపడేవారు. స్కూలంతా ఆయనంటే భయపడేవారు.

"అంటరానోడివా" హెడ్‌మాస్టర్ రెండో ప్రశ్న వేశాడు.

"అవునండీ"

"మంచిది"... అదిగో చూడు ఆ కనిపిస్తున్న చెట్టు ఎక్కి దాని ఆకులు తుంచి చీపురు తయారుచెయ్యి. స్కూలు అంతా అద్దంలా మెరిసేటట్లు ఊడవాలి. ఇది నీ కులవృత్తే కదా. వెళ్ళు... చకచకా పనిలోకి చేరిపో అన్నాడు.

హెడ్‌మాస్టర్ ఆదేశాల ప్రకారం నేను పాఠశాల గదిని అరుగుల్ని శుభ్రం చేశాను. తర్వాత ఆయన వచ్చి "ఆటస్థలమంతా శుభ్రం చెయ్యి" అన్నాడు. అంత పెద్ద మైదానం శుభ్రం చేసేపని నా శక్తికి ఎన్నోరెట్లు మించింది. మైదానం శుభ్రం చేస్తుంటే నాకు నడుము నొప్పి రాసాగింది. దుమ్ముతో నా మొహం, తల నిండిపోయింది. మా తరగతిలో చాలామంది పిల్లలు చదువుకుంటూ ఉన్నారు. కానీ నేను మాత్రం రోజంతా చిమ్ముతూ ఉన్నాను. హెడ్‌మాస్టర్ తన గదిలో కూర్చుని నన్నే గమనించసాగాడు. నీళ్ళు త్రాగడానికి కూడా నాకు అనుమతి ఇవ్వలేదు. నా జీవితంలో నేనింత పని ఎప్పుడూ చేయలేదు. ఇంట్లో అన్నదమ్ములందరికీ నేను చాలా ఇష్టమైనవాడిని. నా చేత వాళ్లు పనిచేయించే వాళ్ళు కాదు.



రెండో రోజు నేను స్కూలుకి వెళ్ళాను. వెళ్ళడంతోనే హెడ్‌మాస్టర్ తిరిగి నాకు మైదానం ఊడ్చేపని అప్పగించాడు. రోజంతా ఊడుస్తూనే ఉన్నాను. మనసులో ఒక ఊరట అదేమంటే రేపటి నుంచయినా తరగతిలో కూర్చుంటాను అని.

మూడో రోజు నేను తరగతిలోకెళ్ళి నిశ్శబ్దంగా కూర్చున్నాను. కొంచెం సేపటి తర్వాత అతని సింహగర్జన వినిపించింది. "అరే అలగా నాకొడకా ఎక్కడ దాక్కున్నావురా" నీయమ్మ... అంటున్నాడు.

అతని గర్జన విని నేను గడగడ వణకసాగాను. ఒక త్యాగీ పిల్లవాడు అరుస్తూ చెప్పాడు. "మాస్టర్‌గారూ, ఆ కొడుకు అడుగో ఆ మూలన".

హెడ్‌మాస్టర్ నా మెడబట్టుకొని లాగి కొట్టాడు. ఆయన వేలిముద్రలు నా మెడపై పడ్డాయి. తోడేలు మేకపిల్లని ఎత్తుకెళ్ళినట్లు తరగతిలోంచి బైటికి లాగి నన్ను మెట్లపై పడేసాడు. పెద్దగా అరిచాడు. "వెళ్ళు, మైదానమంతా చిమ్ము... లేకుంటే నీ అంగంలో కారంపెట్టి స్కూలు నుంచి బైటపడేస్తా అన్నాడు.

భయకంపితుడినై నేను మూడు రోజుల నుంచి ఊడ్చుతున్న ఆ చీపురందు కొన్నాను. నా ఆశల్లాగే దాని ఆకులు కూడా ఎండిపోయి రాలుతున్నాయి. పచ్చటి ఆకులు మాత్రమే మిగిలి ఉన్నాయి. నాకు కన్నీళ్లు రాసాగాయి. ఏడుస్తూ నేను చిమ్మసాగాను. స్కూలు గదుల కిటికీలు, తలుపుల నుంచి మాస్టర్లు, పిల్లలు కళ్ళప్పగించి ఈ తమాషా చూడసాగారు. నా రోమాలన్నీ వేదనాభరితమైన బాధతో మూలగసాగాయి.

మా నాన్నగారు అనుకోకుండా స్కూలువైపు వచ్చాడు. స్కూలు మైదానంలో ఊడుస్తున్న నన్నుచూచి ఆశ్చర్యపోయాడు. బైట నుండి పెద్దగా అరిచాడు. "రచయితగారు ఏం చేస్తున్నారు?" ఆయన ప్రేమగా నన్ను రచయితగారు అని పిలుస్తుంటారు. నాన్నని చూసి, నేను వెక్కి వెక్కి ఏడ్చాను. ఆయన పాఠశాల మైదానంలో నా దగ్గరి కొచ్చాడు. ఏడుస్తున్న నన్ను చూసి "రచయితగారు... ఎందుకు ఏడుస్తున్నారు? సరిగా చెప్పు. ఏమయింది?".

నా వెక్కిళ్ళు ఆగిపోయాయి. వెక్కి వెక్కి ఏడుస్తూ విషయమంతా మా నాన్నగారికి చెప్పాను. "మూడురోజుల నుంచి రోజూ నా చేత ఊడ్పిస్తున్నారు. తరగతిలో కూర్చుని చదువుకోనివ్వటం లేదు" అన్నాను.

మా నాన్నగారు నా చేతిలోని చీపురు లాక్కుని దూరంగా విసిరివేశాడు. ఆయన కళ్ళు నిప్పుకణికలైనాయి. ఎక్కుపెట్టిన బాణంలా ఉండే నాన్నగారి పెద్ద పెద్ద గుబురు మీసాలు కోపంతో మరింత ఎగిరిపడుతూ కనిపించాయి. ఆయన కేకలేయసాగాడు. "ఎవడా పంతులు, ద్రోణాచార్యుడి కొడుకు, నా కొడుకు చేత చిమ్మిస్తున్నాడు..." అన్నాడు.

నాన్నగారి మాటలు స్కూలంతా ప్రతిధ్వనించాయి. ఈ మాటలు విని హెడ్‌మాస్టర్‌తో సహా మాస్టర్లందరూ బైటికొచ్చారు. కాళీరామ్ హెడ్‌మాస్టర్ కూడా నాన్నగారిని తిడుతూ బెదిరించాడు. కానీ నాన్నగారిపై ఆ ప్రభావం ఏమీ పడలేదు. ఆరోజు ఎంత సాహసంతో, సామర్థ్యంతో నాన్నగారు హెడ్‌మాస్టర్‌ని ఎదుర్కొన్నాడో, ఆ దృశ్యాన్ని నేను ఎన్నటికీ మరువలేను. నాన్నగారిలో కూడా ఎన్నోరకాల బలహీనతలున్నాయి. కానీ నా భవిష్యత్‌ని ఆరోజు ఆయన మలుపు తిప్పిన తీరు మరువలేను. ఆ ప్రభావం నా వ్యక్తిత్వంపై పడింది.

హెడ్‌మాస్టర్ కోపంగా "తీసుకెళ్ళు వీడ్ని ఇక్కణ్ణుంచి... అలగా నాకొడుకులక్కూడా చదువులు కావాల్సొచ్చాయి... వెళ్ళు తీసుకెళ్ళు... లేకుంటే ఎముకలు కుళ్ళబొడుస్తా" అన్నాడు.

నాన్నగారు నా చేయిపట్టుకుని ఇంటికి తీసుకెళ్ళాడు. వెళ్తూ వెళ్తూ హెడ్‌మాస్టర్ వినేటట్లు "ఓ పంతులూ... వెళ్తున్నాను... కానీ గుర్తుపెట్టుకో పంతులూ... ఈ అలగావాడు ఇక్కడే చదువుకొంటాడు... ఈ బడిలోనే. ఇంతేకాదు ఇంతకంటే ఇంకా ముందు ముందు కూడా బాగా చదువుకొంటాడు" అన్నాడు.

ప్రజాసాహితి సౌజన్యంతో....

'జూఠన్' పుస్తకం ఓం ప్రకాష్ వాల్మీకి సొంతకథ. ఉత్తర భారతంలో అంటరాని తనం ఎంత దారుణంగా ఆచరించబడిందో – బడి పిల్లలు – ఉపాధ్యాయులు సంబంధాలు కూడా ఎంత ఘోరంగా వుండేవో – ఓం ప్రకాష్, తమ అనుభవాలను మనకళ్ళ ముందుంచారు. మహాత్మాగాంధీ – అంటరాని తనాన్ని – హరిజనోద్ధరణ ఉద్యమంతో, రూపుమాపాలని ఎన్నో విధాల ప్రయత్నించారు. 'ఆలయ ప్రవేశం' దేశమంతా ఒక సంస్కరణలాగా వ్యాపింపజేశారు!

చదవండి...

– ఎన్నార్కె

✦ **పాతాళ గరిగె :** సాహిత్య వ్యాసాలు, రచయిత తోకల రాజేశం. పాల్కురికి సోమనాథుని నుండి సురవరం ప్రతాపరెడ్డి వరకు బహుముఖ ఉద్యమ సాహిత్య జీవితాన్ని తనదైన శైలిలో చెప్పుకొచ్చారు. అన్నవరం శ్రీనివాస్ వేసిన ముఖచిత్రం అర్థవంతంగా ఉంది.

పేజీలు :100 వెల : ₹ 100/–, ప్రతులకు – అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

✦ **పత్రికా రంగంలో పున్నమి :** రచయిత పున్న అంజయ్య. ఒకనాడు తెలంగాణ పత్రికారంగానికి పునాదులు వేసింది 1922లో వచ్చిన నీలగిరి పత్రిక. 1996లో అంజయ్య సంపాదకత్వంలో నీలగిరి వారపత్రిక పునఃప్రారంభమైంది. అంజయ్య బహువిధాల రచనా ప్రక్రియలు చేశారు. వారు నడిపి, పనిచేసిన వివిధ పత్రికలలో కొన్ని రచనల సంపుటిది –

పేజీలు :100, వెల : ₹ 50/–, ప్రతులకు – విశాలాంధ్ర, ప్రజాశక్తి.

✦ **మూడు ఒకట్లు మూడు... మూడు పదులు ముప్పయి :** సాహితీ ప్రియులకు అత్యంత ఆప్తుడయిన శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు, ప్రమీల దంపతుల పై, సాహితీ మిత్రుల సంకలన వ్యాస సంపుటి. విశ్వేశ్వరరావు వ్యక్తిత్వ విశ్లేషణలకిది నిలువెత్తు దర్పణం. రావులపాటి సీతారామారావు గారి వ్యాసం ఆసక్తిదాయకంగా సాగింది.

పేజీలు :119, వెల : వెల పేర్కొనబడలేదు ప్రతులకు – సాహితీ మిత్రులు, విజయవాడ.

✦ **ఈ కోతి ఈ డ్రామాకు పనికొస్తుందా :** రచయిత నాయుని కృష్ణమూర్తి. అసంబద్ధ రాజకీయాలపై ఈ వ్యంగ్య నాటకం ఒక చురక, ప్రజలకొక మేలుకొలుపు. అన్వర్ వేసిన అట్టమీద బొమ్మ సందర్భోచితంగా ఉంది.

పేజీలు :51, వెల : ₹ 30/–, ప్రతులకు – అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

✦ **మోనోలోగ్ ఆఫ్ ఎ వూండెడ్ హార్ట్ :** కవిత్వాన్ని చికిత్సా స్థాయికి తీసికెళ్ళే దిశలో ఈ దీర్ఘకవిత తెలుగులో నిజాయితీతో కూడిన విశుద్ధమైన ప్రయత్నమని చెప్పవచ్చు. తన కవిత్వం ద్వారా కేన్సర్ బాధితులకు ఊరట కలిగించారు రచయిత్రి అయినంపూడి లక్ష్మి.

పేజీలు :60, వెల : ₹ 35/–, ప్రతులకు – విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ బుక్ స్టాల్స్.

✦ **బొల్లిముంత రేడియో నాటికలు :** రచయిత వెంకట రామణారావు. రంగస్థలం లేకుండా నాటకాన్ని రక్తికట్టించటం సాధారణ విషయం కాదు. శ్రవ్యనాటకం రచనలలో ఎన్నో జాగ్రత్తలు అవసరమవుతాయి. ఇందులో నున్న ఐదు నాటికలు చదువు కోవడానికి, వినడానికే కాదు ప్రదర్శన యోగ్యం కూడా. ప్రవీణ్ ముఖచిత్రం వేశారు.

పేజీలు :64, వెల : ₹ 60/–, ప్రతులకు – అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

✦ **ఆంధ్రదేశంలో మత పరిణామాలు :** రచయిత బి.యస్.యల్. హనుమంతరావు. ఆంధ్రదేశ చరిత్ర హనుమంతరావు అభిమాన విషయం. విషయ విశ్లేషణలో తీవ్రవాద దృక్పథాలకు సంకుచిత ప్రయోజనాలకు అతీతంగా గత చరిత్రను దర్శించి, సంకుచిత జాతీయవాదనల ధోరణులకు భిన్నంగా సాగిన రచన. సామాజిక గమనంపై మతం ప్రభావాన్ని క్షుణ్ణంగా చర్చించింది.

పేజీలు :130, వెల : ₹ 80/-, ప్రతులకు – ఫోన్ : 9246830320.

✦ **సాహిత్యంలో మధుర భక్తి :** సంపాదకత్వం డా॥ టి. శ్రీరంగస్వామి. మధుర భక్తి అనగానే మనసు రసప్లావితమవుతుంది. ఈ పుస్తకంలో 15 వ్యాసాలున్నాయి. ఇవన్నీ మధుర భక్తితో ఆ దేవునికి తమ రచనలు అర్పించిన అనేక భావకుల సాహిత్యం పై దృష్టిసారించి సాగిన రచనలు. విశేష విశ్లేషణతో పోల్చి చూస్తే ఈ సంపుటి వెల అతిస్వల్పం.

పేజీలు :140, వెల : ₹ 100/-, ప్రతులకు – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

✦ **శుభోదయం :** డా॥ పాలకోడేటి సత్యనారాయణ రావు. కళ్యాణ్ అనే కలంపేరుతో ప్రచురించబడిన చిన్న కథల సంపుటి. ప్రతి కథ ఒక సంఘటనను మన ముందుంచటమే కాక మనల్ని ఆలోచింపజేస్తుంది.

పేజీలు :110 వెల : ₹ 80/-, ప్రతులకు – ఫోన్ : 9848272430.

✦ **కూరగాథలు :** రచయిత ముత్తేవి రవీంద్రనాథ్. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ముప్పై వారాలపాటు ధారావాహికంగా వడ్డించబడినవే ఈ కూరగాథలు. ఏయే కూరగాయలు ఎక్కడ పుట్టాయి? ఎప్పుడు మన ప్రాంతానికి వచ్చి చేరాయి? పలు భాషల్లో వాటిని ఏమని పిలుస్తారు? వాటి శాస్త్రీయ నామాలేమిటి? ఎలా సాగుచేస్తారు? వంటి ప్రయోజనకరమైన విషయాలను ఎంతో శ్రమకోర్చి మనముందుంచారు రచయిత. అందరూ తప్పక తెలుసుకోవలసిన విషయాలు ఇందులో ఉన్నాయి.

పేజీలు :280, వెల : ₹ 250/-, ప్రతులకు – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

✦ **కాశీబుగ్గ :** ఇప్పటికే సాహిత్య పరంగా గుర్తింపు పొంది, అనేక బహుమతులందుకున్న రచయిత ఈతకోట సుబ్బారావు సామాజిక స్పృహతోను, వ్యంగ్యంతో రంగరించి చేసిన 18 కథల సంపుటి. ఆత్మకూరు రామకృష్ణ వ్రాసిన ముఖచిత్రం అర్థవంతంగా ఉంది.

పేజీలు :125, వెల : ₹ 80/-, ప్రతులకు – ఫోన్ : 9440529785.

✦ **ఊహాచిత్రం :** మరుగు పడుతున్న తెలుగుభాషను, తిరిగి సంరక్షించుకోవాలనే లక్ష్య శుద్ధి ఉన్న ఆధునిక విద్యాధిక యువకుడు రచయిత అరిపిరాల సత్యప్రసాద్. ఇందులో 17 కథానికలు ఉన్నాయి. విషయం, భాష కొత్తగా ఉంది. భవిష్యత్‌లో మంచి రచయిత కాగలిగిన సూచనలు కనిపిస్తున్నాయి. అన్వర్ వేసిన ముఖచిత్రం ఆకర్షణీయంగా ఉంది.

పేజీలు :140, వెల : ₹ 120/-, ప్రతులకు – అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.









కలల బేహారి

ఆ అమ్మాయి ఒక చిరుద్యోగి. ఆ అబ్బాయి ఒక నిరుద్యోగి. ఇద్దరికీ కంటి నిండుగా కలలున్నాయి. ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఆశ, ప్రేమ, బిడియం, అన్నిటినీమించి ఆర్థిక అభద్రతా భావం వల్ల ఏర్పడిన అవ్యక్తీకరణ. ఇటువంటి సమయంలో ఇద్దరూ ఒకసారి రోడ్డుపై కలుసుకున్నారు. ఆ సమయంలో ఆకాశం మేఘావృత్తమైంది. ఏ క్షణంలోనైనా వర్షం రావచ్చు. అతను తన ప్రేమ వెల్లడించాలని ధైర్యాన్ని కూడగట్టుకుంటున్నాడు. ఆ వాతావరణంలో వాళ్ళకు పెద్దగా కోరికలు లేవు. వాళ్ళు కోరుకుంటున్నది ఒక కప్పు వేడి చాయ్. అతని జేబులోని చిల్లరంతా ఊడ్చి పెడితే ఒక కప్పు చాయ్‌కి సరిపోతుంది. ఆమెనుంచి డబ్బులు తీసుకోవడానికి అతనికి అభిమానమడ్డొస్తుంది. టీ కొట్టువాడు తెలుసున్నవాడయినా అప్పివ్వడు. అతన్ని బతిమాలి, బామాలి ఒక ఒప్పందానికి వస్తాడు. వేడిచాయ్ ఆమెకు, వేడినీళ్ళు అతనికి, చివరకు టీ కొట్టువాడు జాలిపడి ఇద్దరికీ టీ ఇస్తాడు.

అప్పుడే అతను తన ప్రేమను వెల్లడిస్తాడు. ఆమె మౌనంగా అంగీకరిస్తుంది. ఈ రెండు భావాలు కంటి చూపు ద్వారానే జరుగుతాయి. అప్పుడే సన్నగా గాలి వీస్తుంటుంది. ఆమె చీర గాలికి రెప రెప లాడుతుంది. చిన్నగా చిరుజల్లు మొదలవుతుంది. ఆమె వద్దనున్న గొడుగు అతను తీసుకుంటాడు. ఆమె వర్షంలో తడుస్తుంది. గొడుగు ఆమెకిచ్చి అతను తడుస్తాడు. వర్షం నుంచి కాపాడుకోవాలంటే ఇద్దరూ ఆ గొడుగు క్రిందకు రావల్సిందే. నిజానికి అదే జరుగుతుంది. వర్షం ఉధృతమవుతుంది.

ఇదంతా ఒక హేన్రీ కథలోనిదో, చెహోవ్ కథలోని సంఘటనో కాదు. అత్యంత సున్నితమైన ప్రేమ వ్యక్తికరణలో భారతదేశ చలన చిత్ర చరిత్రలోనే ఉత్కృష్టమైన చిత్రీకరణ. 1955వ సంవత్సరంలో రాజ్‌కపూర్ నిర్మించిన శ్రీ 420 చిత్రంలోనిది. కళాత్మక దృష్టి వున్న భారతీయ దర్శకులలో అగ్రతాంబూలం శాంతారామ్‌దయితే, ఊహ, సన్నివేశాలలో మాత్రం నృజనాత్మకమైన ప్రేమ రాజ్‌కపూరే అగ్రగణ్యుడు. రాజ్‌కపూర్‌కు ముందు వర్షపు పాటలు లేవు. ఆ తరువాత వాన పాటలు లేని చిత్రాలు అరుదుగా ఉండేవి. రాజ్ కపూర్‌తో ప్రారంభమయిన ఈ వాన పాటల యుగం తరువాత 'చిటపట చినుకులు పడుతూ ఉంటే' లాంటి పాటలతో శృంగార ప్రధానమై, తరువాత వెర్రితలలు వేసి, ఉప్పెనగా మారింది. ఒకప్పుడు తెలుగు సినిమాలో నృత్యాల పేరుతో జ్యోతిలక్ష్మి, జయమాలిని వచ్చి లైంగిక భావాలను బట్టబయలు చేస్తే – ఇప్పటి కథానాయికల 'ఐటమ్ సాంగ్స్' ప్రదర్శన యొక్క ఔచిత్యాన్ని మీకు మీరే సమీక్షించుకోగలరు. ఈ కారు మబ్బుల మధ్య రాజ్‌కపూర్ చిత్రీకరణ ఒకటే నిజమైన విద్యుల్లత.

రాజ్‌కపూర్ తన చిత్రీకరణలో ఎక్కడా నర్గీస్ అందాలను బహిర్గతం చేయలేదు. నర్గీస్, తనకు మాత్రమే సాధ్యమైన ప్రేమ భావాన్ని శ్రీ దేవులపల్లి భాషలో చెప్పాలంటే కనుకొలకులలోని (ఆమె కనులో ననంతాంబరపు నీలినీడలు కలవు.) ఆనంద భాష్పాల ద్వారా వ్యక్తపరుస్తుంది.

ఈ చిత్రంలోని వర్షం మనల్ని కూడా తడుపుతున్నట్లుగా ఫీల్ అవుతాము. మొదట చిరుగాలి, చిరుజల్లు, పెద్దవర్షం, మళ్ళీ గాలితో కూడిన తుంపర్ల వర్షం, ఎక్కడా కృత్రిమత్వం కనిపించని చిత్రీకరణ. ఆ వర్షంలో హీరో హీరోయిన్లు పాడిన "ప్యార్ హువా ఇక్‌రార్‌హువా" అని మన్నాడే, లతామంగేష్కర్ పాడిన పాట, ఈ నాటికీ, ఏనాటికీ వాడని వసంతం. ఆ పాటలోని ఒక చరణంలో "తుమ్‌న రహీగీ, హమ్‌న రహెగీ, ఫిర్‌భీ రహేగీ నిషానియా" (నీవు ఉండవు, నేను ఉండనూ కానీ మన ఛాయ మాత్రం ఉంటుంది). అన్న సన్నివేశంలో చిట్టిపొట్టి అడుగులతో, నడిచి వెళ్ళే రాజ్‌కపూర్ సంతానం అయిన మాష్టర్ రణధీర్ కపూర్, మాష్టర్ రిషికపూర్‌లు కనిపిస్తారు.

ఆవారా చిత్రంతో (1950) కలల చిత్రీకరణకు శ్రీకారం చుట్టి (ఈనాటికీ ఈ కలలు పీడకలలుగా సినిమాలను వదలటం లేదు) శ్రీ 420 చిత్రంతో వానపాటలు ప్రారంభించిన రాజ్‌కపూర్‌ను ఎంతమంది అనుకరించినా, అతని మోకాలు స్థాయికి కూడా చేరుకోలేక పోవటం, రాజ్‌కపూర్ గొప్పతనానికి నిదర్శనం.

– కాండ్రేగుల నాగేశ్వరరావు

క్షామధేనువు !

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14

కల చెదిరె,,,